
# లోకానికి నేనే వెలుగు

## ప్రేమానందం:
## కుటుంబ బాంధవ్య అనుబంధం



సంపుటి - 41 జనవరి - మార్చి 2018 సంచిక - 1

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.



## సంపాదక వర్గం

ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ నందిపాము జోజప్ప
ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి
ఫాదర్ పిల్లి అంతోని దాస్

## గురువిద్యార్థుల బృందం

బ్రదర్ నల్ల సుధీర్ కుమార్
బ్రదర్ కుచ్చర్ల మార్టిన్
బ్రదర్ లింగతోటి రత్నకిషోర్
బ్రదర్ కత్తుల సునీల్ బాబు
బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్
బ్రదర్ మానూరి మార్కో
బ్రదర్ కల్లేపల్లి యేసుబాబు
బ్రదర్ సిగినం ప్రకాశ్
బ్రదర్ యానాద్రి బాలయేసు
బ్రదర్ సూరిపోగుల వినోద్ కుమార్


## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ. 100/- యం.ఓ., డి.డి..ల ద్వారా
St. John's Regional Seminary Society, Hyderabad
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్ :


**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph : 040-27201427, 27200370, Fax : 27209505
e-mail : stjohnshyd2@gmail.com



Printed at : holycrossprinters 9848145417

# లోకానికి నేనే వెలుగు

సంపుటి-41 జనవరి - మార్చి 2018 సంచిక-1

## ప్రేమానందం:
## కుటుంబ బాంధవ్య అనుబంధం

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
**ప్రధాన సంపాదకులు**

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**
**సంచిక సంపాదకులు**

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
website : stjohnseminaryhyd.org

# విషయసూచిక

సంపాదకీయం

1. దైవవాక్కు వెలుగులో కుటుంబం ............................................ 9
   – *బ్రదర్ దారా షద్రక్*

2. కుటుంబంలో అనుభవాలు మరియు సవాళ్లు ............................ 18
   – *బ్రదర్ మెడిపల్లి థామస్*

3. కుటుంబానికి దైవ పిలుపు: క్రీస్తువైపు చూడటం ......................... 29
   – *బ్రదర్ బొట్టె మనోహర్*

4. వివాహంలో ఉన్న ప్రేమ .................................................. 42
   – *బ్రదర్ కొండల కిషోర్ & బ్రదర్ మానూరి మార్కో*

5. ఫలభరితమైన ప్రేమ ...................................................... 70
   – *బ్రదర్ కల్లేపల్లి ఏసుబాబు*

6. విశ్వాస పరిచర్యలోని దృక్పథాలు ........................................ 84
   – *బ్రదర్ అల్లం సాగర్ మనోజ్*

7. పిల్లల విధ్యాభ్యాసం పురోగతి ............................................. 96
   – *బ్రదర్ తమనంపల్లి సంతోష్*


8. బలహీనతలో తోడుగా ఉండటం గమనించడం, పరిపూర్ణం చేయడం. 106
   – *బ్రదర్ కోల సాగర్*

9. కుటుంబములోను, వివాహములోను ఉన్న ఆధ్యాత్మికత................ 120
   – *బ్రదర్ సూరిపోగుల రవి*

10. నజరేతు పవిత్ర కుటుంబం విశ్వాస–ఆత్మీయతలకు ఆలయం ........ 129
    – *ఫాదర్ డా॥ పిల్లి అంతోని దాస్*

# సంపాదకీయం

## ప్రేమానందం శ్రీసభ ఆనందం



"ప్రేమానందం శ్రీసభ ఆనందం". పరిశుద్ధ పాపుగారైన ఫ్రాన్సిస్ తన అపోస్తోలిక ప్రోత్సాహక పత్రం - Apostolic Exhortation – అమోరిస్ లేతిజియా (*Amoris Laetitia*) అనగా 'ప్రేమానందం' అను శ్రీసభ బోధనాపత్రంలో మొదటివాక్యంగా ప్రకటిస్తున్నాడు: "కుటుంబాలు అనుభవించే ప్రేమానందమే శ్రీసభ ఆనందం కూడాను'. వివాహం చేసుకోవాలి, కుటుంబ వ్యవస్థను నిర్మించాలి అను తపన, ముఖ్యంగా యువతలో కనిపించు ఈ తపనే, శ్రీసభకు ఒక ప్రేరణ. అందువలన, కుటుంబ ఉనికి, విధానం, ఆరంభ అంతిమ లక్షములను, లక్షణములను గురించి లోతుగా అధ్యయనం చేయాలి. అందులోని సుఖసంతోషాలను ఒకవైపు, అందులోని సమస్యలను, సవాళ్ళను మరోవైపు, విపులంగా పరిశీలించాలి. దైవ ప్రణాళికలో వివాహం, కుటుంబం అను అంశాలలో దాగియున్న పవిత్రతను, దైవత్వాన్ని, ఆత్మీక గుణగణాలను వెలికితీసి లోకానికి అందించాలి. ఈ విధంగా ప్రజలలో దాగియున్న 'కుటుంబ జీవితం' అను ఆశకు శ్రీసభ ఊపిరి పోయాలి. ఆ ఆశకు ప్రస్తుతం శ్రీసభ అర్పించు సమాధానమే ఈ పత్రం. కావున "కుటుంబం గురించి క్రైస్తవ ప్రకటనం నిజముగా ఓ సువార్త".

కాలం మారింది. పరిస్థితులు మారాయి. ఆశలు, ఆలోచనలు, అంతిమ లక్ష్యాలు మారాయి. జీవిత ప్రయాణం వేగవంతం అయ్యింది. అతివేగం ప్రమాదకరం అను నానుడి తన రుచిని కోల్పోతుంది. వైజ్ఞానిక పురోగమనంతో జీవితం ఓ యాంత్రికంగా మారింది. వ్యక్తులకు చూపించవలసిన గౌరవం, ఇవ్వవలసిన విలువ, వస్తువులలోకి మారిపోయింది. స్నేహితునికంటే సెల్ ఫోన్ ముఖ్యమైంది. మిత్రుడు పడితే లేవనెత్తే సమయం లేదు గాని, మత్తు మైకంలో వస్తు వ్యామోహంలో

పడిపోడానికి సమయాన్ని వెదుకుతున్నాడు మానవుడు. కుటుంబంలోని పరిస్థితులు ఇందుకు భిన్నమేమి కాదు. అలా అని అన్ని కుటుంబాలు ఇటువంటి దుర్భరస్థితిలో ఉన్నాయని అనకూడదు. అయితే కుటుంబ విలువలు మారుతున్నాయనీ, ఆప్యాయత అనురాగాలు సన్నగిల్లుతున్నాయనీ, పరస్పర అవగాహన, అంగీకారం చేజారిపోతున్నాయని మాత్రం మనం 'నేటి పరిస్థితులను' గమనిస్తే అర్థం అయ్యే ఒక సత్యం.

ప్రేమ సమస్తమునకు మూలం. నిజమైన ప్రేమ దేవుని నుండి జనిస్తుంది (1 యోహాను 4:7). ప్రేమలో ఫలిస్తే కుటుంబంలో జీవితం సాఫల్యమవుతుంది. పరస్పర ప్రేమలో పెరిగితేనే, కుటుంబం ఎదుగుతుంది. అందుకొరకే, ఫ్రాన్సిస్ పాపుగారు నేటి ప్రపంచంలోని కుటుంబ స్థితిగతులను పరిశోధించారు. వివాహము, కుటుంబం యొక్క ప్రాధాన్యతను, అందులోని విశాలమైన, వినూత్నీకరణ అవగాహన అవసరతను గుర్తించారు. కుటుంబ జీవనంలో ఎదురయ్యే అసంఖ్యాక సంక్లిష్ట సమస్యలు శ్రీసభ ప్రబోధన ప్రక్రియలో ఒక నూతన ఆలోచనాధోరణి వైపు నడిపిస్తున్నాయి. అతిముఖ్యముగా ఈ సమస్యల వలయంలో చిక్కుకున్న కుటుంబాన్ని విమోచించి, సరియైన మార్గంలో నడిపించుటకు, దానికి సంబంధించిన సైద్ధాంతిక, నైతిక, ఆత్మిక, సువార్తా పరమైన పరిష్కారాలను ఇవ్వవలసిన బాధ్యత శ్రీసభపై అమితంగా ఉంది. ఈ పరిస్థితుల కూడలిలో పాపుగారు ఈ 'ప్రేమానందం' - అమోరిస్ లేతిజియా' అను అపోస్తోలికా బోధనా పత్రమును అందించారు. ఈ పత్ర అధ్యయనం ద్వార అనేకమంది దేవుడు ఏర్పరచిన కుటుంబ వ్యవస్థ నైజాన్ని సమగ్రంగా గ్రహించగలరు.

ఒక వ్యాసం రాయాలంటే ఎంతో శ్రమటోర్చాలి. విషయ పరిజ్ఞానం సేకరించాలి, దానిని సరియైన క్రమములో కూర్చాలి. దానిని సరళమైన భాషలోనికి తర్జుమా చేయాలి. క్లిష్టమైన పదాలను అర్థం మారకుండా, మార్చకుండా స్థానిక భాషలోకి పొందుపరచడం చాల కష్టం. మరి శ్రీసభ అందించు పత్రిక సంగతి వేరే చెప్పనక్కరలేదు. అది కేవలం అక్షరాలను అనువదించడం కాదు. దానిని రూపొందించిన 'రచనామండలి' ఆలోచనలోనికి, ఉద్ధ్యేశములోనికి ప్రవేశించకుంటే

దాని 'వాస్తవ రూపాన్ని' ఇవ్వడం సాధ్యం కాదు. మరీ ముఖ్యంగా కొన్ని పదాలను తర్జుమా చేయడంలో నేర్పరితనం, నమ్మక ప్రయత్నం చేయాలి. అప్పుడే ఒక శ్రీసభ అధికారపత్రాన్ని విశ్వసనీయంగా స్థానిక భాషలో సమర్పించదానికి సాధ్యం అవుతుంది. అది చాలా ప్రయాసతో కూడిన ఓ కర్తవ్యం. ఇటువంటి ప్రయత్నంలో సహనంతో ప్రయాణించి నాకు సహకరించిన సంపాదకవర్గానికి, గురువిద్యార్థులకు, ఇందులో తమవంతు కృషిని అందించిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పత్రిక కోసం వేచియుండి, క్రైస్తవ విశ్వాసంలో ఎదగాలి అని తపించు ప్రతి చదువరికి నా ధన్యవాదములు. దేవుడు మీ కుటుంబములను 'తన ప్రేమతో' నడిపించు గాక.

ఇట్లు ప్రభు సేవలో...
**ఫాదర్ పిల్లి అంతోని దాస్**
సంచిక సంపాదకులు

# 1. దైవవాక్కు వెలుగులో కుటుంబం

– బ్రదర్ దారా షద్రక్

## పరిచయం



పవిత్ర గ్రంథములో చూసినట్లయితే కుటుంబ జీవనాలు, పుట్టుక వృత్తాంతాలు, ప్రేమ కథలు మరియు కుటుంబ కలహాలు ఎక్కువగానే కనిపిస్తాయి. ఇది నిజం. పవిత్ర గ్రంథములోని మొదటి పేజీలలోని అవ్వ ఆదాముల కుటుంబం గురించి, వారి కుటుంబంలోని కష్టాలు, బాధలు, వాటిని ఓర్చుకొను శక్తిని కూడా చూస్తాం. పవిత్ర గ్రంథం చివరి పేజీలలో కూడా ప్రభువు గొఱ్ఱెపిల్ల యొక్క వివాహ మహోత్సవమును చూస్తాం (దర్శన 21:2,9). ఇలా చూస్తే పవిత్ర గ్రంథం మొదటి పేజీ నుండి చివరి పేజీ వరకు కుటుంబ ప్రస్తావన కనిపిస్తుంది. యేసుప్రభువు చెప్పిన రెండు గృహముల ఉపమానం: ఒక గృహం రాతిమీద నిర్మించినది, రెండవది ఇసుక నేలపై నిర్మించినది (మత్తయి 7:24). ఈ ఉపమానం కుటుంబాలలోని పరిస్థితులను గురించి సూచిస్తున్నది. కుటుంబంలోని సభ్యులు తమ స్వేచ్ఛా జీవితాలను జీవించు విధానమును బట్టి వారి కుటుంబం నిలుస్తుంది అని తెలియజేస్తున్నది.

ఒక కవి ఇలా అంటాడు "ప్రతి కుటుంబం ఒక దీపస్తంభం". ఇప్పుడు మనమందరము అటువంటి ఒక కుటుంబమును పరిశీలిద్దాం. కీర్తనాకారుడు పాడినటువంటి పాట ఇప్పటికీ యూదుల మరియు క్రైస్తవుల వివాహ వేడుకల్లో ప్రతిధ్వనిస్తుంది. "ప్రభువుపట్ల భయభక్తులు చూపుచు అతని మార్గములో నడుచు నరులు ధన్యులు. నీ కష్టార్జితమును నీవు అనుభవింతువు, నీవు ఆనందమును, అభ్యుదయమును బడయుదువు. నీ లోగిట నీ భార్య ఫలించిన ద్రాక్ష తీగవలె

నుండును. నీ భోజనపు బల్ల చుట్టూ నీ తనయులు ఓలీవ పిలకల వలె ఒప్పుదురు. దేవుని పట్ల భయభక్తులు గల నరుడు ఇట్టి దీవెనలు బడయును. నీ జీవిత కాలమందెల్ల ప్రభువు సీయోను నుండి నిన్ను దీవించు గాక! నీవు యెరూషలేము అభ్యుదయమును కాంతువు గాక! నీ బిడ్డల బిడ్డలను కన్నులారా చూతువు గాక! ఇస్రాయేలీయులకు శాంతి కలుగును గాక!" (కీర్తన 128:1-6).

## నీవు – నీ భార్య

భోజన బల్లపై ప్రశాంతంగా కూర్చున్న కుటుంబం మధ్యలో తల్లీ తండ్రీ, భార్యభర్తలు, వారి ప్రేమ కథ. క్రీస్తుప్రభువు పలికినట్లుగా ఆదియందు దేవుడు ఏర్పరచిన బంధం, ఆయన ప్రణాళికే కుటుంబం. ఆది నుండి సృష్టికర్త వారిని స్త్రీ పురుషులుగా సృజించినట్లు చదువుతున్నాం (మత్తయి 19:4). ఆదికాండములో విన్న మాటలే మనకు మరల మరల వినిపిస్తున్నాయి, "కావుననే నరుడు తన తల్లిదండ్రులను విడనాడి ఆలికి హత్తుకొనిపోవును. వారిరువురు ఏక శరీరులగుదురు" (ఆది 2:24).

ఆదికాండములోని మొదటి అధ్యాయాలలోనే భార్యాభర్తలను గూర్చి వివరంగా తెలియజేయబడింది. పవిత్ర గ్రంథములోని ఘనమైన మొదటి పేజీలలోనే కుటుంబం గురించి చాలా అంశాలు చెప్పబడ్డాయి. "దేవుడు మానవజాతిని సృజించెను" (ఆది 1:27). ఇక్కడ ఆశ్చర్యకరమైన మాట: "దేవుని పోలిక". దేవుని పోలిక భార్యాభర్తలలో, స్త్రీ పురుషులలో కనిపిస్తుంది. ఈ లింగతత్వాలు దేవునికి సంబంధించినవా లేక ప్రాచీన మతాచారాలలో చెప్పబడినట్లు దేవుడు దైవీక స్త్రీని అనగా దేవతను తన సహచరినిగా కలిగివున్నాడా? దీనికి సమాధానం: లేదు. పవిత్ర గ్రంథం ఇలాంటి కానాను దేశపు మతాచారాలకు చెందిన మూఢ ఆచారాలను తృణీకరిస్తుంది అని మనకు తెలుసు. దేవుని మహత్యం రహస్యమైనది. ఆయన సృష్టికర్త కనుక భార్యాభర్తల కలయిక ఫలం దేవుని సృజనాత్మక కార్యంలోని ఆయన రూపానికి, పోలికకు 'రూపం' లేదా 'పోలిక' ఈ బంధం. ఒక సజీవమైన ఫలభరితమైన దృశ్య చిహ్నం.

ప్రేమించుకుంటూ, ప్రేమకు ప్రతిరూపముగా బిడ్డలకు జన్మనిచ్చే భార్యాభర్తలు నిజమైన, సజీవమైన స్వరూపాలు. వారు రాళ్లు, బంగారంతో చేయబడిన విగ్రహాలు

కాదు. వారు సృష్టికర్తయు, రక్షకుడైన దేవుని ప్రత్యక్షపరులు, శక్తిని కలిగినవారు. అందుకే అది ఫలభరితమైన ప్రేమ. దేవుని అంతర్గత జీవితాన్ని సూచిస్తుంది (ఆది 1:28, 9:7, 17:2-5,16, 28:3, 35:11, 48:34).

ఇందువలననే ఆదికాండములోని యాజక సాంప్రదాయములో చాలా వంశవృత్తాంతాలు గోచరమవుతాయి (4:17-22, 25-26, 5:10, 11:10-32, 25:1-4,12-17, 19-26,36). భార్యాభర్తలు వారి ప్రేమ ద్వారా నూతన జీవితాలను ఇవ్వగలరు అను సత్యం చుట్టూ రక్షణ చరిత్ర సాగుతుంది. ఈ విధంగా చూస్తే భార్యాభర్తల ప్రేమబంధం ద్వారా దేవుని యొక్క పరమ రహస్యాన్ని తెలుసుకోగలము. అందుకే క్రైస్తవ విశ్వాసంలోని త్రిత్వైక దేవుడు - తండ్రీ, కుమారుడు, ఆత్మలో కనిపిస్తారు. కనుక దేవుడు ఒంటరివాడు కాదు. ఆయన ఒక కుటుంబం. ఆయన తండ్రితత్వమును, కుమారుని తత్వాన్ని మరియు కుటుంబ సుగుణమైన ప్రేమతత్వాన్ని కలిగి ఉన్నాడు. "దైవీక కుటుంబంలోని ఆ ప్రేమే పవిత్రాత్మ". కనుక కుటుంబ జీవితం దేవుని ఉనికిని దాటిపోదు. త్రిత్వైక దేవుని సారూప్యం గురించి పునీత పౌలుగారి దైవశాస్త్ర రచనలలో కనిపిస్తుంది. ఆయన భార్యాభర్తలను, క్రీస్తుకు, శ్రీసభకు గల ఐక్యతతో పోల్చారు (ఎఫెసీ 5:21-33).

వివాహం గురించి ప్రస్తావన వచ్చినప్పుడు, ఆదికాండము రెండవ అధ్యాయంలో వ్రాయబడిన భార్యాభర్తల బాంధవ్యం మన స్ఫురణకు వస్తుంది. మొదటి పురుషుడు తనకు 'సరియైన జోడి' కొరకు అన్వేషిస్తున్నాడు (ఆది 2:18,20). జంతువులలోగాని తన చుట్టూ ఉన్న ప్రపంచంలో తన ఒంటరితనమును తీసివేయగల జంట కోసం వెదకుతున్నాడు. హీబ్రూ గ్రంథములో ఈ విధంగా ఉంటుంది: "అది ఒక ప్రత్యక్ష కలయిక, ముఖాముఖి కలయిక, కంటి కంటి కలయిక, మౌన భాషతో కూడిన కలయిక, ఎందుకన ప్రేమకు సంబంధించినంత వరకు మౌనం మాటకన్నా గంభీరమైనది, అది ఒక కలయిక. దేవుని ప్రేమను ప్రత్యక్షపరచు ఒక ముఖముతో ఒక 'నీవు'తో కలయిక. ఆమె మానవుని 'ఉన్నతమైన సంపద; అతనికి సరియైన సహకారి. ఆమె అతనికి ఒక ఆదరణ స్తంభము". ఇక పరిశుద్ధ గ్రంథ జ్ఞాని పలుకులు (సిరా 36:24). అదే విధముగా పరమగీతాలలో స్త్రీ ప్రేమ ప్రమాణాన్ని పాడుతుంది: "నా ప్రియుడు నావాడు. నేనతని దానను. అతడు లిల్లీ పూలు పూచిన చోట తన మందను మేపును" (పరమ 2:16).

ఈ ఎదురుపాటు లేక ఈ కలయిక మానవుని ఒంటరితనాన్ని తొలగించి నూతన జీవితం, కుటుంబ జీవిత ఆవిర్భావానికి అవకాశం ఇస్తుంది. ఆదాము, అవ్వలు ప్రతి కాలానికి, స్థలానికి సంబంధించిన వారిగా నూతన కుటుంబం ప్రారంభిస్తారు. యేసుప్రభువు ఆదికాండములోని కుటుంబం గురించి ఈ విధంగా పలుకుతారు "ఈ కారణము చేతనే పురుషుడు తల్లినీ తండ్రిని విడచి తన భార్యను హత్తుకొనియుండును. వారు ఇరువులు ఏక శరీరులై ఉందురు" (మత్తయి 19:5; ఆది 2:24). ఇక్కడ "ఏక శరీరులు", "హత్తుకొని", అను పదాలు హీబ్రూ భాషలో శారీరకంగా, మరియు అంతర్గతంగా ఒక గాఢమైన బంధాన్ని తెలియజేస్తున్నాయి. ఇలాంటి పదాలనే దేవునితో మన ఐక్యతను తెలియపరచుటకు ఉపయోగిస్తారు. "నేను నీకు అంటిపెట్టుకొని నడుతును" (కీర్తన 63:8). వివాహ బంధం శారీరక, లైంగికపరమైన కోణములోనే కాదు కాని, ప్రేమలోని స్వచ్ఛమైన స్వీయ సమర్పణను జనింపజేస్తుంది. ఈ వివాహ కలయిక వలన భార్యాభర్తలు ఇద్దరు శారీరకంగా మరియు వారి హృదయాల, జీవితాల కలయికతో 'ఒక శరీరం అవుతారు'. పర్యావశానంగా వారి బిడ్డలు కూడా తల్లిదండ్రుల దేహపరమైన 'శరీరమునే కాక, ఆత్మీయపరమైన శరీరమును పొందుతారు'.

## నీ పిల్లలు ఒలీవు చెట్టు పిలకవంటి వారు

కీర్తనాకారుడు పాడిన కీర్తనను మరియొకసారి చూద్దాం. ఇంటిలో భార్యాభర్తలు భోజన బల్లపై కూర్చున్నారు. వారికిరువైపులా పిల్లలు ఓలీవు చెట్టు చిగురించిన కొమ్మలవలె ఉన్నారు (కీర్తన 128:3). ఈ పిల్లలే వారికి సంపూర్ణ బలము, జీవము. తల్లీ తండ్రీ ఇంటికి పునాదులు అయితే పిల్లలు ఆ ఇంటికి 'జీవమున్న రాళ్లలాంటివారు' (1 పేతురు 2:5). పాత నిబంధనలో మనకు యావే దేవుని పేరు తరువాత తరచూ కనిపించే పదం 'బిడ్డ' (బిన్–కుమారుడు) లేదా (బనా – కట్టు, నిర్మించు). కీర్తన 128లో కూడ పిల్లలు కలగడం అనేది ఇంటిని నిర్మించడం లేదా సమాజాన్ని నిర్మించడం లాంటిదని అర్థమవుతుంది. "ప్రభువు ఇల్లు కట్టని యెడల దానిని కట్టినవారి శ్రమ వ్యర్థమగును. ప్రభువు నగరమును కాపాడని యెడల కావలివారు మేల్కొనియుండియు లాభము లేదు. పుత్రులు ప్రభువు ఇచ్చు వరము. తనయులు దేవుని బహుమానము. యౌవనమున పుట్టిన

కుమారులు వీరుని చేతిలో బాణముల వంటివారు. అట్టి బాణములతో తన అమ్ముల పొదిని నింపుకొనువాడు ధన్యుడు. నగర ద్వారము వద్ద శత్రువులు తారసిల్లినప్పుడు అతడు పరాజయము నొందడు" (కీర్తన 127:1,3-5). బిడ్డలు రక్షణ చరిత్రలో కుటుంబాలను ఒక యుగం నుండి మరొక యుగానికి కొనసాగింపు చిహ్నాలుగా కనిపిస్తారు.

నూతన నిబంధనం "గృహములో గుమికూడిన సంఘములను గురించి మాట్లాడుతుంది" (1 కొరింతీ 16:9; రోమీ 16:5; కొలస్సీ 4:5; ఫిలేమో 2). ఒక కుటుంబ జీవితం ఒక కుటుంబ శ్రీసభగా దివ్యపూజకు అనుకూలమైన నివాసంగా భోజన బల్లపై ఆసీనుడైన క్రీస్తు సన్నిధిగా మారుతుంది. దర్శన గ్రంథములో కనిపించు రూపం మరచిపోలేనిది. "వినుము! నేను ద్వారము వద్ద నిలిచి తలుపు తట్టుచున్నాను. ఎవరైనను నా స్వరమును విని తలుపు తెరచిన లోనికి వత్తును. వానితో భుజింతును, అతడును నాతో భుజించును" (దర్శన 3:20). దేవుని ఉనికిచే నింపబడి, కుటుంబం ప్రార్థనకు మరియు ఆశీర్వాదము మెండుగా పొందు కుటుంబముగా కనిపిస్తుంది.

కుటుంబం బిడ్డలను విశ్వాసంలో పెంచాలి అని పవిత్ర గ్రంథం తెలియజేస్తున్నది. నిర్గమకాండములో పాస్కా విందు జరుగు విధానం చూస్తే ఈ విషయం బోధపడుతుంది (నిర్గమ 12:26,27). యూదా సాంప్రదాయం ప్రకారం జరుగు పాస్కా విందులో ఈ కుటుంబ లక్షణం కనిపిస్తుంది. కీర్తనాకారుడు కూడా పాస్కా విందు సమయంలో కుటుంబంలో విశ్వాస ప్రకటనను ఏ విధంగా జరుపుకోవాలో తెలియజేస్తున్నాడు. "మేము విన్న సంగతులు, మా పూర్వులు మాతో చెప్పిన సంగతులు, ప్రభువు మహాకార్యములు అతని పరాక్రమము, అతని అద్భుత కార్యములు మొదలయిన అంశాలను మన పిల్లలకు తెలియకుండా దాచి ఉంచరాదు. ఈ సంగతులనెల్ల మన తరువాత తరముల వారికి తెలియజేయ వలయును. ప్రభువు యాకోబు సంతతికి శాసనములను ఒసగెను. ఇశ్రాయేలు ప్రజలకు శాసనములను ఒసగెను. ఇశ్రాయేలు ప్రజలకు ధర్మశాస్త్రమును దయచేసెను. మన పూర్వులు ఆ శాసనములను తమ పిల్లలకు బోధించవలయును.

అప్పటికి ఇంకను పుట్టని భావి తరముల వారును వానిని నేర్చుకొని మరల తమ బిడ్డలకు నేర్పవలయుననియు అతడు ఆజ్ఞాపించెను” (కీర్తన 78:3-6). తల్లిదండ్రులు మొదట వారి పిల్లలకు విశ్వాసాన్ని పెంపొందించు గురువులుగా మారాలి. కుటుంబంలో ఈ విశ్వాస ప్రకటన ఒకరి నుండి మరొకరికి అందించబడాలి. “మీ కుమారుడు ఇదియేమి? అని మిమ్ము అడిగినచో యావే మహాశక్తితో మమ్ము దాస్యనిలయమయిన ఐగుప్తు నుండి కొనివచ్చెను” (నిర్గమ 13:14). ఈ విధంగా రానున్న తరాలు కూడా వారు ఈ పాటను దేవునికి పాడగలరు: “యువతి యువకులు, వృద్ధులు, బాలబాలికలు” (కీర్తన 148:12) అందరు కలసి దేవుని స్తుతించగలరు.

పవిత్ర గ్రంథ జ్ఞానులు తెలియజేస్తున్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల పెంపకంలో చాలా శ్రద్ధ వహించాలి (సామె 3:11,12; 6:20-22,13:1, 22:15, 23:13-14). అంటే పిల్లలు కూడా తల్లిదండ్రుల మాటలు పాటించాలి. “మీ తల్లిదండ్రులను గౌరవింపుము” (నిర్గమ 20:12). ఇక్కడ “గౌరవించు” అనగా కుటుంబ నియమాలను, సామాజిక నిబంధనలను పాటించాలి. మత నమ్మకాలను అడ్డుపెట్టుకొని వాటిని విస్మరించకూడదు (మార్కు 7:11-13). “తండ్రిని గౌరవించువాడు తన పాపములకు ప్రాయశ్చిత్తము చేసుకొనినట్లే, తల్లిని సన్మానించువాడు నిధిని చేకొనినట్లే” (సిరా 3:3-4).

సువార్త గ్రంథం మనకు గుర్తు చేస్తుంది: పిల్లలు కుటుంబ సొత్తు మాత్రమే కాదు. వారు తమ సొంత జీవితాలను కూడా జీవించాలి. దీనికి యేసుప్రభువే మనకు ఒక ఉదాహరణగా నిలుస్తున్నారు. ఈ లోకంలో తల్లిదండ్రులకు విధేయించి జీవించాడు (లూకా 2:51). పిల్లల నిర్ణయాలు, వారి దైవపిలుపు దైవరాజ్యంలో పాలుపంచుకొనే విధంగా ఉండాలి (మత్తయి 10:34-37, లూకా 9:59-62). స్వయముగా పవిత్ర గ్రంథమే తెలియజేస్తుంది.

యేసు 12 సంవత్సరాల వయస్సు ఉన్నపుడు మరియ తల్లికి, యోసేపుకి ఈ విధంగా చెప్పారు “నేను నా తండ్రి పనిమీద ఉన్నానని మీకు తెలియదా? (లూకా 2:48-50). అంతేకాక సమాజం నిరాకరించిన పిల్లలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు. పిల్లల మనస్సులను నిర్మలమునకు, వినమ్రతకు ప్రతీకగా చూపించాడు (మత్తయి 18:34).

## శ్రమలతో, రక్తముతో కూడిన మార్గం

కీర్తన 128లో అవగతమవుతుంది: బాధలు, శ్రమలు, హింసలు కుటుంబంలోని ప్రేమ, ఐక్యతలను విచ్ఛిన్నం చేస్తాయి. పవిత్ర గ్రంథములో చూస్తున్నాం. విడాకుల గురించి జరిగిన వాగ్వివాదంలో వివాహం గురించి క్రీస్తు బోధను పొందుపరిచారు (మత్తయి 19:3-9). సృష్టి ఆరంభంలోనే పాపం ద్వారా వెలుగు లోపించి స్త్రీ పురుషుల మధ్య ఉన్న ప్రేమ బంధం తారుమారు అయింది. పురుషుని ఆధిపత్యానికి దారి తీసింది. “నీ భర్త యెడల నీకు కోరిక కలుగును. అతడు నీ మీద పెత్తనము చేయును” (ఆది 3:16).

శ్రమలు, రక్తముతో కూడిన జీవితాలు పవిత్ర గ్రంథములో చాలా కనిపిస్తాయి. కయీను తన తమ్ముని చంపడంతో మొదలు, అబ్రహాము, ఇస్సాకు, యాకోబు కుమారులు, భార్యల కలహాలు మరియు దావీదు కుటుంబంలోని కష్టాలు, తోబియా కుటుంబంలో మరియు యోబు కుటుంబం గురించి కూడా చూస్తాం (యోబు 19:13-14).

యేసు స్వయంగా ఒక సాధారణ కుటుంబంలో జన్మించాడు. వెంటనే పరాయి దేశానికి పారిపోవలసి వచ్చింది. ఆయన పేతురు ఇంటికి వెళ్లినప్పుడు పేతురు అత్త అనారోగ్యంతో ఉండుట చూసి దయ చూపించాడు (మార్కు 1:30,31). మరియు జైరూస్, లాజరు మరణించుటను గూర్చి చింతించాడు (మార్కు 5:22-24, 35-43, యోహాను 11:1-44) ఇలా చాలా చూస్తాం.

ఇటువంటి కష్టాలు, బాధలు ఉన్న కుటుంబాలకు దేవుని వాక్కు ఓదార్పును ఇస్తుంది. వారి జీవిత ప్రయాణానికి ఒక గమ్యం చూపుతుంది (దర్శన 21:4).

## నీ హస్తముల కార్యం

కీర్తన 128లో ప్రారంభంలోనే తండ్రీ ఒక పనివానిలాగా కనిపిస్తాడు. తాను తన కృషి, కష్టాల కార్యము ద్వారా ఒక మంచి కుటుంబాన్ని నిర్మించడానికి తన కుటుంబంలో సమాధానం కోసం పనిచేస్తాడు (కీర్తన 128:2). బైబిల్ ప్రారంభం నుండి పని అనేది మానవుడు చేయవలసిన ముఖ్యమైన భాగం (ఆది 2:15). మనిషి ఒక పనివాడు. భూమిని త్రవ్వి పంట పండించి జీవించాలి (కీర్తన 127:2). తన సొంత శక్తిని పెంచుకోవాలి.

పని సమాజ అభివృద్ధికి దోహదపడుతుంది. కుటుంబ పోషణకు ఆధారమవుతుంది (కీర్తన 128:5-6). సామెతల గ్రంథం చూస్తే కుటుంబంలో తల్లి యొక్క పనిని తెలుపుతుంది. తల్లి పని ద్వారా పిల్లల మరియు భర్త యొక్క మన్నన పొందుతుంది (సామె 31:10-31). అపోస్తలుడైన పునీత పౌలుగారు కూడా పని చేసి తన ఆహారాన్ని సంపాదించుకున్నారు (అపొ 18:3, 1 కొరింతి 4:12, 9:12). అదే విధంగా పనిచేసిన వారికే భుజించే అర్హత ఉందని బోధించాడు (2 తెస్స 3:10, 1 తెస్స 4:11).

పనిలేకపోతే బాధపడే వ్యక్తులను మెచ్చుకోవాలి. యేసుప్రభువు ఉపమానం ద్వారా తెలుపుతున్నారు. పనిలేక వీధులలో చింతించిన వారి గూర్చి చెప్పారు (మత్తయి 20:1-16). పేదవారిని, ఆకలితో ఉన్నవారిని కలిసినప్పుడు ఆయన చాలా బాధపడ్డారు. ప్రస్తుత సమాజంలో కూడా చూస్తున్నాం, నిరుద్యోగం వలన చాలా కుటుంబాలలో సంతోషం లేదు.

పాపం వలన సమాజంలో జరుగుతున్న అనర్థాలను మనము మరచిపోలేము. మరి ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో మానవుడు స్వార్ధంతో పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాడు. దీని వలన భూమి నాశనం అవుతుంది. సామాజిక, ఆర్థిక వ్యవస్థను గురించి ఏలియా ప్రవక్త గారు కూడా హెచ్చరించారు. చివరికి క్రీస్తుప్రభువు కూడా అన్యాయం గురించి బోధించారు (లూకా 12:13, 16:1-31).

## ఒక కౌగిలిలోని మాధుర్యం

ఒకరితో ఒకరు ప్రేమ కలిగి ఉండాలి అని క్రీస్తుప్రభువు నేర్పుతున్నారు. పొరుగువాని కొరకు తన ప్రాణమును అర్పించువాడు నా సేవకుడు అన్నాడు (మత్తయి 22:39, యోహాను 13:34). ప్రేమ కూడా దయ, కరుణ అను ఫలాలను ఇస్తుంది. వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీ విషయంలో గమనించగలం. యేసుప్రభువు ద్వారా ఆమె కరుణను పొంది నూతన జీవితం పొందింది (యోహాను 8:11). క్రైస్తవ వివాహం మరియు కుటుంబ జీవితానికి ముఖ్యమైనది ప్రేమ. పరుగుల ప్రపంచంలో బాహ్యమైన బంధాలతో మాత్రమే సరిపెట్టుకొను ఈ లోకంలో, ఒకటి

మాత్రం నిర్లక్షమునకు గురి అవుతున్నది అదే మృదుత్వం. 130వ కీర్తనలో మరియు ఇతరత్ర వాక్యాలలో కూడా చూస్తాం (నిర్గమ 4:22, 49:15, కీర్తన 27:10). దేవునికీ ప్రజలకు మధ్యగల సంబంధం భర్యాభర్తల మధ్య ప్రేమ బంధమును సూచిస్తుంది. ఇక్కడ తల్లీ పిల్లల మధ్యగల సున్నితమైన బంధాన్ని చూస్తాం. చిన్న బిడ్డ పాలు త్రాగిన తరువాత తన తల్లి ఒడిలో నిద్రిస్తుంది. అది ఒక బలమైన బంధం. గాఢమైన అనుబంధం. అది బాహ్యమైనది మాత్రమే కాదు, మనస్సుకి సంబంధించినది (కీర్తన 131:2).

మన విశ్వాసము, ప్రేమ, దయ, భక్తి ద్వారా మానవ కుటుంబంలో మరియు ప్రత్యేక త్రిత్వేక దేవుని కుటుంబంలోని బాంధవ్యాన్ని గురించి తెలుసుకున్నాం. ఈ లోకంలో కుటుంబ బాధ్యత తల్లిదండ్రులకు ఇవ్వబడింది. దీని ద్వారా వారు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మల బంధం వలె ఐక్యమై ఉంటారు అని దేవుని వాక్యం తెలుపుతుంది. పిల్లలను కని, పెంచుట అనేది దేవుని అద్భుతమైన సృష్టి. ప్రతి కుటుంబం ప్రతిరోజు ప్రార్థించుకుంటూ పవిత్ర గ్రంధాన్ని పఠిస్తూ, దివ్యపూజలో పాల్గొంటూ, నిత్యము ప్రేమానురాగాలతో వర్ధిల్లే ఆత్మ నిలయముగా కొనసాగాలి.

ప్రతి కుటుంబం కూడా తిరుకుటుంబాన్ని చూసి జీవించాలి. బాధాకరమైన విషయం ఏమిటంటే: ఎన్నో  కుటుంబాలు, ఇల్లు, స్థలములేక రోధిస్తున్నారు. మరియతల్లివలె తల్లిదండ్రులు, కుటుంబంలోని కష్టాలను, బాధలను, ధైర్యముతో నెమ్మదిగా ఎదిరించి దేవుడు వారి జీవితాలలో చేసిన కార్యాలను మదిలో పదిలపరచుకోవాలి (లూకా 2:19,51). మరియతల్లి యొక్క హృదయంలో కూడా ప్రతి కుటుంబం యొక్క అనుభవాలు, అనుభూతులు పదిలపరచబడ్డాయి. మన కుటుంబ జీవితం ద్వారా దేవుడు మనకు ఏమి తెలియజేయాలనుకున్నాడో సత్యం మనకు అర్ధమయ్యేలా మరియతల్లి మనకు సహాయం చేస్తుంది.

❋ ❋ ❋ ❋

# ౨. కుటుంబంలో అనుభవాలు మరియు సవాళ్లు

- బ్రదర్ మెడిపల్లి థామస్



కుటుంబ జీవితం ఒక సుందరమైన వనం. ఈ సుందరమైన వనంపైనే మన ప్రపంచం మరియు శ్రీసభ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఈ కుటుంబ జీవితంపై అనేకమైన విజ్ఞానవంతులు వివిధ అధ్యయనాలు చేశారు. మరిముఖ్యంగా మనం శ్రీసభ బోధనల అనుసారంగా ప్రస్తుతం కుటుంబం ఎదుర్కొనే సంక్లిష్టమైన సమస్యలపై దృష్టిసారించాలి. ఎందుకనగా భార్యాభర్తలు స్వీకరించిన పిలుపుకు మరియు ఆధ్యాత్మికతకు అనువుగా జీవించటానికి శ్రీసభ మార్గనిర్దేశం చేయవచ్చు. తద్వారా భార్యాభర్తలు వారు స్వీకరించిన పరమ పవిత్రమైన వివాహ అంతస్తులో సజావుగా సాగుతారు. ఈ ఆర్టికల్ ద్వారా కుటుంబం ఎదుర్కొనే కొన్ని సవాళ్లను ఏవిధంగా ఆధ్యాత్మికంగా జయించవచ్చునో తెలుసుకుందాం.

నేడు కుటుంబ జీవితాన్ని అన్ని సంక్లిష్టమైన కోణాలలో పరిశీలించిన పిమ్మట జీవిత విశిష్ట ఔన్నత్యం మరియు దానిలోని కొన్ని చేదు అనుభవాలను మనం గమనించగలం. ఈనాటి సమాజంలో మానవ జీవితంలోని మార్పులు మరియు సమాజంలోని మార్పులు జీవితాలపై ప్రభావాన్ని చూపుతాయి. ఇవి కొన్నిసార్లు స్వీకరించిన పిలుపుకు విశ్లేషణాత్మకంగాను మరియు విభిన్నంగాను ఉంటాయి. కొన్ని దశాబ్ధాల క్రితం స్పానిష్ పీఠాధిపతులు అందరూ కలిసి ఒక తీర్మాణం చేశారు. అందులో కుటుంబ జీవితాన్ని ఆస్వాదించే వారికి సమానమైన స్వేచ్ఛ ఉండాలని అనుకున్నారు. అనగా వారి విధులను, బాధ్యతలను మరియు

పనులను సమానంగా నిర్వర్తించాలి. అంతేకాకుండా ఇరువురి మధ్య పరస్పర సంభాషణ ద్వారా కుటుంబ జీవితాన్ని సజావుగా గడపవచ్చును. అలా కాకుండా ఇరువురు మౌనంగా ఉండి ఎవరి పనిని వారు నిర్వర్తించిన యెడల అందులో భాంధవ్యం ఉండదు. కాని ఈనాటి సమాజం భార్యాభర్తల సంబంధాన్ని బలపరచటానికి ఎటువంటి కార్యాచరణను అనుసరించకుండా, కుటుంబ జీవితానికి మద్ధతు ఇవ్వకుండా బలహీనపరుస్తుంది. కనీసం పూర్వకాలం నుండి వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలను కూడా ఈనాటి మానవ పరిణామాలు సాంస్కృతిక మార్పులు ప్రక్కన పెట్టిస్తున్నాయి.

మరోవైపు ఈ విధంగా సమాన స్వేచ్ఛను పాటించడం ద్వారా ఇంకొక ప్రమాదం ఎదురవుతుంది. మనిషి వ్యక్తిగత జీవితం, వ్యక్తిగత కోరికలు మరియు ఆలోచనలు చేయడం జరుగుతుంది. దీని ద్వారా పరమపవిత్రమైన వివాహ సమయంలో వారు చేసిన ప్రయాణాలు "బూడిదలో పోసిన పన్నీరుగా" మారగలవు. నేను చేసినదే గొప్ప లేదా వాస్తవం అనే అపోహలో జీవిస్తూ ఇరువురూ ఏకమనస్కులు అనే సంగతిని మరచిపోతున్నారు. ఈ విధంగా చేయటం ద్వారా వారి ఆలోచనలు అన్నీ కూడా సంపాదనలు మరియు విలాసవంతమైన జీవితంపై కేంద్రీకరించబడి ఉంటాయి. దీని కారణాన, కుటుంబంలో అసహనం, ద్వేషం, మరియు శతృత్వం చోటు చేసుకుంటున్నాయి. మారుతున్న సామాజిక, సాంస్కృతిక కార్యక్రమములు కొన్నిసార్లు శాశ్వత ప్రమాణాలకు అభిముఖంగా నిలుస్తాయి. ఉదాహరణకు మనం వ్యక్తిగత జీవితానికి అధిక ప్రాముఖ్యతను ఇస్తాం. ఇది సరైన విధానంలో ఉపయోగించినంతకాలం మనకు ఎటువంటి సమస్యలు ఎదురుకావు. ఒక్కసారి ఈ విధానం దారితప్పితే అనుమానం, స్వార్థం, అహంభావం మరియు అహంకారం పెరుగుతాయి. మనం ఒక్కసారి మన నుంచి వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతే ఇతరులకు మంచిని పంచలేము. ఈనాడు అనేకమైన దేశాలలో వివాహాలు కొరవడుతున్నాయి. ఎక్కువ మంది స్త్రీ, పురుషులు ఒంటరిగా జీవించడానికి, సహజీవనం చేయటానికి మొగ్గు చూపుతున్నారు.

ఈ విషయాలు కుటుంబ జీవితాన్ని ప్రభావితం చేయటం వలన ఇరువురు కూడా తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. సమాజం మరియు సృష్టి మనకు

ఒసగిన స్వేచ్ఛను ఇష్టం వచ్చినట్లుగా ఉపయోగించుకుంటున్నారు. ఈ సమాజంలో, ఈ సృష్టిలో సత్యాలుగాని, విలువలు గాని, మానవత అంకిత భావాలుగాని, సూత్రాలలో గాని కుటుంబ జీవితాన్ని సక్రమంగా గడపడానికి దోహదం చేయడం లేదు, అధోగతికి దిగజారిపోతున్నాం. పవిత్ర వివాహంలో చేసిన ప్రమాణాలను మనం ఇష్టం వచ్చినట్లుగా మలచుకొని జీవిస్తున్నాం. దీని ద్వారా ఒంటరి జీవితాన్ని అలవరచుకొని ఎవరికి వారు తమ స్వప్రయోజనాల కోసం ప్రాకులాడుతున్నారు.

క్రైస్తవులుగా మనం వివాహ జీవితాన్ని సమర్థించకుండా ఉండలేము, అలాగని, సమాజంలో జీవిస్తున్నా అసాంఘిక క్రియలను అంత సులభంగా కొట్టిపారేయలేము. రెండింటిలో దేనిని ఎంచుకోవాలి? ఖచ్చితంగా కుటుంబ జీవితాన్ని ఎంచుకోవాలి. ఎందుకంటే, కుటుంబ జీవితం ద్వారా సమాజానికీ, సంఘానికి కలిగే మేలులను పఠించి ఇతరులకు ఏ విధంగా తెలియజేయగలమో అటువంటి పద్ధతులను అనుసరించి, వాటిని ప్రజలకు తెలియజేయాలి. సక్రమమైన కుటుంబ జీవితం ద్వారా ప్రభువు ఒసగే మేలులను అందరికి బహిర్గతం చేయాలి. ఇలా చేసేటప్పుడు మనం ప్రకటించే విషయములు ప్రస్తుత సమాజంలో ఉన్నా సమస్యలను అధిగమించే విధంగా ఉండాలి. ఇలా పరిస్థితులకనుగుణంగా ప్రకటించడం ద్వారా ఇవి ప్రజలకు తొందరగా అర్థమయ్యి, వాటిని వారి జీవితాలకు అన్వయించుకోవటానికి గొప్ప అవకాశము ఉంటుంది. కొన్నిసార్లు మనం తెలియజేసే విషయాలు ఏ విధంగా ఉంటాయంటే వివాహం అంటే పిల్లల్ని కనడానికి మాత్రమే అన్నట్లు ఉంటాయి. మరికొన్ని సార్లు క్రొత్తగా వివాహం చేసుకొన్నవారు, ఒకరి కోసం మరొకరు సర్దుకుపోయే జీవితాన్ని మాత్రమే జీవిస్తుంటారు. మరికొన్నిసార్లు ప్రజల నిజ జీవితాన్ని ప్రస్తావించకుండా, స్థిరత్వంలేని అనేకమైన సిద్ధాంతాలను ఇతరులకు చూపిస్తుంటాం. క్రైస్తవులముగా మనం నిజంగా చూపించవలసినది ఏమిటి?

మనం కుటుంబ జీవితాలపై ఎంతో అవగాహనతో అనేక విషయాలను ప్రజలకు తెలియజేస్తున్నాం. క్రైస్తవ సిద్ధాంతముల ఆధారముగా జీవశాస్త్రజ్ఞుల ఆధారముగా, నైతిక విలువలు మరియు నీతియుక్త జీవితం ఆధారంగా వివాహ బంధాన్ని, కుటుంబ జీవితాన్ని మనం సమర్ధిస్తూ, ప్రోత్సహిస్తూ దానియొక్క

ఔన్నత్యాన్ని అందరికి తెలియజేస్తున్నాం. క్రైస్తవులముగా అందులోను మరిముఖ్యంగా కతోలికులముగా మన కుటుంబ జీవితముల ద్వారా ఇతరులకు చూపించవలసినది: ప్రభుని కరుణకు, కృపావరములకు, అనుగ్రహములకు మనలను మనం సమర్పించుకొనుట ద్వారా, మనకు కలుగు మేలులను, వరములను గురించి అందరికి తెలియజేయడం మరియు జీవిత విధానం ద్వారా ఇతరులకు సుమాతృకగా నిలవడం.

ఇలా చెప్పలేకపోవడం వలన వివాహ ఔన్నత్యాన్ని ప్రజలకు తెలియజేయడంలో వైఫల్యాన్ని చవిచూస్తున్నాం. ఇలా చెప్పగలిగితే అది అందరికి భవిష్యత్తు కార్యాచరణకు, వ్యక్తిగత విలువలకు బాసటగా ఉంటుందే కాని ఆటంకం కాదు అని చెప్పగలము. వీటికి తోడుగా బైబిలు గ్రంథ వాక్యములను జోడించి వాటిని అన్వయించుకుని ఇతరులకు తెలియజేస్తే ప్రజలకు తొందరగా అర్థం అవుతుంది. వారు ఎటువంటి ఇబ్బంది పడకుండా పాటించగలుగుతారు. మనం మనలోని అంతరాత్మలను భద్రపరచుకొను మార్గాలను చూపాలి. మనం కొంతమందికి కృతజ్ఞులమై ఉండాలి. ఎందుకంటే చాలామంది వివాహ జీవితాన్ని ఎంతో గౌరవిస్తారు. మరిముఖ్యంగా తిరుసభ చేసే ప్రతి ప్రయత్నాన్ని వాళ్లు సమర్ధిస్తూ వారి సహాయాన్ని అందజేస్తున్నారు. మరిముఖ్యంగా ప్రేమగా జీవించటాన్ని కుటుంబ జీవితంలో వచ్చే సమస్యలను అధిగమించాలి. పిల్లలను సరైన మార్గంలో ఎలా పెంచాలి అనే విషయాల్ని శ్రీసభ చక్కగా వివరిస్తుంది.

అనేక దేశాలు మరిముఖ్యంగా ఆఫ్రికా దేశాలలో కొన్ని ప్రాంతాలలో వివాహ జీవితాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. సమస్యలను కూడా సామరస్యంగా పరిష్కరించుకోవటానికి ప్రయత్నిస్తారు, పరిష్కరించుకుంటారు. అదే విధంగా అనేక మంది కుటుంబ జీవితాన్ని ఎంతో ప్రేమతో, నేర్పుతో గడుపుతున్నారు. ఇవన్నీ కూడా క్రైస్తవ ప్రతినిధులకు ఒక నమ్మకాన్ని కలుగజేస్తుంటాయి. కాని కొన్నిసార్లు, ప్రజలు బోధకులు చెప్పే దానిని సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు, దీని ద్వారా ప్రజల్లో, గురువులు సరిగ్గా మాకు వివాహ జీవితం గురించి తెలియజేయలేక పోతున్నారు మరియు వారు యేసుక్రీస్తువలె సమరియ స్త్రీకి, వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీకి, ఆయన చూపిన కరుణను, ప్రేమను మాకు చూపించలేకపోతున్నారు అని భావిస్తున్నారు. కావున గురువులు, మతవాసులు మరియు క్రైస్తవులు, కతోలిక

భావాలను ప్రజలకు అందజేసే ప్రతివారును, విశ్వాసుల మనోభావములను గమనించి వారికి తగిన సమయాన్ని, సలహాలను అందజేస్తుండాలి.

క్రైస్తవ మతపెద్దలు పలుమార్లు సమాజానికి కుటుంబ ఆవశ్యకతను వివరిస్తూనే ఉన్నారు. కొన్నిసార్లు మన సంబంధ బాంధవ్యాలు, ఒక సంబంధం నుండి మరొక సంబంధానికి చాలా తొందరగా మారుతుంది. దీని ద్వారా మన సంబంధ బాంధవ్యాలు, సామాజిక మాధ్యమాల వలె తొందరగా అంటిపెట్టుకోవడం, అంతే తొందరగా విడిపోవడం జరుగుతుంది. కొన్నిసార్లు ఈ బంధాలను ఒంటరితనాన్ని పోగొట్టుకోవడానికి అవసరాలను, కోర్కెలను మరియు తమ యొక్క సొంత నిర్ణయాలను పరిపూర్తి చేసుకోవడం కోసం ఉపయోగిస్తున్నారు. ఏ విధంగా అయితే ప్రపంచంలోని వస్తువులను అవసరం కోసం వాడుకొని వదిలేసినట్లుగా ఈ బంధాలను కూడా ఒక ఆటవస్తువులాగా చూస్తున్నారు. అనేకమంది యువతీ, యువకులు వివాహ జీవితం అంటే భయపడుతున్నారు. దీనికి గల కారణాలు అనేకం అందులో మరి ముఖ్యంగా:

1. తల్లిదండ్రుల ప్రేమ వారిలో కొరవడి ఉంటుంది. వారు ఎప్పుడు గొడవపడుతూ ఉండటం వలన, ప్రేమ కలిగి జీవించలేకపోవడం వలన జరుగుతుంది.

2. ఆర్థిక సమస్యలు: వీటి వలన అనేకమంది వివాహ జీవితానికి వెనుకడుగు వేస్తున్నారు. నేను ఇంకా చాలా చదువుకోవాలి అంటూ కాలాన్ని గడిపేస్తున్నారు.

3. ఇంకొందరు కుటుంబ జీవితం అంటే సరైన అవగాహన లేక బ్రతికేస్తున్నారు. మరికొందరు ఆ జీవితం అంటేనే విరక్తి చెందుతున్నారు.

ఈ విధంగా అనేకమంది యువత వివాహ జీవితాన్ని ఎంచుకోకుండా విలాసవంతమైన, సుఖభోగాలతో కూడిన జీవితాన్ని గడిపేస్తున్నారు. మరి మనం క్రైస్తవులముగా వారిని ఏ విధంగా కలుసుకొని వారిలోని దుష్ట ఆలోచనలను తీసివేసి, వారిలో ప్రభువు ఏర్పరచిన ప్రేమాగ్ని జ్వాలలను రగిలించి, వివాహ మరియు కుటుంబ జీవితాలపై ఆసక్తి కలిగి జీవించే వారిగా మనం వారిని మార్చి మంచి కుటుంబ జీవితాన్ని ఆస్వాదించే బిడ్డలుగా వారిని తీర్చిదిద్దాలి.

ఈనాడు మన సమాజంలో రాజకీయ నాయకులు మరియు దేశ జనాభా గణాంకాలు, పిల్లల జననం ప్రణాళిక బద్ధంగా జరగాలని, జనాభా సంఖ్య తగ్గించాలని తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్నారు. అంతేకాకుండా అనేకమైన ప్రైవేటురంగ సంస్థలు కూడా దీనిని ప్రచారం చేస్తూ భవిష్యత్తు కార్యాచరణను దెబ్బ తీస్తున్నారు. భార్యాభర్తలు ఎంతో ప్రేమ కలిగి, పిల్లలు కావాలని కోరుకున్నా సమాజ ఒత్తిడి వలన ఎంతోమంది వెనుకడుగు వేస్తున్నారు. అందువలననే మన సత్య తిరుసభ ఇటువంటి ప్రచారాలను ఖండిస్తుంది. ప్రజలు తమ బాధ్యతలను నిర్వర్తించాలని శ్రీసభ ఆకాంక్షిస్తుంది. ఏ సమాజంలో అయితే దేవుడంటే నమ్మకంగాని, విశ్వాసంగాని, భయభక్తులుగాని లేకుండా జీవిస్తున్నారో అక్కడ ఇటువంటి అవాంఛనీయ పరిణామాలు ఎక్కువగా జరుగుతూ, సామాజికపరంగా, ఆర్థికపరంగా, ఆధ్యాత్మికపరంగా పలు రకములైన అవరోధములను ఎదుర్కొంటున్నారు.

తల్లిదండ్రులు పిల్లల్ని అభివృద్ధిపథంలో నడిపించకుండా గాలికి వదిలేస్తున్నారు. మా బాధ్యత "జన్మనివ్వటం" మాత్రమే అన్నట్లుగా, ఎవరిపని వారిదే అన్నట్లుగా జీవిస్తున్నారు. ఇంకా ఘోరమైన, దారుణమైన పరిస్థితి: వృద్ధులు– వృద్ధుల్ని ఎవరు పట్టించుకోవడం లేదు. వృద్ధాప్యంలో వారికి కావలసిన ప్రేమానురాగాలను పంచకపోగా, భూమికీ కుటుంబానికి భారంగా భావిస్తున్నారు. కుటుంబ జీవితాలలో భావోద్వేగాలు ఎక్కువగా కొరవడుతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో సమాజం మరియు మత నాయకులు, యువత భవిష్యత్తు కార్యాచరణకు మార్గములను నిర్దేశించాలి.

ప్రజలు కుటుంబ జీవితాన్ని ఎన్నుకోవడానికి భయపడే మరొక అంశం: ఇల్లు లేకపోవడం. భార్యాభర్తలు అన్యోన్యంగా జీవిస్తూ పిల్లల్ని సక్రమమైన మార్గంలో జీవింపజేయాలి. మరి సొంత ఇల్లు లేకపోతే ఇవి సాధ్యం కాదు. దీనికి గల కారణాలు అనేకం: పేదరికం ఒక పెద్ద సమస్య. అలాగే వివాహేతర సంబంధాల వలన కలిగిన పిల్లలు, ఒంటరి జీవితం గడిపేవారు, తల్లిగాని, తండ్రి మాత్రమే ఉన్నవారు, వీధిబాలలు ఎంతోమంది సరైన వసతులు లేక తిరుగుతూ, పట్టించుకొనేవారు లేక, దొంగలుగా, క్రూరమైన జంతువుల్లాగా ప్రవర్తిస్తున్నారు.

ఇటువంటి పరిస్థితుల వలన సమాజంలో గొడవలు మరియు ఎన్నో అసహజమైన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ విధంగా తిరుగుతున్న వీధి బాలబాలికలపై, అసాంఘిక, లైంగిక దాడులు జరుగుతున్నాయి. ఈ లైంగిక దాడుల వలన పిల్లలు తమ జీవితంపై విరక్తి కలిగి, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు తప్పుడు త్రోవన ప్రయాణిస్తున్నారు. కుటుంబ జీవితాలపై వ్యతిరేకత భావాన్ని పెంచుకొని జీవితాన్ని వ్యర్థంగా గడిపేస్తున్నారు. అంతేకాకుండా వలస జీవితాలు సమాజంలో వ్యతిరేకత భావాన్ని ఎదుర్కొంటున్నాయి.

వలస వచ్చిన ప్రజలను దేశాలు, ప్రభుత్వాలు మరియు రాష్ట్రాలు అంగీకరించి వారి దయనీయ జీవితాన్ని గమనించి, ఆశ్రయాన్ని అందించడం లేదు. కొన్ని దేశాలలో అలావచ్చిన వారిని బానిసలుగా మలచి అనేకమైన పనులను చేయించుకుంటూ వారి కష్టంపై వీళ్లు ఇల్లు కట్టుకుంటున్నారు. మరికొన్నిచోట్ల ప్రాంతీయ విభేదాలు కలిగి వలస వచ్చిన వారిని కొట్టి చంపేయడం మనం చూస్తున్నాం. ఇలా చేయడం వలన వారి కుటుంబాలు విచ్ఛిన్నమై చెట్టుకొకరు, పుట్టకొకరుగా, ఎవరి జీవితాన్ని వారు జీవించడానికి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీస్తూ ఉన్నారు. కాని ఇటువంటి విషయాలలో మన కతోలిక శ్రీసభ చాలా ప్రేమను ఔధార్యాన్ని కనబరుస్తుంది. కతోలిక శ్రీసభ వర్ణ, ప్రాంతీయ, విదేశాల భేదాలను ప్రక్కన పెట్టి మానవత్వాన్ని కనబరుస్తుంది. దేవుడు మనలను మానవులుగా తన రూపాన్ని ఇచ్చి తన పోలికలో సృజించే తనను అనుసరించి జీవించమని కోరుతున్నాడు. శ్రీసభ ఎల్లప్పుడు ఇటువంటి వారిపై కరుణను, దయను చూపిస్తుంది. వారు జీవించడానికి కావలసిన అనేక పరిస్థితులను కూడా కలిగిస్తుంది.. వారికి ఆత్మీయ అనురాగాలతో పాటు, ఆర్థిక, ఆధ్యాత్మిక సహాయాన్ని కలుగజేస్తుంది. అంతేకాకుండా వీరికోసం ప్రభుత్వాలతో మాట్లాడుతూ వారివైపు నిలుస్తుంది.

పీఠాధిపతుల సమైక్య సమావేశంలో కుటుంబముల గురించి ప్రస్తావిస్తున్నప్పుడు వచ్చిన మరొక సమస్య: పిల్లలు, అంగవైకల్యంతో ఉండడం. ఈ సమస్య కుటుంబ జీవితాలలో ఒక కలతను రేకెత్తిస్తుంది. ఇటువంటి పరిస్థితులలో కూడా ఎంతోమంది గొప్ప తల్లిదండ్రులు తమ బిడ్డలను అక్కున చేర్చుకుని

పెంచుతున్నారు. వారు సమాజానికి మరియు శ్రీసభకు, వారు ఎన్నిక చేసికొనిన పిలుపునకు విశ్వాసపాత్రులుగా జీవిస్తూ, నవ్య సమాజానికి ఒక మంచి ఉదాహరణగా నిలుస్తున్నారు. ఇటువంటి మంచి కార్యక్రమములను బాధ్యతా యుతంగా చేయటం ద్వారా కతోలికులమైన మనకు, ఇతర మతస్థులకు మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది, తెలుస్తుంది. మన కుటుంబంలో ఎటువంటి వైకల్యం వారైనా, వారి ప్రత్యేకతను గుర్తించి, వారికి అందించవలసిన సేవలను మనము అందించ వలయును. అంతేకాకుండా వృద్ధాప్యంలో ఉన్న వారిని కూడా మనం ప్రేమగా, ఆప్యాయంగా పలుకరించాలి. ఎంతోమంది దయార్ధహృదయులు వృద్ధాశ్రమాలను నడుపుతున్నారు. వారికి మనం కృతజ్ఞతలు చెల్లించాలి. ఈనాటి కాలంలో ఎంతోమంది వృద్ధ తల్లిదండ్రులను రోడ్డుమీద వదలివేస్తున్నారు. కాని వారందరు ఒక విషయాన్ని మరచిపోతున్నారు, వాళ్లు కూడా భవిష్యత్తులో వృద్ధాప్యతల్లిదండ్రులు అవుతారు.

ప్రియమైన విశ్వాసులారా! మనం ఆలోచించి చూసుకోవాలి. ప్రభువు నిరాశ్రయుల పట్ల, చిన్నారిబిడ్డల పట్ల, ముసలిప్రాయంలో ఉన్నవారి పట్ల, రోగాలు, వ్యాధుల బారిన పడిన పీడితులపైన చూపిన ప్రేమ అనిర్వచనీయం. మరి ప్రభువుకి విశ్వాసపాత్రులుగా ఉంటూ, ఆయన బాటలో నడుస్తూ, పవిత్ర తిరుకుటుంబ జీవితాన్ని అనుసరిస్తూ జీవిస్తున్న మనం ఏవిధంగా ఉండాలి? ప్రభువుకు ఆనాడు తారసపడినవారే ఈనాడు మనకు వలస వచ్చిన కుటుంబముల రూపంలో, అంగవైకల్యం కలిగిన వారి రూపంలో, వీధి బాలల రూపంలో, వృద్ధులు మరియు అనేకమైన రోగములతో బాధపడేవారు మనకు ఎదురౌతారు. వారిని మనం ప్రేమతో, దయతో, కరుణతో, స్వీకరించి, ప్రభువు మనకొసగిన కృపావరములను వారికి పంచివ్వాలి. ఆకలితో ఉన్నవారికి అన్నంలా, నిరాశ్రయులైనవారికి ఆశ్రయదుర్గముగా, బాధపడుతున్నవారికి ఓదార్పుగా మనం నిలవాలి.

## కుటుంబాలు ఎదుర్కొనే ప్రధాన సమస్యలు

ముందుగా మనం తెలుసుకున్న విధంగా అనేకమైన అధ్యయనాలు, కుటుంబములో ఎదురయ్యే సమస్యలు కొన్నింటిని మన ముందుంచాయి. అవి

**1. పిల్లల్ని పెంచి ప్రయోజకుల్ని చేయటం:** తల్లిదండ్రులు ఉదయం నుండి సాయంత్రం వరకు కష్టపడి అలసిపోయి, ఇంటికి వచ్చి పడుకుంటారు. పిల్లలతోగాని, భార్యాభర్తలుగాని సరిగా మాట్లాడుకోరు, కనీసం కలిసి భోజనం కూడా చేయరు, దానికి తోడు ప్రసార మాధ్యమాల (టి.వి.) కు అంటిపెట్టుకుపోవడం, ఈ విధంగా జీవించడం వలన పిల్లలకు తమ విశ్వాసాన్నీ, ప్రేమను అందించడంలో విఫలమవుతున్నారు. కొన్ని కుటుంబాలు భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ తీవ్ర ఒత్తిడికి గురై ప్రస్తుత జీవితాన్ని ఆనందంగా అనుభవించలేకపోతున్నారు.

**2. మత్తు పదార్థాలు మరియు మాదక ద్రవ్యాల ప్రభావం:** మత్తు పదార్థములు అతిగా వాడటం వలన అనేక కుటుంబాలు విచ్ఛిన్నమైనాయి. మన సమాజం మరియు ప్రభుత్వాలు ఈ సమస్యలను అదుపు చేయలేకపోతున్నాయి. దీని వలన భార్యాభర్తలు విడిపోవడం, ఫలితంగా చిన్నారి బిడ్డలు, తల్లిదండ్రులు ఉన్నా అనాథలుగా తయారవుతున్నారు. యవ్వనస్తులు ఏమి చేయాలో తెలియక, ఆదరించేవారు లేక దిగ్భ్రాంతికి గురవుతున్నారు. అశాంతి దీనికి ప్రధానమైన కారణం.

**3. వివాహ జీవితం సమాజానికి గౌరవనీయం అని గమనించలేకపోవటం:** వివాహ జీవితం వలన ఒకరి వ్యక్తిత్వ జీవితానికి అడ్డుగా ఉంటున్నాం అనేది కొంతవరకు వాస్తవం కావచ్చు. కాని మన దేశ, ప్రాంతీయ అభివృద్ధి మరియు మంచి సుగుణాలను కుటుంబ జీవితాల ఆధారంగానే పరిగణిస్తారు. కుటుంబం అనగానే మనకు గుర్తుకు రావలసినది భార్య, భర్త మరియు పిల్లలు. అంతేగాని ఒకే సంపత్తికి చెందినవారు కాదు. కావున కుటుంబ జీవితానికి గౌరవం ఇస్తూ ఇటువంటి జీవితాన్ని అభివృద్ధి చేయవలయును.

**4. అసహజ, ప్రకృతి విరుద్ధ బంధాలు:** కొన్ని సమాజాలు ఇంకా అధ్వాన్నంగా, ఇరువురు భార్యలు లేక భర్తలు కలిగి ఉండటం మనం చూస్తున్నాం. కొన్ని దేశాలలో వివాహం చేసుకోకుండా సహజీవనం చేయటం. అదే విధంగా శారీరక వాంఛలను తీర్చుకోవటం కోసం కలిసి జీవించడం మనం చూస్తున్నాం. అధిక శాతం ఈ విధంగా జీవించటానికి అలవాటుపడి, దేవుడు ఏర్పరచిన గొప్పదైన వివాహ అంతస్తును తృణీకరిస్తున్నారు. చాలా దేశాల ప్రభుత్వాలు ఇటువంటి జీవనానికి

అనుమతిని కూడా జారీ చేశాయి. ఇటువంటి వివాహ జీవితంలో ఎటువంటి కొత్తదనం లేదని ఆ జీవితానికి అసలు అర్ధమేలేదని భావిస్తున్నారు. ఒంటరి జీవితం ఒక స్వర్గంలా భావిస్తున్నారు కాని ఈ వివాహ జీవితం జీవితానికే కొత్త అర్ధాన్ని ఇస్తుందని అర్ధం చేసుకోలేకపోతున్నారు. కాని ఈ వివాహ జీవితం అనగానే ప్రేమించడం, ప్రేమ కలిగి జీవించడం, ఇతరులకు ప్రేమను తెలియజేయటం.

**5. స్త్రీలకు తగిన గౌరవం ఇవ్వకపోవడం:** ఈ సమస్య చాలా వరకు పరిష్కారమైనప్పటికి ఇంకా చాలా దేశాలలో ఈ సమస్య ఉంది. వీరి హక్కులను వారికి తెలియజేస్తూ ఉండాలి. కొన్ని సంఘాలు ఇంకా స్త్రీల పాత్రను అంగీకరించలేక పోతున్నాయి. అటువంటి సంఘాలను బహిష్కరించాలి. ఇంకా సిగ్గుపడాల్సిన పరిస్థితి ఏమంటే, పురుషులు, స్త్రీలను ఇంకా వంటింటి కుందేళ్లుగానే చూస్తున్నారు. స్త్రీల మంచితనాన్ని చేతగానితనంగా భావించి వారిపై పెత్తనాన్ని చెలాయిస్తున్నారు. వారిని మాటలతో, క్రియలతో, శారీరకంగాను, మానసికంగాను కృంగతీస్తున్నారు. ఇటువంటి విధానాలను అవలంభించటం అంటే స్త్రీ జాతిని అవమానించినట్లే, స్త్రీలకు తగిన గౌరవాన్ని పురుషులు అందివ్వాలి. మనం చరిత్రను గమనించినట్లయితే ఎంతోమంది మహిళలు దేశాలను పరిపాలించారు, దేశాలకు కీర్తిప్రతిష్టలను గడించారు. స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం వెల్లివిరియాలి. అప్పుడే కుటుంబ జీవితంలో చక్కనైన ప్రేమానురాగాలు చోటు చేసుకుంటాయి. దేవుడు స్త్రీ, పురుషులను సమానంగా జీవించమని సృజించారు.

**6. కుటుంబములో పెద్ద దిక్కు (తండ్రి) లేకపోవడం:** కుటుంబంలో తండ్రి పోషించే పాత్ర ఎంతో ఉత్తమమైనది మరిముఖ్యంగా కుటుంబానికి అండగా, ధైర్యంగా, పిల్లల భవిష్యత్తుకు పూలబాటలు వేస్తూ, భార్యకు సంతోషాన్ని పంచుతూ, వారి సంతోషమే తన సంతోషంగా భావించేవాడు, భర్త లేక తండ్రి. మరి కుటుంబంలో అటువంటి వ్యక్తి దూరమైతే ఆ కుటుంబ పరిస్థితి విషమంగా, దయవనీయంగా ఉంటుంది. ఈ పరిస్థితి కుటుంబీకులను మానసికంగా, ఆధ్యాత్మికంగా, శారీరకంగా కృంగదీస్తుంది.

**7. స్త్రీ, పురుష వ్యత్యాసమును వ్యతిరేకించడం:** స్త్రీ, పురుష అనే బేధాభిప్రాయములు లేకుండా జీవించవచ్చు కాని వారి సహచార్యములోగాని

పనితత్వములోగాని, ఆచార వ్యవహారములుగాని కుటుంబ జీవితములోగాని ఆ వ్యత్యాసము లేకుండా జీవించలేము. అది సృష్టికి విరుద్ధము కూడాను. ఈ స్త్రీ పురుష వ్యత్యాసము మనము అలాగే కొనసాగించాలి. స్త్రీ, పురుషునిలాగా పురుషుడు, స్త్రీలాగా మారకూడదు. ఇప్పుడు అనేకమంది భార్యాభర్తలు శారీరక సుఖాలను అనుభవించటానికి, పిల్లలను కృత్రిమ పద్ధతిలో కంటున్నారు. ఈ విధంగా చేయటం అంటే భార్యాభర్తలు తమ కర్తవ్యమును సరిగా నిర్వర్తించనట్లే. కావున మనం గమనించవలసిన ముఖ్యమైన అంశం: జీవితంలో కొన్ని బంధాలు విడదీయరానివిగా ఉంటాయి. అందులో ప్రథమమైనది: భార్యాభర్తల బంధం. కావున మనలను సృజించిన దేవుడు గొప్పవాడు, ఆయన సృష్టిని మనం అంగీకరించకుండా, దానిని కించపరుస్తూ మనకు ఇష్టం వచ్చినట్లు మారడం పాపం అవుతుంది. సృష్టికి వ్యతిరేకంగా జీవించక కాలానుగుణంగా జీవించుదాం.

జీవితంలో మరిముఖ్యంగా కుటుంబ జీవితంలో సమస్యలు సర్వసాధారణం. మరి అటువంటి సమస్యలను చిరునవ్వులతో ఎదుర్కొంటూ ప్రేమతో జీవిస్తున్నా, అనేకమైన కుటుంబాలకు కృతజ్ఞతలు చెల్లిస్తూ ప్రార్థన చేస్తుండాలి. ఈ సమాజంలో ఎటువంటి సమస్యలు లేవు అని చెప్పుకుని జీవించే కుటుంబాలు లేవు. కాని సమస్యల వలన మాలో ప్రేమ అధికం అవుతుంది, అనే కుటుంబాలు చాలా వున్నాయి. మనం ప్రేమ కలిగి జీవిస్తున్నా అనేక పరిస్థితులలో వివిధ సమస్యలు ఎదురవుతాయి. అవే మనకు సవాళ్లు. కావున వృధాగా మన శక్తిని సామర్థ్యములను వాటికై ఖర్చు చేస్తే జీవితం వ్యర్థం అవుతుంది. దానికి భిన్నంగా జీవితాన్ని ఏ విధంగా పూలపాన్పుగా మార్చుకోవాలి, అందమైన హరివిల్లుగా మార్చుకోవాలి అనే అంశంపై దృష్టి సారించాలి. పవిత్రమైన వివాహ జీవితం, క్రైస్తవ జీవితం మానవత్వమునకు ఒక ఆదర్శంగా ఆయువు పట్టుగా ఉంటున్నాయి. కావున ఆదర్శవంతమైన కుటుంబంగా జీవిస్తూ, క్రైస్తవ మరిముఖ్యంగా కతోలిక సిద్ధాంతాలను పాటిస్తూ ప్రభుని ఆరాధించుదాం.

❋ ❋ ❋ ❋

# 3. కుటుంబానికి దైవ పిలుపు: క్రీస్తువైపు చూడటం

– బ్రదర్ బొట్టె మనోహర్



"యేసు జ్ఞానమందును, ప్రాయమందును, వర్ధిల్లుచు దేవుని అనుగ్రహమును, ప్రజల ఆదరాభిమానములను పొందుచుండెను" (లూకా 2:42).

కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని ఈనాటి సామాజిక స్థితిగతులను పరిశీలిస్తే, కుటుంబ వ్యవస్థ ఎన్నో మార్పులకు, పరిణామాలకు గురి అవుతుంది. వివాహంపై సరియైన అవగాహనలేక, పటుత్వం, అంకితభావం లోపించి ఇంకా ఎన్నో విపరీతమైన దారుణాలను, మన సమాజంలో ఉన్న వివాహ బంధాలలో మనం చూస్తున్నాము.

వివాహం ఐక్యతకు ఒక ఆహ్వానం

సహజీవనం జీవన సౌభాగ్యానికి ఒక ఆలంబనం

వివాహం మానసిక సమస్యలకు దివ్యౌషధం

శారీరకావలసరాలకు బలవర్ధక రసాయనం

వివాహం సాక్షాత్తు సృష్టికర్తయైన దేవునిచే స్థాపించబడిన మొదటి దివ్య సంస్కారం.

గృహస్థ జీవితం వివాహంతో ప్రారంభమవుతుంది. స్త్రీకాని, పురుషుడుగాని వివాహంతో భార్యాభర్తలవుతారు, గృహస్థులవుతారు. వివాహంతో నిమిత్తం లేకుండా స్త్రీ పురుషులు సృష్టి ధర్మమైన కామవాంఛను తీర్చుకోగలరేమో. అయితే అలా చేయడం ద్వారా మానవ జాతి పశు-పక్ష్యాదులలాగా (ఒక సీజన్, ఒక రీజన్) ఒక రీతికిగానీ, ఒక నీతినిగానీ కట్టుబడి ఉండే దశను ఎపుడో దాటిపోయింది.

కాబట్టి వారి కామవాంఛ విచ్ఛలవిడితనానికి, విశృంఖలత్వానికి దారి తీయకుండా, అనారోగ్యంపాలు కాకుండా ఉండడానికి విజ్ఞులు వివాహ వ్యవస్థను రూపొందించారు. వివాహం అనేది ఒక కట్టుబాటు. ఎవరికి వారు తమ హద్దులలో ఉంటూ నియమాలను ఉల్లంఘించకుండా, బాధ్యతగా జీవించేదానికి గృహస్థ జీవితం ఏర్పాటు చేయబడింది.

నేటి భార్యాభర్తల మధ్య ఉండేది ఒక బాధ్యత, ఇష్టం మాత్రమే. బాధ్యతనే ప్రేమ అని అనుకుంటూ ఉంటూ ఎవరికైనా ప్రేమ అనేది ఉంటే అది ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగానీ భగవంతుని మీద మాత్రమే. భర్త భార్యను ప్రేమిస్తున్నాడంటే, భార్య కోర్కెలు తీర్చడానికి కాదు. తద్వారా తన కోర్కెలను తీర్చుకోవడానికి, సేవలు చేయించుకోవడానికి, సౌకర్యంగా ఉండడానికే. భర్త ఉంటేనే భార్య బ్రతకగలదు, భద్రంగా ఉండగలదు అలాగే భార్య ఉంటేనే భర్త బ్రతుకగలడు, భద్రంగా ఉండగలడు. ఆశతో, ఆపేక్షతో భార్యాభర్తలు ఇద్దరు ఒకరినొకరు ఇష్టపడుతూ ఉండాలి. ఈ విధంగా వారనుకునే ప్రేమలో స్వార్థం ఉంది. ఒకరి నుండి మరొకరు శారీరక అవసరాలను, సౌకర్యాలను, సుఖాలను, సేవలను ఆశిస్తూ ఉంటారు. అందువలననే ఒకరికి ఒకరు ప్రీతిపాత్రులవుతారు. ఇరువురిలో ఎవరైనా అసౌకర్యాన్ని కలిగిస్తూ ఉంటే, అవసరాలను తీర్చకుంటే, సేవలనందివ్వకపోతే, ఆధిక్యతను, అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని చూపిస్తూ ఉంటే ఘర్షణ మొదలై, అశాంతికిలోనై, సుఖశాంతులకోసం విడిపోతూ ఉన్నారు. మరెక్కడో ఉంటాయని వెదుకుతూ పరుగులు పెడుతున్నారు. విడాకులతో విడిపోతున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో మన పరిశుద్ధ ఫ్రాన్సిసు పాపుగారు తన అధికారిక లేఖ "ప్రేమానందం" (అమోరిస్ లెతీషియ)లో శ్రీసభలోని సకల క్రైస్తవుల కుటుంబాల కోసం ప్రేమతో వ్రాస్తున్న పలుకులివి.

సుందర సుగంధమైన సువిశేష సువాసనలు ప్రతి ఒక్క కుటుంబంలో అనుక్షణం వెదజల్లబడాలి. సువిశేషమే సువార్త ప్రచారంలో కేంద్రీకృతమై ఉండాలి. మనం ప్రతిక్షణం సువిశేషమనే వివిధ మార్గాల్లో వివిధ రూపాల్లో ప్రకటించాలి. ఈ సువార్త కంటే మరే విషయాలు కూడా ముఖ్యమైనవి, అర్థవంతమైనవి, వివేకమైనవి కావు. వివాహం మరియు కుటుంబ విషయాలపై బోధించే అంశాలు అందరిని ప్రోత్సహించడంలో విఫలం కాదు. ఎందుకంటే ఈ సువిశేష బోధ ప్రేమ

ఆప్యాయాలతో కూడినది కాబట్టే. క్రైస్తవ కుటుంబ పరమార్ధం కేవలం క్రీస్తునిలో వెల్లడి అయినటువంటి తండ్రిదేవుని ప్రేమనే ద్వారా అర్ధమవుతుంది. ఇప్పుడు ప్రేమామయుడైన క్రీస్తువైపు వీక్షిస్తూ క్రీస్తు ఏవిధంగా మహిళలు, పురుషులతో కలిసి తండ్రిరాజ్యం ఉట్టిపడేలా శ్రమించారో తెలియజేశారు. సువార్తను జీవించడం ద్వారా మరియు ప్రకటించడం ద్వారా ప్రభువు ఈనాడు మనతో ఉన్నాడు.

## క్రీస్తులో తండ్రి ప్రణాళిక సూత్రీకరణ, సఫలీకరణ

క్రీస్తుప్రభువు ఈ లోకానికి వచ్చింది కేవలం తన తండ్రి ప్రణాళికను నెరవేర్చడానికే కావున తండ్రి స్థాపించిన వివాహ బంధాన్ని క్రీస్తు కూడా నజరేతు కుటుంబంలో ఉంటూ గౌరవిస్తున్నారు. దాంపత్య బంధం ద్వారా “భిన్న శరీరులుగాక ఏకశరీరులై ఉండే” దంపతులు (మత్తయి 19:6). ఒకరినొకరు సహాయ సహకారాలను అందజేసుకుంటూ, ఒకరికొకరు సేవలు చేసుకుంటూ అన్యోన్యంగా జీవించాలి. ఆదర్శప్రాయమైన కుటుంబ జీవితానికి ఏకీభావం సదవగాహన ఎంత అవసరమో గుర్తించాలి. దంపతులు పరస్పరం నమ్మకపాత్రుల్లా మెలగాలి, ఒకరినొకరు కట్టుబడి ఉండాలి. ఎటువంటి పరిస్థితులలోను ఒకరినుంచి ఒకరు విడిపోయే ప్రయత్నాలు చేయరాదు. దేవుడు స్థాపించిన వివాహ వ్యవస్థలో చెల్లుచీటీలు (విడాకులు) చెల్లుబాటు కావు. అపుడే వివాహ బంధం అర్ధవంతమవుతుంది, పటిష్టమవుతుంది, ఫలప్రదమవుతుంది. సఖ్యత గల దంపతులే ఒకరికొకరు ప్రేమానురాగాలతో ఆత్మసమర్పణం కావించుకోగలుగుతారు, తమ ప్రేమ ఫలమైన సంతానాన్ని విద్యాబుద్ధులతో తీర్చిదిద్దుకోగలుగుతారు, సన్మార్గంలో నడిపించగలుగుతారు. క్రీస్తుప్రభువుకు శ్రీసభకు మధ్యగల ప్రేమబంధం ఎంతో స్వచ్ఛమైనది, గాఢమైనది. పూర్వనిబంధన గ్రంథంలో దేవుడు ఇశ్రాయేలు ప్రజలతో చేసుకున్న ఒప్పందంలోని పరస్పర ప్రేమ, పరస్పర విశ్వసనీయత దంపతుల మధ్య సైతం వర్ధిల్లారి. నిజానికి దేవుడు తన ప్రజలతో చేసుకున్న ఒప్పందమే వివాహ బంధంలో స్త్రీ పురుషులు చేసుకునే వాగ్దానాలకు మాతృక (హోషేయ 2; యిర్మీయా 3:6-13; యెహెస్కేలు 16:23; యెషయా 54). కనుకనే - క్రీస్తు ప్రభువు వివాహ బంధానికి అపురూపమైన గౌరవాన్ని ఆపాదించాడు, దాంపత్య బంధాన్ని దివ్యసంస్కారంగా ప్రతిష్టించి దీవించాడు. లోక రక్షకుడైన ప్రభువు, శ్రీసభకు నిత్యనూతన వరుడుగా వర్ధిల్లే

ప్రభువు (మత్తయి 9:15; మార్కు 2:19-20; లూకా 5:34-35; యోహాను 3:29; 2 కొరింతీ 11:2, ఎఫెసీ 5:27, దర్శన 19:7-8,21:2,9). నేడు ఈ వివాహ దివ్యసంస్కారం ద్వారా క్రైస్తవ దంపతుల మధ్య కొలువుదీరడానికి వస్తున్నాడు, తాను వారితో సహవాసం చేస్తున్నాడు. క్రైస్తవ దంపతులు ప్రభువును తమ మధ్యకు సాదరంగా ఆహ్వానిస్తే, ప్రభు స్వరాన్ని ఆలకిస్తూ ఆయనకు విధేయులై జీవించడానికి పూనుకుంటే వారి దాంపత్యం నిస్వార్థమైన ప్రేమకు విశ్వసనీయతకు నెలవవుతుంది. ప్రభువు శ్రీసభ పట్ల గల ప్రేమతో తనను తానెలా ఆత్మసమర్పణం కావించుకున్నాడో (ఎఫెసీ 5:25), అలాగే ప్రభు సన్నిధానంలో జీవించే దంపతులు సైతం త్యాగమూర్తులై ఒకరికొరకు ఒకరుగా జీవిస్తారు. ఒకరికోసం ఒకరు మరణిస్తారు. ద్వితీయ వాటికన్ మహాసభ అధికార పత్రమైన "లోకానికి వెలుగు శ్రీసభ" భార్యాభర్తలు ఇద్దరు పవిత్రులై క్రీస్తు శరీరమైన శ్రీసభ అభివృద్ధికి తోడ్పడతారని తెలియజేస్తుంది. అలాగే వివాహ సంస్కారం ద్వారా "క్రీస్తుప్రభువుకు శ్రీసభకు మధ్య నెలకొని ఉండే నిగూఢమైన ఏకతాబంధానికీ, ప్రగాఢమైన విశ్వసనీయమైన ప్రేమ బంధానికి, చెరగని సంకేతాలుగా నిలిచి, ఆ పరమ రహస్యంలో భాగస్వాములయ్యే క్రైస్తవ దంపతులు పవిత్ర జీవనం గడపడానికి పరస్పరం సహకరించుకుంటారు.

### శ్రీసభ అధికార పత్రాలలో కుటుంబం

ద్వితీయ వాటికన్ మహాసభ అధికార పత్రమైన "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" వివాహ బంధం యొక్క పవిత్రతను, ఔన్నత్యాన్ని విపులంగా వివరిస్తుంది.

ఆధునిక ప్రపంచంలో ఒక ప్రక్క వివాహ కుటుంబ వ్యవస్థల వికాసానికి దోహదం చేసే పరిణామాలు సంభవిస్తుంటే, మరోప్రక్క మానవ మనుగడకు మూలకందాల వంటి ఈ వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేస్తున్న వికృత చర్యలు, దుష్టసంప్రదాయాలు కూడా యధేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. ఉదాహరణకు – బహుభార్యాత్వం, విశృంఖలంగా సాగే విడాకుల పర్వం, ప్రేమ పేరుతో కొనసాగే స్వేచ్ఛా శృంగారం మొదలైనవి పవిత్రమైన వివాహ వ్యవస్థకు గొడ్డలిపెట్టు వంటివి. వీటికి తోడు దాంపత్య జీవితంలో చొరబడే స్వార్థపరత్వం, ఆనందవాదం, చట్టవిరుద్ధమైన కుటుంబ నియంత్రణ విధానాలు గర్భనిరోధక పద్ధతులు, దాంపత్య బంధానికి గల గౌరవాన్ని మంటగలుపుతున్నాయి. దంపతుల ఆత్మగౌరవాన్ని హరించి

వేస్తున్నాయి. ఇలా ఎన్నెన్నో సమస్యలు ఉప్పెనలై ఉవ్వెత్తున లేస్తున్నా వివాహ కుటుంబ వ్యవస్థలు కుప్పకూలకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వివాహ బంధం ఇంకా చెక్కు చెదరలేదు. కుటుంబ వ్యవస్థ పునాదులింకా పటిష్టంగానే ఉన్నాయి. ఈ మౌలిక వ్యవస్థల మూల స్తంభాల మీద మానవ జాతి మౌలిక స్వరూపంలోనే చంచల్యానికి అతీతమైన స్థిరత్వం ఉంది, శాశ్వతమైన పరమార్థం ఉంది. ఈ సత్యసందేశం అన్ని యుగాలలోను అన్ని తరాల మానవులకు ఏదో ఒక రూపంలో అందజేయబడుతూనే ఉంది. ఈ సత్యానిష్ట, నైతిక నిబద్ధత వల్లనే మానవులు సామాజిక పరిణామాలు సృష్టించే సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ – కుంటుంబ వ్యవస్థను కాపాడుకోగలుగుతున్నారు. వైవాహిక బంధ పవిత్రతను గుర్తించగలుగుతున్నారు, పరిరక్షించుకోగులుగుతున్నారు.

వివాహము, కుటుంబ జీవనమూ పవిత్రమైనవి. ఎందుకంటే – వాటిని పరమపావనుడైన భగవానుడే స్థాపించాడు. తాను సృష్టించిన స్త్రీ పురుషుల మధ్య అత్యంత సన్నిహితమైన ప్రగాఢమైన అనురాగ బంధాన్ని వైవాహిక సంబంధాన్ని సృష్టికర్త భగవానుడే ఏర్పరచాడు. కుటుంబ జీవితానికి ఈ వైవాహిక బంధమే పునాది. ఈ వివాహ బంధాన్నీ, కుటుంబ జీవనాన్ని అదుపాజ్ఞలలో ఉంచే నైతిక చట్టాలను కూడా సాక్షాత్తు భగవానుడే నిర్ధేశించాడు. వివాహ బంధాన్ని ఏర్పరచుకొనే స్త్రీ, పురుషులు వివాహ శుభ గడియలో పరస్పరం తెలుపుకొనే "సమ్మతి" మీదనే వైవాహిక సంబంధానికి గల చట్టబద్ధత ఆధారపడి ఉంటుంది. వివాహ గడియలో వధూవరులు తెలిపే సమ్మతి జీవితాంతమూ శాశ్వతంగా నిలిచి ఉంటుంది. కనుకనే – వైవాహిక జీవితంలో అడుగుమోపిన దంపతుల మధ్య విడాకులకు అవకాశం లేదు. వివాహబంధానికి విచ్ఛిత్తి లేదు.

**వివాహం ఒక వ్యవస్థ:** దైవ చట్ట ప్రకారం స్థిరపడిన వ్యవస్థ, సుస్థిరమైన వ్యవస్థ, లౌకిక సమాజం సైతం గౌరవప్రదంగా స్వీకరించిన వ్యవస్థ మానవులందరి ఆమోదం పొందిన వ్యవస్థ. ఒక వైవాహిక వ్యవస్థలో స్త్రీ పురుషులు స్వేచ్ఛగా స్వీయ నిర్ణయానుసారం ఒకరికొకరు గౌరవం కలిగి ఉండడానికి, కలిసిమెలసి జీవించడానికి ముందుకొస్తారు, ఏక శరీరులుగా జీవించ నారంభిస్తారు. ఈ వైవాహిక బంధం దంపతులకు ఆనంద ప్రదాయిని అవుతుంది, సంతానానికి శ్రేయోదాయినిగా వర్ధిల్లుతుంది, సామాజిక వ్యవస్థ సుస్థిరతకు సర్వతోముఖ వికాసానికి దోహదం

చేస్తుంది. అంతమాత్రాన ఈ వివాహ వ్యవస్థను కేవలం మానవులు స్థాపించుకున్న సంస్థగానో, మానవుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి నడచే వ్యవస్థగానో భావించరాదు. ఇంతకుముందు చెప్పుకున్నట్లే వివాహ వ్యవస్థ సాక్షాత్తూ దేవుడు నెలకొల్పిన సంస్థ. మానవ వికాసానికి దోహదం చేసే అనేక ప్రయోజనాలను దేవుడు ఈ వ్యవస్థలో పొందుపరచాడు, దానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్ధేశించాడు. ఇవన్నీ మానవ జాతి మనుగడ నిరంతరాయంగా కొనసాగడానికి దోహదం చేసేవి, కుటుంబ సభ్యుల వ్యక్తిత్వ వికాసానికి ఆధ్యాత్మిక జీవన పురోగమనానికి తోడ్పడేవి. దైవ సంకల్పానుసారం వివాహ వ్యవస్థకు విశ్వసనీయంగా కట్టుబడి ఉంటే, కుటుంబాలు గౌరవనీయంగా మనగలుగుతాయి, సుస్థిరంగా నిలుస్తాయి, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతాయి. ఇదంతా వివాహ వ్యవస్థలో దేవుడు పొందుపరచిన విశేష కృపావరాలు, నిర్ధేశించిన ఉదాత్తమైన లక్ష్యాల కారణంగానే జరుగుతుంది. కుటుంబమే మానవ సమాజానికి పునాది గనక – దాని ప్రభావం యావత్ మానవ జాతి మీద బలంగా పడుతుంది. వివాహ వ్యవస్థ సహజ ధర్మం ప్రకారం – దాంపత్య బంధాన్ని దాంపత్య ప్రేమను సార్ధకం చేసేది సంతానం. పిల్లాపాపలను కనడం, వారికి విద్యాబుద్ధులు నేర్పి వికాసవంతులను చేయడం దంపతుల ప్రధాన ధర్మం. సంతానం ద్వారానే దాంపత్య బంధానికి గల విలువ గౌరవం ఇనుమడిస్తాయి.

వివాహ సంస్కారం ద్వారా దంపతులు శక్తిమంతులవుతారు. జీవన సమరంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకొని నిలువగలుగుతారు. ఈ దివ్యసంస్కారం ద్వారా వారు అభిషిక్తులై దాంపత్య ధర్మాలను గృహస్థ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడానికి నియుక్తులవుతారు. వివాహ దివ్యసంస్కారం ద్వారా దేవుడు తమకు నిర్దేశించిన విధులను, కుటుంబ పాలనా బాధ్యతలను నిష్ఠతో నిర్వర్తించే దంపతులు సాక్షాత్తూ క్రీస్తు ఆత్మశక్తితో నింపబడుతారు.

## వివాహ కుటుంబ వ్యవస్థలను కాపాడడం అందరి బాధ్యత

కుటుంబం – సంపూర్ణ మానవ వికాసానికి దోహదం చేసే పాఠశాల వంటిది. ఈ కుటుంబ పాఠశాల సక్రమంగా పనిచేయాలన్నా, సత్ఫలితాలను సాధించాలన్నా అందుకు భార్యాభర్తల సంపూర్ణ సహకారం అవసరం. ముందుగా దంపతుల మధ్య సఖ్యత స్నేహసంబంధాలు వర్ధిల్లుతూ ఉండాలి. కుటుంబ

నిర్వహణలోను, పిల్లల పెంపకంలోను పరస్పరం వారు తమ ఆలోచనలను అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేసుకోవాలి. కలిసి చర్చించాలి, ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయాలను ఆచరణలో పెట్టడానికి ఒకరికి ఒకరు సహకరించుకోవాలి. పిల్లలకు ఉత్తమ శిక్షణ నీయడంలో తండ్రిపాత్ర కీలకమైనది. కనుక తండ్రి ఎపుడూ పిల్లలను కనిపెట్టి ఉండాలి, వారికి అందుబాటులో ఉండాలి. అలాగే ఇంటిని చక్కదిద్దుకోవడంలో, పిల్లల ఆలనాపాలన చూడడంలో తల్లిగా గృహిణి పాత్ర లేదా బాధ్యత ప్రధానమైనది. ముఖ్యంగా పిన్నవయస్సులో పిల్లలకు తల్లి ఆదరణ ఎంతో అవసరం. ప్రతి చిన్న విషయానికి తల్లి మీదే ఆధారపడి ఉండే పిల్లలకు ఆమె తొలి గురువై బ్రతుకు పాఠాలు నేర్పుతుంది. అలా అని స్త్రీ స్వేచ్ఛను అరికట్టి స్త్రీ శక్తిని గృహస్త బాధ్యతలకే పరిమితం చేసి వారి సామాజిక వికాసాన్ని నిరోధించాలన్నది మా ఉద్దేశ్యం కానే కాదు. అయితే కుటుంబంలో తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూనే మహిళలు వివిధ జీవన రంగాలలో పురోగమించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

ఎదిగిన పిల్లలు తమ తమ జీవన మార్గాలను ఎంచుకోవడంలో తల్లిదండ్రులు వారికి తగిన స్వేచ్ఛనివ్వాలి, వారికి తమ పూర్తి సహకారాన్ని అందజేయాలి. వారు మత గురువులుగా మారాలనుకున్నా, మఠకన్యలు కావాలనుకున్నా, మరే జీవనరంగాన్ని ఎన్నుకున్నా అందుకు తల్లిదండ్రులు అవరోధాలు కల్పించకూడదు. తమ పిల్లలు యుక్త వయస్సులో సరైన జీవన మార్గాన్ని ఎన్నుకోవడానికి ఉపకరించే విధంగా వారి పెంపకం ఉండాలి. బాధ్యతాయుతంగా వారా మార్గంలో ప్రవేశించాలి. ఈ దశలో తల్లిదండ్రులు పిల్లలకు దారిదీపాలై త్రోవ చూపాలి. ఒకవేళ పిల్లలు వైవాహిక జీవితం వైపు మొగ్గు చూపుతుంటే గృహస్థ జీవితానికి వారిని సిద్ధపరచాలి. ఆర్థికంగా, సామాజికంగా, నైతికంగా వారు స్వతంత్రులై కుటుంబ బాధ్యతలను స్వీకరించే శక్తి సామర్థ్యాలను వారిలో పెంపొందించుకోవాలి. పిల్లల సంసారాలు పటిష్టంగా నిలిచి ప్రశాంతంగా కొనసాగాలంటే అందుకు బలమైన పునాదులు వేయవలసిన బాధ్యత తల్లిదండ్రుల మీదే ఉంటుంది. పరిశుద్ధ ఆరవ పౌలుగారు ద్వితీయ వాటికన్ మహా సభలోను మరియు వివాహము, కుటుంబ విషయాలకు సంబంధించిన బోధలను చాలా మెరుగుపరిచారు. ఈయన వివాహ బాంధవ్యము

పునరోత్పత్తి గురించి మాట్లాడుతూ భార్యాభర్తలు తమకు కలిగే పిల్లలకు తల్లిదండ్రుల బాధ్యత కలిగి దేవునివైపు, వారి వైపు వారి కుటుంబం వైపు మరియు సమాజంవైపు నిర్దిష్టమైన విధి ఉందని గమనించాలి. పునీత రెండవ జాన్‌పాల్‌గారు గ్రాటిస్సిమం సేన్ అను లేఖలో కుటుంబము శ్రీసభ మార్గమని దైవపిలుపు పురుషులు స్త్రీలు ప్రేమతో వారి వారి రంగాలలో స్వీకరించి కుటుంబంలో సమాజంలో పరస్పరం ప్రేమను పంచుతూ పరిశుద్ధమైన జీవితం జీవించాలి. విశ్రాంత పదహారవ బెనెడిక్టు పాపుగారు "స్త్రీ పురుషుల మధ్య ప్రేమ కేవలం సిలువవేయబడిన క్రీస్తు ప్రేమలోనే వెలుగొందును" అని చెప్పారు. దేవునికి తను ఎన్నుకొనిన ప్రజలకు ఏ విధమైన సంబంధం ఉంటుందో అదే సంబంధం భార్యాభర్తలు తమ దాంపత్య జీవితంలో పరస్పరం చూపించుకోవాలని తెలియజేశారు.

## జ్ఞాన వివాహం - ఒక దివ్య సంస్కారం

కుటుంబము దేవుని యొక్క రూపము. క్రీస్తు బప్తిస్మ సమయంలో కూడా తండ్రి స్వరం ''ఈయన నా ప్రియకుమారుడు ఈయనయందు నేను ఆనందించుచున్నాను" (మార్కు 1:10-11) అని తండ్రి కుమార పవిత్రాత్మల వసుదైక కుటుంబం మనకు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. పరిసయ్యులు యేసుని పరీక్షించుటకై "ఏ కారణముచేతనైన ఒకడు తన భార్యను పరిత్యజించుట చట్టబద్ధమా''? అని ప్రశ్నించగా అందుకు యేసు "భార్యభర్తలిద్దరు ఏక శరీరులైయున్నారు కనుక దేవుడు జతపరిచిన జంటను మానవమాత్రుడు వేరుపరుపరాదు" అని సమాధానమిచ్చెను. అంతటితో ఆగక పరిసయ్యులు "అటులైన విడాకుల పత్రమునిచ్చి భార్యను విడనాడవచ్చునని మోషే ఎందుకు ఆజ్ఞాపించెను"? అనిరి. "మీ హృదయ కాఠిన్యమును బట్టి మీ భార్యలను మీరు విడనాడుటకు మోషే అనుమతించెనేగాని, ఆరంభము నుండి ఇట్లు లేదు. వ్యభిచారం కారణముననే తప్ప, తన భార్యను విడనాడి మరియొకతెను వివాహమాడువాడు వ్యభిచారియగును" అని యేసు ప్రత్యుత్తరమిచ్చెను (మత్తయి 19:3-12). సువార్తకు సాక్ష్యమివ్వడానికి వివాహం మరియు కుటుంబం రెండు కూడా శ్రీసభ ద్వారా పవిత్రాత్మను క్రీస్తు నుండి స్వీకరిస్తున్నాయి.

వివాహం ఒక సామాజికమైన క్రియనో, ఆచారమో లేక బహిరంగమైన ఒక ఒప్పందమో కాదు అంతకంటే మిన్నగా తమకు తాను పరిశుద్ధ పరచుకొనుటకు

మరియు రక్షణ పొందుటకు, దేవుడిచ్చిన గొప్ప కానుక. వివాహం కూడా దేవుని పిలుపే, ఎందుకంటే వారు వివాహ దాంపత్య జీవితానికి స్పందించడానికి అనుగుణంగా క్రీస్తు మరియు శ్రీసభ మధ్య ఉన్న ప్రేమవలే భార్యాభర్తలు కూడా అదే ప్రేమను కలిగి ఉండాలి. వివాహం చేసుకొనుటకు ఒక నిర్ధిష్టమైన క్రమము కాలము ఉండేలా చూసుకోవాలి. వివాహం జ్ఞానస్నానము ద్వారా క్రీస్తుతో శ్రీసభలో ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకునే దివ్యసంస్కారం. క్రీస్తుని కృపతో వారిరువురు ఇచ్చిపుచ్చుకోవడంలోను, విశ్వసనీయతలోను, మనస్సు విప్పి మాట్లాడడంలోను ఒక నూతన జీవితానికి నాంది పలకాలి. వివాహ దంపతులు ఈ దివ్యసంస్కారం సాక్షాత్తు దేవుడు, ఉచితంగా ఇచ్చిన కానుకగా భావించాలి. ఈ దివ్యసంస్కారాన్ని ఒక వస్తువో, శక్తో కాదు, క్రీస్తు వారితో జీవిస్తూ వారు కష్టాలలో ఉన్నప్పుడు తమ అనుదిన సిలువలను మోస్తూ క్రీస్తును వెంబడించుటకు క్రీస్తు తన శక్తిని ఒసగి క్రిందపడినపుడు లేపుతూ, భారాలను ఒకరితోనొకరు భరించుకుంటూ క్షమించుకునేలా చేస్తాడు. వివాహపు అంతస్తులో ఉన్నవారికి దైవప్రజలలో ప్రత్యేకమైన గౌరవ స్థానముంటుంది, దైవానుగ్రహంతో వారికి ప్రత్యేక వరాలు లభిస్తాయి (1 కొరింతీ 7:7).

దంపతుల లైంగిక సంబంధం ఒక ప్రేమగా అనుభవిస్తూ ఈ దివ్యసంస్కారం ద్వారా వారిని వారు పరిశుద్ధపరచుకోవాలి. ఆ పరిశుద్ధతనే వారికి క్రీస్తులో పయనించుటకు మంచి మార్గమును చూపును. వారి శారీరక కలయిక ఒకరినొకరు సంపూర్ణ అంగీకారంతో ఉండేదిగా ఉండాలి. ఎందుకంటే ఇద్దరి ఒప్పందం, అంగీకారం ఉన్నప్పుడే వారి లైంగిక బాంధవ్యానికి అర్ధం పరమార్ధం ఉంటుంది. దంపతుల జీవితం అంతా కూడా తమ పిల్లల భవిష్యత్తువైపు, వారి భవిష్యత్తు నిర్మాణం కొరకు ఉండేలా ఈ దివ్యసంస్కారం ఉపయోగపడును. క్రైస్తవేతర దంపతులు జ్ఞానస్నానం తీసుకున్నపుడు వారి యొక్క వివాహ ఒప్పందాన్ని నూత్నీకరించనవసరం లేదు. ఎందుకనగా జ్ఞానస్నాన స్వీకరణ ద్వారా వారి వివాహ సంబంధం పవిత్రపరచబడుతుంది. కతోలిక వివాహాలన్నీ బహిరంగముగా, తగిన సిద్ధపాటుతో తగిన నియమ నిబంధనలతో సాక్షులతో జరుపవలెనని తల్లి శ్రీసభ ఆజ్ఞాపిస్తున్నది.

వివాహ దంపతులు ఓర్పు కలిగి వివాహ బంధం యొక్క రహస్య ప్రణాళికను లోతుగా అన్ని కోణాల నుండి అర్ధం చేసుకోగలగాలి. అందరు కూడా క్రీస్తు ద్వారా

క్రీస్తు కోసం సృష్టింపబడ్డారు (కొలస్సీ 1:16) అని పునీత పౌలుగారు తెలియజేస్తున్నారు. సహజమైన వివాహం ద్వారానే దివ్యసంస్కారం యొక్క పూర్తి అర్థాన్ని, ఫలాన్ని గ్రహించగలరు. వివాహ దంపతులు సమస్యలతో విడిపోయే సమయంలో ఉన్నపుడు నిజనిజాలు తెలుసుకొని వారిని కలిపే బాధ్యత గురువులకు ఉంది. వివాహం మొదటగా జీవితం మరియు ప్రేమ యొక్క సన్నిహితమైన భాగస్వామ్యం. ఒకవేళ దేవుడు వారికి సంతాన ప్రాప్తి కలుగజేయనప్పటికి దేవుని ప్రణాళికను అర్థం చేసుకొని వారి సహజీవనాన్ని సహజంగా మానవ మరియు క్రైస్తవ విలువలతో జీవించాలి. వారికి కలిగే సంతానం ఏదో అదనంగా వచ్చేవి కాక వారి ఇష్టపూర్వకంగా పరస్పర ప్రేమను వారి లైంగిక దాంపత్య జీవితం ద్వారా వచ్చే ఫలమే అని భావించాలి. పిల్లలు కూడా కేవలం వారి తల్లిదండ్రుల లైంగిక దాంపత్య ప్రేమ ద్వారా పుట్టారనే హక్కు వారికి ఉంది. దేవుడు స్త్రీ, పురుషులను తన పోలికతో సృష్టించి ఆయన ప్రేమ పరికరాలుగా ఉండి భూమండలంలో ఉన్న జీవరాశులన్నిటిపై అధికారం కలిగి పరిపాలించుమని ఆజ్ఞ ఇచ్చెను (ఆది 1:27-28). కుటుంబం ఒక బిడ్డకు జన్మనిచ్చే పవిత్ర ప్రదేశం. ఆ ప్రదేశంలో బిడ్డ రక్షణను, కాపుదలను పొందుతుంది. ఆ పవిత్రమైన ప్రదేశమే అమాయకులైన చిన్నారులను బలితీసుకునే కేంద్రంగా ఉండకూడదు. ఒకరి ప్రాణాలను తీసే హక్కు ఎవరికీ లేదు. సహజమైన మరణాన్ని ఆహ్వానించాలేగాని అబార్షన్ లేక యుతనాసియ ద్వారా ఎవరిని చంపకూడదు.

## దైవవాక్కు బీజాలు మరియు అసంపూర్ణ పరిస్థితులు

సువిశేష కుటుంబంలోని బీజాలు ఇంకా పెరగడానికి, సిద్ధంగా వేచి ఉన్నాయి. భార్యాభర్తలిరువురు ఓర్పు కలిగి లోతైన అర్థాన్నీ, సంపూర్ణ జ్ఞానాన్నీ పరమరహస్యాన్నీ వారి జీవితాల్లో కనుగొనాలి. పండిత గురువులు “రక్షణ విధానం సృష్టిని వెలుగుమయం, సంపూర్ణం చేస్తుందని” తెలియజేస్తున్నారు. సహజసిద్ధమైన వివాహం దివ్యసంస్కారం అనే వెలుగులో పూర్తిగా అర్థమవుతుంది. మానవుని సంబంధాల యొక్క సత్యం కేవలం ధ్యానామృతమైన క్రీస్తులో మాత్రమే తెలుసుకోగలరు. దైవకుమారుని మనుష్యావతారము ద్వారా దేవుడు తన పరమ రహస్యాన్ని వెల్లడిచేస్తే నూతన ఆదాము, వాక్కు అయిన క్రీస్తు తండ్రి పరమరహస్యాన్ని

తనలో సమస్తమునకు తెలియజేశారు. ఆది మానవుడు ఆదాము అని బైబులు గ్రంథం చెబుతోంది. నిజానికి – ఆదాము రాబోయే కాలంలో అవతరించబోయే పరిపూర్ణ మానవుడు, క్రీస్తు భగవానుడికి ఒకానొక నమూనా, ఒక ప్రతీక మాత్రమే. క్రీస్తుప్రభువే నూతన మానవుడు, పరిపూర్ణ మానవుడు. ఆయనే తండ్రి భగవానుని ప్రేమతత్వాన్ని మానవులకు వెల్లడించాడు. అలాగే దేవుని సృష్టి ప్రణాళికలో మానవుడికి గల ప్రత్యేకమైన స్థానాన్ని ప్రాధాన్యాన్నీ, అతడికి దేవుడు నిర్దేశించిన జీవన మార్గాన్ని జీవన గమ్యాన్నీ స్పష్టంగా తెలియజేశారు. అంతేకాదు మానవుడిలో ఉండవలసిన లక్షణాలు, సద్గుణాలన్నీ క్రీస్తుప్రభులో మూర్తీభవించి ఉంటాయి. కనుకనే ఆయన పరిపూర్ణ మానవుడు. క్రైస్తవ విశ్వాసులు తమ చుట్టూ ఉన్న విభిన్న సామాజిక సాంస్కృతిక వర్గాల ప్రజల పట్ల సఖ్యతా సామరస్యాలను పెంపొందించుకోవాలి, వారి ఆచార వ్యవహారాలను గౌరవించాలి.

## జీవం ఇచ్చుట మరియు సంతానోత్పత్తి

వివాహం ప్రప్రథమంగా జీవం మరియు ప్రేమ యొక్క సన్నిహిత భాగస్వామ్యం. దాంపత్య జీవితంలో వారికి సంతానం కలగకపోయినప్పటికి వారి లైంగిక జీవనం సంపూర్ణ అర్థంతో క్రైస్తవులుగా, మానవులుగా గడపాలి. దాంపత్య జీవితం ముందుగా సంతానోత్పత్తి కోసం అని మనం గమనించాలి. దంపతులకు కలిగిన బిడ్డ, ఏదో వారి లైంగిక జీవితం ద్వారా అదనంగా వచ్చిందని భావించక, వారి పరస్పర ప్రేమ కానుకగా భావించాలి. వారి సంతానం వారి దాంపత్య జీవితంలో చివరిగా, ముగింపుగా వచ్చేదిగా భావించకూడదు. ముందుగానే అనగా వారి ప్రేమ కలిగిన సమయం నుండే సంతానం వారితో మొదలైనదనిభావించాలి. ప్రేమ ఫలాన్ని ఇవ్వకపోతే ప్రేమలో ఏమీ అర్థం ఉండదు. శిశువు స్వచ్ఛమైన తల్లిదండ్రుల ప్రేమలో పుట్టాలనే హక్కు శిశువుకు ఉందేకాని ఏదో కృత్రిమ పరికరాలతో కాదు. "దేవుడు మానవ జాతిని తన పోలికతో సృజించి, వారిని స్త్రీ పురుషులుగా చేసి, దీవించి, సంతానోత్పత్తి చెందుడు. భూమండలమునందంతట నివసించి, దానిని వశము చేసికొనుడు, నీళ్లలోని చేపలను, ఆకాశంలోని పక్షులను, నేలమీది జంతువులను పాలింపుడు" (ఆది 1:27–28) అని చెప్పెను.

ఈ ప్రపంచీకరణ వెల్లువలో భార్యాభర్తలు స్వార్ధానికి లోనై వారి వ్యక్తిగత, శారీరక అవసరానికై ఆనందానికి లోనై సంతానోత్పత్తి కోసం ఎక్కువ మక్కువ చూపించడం లేదు. పిల్లలకు జన్మనిచ్చి, పెంచే బాధ్యత తల్లిదండ్రులదిగా చెపుతుంది. ఆరవ పాల్ పాపుగారు "హ్యూమానె వీతే" అనే లేఖలో "వివాహ దంపతులిద్దరు సంతానోత్పత్తి విషయంలో సహజమైన, నైతికమైన పద్ధతులను మాత్రమే వాడాలి. సంతానం వివాహ జీవితంలో చాలా ప్రధానమైనది మరియు పవిత్రమైనది. సంతానోత్పత్తి ఎంతవరకు, ఏ స్థాయి వరకు అని ఇద్దరి ఒప్పందం ద్వారానే ఉండాలి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా గర్భనిరోధక, బహుభార్యత్వం, ఇంకా అనేకమైన శ్రీసభకు వ్యతిరేకమైన పద్ధతులను పాటించకూడదు" అని తెలియజేస్తున్నారు. కుటుంబం పిల్లలకు జన్మనిచ్చే ఒక గర్భగుడి. ఆ గర్భగుడే ప్రాణం తీసే త్రాచుపాము పడగలా ఉంటే ఆ వ్యతిరేకతను మనం ఊహించలేము. మానవుని జన్మ అమూల్యమైనది. అభం శుభం తెలియని గర్భంలో పెరుగుతున్న శిశువు ప్రాణాలు తీసే హక్కు తమ తల్లిదండ్రులకు మరి ఏ ఒక్కరికి లేదు. కుటుంబం ఒక ప్రాణాన్ని ఏ విధంగానైనా చివరి వరకు కాపాడాలనే చూడాలి. వైద్యరంగంలో సేవలందిస్తున్న వారు కూడా అంతరాత్మ కనుగుణంగా వ్యవహరించాలి. సహజమైన మరణాన్నే ఆహ్వానించాలేగాని బలవంతపు లేదా కృత్రిమ మరణాన్ని మనం ప్రోత్సహించ కూడదు. శ్రీసభ తనదైన శైలిలో వివాహితులను తల్లిదండ్రుల పాత్ర, బాధ్యతను అనుక్షణం హెచ్చరిస్తూ, ప్రోత్సహిస్తుండాలి. తద్వారా వారందరు క్రీస్తు శరీరం అనే శ్రీసభ నిర్మాణానికి తోడ్పడతారు.

## కుటుంబం మరియు శ్రీసభ

శ్రీసభ ఎంతో అంతరంగిక సంతోషంతో, లోతైన భావంతో సువిశేష విలువలకు అనుగుణంగా జీవించే విశ్వాసుల కోసం ప్రోత్సహించి, కృతజ్ఞతలు తెలియజేయుటకై చూస్తుంది. కుటుంబ ఔన్నత్యము గురించి సాక్షమిచ్చే విశ్వాసులుగా ఉండాలి. యాజక సంఘమైన శ్రీసభ పవిత్ర స్వభావము, సంస్థాగతమైన శ్రీసభ స్వరూపము, అది ఆచరించే దివ్య సంస్కారాల ద్వారా, పాటించే నియమ నిష్ఠల ద్వారా గుణశీలాదుల ద్వారా ప్రపంచానికి వెల్లడవుతాయి. జ్ఞానస్నానం ద్వారా శ్రీసభలో సభ్యులుగా చేరే విశ్వాసులు, తమ బప్తిస్మ ధర్మం ప్రకారం క్రైస్తవ

మతారాధనలో అర్చనాకాండలో పాల్గొన బద్ధులై ఉంటారు. శ్రీసభ ద్వారా దేవుడు తమకు ప్రసాదించిన విశ్వాస వరాన్ని మానవుల ఎదుట తమ ఆదర్శ జీవనం ద్వారా సజీవంగా ప్రదర్శించాలి, స్పష్టంగా ప్రకటించాలి, శ్రీసభ కుటుంబాలకే ఒక కుటుంబం. జ్ఞానవివాహం అనే దివ్యసంస్కారం ద్వారా ప్రతి దాంపత్య కుటుంబం శ్రీసభకు శుభాన్ని చేకూర్చుతుంది. ఈ విధంగా కుటుంబం శ్రీసభకు ఒక అమూల్యమైన కానుకగా ఈనాడు నిలుస్తుంది. దేవుడిచ్చిన బహుమతిని వివాహ సాంగ్యములో కాపాడడం ఒక కుటుంబం యొక్క బాధ్యతనే గాక క్రైస్తవ సంఘము యొక్క బాధ్యత కూడా దంపతులిద్దరు వారి ప్రేమబంధం వలన పితృత్వమును, మాతృత్వమును అనుభవిస్తూ కష్టసుఖాలను ఆశలను ఆకాంక్షలను, ప్రణాళికలను పశ్చాత్తాపమును ఒకరినొకరు పంచుకుంటూ ముందుకు సాగాలి.

**ముగింపు**

మన కుటుంబాలు త్రిత్వ దేవుని కుటుంబాన్ని అనుసరించాలి. త్రిత్వ దేవుడి కుటుంబమని, వారి మధ్య బంధం ప్రేమ, విధేయత, వినయం, గౌరవం కలిగి ఉంటూ పరిపూర్ణతను మినహాయింపు లేకుండా ఇచ్చిపుచ్చుకొంటారని వేదాంతులు బోధిస్తున్నారు. మన కుటుంబాలలో ఈ స్వేచ్ఛతో కూడిన పరస్పర స్వీయ బహుమానం చోటు చేసుకొంటే కుటుంబ బంధాల తీయదనం అనుభవానికి వస్తుంది. దాంపత్య జీవితానికి, కుటుంబ జీవితానికి సోకుతున్న చీడలు, జాడ్యాలైన వివాహేతర అక్రమ సంబంధాలు, విడాకుల సమస్యలు, కుటుంబ సమస్యలు, కుటుంబ అగాధాలను ఈ తీయదనం నిలువరించగలుగుతుంది. ఈ తీయదనం అనుభవించిన కుటుంబం ఈదురుగాలులను సైతం లెక్కచేయక ధైర్యంగా, నిటారుగా నిలిచే తాటిచెట్టులా విషమ పరీక్షా సమయంలో చెక్కుచెదరక నిలుస్తుంది. త్రిత్వదేవుని అంతర్గత బంధాన్ని నిర్వహించి, సాక్షమై నిలుస్తుంది.

❊ ❊ ❊ ❊

# 4. వివాహంలో ఉన్న ప్రేమ

**- బ్రదర్ కొండల కిషోర్ & బ్రదర్ మానూరి మార్కో**



శుభములను కలిగించే వివాహము, కుటుంబము మరియు ప్రేమ అనే అంశాలు గురించి వ్యక్తం చేయడానికి ఎంత వివరించినా ఇంకా కొరతగానే ఉంటుంది. ముందుగా కుటుంబ ప్రేమ, వివాహంలోని అన్యోన్య సంబంధాన్ని అభివృద్ధిపరచడానికి, దృఢపరచడానికి మార్గాన్ని చూపించ కుండా, వివాహంలో ఒకరికొకరు, ఒకరికొరకే ఒకరు ఉన్నారనే మార్గాన్ని చూపించి ధృడపరచలేము. కాని వివాహము అనే దివ్య సంస్కారము దంపతుల యొక్క ప్రేమను సంపూర్ణము చేయడానికే ఏర్పరచబడిందని మాత్రము ఖచ్చితంగా చెప్పగలము. పునీత పౌలుగారు 1 కొరింతీ 13:2-3 ప్రేమ యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ ఈ విధంగా అంటారు. పర్వతములను కూడా పెకలింపగల గొప్ప విశ్వాసమును కలిగి ఉన్నను ప్రేమలేని వాడనైనచో నేను వ్యర్ధుడనే. నాకున్న సమస్తమును నేను త్యాగము.... ప్రేమలేని వాడనైనచో అది నాకు నిరుపయోగము. కనుక ముందుగా మన నిత్యజీవితంలో ప్రేమ ఏ విధంగా ఉంటుందో చూద్దాం.

## నిత్యజీవితంలో ప్రేమ

పునీత పౌలుగారు 1 కొరింతీ 13వ అధ్యాయంలో వ్రాత పూర్వకంగా వ్రాసిన కొన్ని ప్రేమ సుగుణాలను పరిశీలిద్దాం.

ప్రేమ, సహనము కలది. ప్రేమ దయ కలది, ప్రేమకు అసూయకాని.... సమస్తమును సహించును. ఈ ప్రేమ అటు వివాహ దంపతుల మధ్య మరియు

వారి పిల్లల మధ్య ఎన్నో అనుభవాలను అనురాగాలను పంచుతుంది. కాబట్టి దీని గురించి ఇంకొంచెము ఎక్కువ తెలుసుకుంటే మనందరికీ లాభదాయకమది.

## ప్రేమ సహనము కలది

ప్రేమ సహనము కలది అంటే మనమనుకున్న విధంగా ఏమి జరిగినా భరించాలన్న ఉద్దేశ్యముతో మాత్రములో ఆయన దీనిని వ్రాయలేదు కాని (సొలొ.జ్ఞా. 11:23) “నీవు అన్నింటినీ చేయగలిగి ఉండి, అందరిని దయతో జూతువు. ఎందుకంటే నీవు నరుల తప్పిదములను ఉపేక్షించి వారికి పశ్చాత్తాపపడుటకు అవకాశము నిత్తువు”. కనుక మనం కూడా మన కుటుంబంలో ఇదే తత్వాన్ని కలిగి ఉండాలి. ఎందుకంటే మనలను వివాహ బంధం ద్వారా ఒకటి చేసిన దేవుడు ఆయన వ్యక్తిత్వాన్ని అనుసరించాలని ఆశిస్తున్నాడు.

సహనంగా ఉండడం అంటే నిత్యమూ అవమానములను, శరీర హింసలను భరించుకుంటూ ఎదుటి వ్యక్తి మనలను వాడుకునే విధంగా ఉండడం కాదు. ఎదుట వ్యక్తి ఎప్పటికైనా మారతాడనే భావన కలిగి ఉండడం. మన జీవితంలో ఎప్పుడైతే మనం మనకున్న బంధుత్వాలు, మన చుట్టూ ఉన్నవారు సరిగ్గా మనమనుకున్నట్లే ఉండాలని అనుకుంటామో అప్పుడే మనం ఎక్కువ ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చి, ప్రతీ విషయమూ మనకొక ఆటంకములా మారి విచారమునకు, కోపములకు గురి చేస్తాయి. కాని దీనికి బదులుగా మనం సహనాన్ని అలవరచుకుంటే ప్రతీ ఇబ్బందికీ ఒక జవాబు కనిపించి, మన కుటుంబం ఒక నందనవనం అవుతుంది. లేకపోతే మన లోపాలతో ప్రతీ కుటుంబమూ ఒక యుద్ధభూమిగా మారుతుంది. ఇంకా చెప్పాలంటే పౌలుగారి మాటలలో (ఎఫెసీ 4:31), ఈ ప్రపంచములో ప్రతీఒక్కరూ స్వేచ్ఛాపూరితమైన జీవితం జీవించే హక్కు కలిగి ఉన్నారని, గాఢమైన ప్రేమ (కలిగిన) మరియు సహనము అలవరచుకున్న మనకు మన సహచరి (ఎదుటి వ్యక్తి) మన జీవితంలో ఒక భాగమని గుర్తించేలా చేస్తుంది.

## ఇతరులకు సేవ చేయు ప్రేమ

ఒకరు మంచివారు అంటే ఆయన మంచితనము ఆయన చేతలలో తెలుస్తుంది. మనం ముందుగా చెప్పిన విధంగా సహనము అంటే స్పందనలేక

చలనం లేని స్వభావము కలిగి ఉండడం కాదు కాని అందరితో కలిసి మెలిసి చురుకైన ప్రవర్తనతో, మెరుగైన సృజనాత్మకతను కలిగి సహవాసం చేయడం. ఇక్కడ సహనం అనే పదము ప్రేమకు నిదర్శనముగా ఉండి సహాయం అందిస్తుంది. అందుకే ప్రేమ దయ కలది అనే విధంగా తర్జుమా చేయబడి నిరంతరమూ సేవ అందించే విధంగా ఉంటుంది.

ఈ విభాగము మొత్తము చూసినట్లయితే పౌలుగారు మనకు చెప్పాలనుకున్న విషయం ప్రేమ అనేది కేవలము ఒక అనుభూతి మాత్రమే కాదు కాని, దానికి మించి ప్రేమించడం, అంటే అన్నివేళలా ఇతరులకు మంచి చేయాలనే ఉద్దేశ్యం కలిగి ఉండడం. కనుకనే పునీత లయోలాపురి ఇన్యాసివారు అంటారు: ప్రేమ అనేది మాటలలో కంటే చేతలలోనే ఎక్కువ కనిపిస్తుంది. అందువలననే దీని యొక్క ఫలితాన్ని, అనుభవాన్ని ఇతరులకు సేవ చేసినప్పుడే పొందగలుగుతాము.

## ప్రేమకు అసూయ ఉండదు

పౌలుగారు అన్నట్లు ప్రేముంటే అసూయ అనే పదమునకే తావుండదు. ప్రేమ ఎప్పుడూ ఇతరుల చెడును కాని నాశనాన్ని కాని కోరుకోదు (అపో. 7:9, 17:5). అసూయ అంటే ఇతరుల అభివృద్ధిని చూడలేక మనకు కలిగే విచారము లేదా నిరాశ. దీనివల్ల మనము ఇతరుల అభివృద్ధీ, ఆనందము కాక కేవలము మన అభివృద్ధినే కోరుకుంటాము. కాని ప్రేమ ఎప్పుడూ మనకున్నా ఇతరుల ఆనందమునే కోరుకుంటుంది. ఈ అసూయ 'మనము', 'మనది' అనే బంధాలతోనే ఉంచుతుంది. కాని నిజమైన ప్రేమ ఇతరుల అభివృద్ధిని కోరుకుంటూ, ఇతరులను ఒక ఆటంకముగా చూడక, మనలను అసూయ అనే బంధనాల నుండి విముక్తి చేసి, ఇతరుల సంతోషానికి మార్గాన్ని చూపి, ప్రోత్సహించి తన మార్గాన్ని కూడా వారి సంతోషంలో వెదుక్కుంటుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే ప్రేమంటే దేవుడిచ్చిన రెండు ఆజ్ఞలను కార్యరూపంలో మన జీవితం ద్వారా చూపించడం (నిర్గమ 20:17). అప్పుడే మనం ఇతరులను ప్రేమించ కలిగి, దేవుడు చూసిన దృష్టితో చూసి, అన్నీ మన సంతోషం కొరకేనని గ్రహించగలుగుతాము తద్వారా మనము అన్యాయాన్ని నిరాకరించడంలోను, సమాజానికి సేవ చేయడంలోను ఆనందాన్ని కనుగొంటాము.

## ప్రేమకు డంబము ఉండదు

ఎవరికైతే ప్రేముంటుందో వారు గొప్పలు చెప్పుకోడానికి కాకుండా ఇతరుల మంచిని కోరుకుంటూ, తమ గురించి కాకుండా ఇతరులే ప్రధానమని భావిస్తారు. ముఖ్యంగా చెప్పాలంటే ప్రేమకు గొప్పలుగాని పొగడ్తలుకాని ఇష్టముండదు. కాని కొంతమంది మాత్రము వాస్తవాలను మరచి గొప్పలు చెప్పుకుంటూ, ఇతరులతో పోల్చుకొని వారు ఇతరులకంటే తెలివైన వారమని, చాలా ఆధ్యాత్మికమైనవారమని అనుకుంటారు. కాని పౌలుగారు ఇంకొక సందర్భములో చక్కగా చెప్పుతారు, మనందరికి జ్ఞానమున్నదన్నది అనుట నిజమేకాని అజ్ఞానము మనుష్యుని గర్వముతో ఉండునట్లు చేయునుకాని ప్రేమ బలము చేకూర్చును (1 కొరింతీ 8:1). ఇంకా చాలామంది తమలో తాము చాలా ముఖ్యమైన వారమని భావించి ఇతరుల కంటే ఎక్కువ జ్ఞానం ఉన్నదని అనుకుంటారు. ఎందుకంటే వారికి ఇతరుల మీద ఆధిపత్యం కావాలి. కాని నిజానికి అన్నింటికంటే ముఖ్యమైనది ప్రేమ. అది ఎదుటివారిని అర్థం చేసుకోగలదు, సానుభూతిని చూపగలదు మరియు అణగారిన వారిని చేరదీయగలదు.

క్రైస్తవులుగా ఉన్న మనము ఈ ప్రేమను ఇంకా ఎక్కువగా చూపించాలి. ఉదాహరణకు, మన కుటుంబమునే తీసుకున్నట్లయితే ఇందులో అందరూ అంత తెలివైనవారు కాకపోవచ్చు మరియు విశ్వాసములోను, నిర్ణయాలలోను దృఢంగా ఉండకపోవచ్చు. అందుకని ముందుగా ఈ ప్రేమను మన కుటుంబంలో అవలంభించాలి. కాని చాలా సందర్భాలలో దీనికి భిన్నముగా జరుగుతుంది. ఎంతోమంది కేవలము ఎదుటివారిపై ఆధిపత్యాన్ని చలాయించడానికి ప్రయత్నిస్తున్నారు. క్రీస్తును అనుసరించే మనకు ఆధిపత్య గొప్పలు కాకుండా, సహచరిని సంతోషం, క్షేమం ముఖ్యము. ఎందుకంటే మత్తయి 20:27లో క్రీస్తు ప్రభువు చెప్పుతున్నాడు: "మీలో ఎవడైన ప్రధముడు కాదలచిన అతడు దాసుడై ఉండవలెను" కనుక కుటుంబ జీవితంలో వినయం ఉండాలి. పేతురుగారు చెప్పినట్లు: "మీరు అందరూ వినము అను వస్త్రమును ధరింపవలెను, ఏలయన దేవుడు అహంకారులను ఎదిరించి వినయశీలురను కటాక్షించును" (1 పేతురు 5:3).

## ప్రేమకు అమర్యాద ఉండదు

మనం ప్రేమించాలంటే తప్పనిసరిగా సాధు స్వభావము మరియు ఆలోచించదగిన వారమై ఉండాలి. ఎప్పుడైతే ఈ రెండూ ఉంటాయో అప్పుడు మనము అమర్యాదగాకాక ప్రేమగా ఉండగలుగుతాము. ప్రేమ మనలను ఎప్పుడూ అదుపులో ఉంచి మన మాటలు, పనులు, చేతలు ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా చూసుకుంటుంది. మర్యాద, ప్రేమ ఇతరుల అవసరాలను స్పందించే విధంగా చేస్తుంది. కనుక ప్రతీ ఒక్కరూ ఓపికగా వినడం మాట్లాడడం మరియు కొన్ని సందర్భాలలో నిశ్శబ్ధంగా ఉండడం అనే వాటిని తప్పనిసరిగా నేర్చుకోవడం ఎంతైనా అవసరం. అందులో క్రైస్తవులుగా మనం తప్పనిసరిగా అలవరచుకోవాలి. ఎందుకంటే ప్రేమించడానికి ఉండవలసిన ముఖ్యమైన అర్హత ఇది. ఇంకా చెప్పాలంటే, ప్రతీ వ్యక్తి తన చుట్టూ ఉన్నవారు ఇష్టపడే విధంగా జీవించాలి. నమ్మకము, మర్యాద ఎప్పుడైతే మనలో ప్రదర్శితమవుతాయో, అప్పుడు ఇతరులు మన జీవితంలోనికి మనం ఇతరుల జీవితంలోనికి వెళ్లగలుగుతాము. ఒకవేళ ఎవరైనా వీటికి వ్యతిరేకంగా ఉంటే వారు మారే వరకు ఎదురు చూస్తుంది ఈ ప్రేమ.

మనం ఇతరులతో పరిచయం పెంచుకోడానికి పెద్ద పెద్ద కార్యాలు చేపట్టనక్కరలేదు కేవలము కల్మషములేని ఒక చూపు చాలు. ఈ చూపు మనలోని వ్యత్యాసాలను, పరిమితులను, తెలియజేసి, సహనమును పెంచి ఇతరులతో సహకరించడానికి తోడ్పడుతుంది. ఎవరికైతే ప్రేముంటుందో వారి మాటలతో ఇతరులకు ఆనందము, బలము, ఊరట, ఉత్సాహము కలిగించగలరు. క్రీస్తుప్రభువు చేసినది కూడా అదియే: ధైర్యముగా ఉండు (మత్తయి 9:2). నీ విశ్వాసము మెచ్చదగినది (మత్తయి 5:28). లెమ్ము (మార్కు 5:41), సమాధానముతో వెళ్లుము (లూకా 7:50) భయపడకుము (మత్తయి 14:27).

## ఉదారమైన ప్రేమ

ముందుగా చెప్పిన విధంగా మనం ఇతరులను ప్రేమించాలంటే ముందు మనలను మనం ప్రేమించగలగాలి. పౌలుగారు చెప్పిన విధంగా ప్రేమ ఎప్పుడూ తన గురించి తాను చూసుకోదు. దీనినే పౌలుగారు ఫిలిప్పీ 2:4 ఈ విధంగా చెప్పుతున్నారు. కేవలము స్వార్థమునే చూచుకొనక పరస్పరము ఉపకారులై

ఉండవలెను. బైబిల్ గ్రంథము దీనిని ఇంకా స్పష్టము చేస్తూ ఉదారంగా సేవ చేయడం అనేది ఒక ఉన్నతమైన కార్యముగా భావిస్తుంది. కనుక మనలను మనం ప్రేమించుకొనుటకు, మన అవసరాలను తృప్తిపరచుటకుకాక, ఇతరుల గురించి ప్రయాసపడుదాం.

తోమాసు అక్వినాస్ గారు ఇలా అంటారు: ఉదార స్వభావము కలవారు అనగా ప్రేమించబడాలనే కోరిక కంటే ప్రేమించాలనే కోరిక కలవారు". మన తల్లిదండ్రుల జీవితంలో ఇటువంటి ప్రేమనే చూస్తాము. ఈ ప్రేమ అన్నింటిని సహిస్తుంది. పునీత యోహానుగారు ఈ ప్రేమకు జత చేస్తూ ఈ విధంగా అంటారు. తన స్నేహితుని కొరకు తన ప్రాణమును ధారపోయువానికంటే ఎక్కువ ప్రేమ కలవాడు ఎవడును లేడు (యోహాను 15:13). ఇది సాధ్యపడుతుందా అనే భావన మనలో కలుగవచ్చును కాని ఇది సాధ్యపడుతుంది. పరిశుద్ధ గ్రంథం చెప్పిన విధంగా మీరు ఉచితముగా పొందితిరి ఉచితముగానే ఒసగుడు (మత్తయి 10:8).

## ప్రేమకు కోప స్వభావము ఉండదు

పౌలుగారు చెప్పిన విధంగా ప్రేమ ఎప్పుడూ సహనమునే ప్రదర్శించును కాని ఇతరుల బలహీనతలయందు, తప్పులయందు అంత త్వరగా ప్రతిఘటించదు. ఆ తప్పులు మరియు ఇబ్బందులు మనలను భయపెట్టి సహజీవనానికి ఆటంకమని అనిపిస్తేనే వ్యతిరేకిస్తుంది. ఎందుకంటే కొన్ని సమయాలలో వీటి వలన విడిపోయే అవకాశం ఉంటుంది. కనుక మనం ఇతరులను సరిచేసేటప్పుడు వారు చేసే పనులు ఎంత వరకు ఇతరులకు హాని కలిగిస్తాయో లేదా అన్యాయాన్ని చేస్తున్నాయో గమనించి సరిదిద్దాలి.

క్రీస్తుప్రభువు సువిశేషంలో అంటాడు: "ముందు నీ కంటిలోని దూలమును తీసివేయుము. అప్పుడు ఎదుట వారి కంటిలో నలుసును తీసివేయవచ్చును" (మత్తయి 7:5). చెడు పనులు చేసేటప్పుడు అడ్డుకోవడం తప్పుకాదు కాని అది మనలను పాపములోనికి తీసుకొని పోకుండా చూసుకోవాలి (ఎఫెసీ 4:26). ఒకవేళ మీకు కోపము వచ్చినచో ఏరోజు కుటుంబములో శాంతి ఏర్పడకుండా రోజు గడచిపోకుండా చూడండి. ఇది ఎలా సాధ్యపడుతుందంటే కేవలము ప్రార్థన ద్వారా మాత్రమే. ఈ

శాంతి నెలకొనడానికి పెద్ద పనులను మాటలను చిహ్నములను వాడనవసరం లేదు, కేవలము చిన్న సానుభూతి లేదా వారి కోసం కొద్దిగ సమయాన్ని వెచ్చిస్తే సరిపోతుంది. మీరు ప్రయత్నించినా ఎదుటి వ్యక్తి సహకరించకపోతే మార్చమని దేవుని అడుగు. ఒకవేళ చెడుతో యుద్ధం చేయవలసి వస్తే యుద్ధం చేయి కాని కుటుంబంలో ఎలాంటి దుర్మార్గ పనులకు పాల్పడకు.

## ప్రేమ క్షమిస్తుంది

ఒక్కసారిగాని మన మనస్సులో చెడుకు స్థానం కలిగించినట్లయితే మనం (సహచరిని) క్షమించలేము. అదే మనం మంచి మనస్సు కలిగి ఉన్నామంటే ఇతరులను అర్థం చేసుకోడానికి అంగీకరించడానికి సహనం తోడ్పడుతుంది. ఈ విధంగా క్రీస్తుప్రభు తండ్రికి మన గురించి విన్నవించారు: "తండ్రి వీరు ఏమి చేయుచున్నారో వీరు ఎరుగరు వీరిని క్షమించండి" (లూకా 23:34). కాని మనం మాత్రము ప్రతీ చిన్న విషయాన్నీ చాలా పెద్ద ఆటంకములుగా భావించి, మన కుటుంబాన్ని ప్రభావితం చేసే విధంగా తయారు చేస్తాము. ఏ విషయాన్నైనా చెడు కోణంలో ప్రత్యేకంగా చూస్తే అన్నీ తప్పులుగానే కనిపిస్తాయి. ఈ విధంగా మనం ఇతరులను అర్థం చేసుకోగలగడంలో ఓడిపోతాము మరియు మన వ్యక్తిత్వాన్ని మరచి హక్కుల కొరకు ఆశయాలు కొరకు పరుగులెడతాం. కనుక మన ధోరణి మారాలి. అప్పుడే మన సహచరినిని అర్థం చేసుకుంటాము.

మనం ఎప్పుడైనా అవమానం పొందినప్పుడు, చిన్నచూపుకు లోనైనప్పుడు క్షమించేద్దాం. ఎందుకంటే కుటుంబం ఐకమత్యంగా కలిసి మెలసి ఉండాలంటే మనం కొన్ని త్యాగాలు చేయాలి. ఇది ఒక్కరు మాత్రమే కాదు, అందరూ సహకరించినప్పుడే సాధ్యపడుతుంది. కాని ప్రస్తుతం దురాశ, కలహాలు, పోటీతత్వం, మితము మించిన ఆధిపత్యం సహచరినిపై దాడి చేయడం ద్వారా ఎన్ని కుటుంబాలు విడిపోతున్నాయో మనకు తెలియనిది కాదు. వీటి వల్ల కుటుంబం మొత్తం నాశనమవుతుంది.

ఇప్పుడు మనం గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే మనం ఇతరులను క్షమించగలిగే మంచి మనస్సుంటే అది మనలను మనం అర్థం చేసుకొని, స్వేచ్ఛగా

ఉండే విధంగా చేస్తుంది. ఇలాంటి స్వేచ్ఛాపూరితమైన అనుభవము మనలో లేనప్పుడు, మనం తప్పు చేసినప్పుడు లేదా సహచరిని మనలను విమర్శించినపుడు మన వ్యక్తిత్వమును కోల్పోయే ప్రమాదముంది. అదే విధంగా ఇతరులపై నిందారోపణ చేయడం, అబద్ధాన్ని నిజమని నమ్మడం వంటి వాటి వలన వివాహ బంధం కోల్పోయే అవకాశముంది. కనుక ముందుగా మన జీవితం కొరకు బలహీనతల కొరకు దేవున్ని ప్రార్ధించాలి అప్పుడు మనలను మనం అంగీకరించగలుగుతాము తద్వారా ఇతరులపై కూడా ఇటువంటి మనస్తత్వమును కలిగి ఉంటాము.

ఇవన్నీ మనకు తెలియజేసే సందేశమేమిటంటే మనమందరమూ మన సొంత సామర్థ్యాల ద్వారా కాకుండా, దేవుని యొక్క (ప్రేమ) కృపావరం వలన సమర్ధించబడి క్షమించబడినాము. కనుక ప్రేమ మాత్రమే ఈ లోకమును జయించగలదు అని కూడా మనం తెలుసుకోవాలి. అప్పుడు దేవుని ప్రేమ కొరతలేనిది, కొనలేనిది, వెలకట్టనిది అని అంగీకరించి మనం కూడా అమితమైన ప్రేమ చూపించి సహచరిని క్షమించగలుగుతాము. లేనిపక్షంలో మన కుటుంబం కూడా అర్థం చేసుకోకుండా, అండగా ఉండక, ప్రోత్సహించక నిత్యమూ విచారమునకు, ఒకరినొకరు అవమానించడానికి నివాసమవుతుంది.

ఇతరులకు అన్యాయం జరిగినప్పుడు సంతోషించే వారిని పశుతత్వం కలవాడు అంటారు. మనం సాధారణంగా కుటుంబములోని వ్యక్తుల సామర్థ్యాలను పనులను, విలువలను వారి వ్యక్తిత్వాలను చూసినప్పుడు ఎంతో సంతోషిస్తాము. అయితే ఏ కుటుంబములో నిత్యమూ పోలికలతో పోటీతత్వముతో జీవిస్తున్నారో వారికి ఇది సాధ్యపడదు. మరి అటువంటి వారు రహస్యంగా సహచరిని అపజయాలయందు ఆనందిస్తారు.

ప్రేమ కలిగిన వ్యక్తి ఎప్పుడైతే ఇతరులకు మంచి చేయ గలిగి, ఎదుటవారు సంతోషంగా ఉండేలా చూస్తాడో అప్పుడే వారు సంతోషంగా ఉండగలుగుతారు. ఈ విధంగా దేవునికి మహిమ చేకూరుస్తారు ఎందుకంటే దానమొనర్చు వానిని దేవుడు ప్రేమించును (2 కొరింతీ 9:7). అందులో ముఖ్యంగా మన దేవుడు, ఎవరైతే ఇతరుల సంతోషంలో వారి సంతోషమును వెదుక్కుంటారో వారిని

మెచ్చుకుంటారు. అలా కాకుండా ఇతరుల సంతోష జీవితంలో మన సంతోషం కనుగొనడంలో విఫలమై కేవలం మన ఆనందము కోసము, అవసరత కోసం ప్రాకులాడితే మనలను మనము నిందించుకోవలసిన సమయం వస్తుంది (అపో 20:35). అదే విధంగా కుటుంబము కూడా ఇంట్లో ఒకరికి మంచి జరిగితే తన ఆనందమును బాధలను పంచుకోడానికి మిగతా వారందరూ ఉన్నారని వారికి తెలియజేయాలి.

## ప్రేమ సమస్తమును భరించును

పౌలుగారు ప్రేమ గురించి ముగిస్తూ ఈ విధంగా అంటారు ప్రేమ అన్నింటినీ భరిస్తుంది, విశ్వసిస్తుంది, నిరీక్షిస్తుంది మరియు సహిస్తుంది. కనుక ఎంత పెద్ద విపత్తు ఎదురైనా ప్రేమ శక్తివంతంగా ఎదుర్కొంటుందని గ్రహించాలి.

ప్రేమ అన్నింటినీ భరిస్తుంది అంటే చెడును చూసి కూడా వదిలిపెట్టడం కాదు కాని దానిని పూర్తిగా నిర్మూలించాలి. అనేక అనర్థాలకు కారకమైన అతిశక్తివంతమైన సాధనము మన నాలుక, దానిని ఏ విధంగా వాడాలో కూడా తెలియజేస్తుంది. ఇది మరో విధంగా చెడు సుగుణాలను పరీక్షించి తీర్పు చేసి అదుపులో ఉంచుతుంది కాని కొన్నిసార్లు అసూయ కోపస్వభావముతో ఇతరుల గురించి చెడుగా మాట్లాడి హాని చేసే ప్రభావము కూడా కలిగి ఉంటుంది. ఈ విధంగా మనం దుర్భాషలాడి, ఇతరుల పేరు ప్రఖ్యాతలకు భంగం కలిగించి దేవుని దృష్టిలో పాపము కట్టుకొని దూరమైపోతున్నాము. అందుకే యాకోబు వ్రాసిన లేఖ 3:6లో ఈ విధంగా అంటాడు (నాలుక ఒక దోష ప్రపంచము అది మన శరీరమంతటిని మలినము చేయును మరియు ఇది విశ్రమింపని చెడుగు, ఘోర విషపూరితము. వీటన్నింటి కంటే కొన్నిసార్లు సాక్షాత్తు దేవుని ప్రతిరూపములైన మన తోటి వారిని శపిస్తుంది. ప్రేమ మాత్రం ఇతరుల మంచి పేరు నందు, ఇంకా తన శత్రువునందు కూడా ఆనందిస్తుంది. కనుక మనకుండవలసిన ముఖ్యమైన లక్షణం ప్రేమ. అది ఈ లోకంలో దేవుని చట్టమును కొనసాగించుటకు, తదనంతరము పరలోక భాగ్యము ప్రాప్తింపజేస్తుందని మర్చిపోకూడదు.

నిజమైన ప్రేమతో జీవించు దంపతులు ఎప్పుడూ ఎదుటి వారి మంచి గుణాల గురించి మాత్రమే మాట్లాడతారుకాని, వారిలోని లోపాలను గురించి, తప్పులను గురించి మాట్లాడడానికి పూనుకోరు. ఒకవేళ అలాంటి సందర్భమే ఎదురైతే నిశ్శబ్ధంగా ఉంటారేకాని చెడు మాట్లాడడానికి ఇష్టపడరు. ఇది వారి నిజ మనస్తత్వము. ఇది కేవలము ఇతరులను మెప్పించడానికి వారి నుండి ఏదో లబ్ధి పొందాలనో చేయరు. మరికొందరు దీనికి వ్యతిరేకతగా వారి తెలివి తేటలన్నింటినీ ఉపయోగించి చిన్న చిన్న పొరపాట్లను, తప్పులను కూడా చాలా పెద్దవిగా భావించి జీవితంలోని ఇబ్బందులకు ఇవియే కారణమని చూపిస్తారు. కాని మనం తెలుసుకోవలసిన విషయమేమిటంటే మనమందరమూ మంచి చెడుల (వెలుగు చీకటుల) సమ్మేళమనీ, వీటన్నింటికన్నా మన ఎదుటి వ్యక్తి ఎన్నో రెట్లు ముఖ్యమని గుర్తించాలి. ప్రేమ ఒక కొలతలో బంధించి ఇంతే ఉండాలని గీత గీయకూడదు, ఎందుకంటే మన సహచరిని తను ఎంత ప్రేమించగలడో అంతే ప్రేమిస్తాడు కాని మనం ఊహించుకొని మనం అనుకున్నంత ప్రేమలేదని కనుక అది నిజమైన ప్రేమ కాదని అనుకోవడం మన అవివేకము అవుతుంది. కాని ప్రేమ ఎప్పుడూ అసంపూర్ణతతోనే సహజీవనం ప్రారంభించి అన్నింటినీ భరించి చివరకు సంపూర్ణ ప్రేమను, శాంతిని కొనసాగిస్తుంది.

## ప్రేమ సమస్తమును విశ్వసించును

ప్రేమ అన్నింటినీ విశ్వసిస్తుందంటే ఇక్కడ మనం దాని యదార్ధ వేదాంత అర్ధమును కాక, 'నమ్మడం' అనే భావమును చూస్తున్నాము. ఇది కేవలము సహచరి మనలను మోసం చేయడంలేదని అబద్ధమాడడంలేదని ఊహించడం కాదుకాని, దానికి మించి గుర్తించగలగడం. ఏ విధంగా బూడిదలో ఉన్నా నిప్పు కణిక వెలుగుతుందో, అదే విధంగా చీకటిని చేదించుకొని దేవుని కాంతి ప్రజ్వరిల్లుతుందో మన యొక్క నమ్మడం కూడా అటువంటిదని గ్రహించాలి.

ఇలాంటి నమ్మకం మన బంధాల నుండి మనలను స్వతంత్రులను చేస్తుంది. అంటే దీని ఉద్దేశ్యం మనం మన సహచరిని అదుపు చేస్తూ అనునిత్యమూ ఒక కంట కనిపెడుతున్నామని మాత్రము కాదు. కానిప్రేమ నమ్ముతుంది. మరియు స్వతంత్రులను చేసి స్వేచ్ఛనిస్తుంది. ఈ ప్రేమ సహచరిని అదుపు చేయడంకాని

ఆమెపై అతను ఆధిపత్యం చెలాయించడం కాని చేయదు. ప్రేమ ఇలాంటి స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉండడానికి, ఏమీ దాచుకోకుండా ప్రపంచంలోని మార్పులకు సానుకూలతను చూపించి, కొత్త అనుభవాలను పెంచి, బంధాన్ని ధృఢపరుస్తుంది. అప్పుడే దంపతులు ఒకరినొకరు అర్ధం చేసుకుంటూ బయట ప్రపంచము నుండి పొందిన, నేర్చుకున్న, అనుభూతులను పంచుకుంటారు. ఒకవేళ మనం ఒకరికొకరు నమ్మకపాత్రంగా లేకపోతే నిజస్వభావాన్ని దాచి నటించవలసి వస్తుంది. కాని ఎప్పుడైతే మన కుటుంబంలో నమ్మకానికి ప్రాధాన్యత ఇస్తామో అప్పుడే ప్రతీఒక్కరూ తమ నిజస్వరూపాలలో స్వతహాగా, మోసాలను అబద్ధ గుణాలను నిర్మూలించి, సహజీవనం సాగించగలము.

## ప్రేమ సమస్తమును ఆశించును

ప్రేమ ఎప్పుడూ భవిష్యత్తు గురించి నిరాశపడదు. కాని తమ సహచరిని మారుతుందని, తెలుసుకుంటుందని ఆ సమయం కొరకు ఎదురుచూస్తుంది. ఈ నిరీక్షణకు ఎలాంటి ఇబ్బందులైనా ఎదుర్కొనే సామర్ధ్యం ఉంటుంది. ఇక్కడ నిరీక్షించడమంటే అంతా మన మనకున్న విధంగా జరుగుతుందని ఊహించడం కాదు కాని మనకు ఏది మంచిదో అదే జరుగుతుందని ఆశించడం. ఎందుకంటే దేవుడు వంకర రాతలను కూడా తిన్నగా వ్రాయగల సమర్ధుడు. కాబట్టి చెడును మంచి నుండి వేరు చేసినట్లు మనలను కూడా దు:ఖము నుండి సంతోష జీవనంలోనికి నడిపిస్తాడు.

ఇక్కడ నిరీక్షణ అంటే పూర్తిగా తనకు తాను, తాను మరణించిన తరువాత జీవితము గురించి నమ్మకం కలిగి ఉండడం, ప్రతిఒక్కరూ వారి వారి యొక్క అపజయాలతో సంపూర్ణమైన పరలోక జీవితమునకు పిలువబడును. మన బలహీనతలన్నీ క్రీస్తు యొక్క ఉత్థానములో రూపాంతరము పొందుతాయి. అప్పుడు మన బలహీనతలు చీకటి కోణాలు, బాధలు అన్నీ తొలగి, మన నిజస్వరూపమైన మంచితనము, ఇతరులకు మనం చేసిన ఉపకారములు వెలుగుగా ప్రకాశిస్తాయి. ఇవన్నీ ప్రస్తుతం మన కళ్ళ ముందు కనిపించనప్పటికీ ఈ నిరీక్షణ అనే అంశము ప్రకృతికి అతీతమైన ఈ లోక జీవితానంతరము పరలోక భాగ్యము ప్రాప్తింపజేస్తుంది.

## ప్రేమ సమస్తమును సహించును

ప్రేమ అన్నింటినీ నిశ్చలమైన మనస్సుతో సహిస్తుంది. ఇది ఆదరించుటలో చాలా దృఢమైన మనస్సు కలిగి ఎన్ని ఆటంకములు వచ్చిన సహించి, ఎలాంటి సవాలునైనా ఎదురించుటకు సిద్ధంగా ఉంటుంది. ఇది అంధకారంలో కూడా ఆశను విడువదు. ఇక్కడ మార్టిన్ లూథర్‌గారు చెప్పిన మాటలను గుర్తుచేసుకుందాం: “ఎవరైతే ప్రతి కష్టమును బాధలను స్నేహపూర్వకమై దిద్దుబాట్లుగా భావించి నిన్ను ఎవరైతే ద్వేషిస్తారో వారిలో కూడా కొంతమంచి ఉంటుంది. నీ దేశము నిన్ను ద్వేషించిన, అందులోను కొంత మంచి ఉంటుంది. నీ జాతి నిన్ను ద్వేషించినా, అందులోను కొంత మంచి ఉంటుంది. వీరందరినీ చూసినప్పుడు వారి ముఖాలను కాక వారి ముఖం వెనుక వున్న మతాన్ని అనగా సృష్టించిన దేవున్ని చూడు. అప్పుడు నీవు నీ దేవుని చూడగలుగుతావు. అప్పుడు నీవు అన్నింటిని ప్రేమించగలవు. ఎప్పుడైతే నీ శత్రువును ఓడించడానికి అవకాశం వచ్చినా ఓడించక విడిచిపెడతావో అప్పుడే నీవు ప్రేమించే స్థాయికి ఎదిగి, చెడును మాత్రమే కాకుండా దుష్ట వ్యవస్థనంతటిని నిర్మూలిస్తావు. ప్రపంచములో ద్వేషమునకు ద్వేషము అనే భావన ఉంది కాబట్టే ఇంకా ఈ అరాచకాలు కొనసాగుతున్నాయి. నేను నిన్ను బాధపెడితే నీవు కూడా నన్ను తిరిగి బాధపెడతావు. ఇలా కొనసాగితే ఎప్పటికీ మనం మన లోకం మారదు. ఎక్కడో, ఎవరో స్ఫురణ కలిగి దానికి చరమగీతం పాడాలి. అతడే లేక ఆమెయే నిజమైన మానవ స్వరూపము. అతడు (ఆమె) మాత్రమే ఈ ద్వేషమును చెడును రూపుమాపగలడు. ఈ భూమ్మీద వీటినన్నింటినీ సమూలంగా ఈ ద్వేషమును చెడును రూపమాపగలడు. ఈ భూమ్మీద వీటినన్నింటినీ సమూలంగా నాశనం చేయాలంటే ఎవరో ఒకరు సరైన మతాన్ని, సంపూర్ణమైన నైతిక విలువలను కలిగి, ప్రేమ అనే ఆయుధమును వాడాలి, అప్పుడు మాత్రమే ద్వేషమును రూపుమాపగలం.

మనలను భయపెడుతున్న ప్రతీ చెడు కార్యముతో పోరాడగల శక్తినిచ్చే ప్రేమను మన కుటుంబాలలో అలవరచుకోవాలి. ప్రేమ ఎప్పుడూ దురభిప్రాయములోను, ఏదో ఆశతో లాభం వస్తుందని ప్రేమించదు. ఎలాంటి సంఘటన ఎదురైనా హాని చేయుటకు పూనుకోదు. క్రైస్తవులుగా మనం మరీ

ముఖ్యంగా ఈ విలువలను పాటించాలి. మనము కొన్నిసార్లు వివాహ దంపతులను చూసి ఆశ్చర్యపోతాము. ఎందుకంటే కొన్ని కారణాల వల్ల వారిరువురు విడిపోయినా ఎదుటి వ్యక్తి బాధలలోను కష్టములోను ఉన్నారని తెలిస్తే వెంటనే స్పందిస్తారు. ముఖ్యంగా ఎదుటి వ్యక్తి అనారోగ్యము వలన మనకు హాని కలుగుతుందన్నా భయపడక సహాయం చేయడానికి సిద్ధమవుతారు. ఇది కేవలం వారి మధ్య వున్న అన్యోన్య ప్రేమ యొక్క బలం.

## దాంపత్యానురాగములో వృద్ధి చెందుట

పునీత పౌలుగారు చెప్పిన విధంగా భార్యాభర్తల మధ్య ఉండే అన్యోన్య ప్రేమ అనేది దివ్య సంస్కారమైన వివాహ జీవితం, దేవుని అనుగ్రహము వలన వారి మధ్య ప్రేమ పవిత్రపరచబడుతుంది, బలపరచబడుతుంది మరియు ప్రకాశవంతమౌతుంది. ఈ బంధము బలమైన ఐక్యతగా, ఆధ్యాత్మికమైనదిగా, త్యాగపూరితంగా వారి మధ్య స్నేహపూర్వకమైన లైంగిక ప్రభావంను చూపుతూ చివరి వరకు కొనసాగుతుంది. 11వ భక్తినాథ పాపుగారు బోధించిన విధంగా,ఈ ప్రేమ వివాహితులకు వారి బాధ్యత యందు ఆనందమును కలిగిస్తుంది. ఈ ప్రేమ క్రీస్తుకు, మానవ జాతి మధ్య ఉన్నట్లుగా, ఎన్నటికి తెగిపోని బంధంగా త్యాగపూరితంగా క్రీస్తుప్రభువు చివరికి సిలువ మీద చూపించిన ప్రేమకు పోలి ఉంటుంది. ఆత్మ భార్యాభర్తలను ఒకరిని ఒకరు ప్రేమించడానికి తోడ్పడుతుంది.

ప్రేమగల దేవుని ప్రతీకగా ఈ వివాహ బంధం నిలుస్తుంది. దేవుని ప్రేమ స్వభావం తొలగించటానికి వీలుపడని చిహ్నంగా ఉంటుంది. వివాహం అనేది దేవుని యొక్క స్వచ్ఛమైన ప్రేమకు గుర్తు. త్రిత్వైక దేవుని సత్సంబంధానికి చిహ్నం వివాహం. త్రిత్వైక దేవుని రహస్యంతో, వివాహం కూడా మానవ మేధాశక్తికి అంత సులభంగా అందనంతగా ఉంటుంది.

వివాహం అనేది నిరంతరం కొనసాగే, ఒకరిని ఒకరు అర్ధం చేసుకొనే ఒక ప్రయాణం. ఏ విధంగానైతే క్రీస్తుప్రభు ప్రేమను శ్రీసభ అర్ధం చేసుకొనుట ద్వారా దినదినాభివృద్ధి చెందుతుందో అదే విధంగా ఈ చర్య కొనసాగుతుంది. దేవుని కృపావరాల వలన ఇది సాధ్యపడుతుంది.

## జీవితాంతం పంచుకునే ప్రేమ

దేవుని ప్రేమ తరువాత అన్యోన్య ప్రేమలో అత్యంత గొప్పది దాంపత్యానురాగము. ఈ ప్రేమలో మంచి స్నేహం, ఇతరుల మీద దయ, సున్నితత్వం, ఐక్యత, మృధుత్వం, నిలకడ ఇలాంటి సుగుణాలు ఉంటాయి. వివాహం ఎప్పటికి చెరిగిపోని బంధం, జీవితాంతం ఒకరికొకరు పంచుకుంటూ ఎదుగుతుంది. నిజానికి ప్రేమించిన వ్యక్తులు ఎల్లప్పుడు కలిసి ఉంటారు. తోటి భాగస్వామి ఎంతటి బలహీనులైనా గాని ప్రేమ నడిపిస్తుంది. పిల్లలు కూడా తల్లిదండ్రులు ఒకరిని ఒకరు ప్రేమించుకుంటూ ఉండటమే కాకుండా, విశ్వాస పాత్రమైన జీవితాలను తల్లిదండ్రుల నుండి కోరుకుంటారు. దేవుడు కూడా ఒడంబడికలో ఒకరికి ఒకరు విశ్వాసపాత్రులుగా ఉండాలని కోరుకుంటారు. ఎందుకంటే విడాకులు అంటే దేవునికి ద్వేషభావాన్ని కలిగిస్తాయి (మలాకీ 2:14-16).

వివాహ జీవితాన్ని ఒక సవాలుగా తీసికొని దాని కోసం పోరాటం చేస్తూ, నూత్నీకరించుకుంటూ మరణం వరకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి. మన ఆలోచన చిన్నదిగా ఉన్నా, దేవుని కృప వలన ఒకరిని ఒకరు పరిపూర్ణంగా ప్రేమించుకోవడానికి దేవుడే తోడ్పడతారు. ఎన్ని కష్టాలు వచ్చినా వివాహం అనే పవిత్ర బంధం చివరి వరకు నిలబడుతుంది.

వివాహం, స్నేహంలాగా గట్టి బంధం కలిగి ఎల్లప్పుడూ నిలకడగా, స్థిరమైన ఐక్యత కలిగి ఉంటుంది. కారణం, వివాహం కేవలం పిల్లల కోసం కాకుండా అన్యోన్య ప్రేమలో వృద్ధిచెందు ప్రక్రియగా ఈ బంధం ఏర్పడింది. భార్యాభర్తల మధ్య ఈ ప్రేమ కేవలం దాంపత్య బంధం ద్వారా మాత్రమే వెలువడుతుంది. ఈ బంధం ఒకరిపై ఒకరికి గౌరవంను పెంచుతుంది. ద్వితీయ వాటికన్ సభలో వెల్లడి అవుతుంది. ఇటువంటి ప్రేమ మానవునికి, దేవునికి మధ్య బంధంలో, తమను తాము అర్పించుకొను కార్యముగా జీవితాంతం కొనసాగుతుంది.

## ప్రేమానందం

వివాహ జీవితంలో ప్రతీఒక్కరూ ప్రేమానందం అనేది అలవరచుకోవాలి. ఈ ఆనందము స్వార్థపూరితమైనది కాకూడదు. ఒకవేళ ఇది స్వార్థంతో ఒకరికి

మాత్రమే పరిమితమైతే అప్పుడు మనం వ్యక్తిగత కోర్కెలు తీర్చుకోడానికి, సంతృప్తి పడడానికి ప్రయత్నిస్తాము. పునీత అక్వినాస్ గారు అంటారు: "ఆనందమనేది హృదయ విశాలతపైన ఆధారపడి ఉంటుంది. దీనిని అర్థం చేసుకుంటే వివాహంలో ఎన్ని కష్టాలు, దు:ఖాలు వచ్చినా ఆనందాన్ని అనుభవించవచ్చు. జీవితమంటే అన్నీ మిళితమైన సంసార సాగరం. దీనిలో సుఖం, దు:ఖం, ఆనందము, కష్టము, శాంతి, అశాంతి ఇలా అన్నీ ఉంటాయి. కనుక దంపతులిద్దరూ వీటినన్నింటినీ అధిగమించి ఒకరికొకరు సహాయం చేసుకుంటూ ఆనందమైన జీవితం జీవించాలి".

ప్రేమ స్నేహం అనేది ఇతరుల అభివృద్ధికి మంచి చేయటానికి ఉపయోగపడాలి. స్నేహంలో ఇతరులు చేసిన పనులను వారికున్న సామర్ధ్యాలను మెచ్చుకుంటూ సాగాలి. వీలైతే సహాయం చేయాలేకాని వారి నుండి ఏమీ ఆశించకూడదు. ప్రస్తుత కాలంలో స్వచ్ఛమైన స్నేహం కనుగొనుట చాలా కష్టం. ప్రేమంటే మనలో ఈర్ష్య, అసూయ అనేవి ఉండకూడదు. మన సహచరిని ప్రేమించేటప్పుడు ఆనందం అప్యాయత, పవిత్రత కలిగి ఉండాలి. మన ప్రేమ సహచరికి స్వేచ్ఛ స్వతంత్రమును ఇచ్చునదిగా ఉండాలి.

## ప్రేమానుభూతి

ప్రేమానుభూతి అనేది ఇతరులను చూసిన వెంటనే వారి కళ్లల్లో కనిపించాలి. మనం కొన్ని సందర్భాలలో ఇతరుల కుటుంబాలలో వింటుంటాము. 'నా భర్త నా వైపు చూడడు, నాతో మాట్లాడడు, నన్ను పట్టించుకోడు కేవలం పిల్లలతోనే మాట్లాడతాడు' అని చాలా బాధపడతారు. ఇలా బాధపడుతూ ఎందుకు ఈ విధంగా జరుగుతుందని ఆలోచించము. కాని ఎప్పుడైతే మన వంతుగా మన ప్రయత్నం చేస్తామో అప్పుడే మన పరస్పర ప్రేమకు అర్థం పరమార్థం ఉంటుంది.

'ప్రేమానందం' అను సలక్షణమును మనం మన వివాహ జీవితంలో అలవరచుకోవాలి. ఈ ప్రేమను ఇతరులతో పంచుకోవాలి. ఎందుకంటే మనం ప్రేమించడానికి సృష్టించబడ్డాము. సీరా గ్రంథం 14:16 ఇలా చెప్తుంది: మనం ప్రేమ ఇచ్చి పుచ్చుకొనుచూ సుఖములను అనుభవించాలి కనుక ప్రేమానందంలో స్వచ్ఛమైన ప్రేమ కలిగి వ్యర్థమైన అవమానములు, అసమానతలు విడిచిపెట్టి ప్రేమ ఫలాలను మన జీవితంలో ప్రదర్శింపజేయాలి.

వివాహ జీవితంలో ఒక్క ఆనందమే కాకుండా కష్టాలు, దు:ఖాలు ఉంటాయి. వీటికి భయపడితే మనం జీవితాన్ని ఆస్వాదించలేము. పునీత అగస్టీను అంటాడు: "యుద్ధ భూమిలో మొదట భయం, ఆపద ఉంటాయి. కాని వీటిని జయించినప్పుడే విజయానందం మనలను వరిస్తుంది". కనుక కుటుంబ జీవితంలో కష్టాలు, దు:ఖాలు వచ్చినప్పుడు దంపతులు భయపడకుండా ఒకరికొకరు అర్ధం చేసుకుంటూ వాటిని అధిగమించడానికి ప్రయత్నించాలి.

## ప్రేమ కొరకు పెళ్లి

క్రొత్త దంపతులు ఈ విషయాన్ని గ్రహించాలి. "వివాహంలో ప్రేమ కనిపించి అది ప్రధాన పాత్రను పోషించాలి. ఎట్టి పరిస్థితుల్లోను ఇతరులను మాట ద్వారా గాని చేత ద్వారా కాని బాధపెట్టకుండా చూసుకోవాలి. ప్రేమ అనేది వారి సమ్మతి, అంగీకారం కంటే గొప్పది. ఈ ప్రేమ ద్వారా ఒక్కటైన మీరు ఒక కుటుంబంగా జీవిస్తూ కుటుంబ అభివృద్ధికై తోడ్పడుతూ కలిసి జీవించాలి".

వివాహ జీవితం సాఫీగా సాగాలంటే ప్రేమతో పాటు నిజాయితీ, నిర్మలమైన మనస్సు కలిగి ఉండాలి. తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, ఇద్దరూ సంప్రదించుకొని ఏది మంచి, ఏది చెడు అని గ్రహించాలి. ఎప్పుడూ ఏ విషయంలోను పోటీతత్వం ఉండకూడదు. ఎన్ని కష్టాలొచ్చినా సమస్యలెదురైనా ఒకటిగా వాటిని జయించాలేకాని ఒంటరిగా ఎదుర్కోకూడదు. ఒంటరిగా వుంటే వారి బంధం విడిపోయే ప్రమాదముంది. కాని నిజమైన ప్రేమ ఉంటే ఎన్ని సమస్యలొచ్చినా ఓర్పు కలిగి ఆనందంతో జీవిస్తారు.

## ప్రేమ తనను తాను వ్యక్తపరచుకుంటుంది - పెరుగుతుంది

కుటుంబం అభివృద్ధి చెందాలంటే వివాహ జీవితంలో ప్రేమ కలిగి ఉండాలి. ప్రేమ అనేది ఇతరులకు ఉదారంగా ఇవ్వాలి. మన కుటుంబం అభివృద్ధి చెందాలంటే ఆనందంగా ఉండాలంటే మనం ముఖ్యంగా మూడు గుణాలను కలిగి ఉండాలి (దయ కలిగిన) సహాయం, కృతజ్ఞత, క్షమాపణ. మన కుటుంబంలో అసూయ లేకపోతే ఇతరుల సహాయానికి కృతజ్ఞత కలిగి ఉంటాము. మనం తప్పులు చేసినప్పుడు క్షమాపణను అడిగే మనస్తత్వం ఉండాలి. అప్పుడే మనం ఎదుటి వారి తప్పులను క్షమించగలుగుతాము. మరియు కష్టాలలో ఉన్న వారికి

సహాయం చేసే గుణం కలిగి ఉండాలి. అప్పుడే మనం కూడా సహాయం పొందగలుగుతాము. ఎప్పుడైతే ఈ గుణాలను పాటిస్తామో అప్పుడు మన ప్రేమ కూడా శాశ్వతంగా ఉంటుంది.

### మనకు ప్రేమ వున్నప్పుడే,

ఇవన్నీ కార్యరూపము దాల్చగలవు. పునీత తోమాస్ అక్వినాస్ గారు చెప్పినట్లు, "సహాయం అనే సుగుణం పవిత్రాత్మ ఒసగడం ద్వారా లభిస్తుంది'. దీని ద్వారానే మనం ఇతరులకు సహాయం చేయగలుగుతున్నాము. దీనికి ఎటువంటి హద్దులుండవు". మన జీవితంలో కూడా అభివృద్ధి చెందాలంటే, దేవుని అనుగ్రహమును, దయను ఉదార స్వభావమును పొందాలంటే, నిరంతరమైన ప్రేమ కలిగి ఉండాలి మరియు పునీత పౌలుగారు మాటలలో "క్రీస్తును అనుసరించే ప్రతివాడు ఒకే భార్యను కలిగి తన సంతానమును కుటుంబమును చక్కదిద్దుకొనగలవాడై ఉండాలి".

### ఉన్నతమైన ప్రేమ జనించినప్పుడు,

ఈ భూలోక సంబంధమైన ప్రేమ తగ్గిపోతుంది. ఆదర్శంగా ఉండవలసిన కుటుంబాలు తప్పుడు మార్గాలను చూపే ప్రచార సాధనాల ద్వారా పాడైపోయే అవకాశం ఉంటుంది. దానిని మనం అరికట్టాలి. మన కుటుంబాలు ఐకమత్యంగా పరిపూర్ణ ప్రేమ కలిగి కలిసి మెలిసి ఉండాలంటే తప్పుడు దారులను, అసంపూర్ణ మార్గములను విడిచి, సరైన బాటను ఎన్నుకొని ప్రయాణించాలి. అప్పుడే మన కుటుంబం అనేక మందికి ఆదర్శంగా నిలిచి ఆనంద నిలయం అవుతుంది.

### సంభాషణ

వివాహము మరియు కుటుంబ జీవితంలో ప్రేమను అనుభవించడానికి, వ్యక్తపరచడానికి మరియు దానిని పెంపొందించడానికి 'సంభాషణ' చాలా ముఖ్యం. ఒక్కొక్కరు ఒక్కో విధంగా తదితర భాషలలో సంభాషిస్తారు. మనం ఎదుటివారిని ప్రశ్నించే విధానం లేదా వారికి జవాబివ్వడం, మనం ఎంచుకున్న సమయం, స్వరం ఇతర కారకాలన్నీ మన సంభాషణలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. కావున ప్రేమను వ్యక్తపరచడానికి కావలసిన ప్రవర్తనను, స్పష్టంగా సంభాషించగలిగే శైలిని నేర్చుకోవాలి.

నీ అమూల్యమైన సమయాన్ని ఎదుటి వ్యక్తి కొరకు కేటాయించి ఆమె లేక అతడు చెప్పే విషయాన్ని చివరి వరకు ఓర్పు, సహనంతో వినాలి. ఈ విధంగా 'వినడం' అనే మంచి ప్రవర్తన స్వతంత్ర కృషితో అలవడుతుంది. ఎదుటి వ్యక్తి చెప్పే విషయాన్ని పరిపూర్తి అయింది అని నిర్ధారించుకున్న తరువాతనే ఒక సలహా లేదా సూచన ఇవ్వడానికి ముందడుగు వేయాలి. ఈ విధంగా వినాలంటే 'అంతరంగిక నిబద్ధత' అవసరం. అలా జరిగినపుడు ఏ విధమైన మానసిక లేదా ఉద్వేగపూరిత అలజడులు అడ్డురావు. చాలాసార్లు భార్య లేక భర్త తన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్న ఆశతో ఎదుటి వ్యక్తితో సంభాషిస్తారు. కాని నా బాధలుగాని, శ్రమలుగాని, కోపంగాని, భయంగాని, ఆశగాని, కలలుగాని ఏదైన లోలోపల దాగుకొన్న భావాన్ని ఎదుటి వ్యక్తికి చెప్పుకుంటే చాలు అనుకుంటారు. చాలాసార్లు అతడు నేను చెప్పే విషయాన్ని వినడు, వింటున్నప్పటికి మరొక పని చేసుకుంటాడు, నేను ఆమెతో మాట్లాడుతున్న కాని నేను ముగించే వరకు ఆమె వేచియుండలేకపోతుంది లేదా మాట్లాడుతుంటే ఆ అంశాన్ని మళ్లించి సంభాషణ ముగించ ప్రయత్నిస్తుంది లాంటి వాక్యాలు వింటూనే ఉంటాము.

ప్రతి వ్యక్తికి జీవించే, తనదైన రీతిలో ఆలోచించే, సంతోషంగా జీవించే హక్కులు కలవు. ఎదుటి వ్యక్తికి నిజమైన విలువను గౌరవాన్ని ఇవ్వాలి. ఎందుకన ప్రతి వ్యక్తి తన అనుభవము మరియు ఇతర మార్గాలు ఎంతో కొంత తోడ్పడును. కావున తన సహకారినిలో ఉన్న సత్యాన్ని స్వీకరించడానికి ప్రయత్నించాలేగాని, కించపరచకూడదు. మనం ఎదుటివారి స్థానంలో నిలబడి వారి హృదయాలలోకి ప్రవేశించి చూస్తే వారి భావాలు మనకు విదితమగును, అప్పుడు సంభాషణ ముందుకు సాగడానికి మార్గమేర్పడును.

భార్య, భర్తలు వ్యక్తిగత ఆలోచనలు, విధి విధానాలతో బంధింపబడక, విశాల దృక్పధం కలిగి ఒకరికొకరు సహకరించుకుంటూ 'భిన్నత్వంలో ఏకత్వం' అన్నట్లు ఉండాలి. ఒకరిలో ఉన్న తారతమ్యాలను మరొకరు గౌరవిస్తూ, ప్రోత్సహిస్తూ జీవించినపుడు ఐక్యత బలపడును అపుడు సంతోషంగా జీవితం సాగును. అతడు లేక ఆమె 'ఈ విధంగానే ఉండాలి' లేక ఇలాగే చేయాలి' అనే ప్రవర్తన మార్చుకోవాలి. కఠిన సమస్యలు పుట్టుకొచ్చినపుడు చాలా మృధువుగా పరిష్కరించాలి. ఎదుటి

వ్యక్తిని గాయపరచకుండా మాట్లాడటం చాలా ముఖ్యం. అందుకు అనువైన మంచి పదాలను వాడాలి. ఎదుటి వ్యక్తిపై పెత్తనం లేదా అధికారం చెలాయించాలి అనే ప్రవర్తన. ఆ విధమైన స్వరం వాడితే గాయపరచినవారమవుతాం. భార్యాభర్తల మధ్య గొడవలు రావడానికి ఏదో పెద్ద పెద్ద సమస్యలు కారణం కాదు. అవన్నీ చిన్న చిన్న సమస్యలే. మనం చెప్పే విధానం, ప్రవర్తన, స్థితిగతులు తదితర కారణాలే విభజనకు కారణమవును.

ఎదుటి వ్యక్తి పట్ల అనురాగము, ఆదరణ కలిగి ఉండాలి. ప్రేమ సకల సమస్యలను పటాపంచలు చేయుచు, మనం ఎవరినైన ప్రేమించినపుడు లేదా ప్రేమించబడినపుడు ఎదుటి వ్యక్తికి చెప్పాలనుకున్న విషయం మరింత సుస్పష్టమగును. ఎదుటి వ్యక్తిని చూసి భయపడితే మనం బలహీనులమని అర్థం కావున ఈ బలహీనత అధిగమించాలి. మనం విలువలు, నమ్మకం, తదితర మంచి కారకాలపై అధారపడి నిలబడాలేకాని ఈ పోరాటంలో 'నేనే నెగ్గాలి' లేక (చెడు ఉన్నప్పటికి) మంచి వ్యక్తిగా అందరూ గుర్తించాలి అన్నట్లుగా ఉండకూడదు.

నిజమైన, అర్హత కలిగిన సంభాషణ కొరకు మనకు ఏదో కొంత అవసరం అని తెలుసుకోవాలి. ఈ విధమైన విలువైన సంభాషణ కేవలం అంతరంగిక సంపద వలన వచ్చును. ప్రార్థన, మంచి పుస్తక పఠనం, వ్యక్తిగత ధ్యానం, చుట్టు ఉన్న ప్రపంచం పట్ల విశాల దృక్పథం వంటి వాటి ద్వారా అంతరంగిక సంపద అధికమగును. అలాకాని పక్షములో సంభాషణలు చిరాకునకు, అనేక సమస్యలకు దారితీస్తాయి. భర్తగాని, భార్యగాని, ఏ ఒక్కరైనా ఈ మార్గంలో కష్టపడకపోతే ఎదుటి వ్యక్తితో సంబంధం బలహీనపడి కుటుంబ జీవితం కష్టతరంగా మారుతుంది. అంతేకాక సంభాషణకు తావులేకుండా పోవును.

దాంపత్య జీవితంలోని ప్రేమ మనిషిలో ఉన్న మంచితనాన్ని హత్తుకునేలా చేస్తూ శారీరకంగా, మానసిక భావాలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్తూ స్నేహపూర్వకంగా జీవించేలా చేయునని ద్వితీయ వాటికన్ మహాసభ బోధిస్తుంది. కావున నిజమైన సంతృప్తి మరియు దృఢమైన ఆశలేని ప్రేమ, దైవ మానవుల ఐక్యతను కనబరచలేదు.

## భావోద్వేగాల ప్రపంచం

కోరికలు, భావాలు, ఉద్వేగాలు మొదలగువాటిని మన పూర్వీకులు అమోఘమైన వాంఛగా అభివర్ణించారు. వీటన్నింటికి వివాహ జీవితంలో చాలా ప్రాధాన్యత ఉంది. అవి మనిషి జీవితంలో ఓ భాగంగా మారడమే కాక ఎవరైన ఎదురుపడినపుడు అవి చలించడం జరుగును. ఇది ప్రతి జీవి యొక్క లక్షణం. భయము, ఆందోళన, సంతోషము, బాధ, ఆనందము, విచారము తదితర సూచనలన్ని మనిషి స్పందనను తెలియజేస్తాయి. ఇవి మనిషి మనుగడను బహిర్గతం చేస్తాయి. భూమిమీద జీవించు మనిషి వీటిని కలిగి పయనిస్తాడు.

నిజమైన మానవుడిగా, క్రీస్తు భావోద్వేగాలను ప్రదర్శించాడు. యెరూషలేము చేత ఆయన నిరాకరింపబడడం (మత్తయి (23:27) అది ఆయనకు కంట తడి పెట్టించెను (లూకా 19:41). పొరుగు వారి శ్రమలను చూసి ఎంతో స్పందించెను (మార్కు 6:34). అందుకు ఆయన హృదయం ద్రవించెను (యోహాను 11:33). తన ప్రియమైన స్నేహితుడు మరణించగా కన్నీరు కార్చెను (యోహాను 11:35) ఇవన్నీ ఆయనలోని మానవ హృదయం పొరుగువారి కొరకు ఎంత విశాలంగా తపిస్తుందో చాలా స్పష్టంగా తెలియజేస్తుంది.

ఏదైన ఒక భావోద్వేగం మనలో కలిగినంత మాత్రమున అది చెడు లేక మంచి అని చెప్పలేము. దానంతట అది పాపము కాదు, తప్పు పట్టరాదు. రేకెత్తిన భావోద్వేగం పైన ఆధారపడి చేసే క్రియ ద్వారా అది నైతికంగా మంచి లేక చెడు అని చెప్పగలము. మన చెడు కార్యాలన్నీ తీసుకునే నిర్ణయాల పైన ఆధారపడి ఉంటాయి. అదే విధంగా ఒకవేళ నేను ఎవరికైన బాగా ఆకర్షితుడనైనంత మాత్రాన అది మంచి అనుకోకూడదు. ఎందుకనగా నేను ఆకర్షింపబడడం వలన ఎదుటి వ్యక్తిని అధిగమించాలి అనే భావం కలిగితే నా స్వార్థాన్ని పోషించుకున్నట్లే. మనం 'మంచివాళ్లము' అనే భావం కలిగినంతమాత్రాన మేము మంచివాళ్లము అని దృఢంగా నమ్మడం ఒక భ్రమయే. చాలా మందికి అనురాగం, ఆదరణ లాంటివి పొందవలసిన

అవసరం ఎంతో ఉంది. కావున మేము మంచిగా అందరిని ప్రేమిస్తాము అనే రీతిలో పయనిస్తారు. కాని ఇతరుల జీవితాలలో సంతోషం నింపడంలో విఫలమవుతారు. ఆ సమయాలలో వారి వారి స్వార్థం కొరకు ప్రాకులాడడం వలన, హెచ్చింపుతనము కలిసి భావోద్వేగాలు మార్పు చెందుతాయి. ఈ విధానం ఖచ్చితంగా కుటుంబ జీవితం ఆరోగ్యంగా, సంతోషంగా సాగడానికి ఏ మాత్రం సహాయపడదు.

ఒకవేళ మనిషిలో ఉన్న తీవ్ర ఉద్వేగం అతడు స్వేచ్ఛతో చేసే క్రియకు తోడ్పడితే ఆ క్రియ వెనుక ఉన్న సంపూర్ణత వ్యక్తమవును. వివాహితుడు/వివాహిత భావోద్వేగాలు కుటుంబమునకు, ఐక్యజీవితానికి, 'దాంపత్య ప్రేమ' ఎదుగుదలకు తోడ్పడును. ఒక కుటుంబంలో ఉన్న సభ్యులు ఇష్టానుసారంగా కాకుండా ఒకరి స్వేచ్ఛను ఒకరు ప్రోత్సహిస్తూ, అందరికి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటూ అందరి ప్రయోజనం కొరకు కృషి జరిగినపుడు ఆ కుటుంబం అభివృద్ధి పథంలో ఉంది అని, పరిణతి చెందిన కుటుంబం అని పిలుస్తాము.

## దేవుడు తన బిడ్డల సంతోషాన్ని ప్రేమిస్తాడు

పైన పేర్కొనబడిన జీవితం సాధ్యపడాలంటే త్యాగం అనే సుగుణం కలిగి ఉండాలి. మానవ సంతోషానికి వ్యతిరేకంగా పోతుందని కాబోలు అనేకమార్లు ఈ తిరుసభను తిరస్కరించడం జరిగింది. ఇటువంటి పరిస్థితిని 16వ బెనడిక్ట్ పాపుగారు క్లుప్తంగా ఈ మాటలలో పొందుపరుస్తున్నారు. తిరుసభలో ఉన్న ఆజ్ఞలు తదితర నిషేధ చట్టాలు జీవితంలో అతి విలువైన దానిని చేదైన దానిగా మార్చడం లేదా? అంతేకాక దేవుడే సృష్టించిన ఈ సృష్టిలో ఆయన ఒసగిన ఆనందానికి తిరుసభ అడ్డుకట్ట వేయుటలేదా? ఈ ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ క్రైస్తవత్వంలో రకరకాలైన వైరాగ్యజీవిత విధానాలు ఉన్నప్పటికీ, పవిత్ర గ్రంథానికి అనుగుణంగా దానిపై ఆధారపడిన శ్రీసభ అధికారిక బోధన ఎల్లపుడు 'వాంఛలను' తిరస్కరించదు కాని అందులో ఉన్న వినాశకర స్వభావంపై పోరాటం చేయమని వెల్లడి చేస్తుంది. ఎందుకనగా నాశనరూపం కలిగి ఈ ఉద్రేకాలు దైవత్వాన్ని దిగజారుస్తూ, మానవత్వాన్ని ముక్కలు చేస్తుంది.

భావోద్వేగం, మనిషి స్వభావ సంపత్తిని సరైన విధానంలో వినియోగించుటకు కొంత శిక్షణ అవసరం. అందుకు కొన్నిసార్లు కొన్ని నిర్ణీత ప్రాంతాలను కేటాయించడం మేలు. మనిషికి కలిగిన ఏదైన ఒక కోరిక లేదా భావోద్వేగం ఎక్కువైనా దానిపై సరైన పట్టు లేదా అవగాహన లేకపోయినా, అది కుటుంబ జీవితానికి హాని కలిగించు అవకాశం లేకపోలేదు. ఎప్పుడైతే ఇతరుల శ్రేయస్సు కొరకు, తన అభివృద్ధి కొరకు పాటుపడుతూ ముందుకు సాగుతాడో అపుడు మానవుడు ఖచ్చితంగా తన భావోద్వేగాలను సరైన క్రమంలో ఉంచగలడు, వినియోగించగలడు. ఈ విధమైన ప్రవర్తన కుటుంబ జీవితంలో వ్యక్తుల మధ్య సంబంధమును పెంచుతుంది.

దు:ఖం నుండి విముక్తి కలగాలంటే 'కోరిక' అనేది నిర్మూలించబడాలి అని కొన్ని మత సిద్ధాంతాలు తెలియజేస్తున్నాయి. అయినా మన సంతోషాన్ని దేవుడు ప్రేమిస్తాడు, ఆస్వాదిస్తాడు అని మనం దృఢంగా నమ్ముతాం. "దేవుడు మనకు ధారాళముగా దయచేయునది మనము సంతోషంగా జీవించుటకు" (1 తిమోతి 6:17). కనుక ఆయన మనలను కలుగజేసెను. 'నిన్ను నీవు సంతోషపెట్టుకొనుము, సంతోష దినమును కోల్పోకుము' (సీరా 14:11-14) అని దేవుడు పలికే పలుకులకు మనము సంతోషపడాలి. 'దేవుడు ఒసగిన సంతోషమునకు ఆనందపడుడు' (ద్వితియో 7:14) అనే వాక్యాన్ని దంపతులు స్వీకరించినపుడు దేవుని చిత్తానికి తగ్గట్టుగా స్పందిస్తారు. ముఖ్యమైన విషయం ఏమనగ పరస్పర ప్రేమ కలిగిన ఈ జీవితంలో ఆనందం రకరకాలుగా వివిధ సమయాలలో, వ్యక్తపరచబడును అని తెలుసుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలి. ఈ కోణంలో తూర్పు దేశ పండితులను అభినందించాలి. ఎందుకనగా మన మనస్సాక్షిని (అంతరంగము, అంతరాత్మను) మాయం చేసే ఏదో ఓ చిన్న అనుభూతికి లోనుకాకుండా విశాల దృక్పథం కలిగి ఉండమని బోధిస్తారు. విశాల దృక్పథం కలిగి ఉండడం అనగా కోరికను తిరస్కరించడం నశింపజేయడం కాదు. వాటికి పరిపూర్ణత ఇవ్వడం.

## ప్రేమలోని లైంగికత కోణం

దేవుడే లైంగికతను సృష్టించెను. దేవుడు మానవులకు ఒసగిన ఓ అద్భుత వరం లైంగికత. ఈ వరమును తరముల వారు అనుభవించాలన్నా, సక్రమంగా

ముందుకు సాగాలంటే అమూల్యమైన లైంగికత దిగజారకుండా పోరాడాలి. "మానవ లైంగికత విలువకు తిరుసభ భోదన వ్యతిరేకం" అను వాదనను పునీత 2వ జాన్‌పాల్ పాపుగారు కొట్టిపారేశారు. ఎందుకనగా సృష్టి కొనసాగింపబడడానికి లైంగికత అవసరం. 'లైంగిక కోరిక'ను చిన్నచూపు చూడవలసిన పనిలేదు. దీని అవసరత ఏమిటి అనే ప్రశ్నలు రేకెత్తే తావు లేనే లేదు.

భావోద్వేగాలు మరియు లైంగికతకు సంబంధించి తీసుకునే తర్ఫీదు వలన స్వచ్ఛందంగా వచ్చెడి లైంగిక ప్రేమ తగ్గుగుతంది అనుకుని భయపడే వారికి పునీత జాన్‌పాల్ పాపుగారు ఈ విధంగా చెబుతున్నారు. "ప్రతి మనిషి తన సంబంధాలలో పరిపూర్ణత, పరిపక్వత కలిగి ఉండాలి" అయితే మనిషి హృదయంలోని ప్రేరేపణలను కనుగొనడం వలన అంచెలంచెలుగా పొందే ఫలమే పరిపక్వత'. ఈ విధమైన జీవితం కొరకు మనిషి కొంత క్రమశిక్షణ, నిలకడ కలిగి తన (ఆమె/అతని) శరీరం యొక్క విలువను తెలుసుకోడానికి కృషి చేయాలి. లైంగికత అనగా ఏవో కొన్ని కోరికలు తీర్చుకొను క్రియ కాదు. చాలా ఉన్నతమైంది. ఒకరికొరకు ఇచ్చిపుచ్చుకొనే ప్రేమ భాష. అతి పవిత్రమైనది. ఈ సమయంలో మరొక విధంగా మానవ హృదయం కూడా పాలుపంచుకొనును. ఈ సందర్భంలో మానవుడు వ్యక్తపరచే లైంగికతగా వాంఛగా కనిపిస్తుంది. ఇది దేహ విలువను, దేవుడు ఒసగిన వరము యొక్క ప్రాముఖ్యతను కనుగొనడానికి తోడ్పడును. మానవ శరీర విలువను గూర్చి పునీత రెండవ జాన్‌పాల్ గారు వ్రాసిన దైవశాస్త్రంలో "లైంగిక తారతమ్యాలు కేవలం ఫలభరితము కొరకు లేక సృష్టి కొనసాగింపు కొరకు మాత్రమే కాక ప్రేమ వ్యక్తపరచు సామర్థ్యము గల వరము. ఈ ప్రేమనందు మనిషి ఓ బహుమానంగా మారును. ఆరోగ్యకరమైన లైంగిక కోరిక ఆశ్చర్యచకితులను చేస్తుంది.

ప్రేమలో ఉన్న లైంగికత కోణాన్ని అనుమతించదగిన చెడుగానో లేక కుటుంబ సంతోషం కోసం సహించే భారంగానో ఎప్పుడూ అనుకోకూడదు. భార్యాభర్తల మధ్య ఉన్న ప్రేమను పరిపూర్ణం చేయడానికి భగవంతుడు ఇచ్చిన దానిని వరముగా భావించాలి. ఎదుటి వ్యక్తిపై ఉన్న గౌరవప్రదమైన ప్రేమ మనలో ఉన్న తీవ్ర కోరికను భస్మం చేయగా, స్వచ్ఛత కలిగిన హృదయంలో అద్భుతం చేయగల సామర్థ్యం వ్యక్తమగును. ఈ విధంగా నియమిత ఆనందమైనప్పటికి జీవితం మంచి, సంతోషం వైపు సాగుతుంది అని మనం భావించవచ్చు.

## హింస - బలత్కారం

లైంగికతలో ఉన్న మంచిని ఆధారంగా చేసుకుని, తర్వాత అంశాన్నంతటినీ స్పష్టంగా, వాస్తవరూపంగా పరిశీలించవచ్చు. చాలాసార్లు ఈ లైంగికత అనారోగ్యకరమైనదిగా మృగత్వం కలిగినదిగా మారుతుంది. అది మనిషి స్వార్థం, స్వార్థకోరికలు, సుఖం తీర్చుకోడానికి దారి తీస్తుంది. ప్రస్తుత ప్రపంచంలో 'వాడుకొని వదిలివేసెయ్' అనే మనస్తత్వం లైంగికతను పాడు చేస్తుంది. మనిషి కోరికలు తీరే వరకు అవతలి వ్యక్తి శరీరం ఒక వస్తువుగా, ఒక్కసారి కోరిక తీరిన తర్వాత ఆ వ్యక్తిని తిరస్కరించడం జరుగుతుంది. లైంగికతలోని పరిపూర్ణ అర్థం తెలియక చోటు చేసుకునే అనేక క్రియలు: ఎదుటి వ్యక్తిపై ఆధిపత్యం చేయడం, బంధాన్ని దుర్వినియోగపరచడం, లైంగిక ఇబ్బందులు, మానభంగం, బలత్కారం ఇలాంటి వాటిని చవిచూడనట్లుగా, పట్టించుకోకుండా ఉండవచ్చా? లేదా మన కోరికల కొరకు మనల్ని మనం దిగజార్చుకుంటూ, మానవ విలువలను ప్రక్కన పెట్టి, క్షణిక ఆనందం కొరకు ప్రాకులాడటం, ఈ విధంగా ప్రేమ కొరకైన పిలుపును విస్మరించడం అర్థవంతమైన జీవితమా?

మనకు తెలిసిన విధంగా కొన్నిసార్లు వివాహంలోనే లైంగికత కష్టాల సంద్రంగా, తారుమారు విధంగా మారుతుంది. కనుక భార్య లేక భర్త సంపూర్ణంగా ఒప్పుకొనకుండా, ఇష్టం లేకుండా బలవంతంగా ఈ లైంగిక క్రియ జరిపితే అది నిజమైన ప్రేమ కార్యం కాదు. అంతేకాదు భార్యాభర్తల మధ్య ఉన్న నైతిక క్రమము దెబ్బతినడం జరుగుతుంది. దేవుని చిత్తానుసారంగా భార్యాభర్తలు లైంగికంగా ఐక్యమయినపుడు అది నిజమైన మానవత్వం కలిగిన క్రియ అవుతుంది. కనుక ఈ విషయమున ఏ వ్యక్తియు తన సోదరునికి లేక సోదరికి హాని చేయరాదు' (1 తెస్స 4:6) అని పునీత పౌలుగారు చెబుతున్నారు. ఆ కాలంనాటి ఆచారాలను దృష్టిలో ఉంచుకొని పునీత పౌలుగారి ప్రకారం స్త్రీలు ఎప్పుడు భర్తలకు అణుకువగా నడుచుకోవాలి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని లైంగికత కొన్ని సమయాలలో వాయిదా వేయమని మిగిలిన సమయాలలో సామాన్య వైవాహిక సంబంధం కలిసి ఉండుడు (1 కొరింతీ 7:5) అని పునీత పౌలుగారు తెలియజేస్తున్నారు.

పునీత జాన్ పౌల్ పాపుగారు చాలా జాగ్రత్తగా చిన్న హెచ్చరికగా చేసారు. కొన్నిసార్లు దంపతుల వైవాహిక జీవితంలో సంతృప్తి నొందని స్థితి వలన

భయపడవచ్చు. ఐక్యంగా జీవించవలసిన వారి మధ్య కొన్ని తారతమ్యాల వలన విభేదాలు రావచ్చు. ఒక్కొక్కరు ఒక్కొక్క వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారు. ఇచ్చి పుచ్చుకొనే మనస్తత్వం బదులుగా ఆధిక్యం చెలాయించాలి అనే ఆలోచన వచ్చినపుడు (కొరవడినపుడు) పరస్పర సంబంధం పోతుంది. ఇతరులపై ఆధిపత్యం చేయువారు వ్యక్తిత్వాన్నే కోల్పోతారు. చివరిగా తమ శరీరాలతో తమకు తాము గుర్తుంచుకోలేని స్థితి ఏర్పడుతుంది. ఎందుకనగా వారు లైంగికతలో ఉన్న అంతరార్ధాన్ని త్రోసివేసారు. లైంగికతను తప్పించుకోవటానికి ఓ మార్గం వెదకి, లైంగిక ఐక్యతలో ఉన్న సౌందర్యాన్ని చేజార్చుకునే స్థితికి దిగజారుతారు.

ఏ రకమైన లైంగిక విధేయతా విధానమైనా నిరాకరించబడాలి. అనగా "భార్యలారా మీ భర్తలకు విధేయులు కండు" (ఎఫెసీ 5:22). అనే పునీత పౌలు గారు చెబుతున్న మాటలను వక్రీకరించి చెప్పే బోధనలను తిరస్కరించాలి. పునీత పౌలుగారు చెప్పిన ఈ మాటలు ఆనాటి ఆచారాలకు అద్దం పట్టే విధంగా ఉన్నాయి. కాని మన ఉద్దేశ్యం ఆచారాలతో సంబంధం ఏర్పరచుకోవడానికి కాదు, అయితే ఆ వాక్యం తెలియజేసే అంతరార్ధాన్ని గ్రహించాలి. పునీత జాన్ పాల్ పాపుగారు: "ప్రేమ ప్రతీ అర్ధరహిత విధేయతను బహిష్కరిస్తుంది, లేని పక్షాన భార్యభర్తకు ఓ బానిసగా మారుతుంది. భార్యాభర్తలు కలిసి నెలకొల్పవలసిన ఐక్యబంధం (సంఘం) ఒకరికొకరు పరస్పరం చేసుకునే త్యాగంవలన ఏర్పడును. అందుచేతనే భర్తలు తమ శరీరాన్ని ప్రేమించిన విధముగానే భార్యలను ప్రేమింపుడు (ఎఫెసీ 5:21) అను వాక్యము స్వార్ధపు ఆలోచనలను విడనాడి ఇతరుల శ్రేయస్సు కొరకు శ్రమించమని సూచిస్తుంది. ఇది మనము ఎన్నుకొన్న జీవన విధానం ఇది అంకితభావం, గౌరవం, ఆదరణ మొదలగు విలువల ద్వారా బహిర్గతమవును. వైవాహిక జీవితంలో స్నేహపూర్వకంగా జీవించేలా లైంగికత తోడ్పడును. దాంపత్య సంపూర్ణత కొరకై లైంగికత సహకరించును.

లైంగికతలో రకరకాల అపార్ధములు లేదా ఇతర సమస్యలన్నీ లైంగికతను తక్కువ చేయడం లేక తిరస్కరించే విధంగా ప్రతి వ్యక్తి మారకుండా జాగ్రత్త పడాలి. ఆదర్శవంతమైన వివాహ జీవితం జీవించేవారు త్యాగపూరితులై తమ స్వలాభాలను విడనాడుతూ అవతలివారి ప్రయోజనాలకై పాటుబడతారు. నిజమైన

ప్రేమను ఇచ్చేవారు అదే రీతిలో తమ వారి నుండి ఆశిస్తారు. అదే రకరకాలు ఉండవచ్చు. తమ అవసరాలు తీర్చుటలో మంచి మనస్సుతో, కృతజ్ఞతా భావంతో ఆహ్వానించడం, శారీరకంగా కౌగిలించుకొనడం, ముద్దు పెట్టుకోవడం, లైంగిక క్రియలో పాల్గొనడం తదితర వాటిని ప్రేమను పంచే వ్యక్తి తన సహచరుని/ సహచరిని నుండి ఆశించడం నిజమైన ప్రేమకు అవసరం.

## వివాహము మరియు బ్రహ్మచర్యం/కన్యాత్వం

శ్రీసభలోను, సమాజంలోను చాలామంది వ్యక్తులు వివాహం చేసికొనక కన్యాత్వములో జీవిస్తూ అటు కుటుంబాలకు, ఇటు శ్రీసభకు తమదైన రీతిలో సేవలను అందిస్తున్నారు. దురదృష్టవశాత్తు వారి యొక్క కృషికి తగిన గుర్తింపు మరియు వారి నైపుణ్య ఉదార స్వభావమునకు, బుద్ధిపూర్వక పనికి సరియైన విధంగా స్పందన లేకపోవటం వలన వారు ఏకాకులుగా తమను భావించుకుంటు న్నారు. పరిస్థితి ఏదైనా గాని వారు తమ జీవితాలను పొరుగువారి కోసం, కుటుంబ, శ్రీసభ మరియు సమాజం కోసం తమను తామే అంకితభావంతో అర్పించు కుంటున్నారు.

కన్యాత్వము అనేది స్వచ్ఛమైన ప్రేమకు ప్రతీక. ఈ సుగుణం రానున్న పరలోక రాజ్యమునకు, మన పట్ల ఉండవలసిన సంపూర్ణ భక్తిని సువార్తకు దారి చూపుతుంది. ఈ గుణం పరలోక రాజ్యమునకు చిహ్నం అనగా పరలోకంలో వివాహాలు, దీని సంబంధాలు ఉండవు అని తెలియజేస్తుంది. పునీత పౌలుగారు ఈ కన్యాత్వం గురించి తన వ్యక్తిగత ఉద్దేశం తెలుపుతూ అందరు క్రీస్తు వలె ఉండాలని తెలియజేస్తున్నాడు. అందరికి వివిధ వరాల అనుగ్రహం బట్టి జీవించాలని పిలుపునిస్తున్నాడు. పౌలుగారి అభిప్రాయాలను ఉద్దేశించి పునీత జాన్ పౌలు పాపుగారు ఈ జీవితంలో ఎవరు ఎక్కువ తక్కువ కాదు అందరు సమానులే అని వెల్లడించారు.

కన్యాత్వపు జీవితం వలన వివాహం మీద ఆసక్తి తగ్గిపోతుంది అని కాదు. సువార్త ప్రకటనలో మరింత ఉదారంగా పాల్గొనవచ్చును. అందరు పవిత్రులుగా జీవించడానికి ఇది దోహదపడుతుంది. వివాహ అంతస్తులో ప్రవేశించిన వారికి ఈ కన్యాత్వము అనేది సంపూర్ణంగా ప్రేమించుకొనుటకు ఉపయోగపడుతుంది.

వారి మధ్య ఐక్యతను త్రిత్వైక దేవుని మధ్య ఐక్యతను తెలియజేస్తుంది. కుటుంబ జీవితం క్రీస్తు ప్రభువుకు ఒక చిహ్నంగా ఉంది. ఇది దేవుని యొక్క అత్యంత దగ్గర సంబంధంను మానవుని యెడల చూపుతుంది. ముఖ్యంగా క్రీస్తు మానవ అవతారం, మరణ, ఉత్థానాలను సూచిస్తుంది. భార్యాభర్తలు ఏ విధంగా అయితే ఒక శరీరంగా మరణం వరకు ఉంటారో అదే విధంగా రహస్యంగా కూడా రానున్న మరణానంతర పునరుత్థాన క్రీస్తుకు గుర్తుగా ఉంటుంది. కన్యాత్వం మరియు వివాహం వివిధ కోణాల్లో చూపే ప్రేమ మార్గం. బ్రహ్మచర్యం అనేది ఒకరి మీద ఆధారపడుతుంది. బ్రహ్మచారిగా ఎవడైనా పని చేయవచ్చు, డబ్బు ఏ విధంగానైనా ఖర్చు చేయవచ్చు. కాని వివాహ దంపతులు ఇద్దరికి ఒక అంగీకారం ఉండాలి. ఈ రెండు భాగాలకు చెందినవారు, దేవుని ఔదార్యమును, విశ్వసనీయతను నేర్చుకుంటూ ఇతరులకు సహాయపడాలి. వివాహ జీవితంలో తమ భాగస్వామి అందంగా లేకపోయినా, వ్యాధికి గురియైనప్పటికి, ఆ వ్యక్తి క్రీస్తుకు అర్పిస్తూ చివరి వరకు అనగా మరణం వరకు అతనికి/ఆమెకు విశ్వసనీయంగా ఉండాలి. అలాంటప్పుడే ప్రేమ మహత్యం వెలువడుతుంది.

ఉదాహరణకు చాలా కుటుంబాల్లో తల్లిదండ్రులు క్రీస్తువలె పిల్లలను ప్రేమిస్తున్నారు. పిల్లలు వారిని ఇబ్బందిపెట్టినా, తల్లిదండ్రులకు కృతజ్ఞులుగా ఉండకపోయినగాని వారు మాత్రం త్యాగపూరిత జీవితంను చూపుతారు. నేటి కాలంలో లౌకికత్వం వలన అనేక అనర్థాలకు ప్రజలు గురి అవుతున్నారు. అందువలన ప్రజలు ఎప్పటికప్పుడు వారి బంధాన్ని నూత్నీకరించుకోవాలి.

## ప్రేమలోని మార్పు

సత్సంబంధాలను తరచుగా నూత్నీకరించుకోవాలి, అందువలన మొదటిలో వాగ్దానాలు గుర్తుంటాయి. భాగస్వామికి లైంగిక కోరిక తగ్గి, తగిన విధంగా ప్రేమను చూపించవచ్చు. ఈ విధంగా ఉండడము కూడా ప్రేమే. చివరి వరకు ప్రేమగా ఉండవచ్చును. ప్రేమ అనేది అన్ని భావనలకు మించి గొప్పగా ఉంటుంది. ఎన్ని ఇబ్బందులు వచ్చినగాని చివరి వరకు ఒకటిగా ఉండేది ప్రేమ మాత్రమే.

కాలక్రమేణ మనిషి శరీరంలో మార్పులు వచ్చినగాని ప్రేమ తగ్గదు. ఎందుకంటే వ్యక్తి ప్రేమించేది వ్యక్తినిగాని శరీరాన్ని మాత్రమే కాదు. వయస్సు నశించినా హృదయం నశించదు కాబట్టి. భాగస్వామి మాత్రమే ఇతరుల వలె బాహ్యరూపంకాక, అంతర హృదయాన్ని చూచును. అందువలన చివరి వరకు విశ్వాసపాత్రంగా ఉండగలరు. దీనికి కారణం నిర్ణయము. పవిత్రాత్మ ప్రేరణ వలన వారు దినదినాభివృద్ధి చెందుతూ అసాధారణ ప్రేమతో ప్రతి సమయంలోను సమస్యను ఎదుర్కొంటూ ముందుకు వెళ్లడానికి ప్రేమ సహకరిస్తుంది.

❊ ❊ ❊ ❊

# 5. ఫలభరితమైన ప్రేమ

**- బ్రదర్ కల్లేపల్లి ఏసుబాబు**



ప్రేమ ఎల్లప్పుడు జీవితాన్ని ఇస్తుంది. వివాహ ప్రేమ, వారితోనే ముగిసిపోదు... భార్యాభర్తల ప్రేమ లైంగిక వ్యామోహాలపై కాక, వారు పిల్లల్ని కనాలనే దైవప్రేరణతో వారు ఒకరిపై మరియొకరు ప్రేమను చూపిస్తుంటారు. ఎందుకనగా పిల్లలు వారి ప్రేమకు ప్రతిరూపాలు, వివాహపు జీవితానికి చిహ్నం వివాహపు బంధానికి కారణం ఈ సంతానమే. అందుకే ఈ ప్రేమ విడదీయరాని బంధమని పిలువబడుతుంది. అదే విధంగా ఈ ప్రేమే వారిని తల్లిదండ్రులుగా చేస్తుంది.

## నూతన జీవితానికి ఆహ్వానము

కుటుంబము అనేది చాల ముఖ్యమైనది, ఎందుకన ఈ కుటుంబంలోనే నూతన జీవం పుట్టడమేకాక ఈ నూతన సంతాన ఫలం దేవుని బహుమతిగా ఆహ్వానించబడింది. ప్రతి క్రొత్త జీవితం, "ప్రేమలో ఉన్న ఉచిత మాధుర్యాన్ని ప్రోత్సాహిస్తుంది." అందుకే ఈ ప్రేమ మనలను ఆశ్చర్య చకితులను చేయదు. ప్రేమించడం అనేది చాల అపురూపమైనది : అందుకే పిల్లలు పుట్టకమునుపే వారిని తల్లిదండ్రులు ప్రేమిస్తారు. పిల్లలు మన కోసం ఏమి చెయ్యకుండానే మనం పిల్లల్ని ప్రేమిస్తాం. కాని మరికొన్ని సందర్భాలలో, చాలమంది పిల్లలు వారి యొక్క మొట్టమొదటి గమనములోనే, కళ్ళు తెరవక ముందే కాటికి పోతున్నారు, విద్యను అభ్యసించక ముందే వీధిబాలలు అవుతున్నారు. పురిటిలోనే పుట్టగతులు లేకుండా పోతున్నారు. లింగ వివక్షచేత తృణీకరించబడుతున్నారు. ఆ పిల్లల బ్రతుకు, వారి భవిష్యత్తు బలహీనంగా మారిపోతుంది. ఇలాంటివి చాల మేరకు వివాహరహిత

సంబంధాల ద్వారా, వివాహేతర సంబంధాల్లో జరుగుతున్నాయి. వారి కామసంతోషాలకు ఎంతోమంది పిల్లలు బలి అవుతున్నారు. పుట్టక ముందే పున్నమి చేరుతున్నారు. ఇటువంటి దుర్భల సంఘటన సమయాలలో మనం ఏవిధంగా మానవ హక్కులపై, పిల్లలహక్కులపై, వారి భవిష్యత్తుపై ఏ విధమైన మార్పులు తీసుకురాగలమా! అని సమాలోచనలు చేయాలి. వారికి బంగారు బవిష్యత్తును దయచేయాలి. పెద్దలమైన మనం చేసే తప్పులకు పిల్లలను శిక్షిస్తే ఏలా? అనివార్య కారణాల వలన ఒక శిశువు ఈ భువిపై జీవం పోసుకుంటే, ఆ బిడ్డ యొక్క తల్లిదండ్రులు మరియు ఇతర కుటుంబ సభ్యులు, ఆ శిశువుని దేవుని యొక్క బహుమానంగా స్వీకరించాలి, బిడ్డ ఎదుగుదలకు ఇష్టంగా కృషి చేయాలి. ఆ శిశువును భారంగా కాకుండా ప్రేమగా, మమకారంతో కుటుంబంలోనికి స్వీకరించాలి. ఎందుకనగా ఏ శిశువు తప్పుడుగా పుట్టినవాడని, మనుష్యుల మూర్ఖత్వమే, కామేచ్ఛే నా జన్మకు కారణం అనే భావోద్వేగాలకు గురికాకుండ ఉంటాడనికి కుటుంబంలో ఒకనిగా చేర్చుకోవాలి. ఇలా అందరు చేస్తే ఈ సమాజంలో అనాధలు అనేవారు, వలవేసి వెదకిన దొరకరు. ఈ విధంగా భార్యాభర్తలు వారి యొక్క పనులు సక్రమంగా నేరవేర్చడం ద్వారా వారు నిత్యరాజ్యనికి వారసులవుతారు. ఇంకా చూస్తే, తల్లిదండ్రులు ఏ పేరు అయితే పెడతారో అదే పేరు దైవరాజ్యంలో పిలువబడుతుంది. అంటే దేవుడు తల్లిదండ్రులు ఆ స్వేచ్ఛను దయచేశారు.

దైవ ప్రజల సంతోషాలేమనగా పెద్దపెద్ద కుటుంబములుగా జీవించడమే. ఈ సందర్భంలో పునీత రెండో జాన్‌పాల్ గారు ఈ విధంగా ప్రస్తావించారు, అదేమనగా భాధ్యతాయుతమైన తల్లిదండ్రులు అంటే ముగింపు లేకుండా పిల్లల్ని కంటూ ఉండడం, పిల్లల్ని పెంచడానికి సరిపోవునంత జ్ఞానం లేకపోవడం కాదుగాని, భార్యభర్తలుగా ఒకరినొకరు అర్ధం చేసుకుంటూ, శక్తిసామర్థ్యలను పెంచుకుంటూ, ఇహలోక జీవిత నిజనిజాలు తెలుసుకుంటూ, వారున్న స్థానాన్ని గుర్తించి వారి యొక్క కోరికలు న్యాయబద్ధంగా ఉండేల చేసుకోవడమే.

## ప్రేమ మరియు గర్భధారణ

గర్భధారణ సమయము చాల కష్టమైన కాలం కాని అతి అద్భుమైన కాలం. ఎందుకనగా, ఒక స్త్రీ నూతన జీవాన్ని భూమిపైకి తీసుకొనిరావడానికి

దేవునితో జత కలుస్తుంది. స్త్రీ శరీర తత్వం ఫలవంతమైనది. సృజించే శక్తి సామర్థ్యాలతో కూడినది తద్వార తన భర్తతో ప్రేమలో ఏకమై సృజించే ప్రక్రియలో దేవునితో మమేకమౌతుంది. కావున మాతృత్వం అన్నింటిలోను చాల గొప్పది. ప్రతి వివాహిత, "దేవుడు సృష్టించే పరమరహస్యంలో తన పాత్ర వహిస్తుంది." దీని ద్వారానే సృష్టించే దైవశక్తి రోజురోజుకి క్రొత్త దనాన్ని రూపుదిద్దుకుంటుంది. దీనిని మనం జన్మించే ప్రతి నూతన శిశువు ద్వారా గ్రహించవచ్చును. అందుకే కీర్తనకారుడు ఈ విధంగా అంటున్నాడు. "నాలోని ప్రతి అణువును నీవే సృజించితివి. మాతృ గర్భమున నన్ను రూపొందించితివి" (కీర్తన 139:3) తల్లిగర్భంలో పెరిగే ప్రతి బిడ్డ దేవుని ప్రణాళికలో నుండి ఉద్భవించినదే యిర్మియా గ్రంథంలో కూడ ఈ విధముగా ఉంది : "నిన్ను మాతృ గర్భమున రూపొందక మునుపే నేను నిన్ను ఎన్నుకొంటిని. నీవు పుట్టకమునుపే నిన్ను పవిత్రపరచితిని. నిన్ను జాతులకు ప్రవక్తగా నియమించితిని". (యిర్మియా 1:5) ప్రతి శిశువునకు దేవుని పవిత్ర హృదయంలో శాశ్వత స్థానముంది. ఎప్పుడైతే ఒక స్త్రీ తన ఉదరములో పెరుగుతున్న బిడ్డకు జన్మనిస్తుందో అప్పుడే దైవ కార్యం నేరవేరినట్లు అర్థం అవుతుంది.

గర్భము ధరించిన ప్రతి మహిళ దేవుడు తలపెట్టిన కార్యాన్ని నేరవేర్చాలని అనుక్షణం కలగంటుంది మరియు ఆ దైవ ప్రణాళికలో పాల్గొంటుంది. తొమ్మిది నెలలు తల్లిదండ్రులు వారికి పుట్టబోవు బిడ్డకోసం కలకంటు ఉంటారు. ఒక్కసారి గనుక ఈ కలల ప్రపంచం నుండి భార్యాభర్తలు వేరుపర్చబడితే, పిల్లలు సక్రమంగా పెరగరు, ప్రేమను పొందలేరు, వారి జీవన విధానం నాశనమైపోతుంది. క్రైస్తవుల కలల ప్రపంచంలో జ్ఞానస్నానం కూడ ఒకటి. ఈ జ్ఞానస్నానం ద్వారానే పుట్టిన బిడ్డను క్రీస్తు సంరక్షణలోనికి అప్పగిస్తున్నాం.

ఈనాటి అభివృద్ధి చెందిన శాస్త్రీయ విజ్ఞాన పరిజ్ఞానం ద్వారా గర్భము గురించి అనేక విషయాలను తెలుసుకొనగలుగుతున్నాం; అవేమనగా : పుట్టబోయేది బాలుడా లేదా బాలిక అనీ, తల ఏ రంగులో ఉన్నది అనీ, పుట్టుకతోనే ఏయే రోగాలతో పుడుతున్నాడనీ, ఏ కాలంలో ఏయే వ్యాధులకు గురవుతాడని ఈ కాలపు వైద్యులు ఆ శరీర తత్వాన్ని పరిశోధించి చెబుతున్నారు. అయితే బిడ్డ జన్మకు కారకుడైన దైవానికి ఈ వైద్యుని కంటే చాల ఎక్కువే తెలుసు. ఎందుకంటే దేవుడే

సర్వమునకు మూలం. కాబట్టి తల్లిదండ్రులు బిడ్డ యొక్క గుణగణాలు ఏ విధంగా ఉండాలో, ఏ రకమైన శిశువుని వారు కోరుచున్నారో, ఆ శిశువు యొక్క శరీరతత్వం మంచిగా చేయమని ఆ దేవాతి దేవుని అర్థించాలి. అనుసరించాలి, ప్రార్థించాలి. బిడ్డకు ఏమి అవసరమైతే ఉందో ఆ అవసరాలను తీర్చమని ప్రాథేయపడాలి. పిల్లల్ని కనడమే కాకుండా వారిని ప్రయోజకులను చేయవలసిన బాధ్యత కూడ తల్లిదండ్రులపైనే ఉంది. దేవుడు ఒక్కొక్క జన్మకోసం ఎదురుచూస్తూ ఉంటారు, పుట్టిన బిడ్డలను ఆదరించి తగిన అనుగ్రహ వరాలను ఉచితముగా దయచేస్తాడు. ఇలా దయచేసి ఆ శిశువును ఈ లోకానికి ఆహ్వానిస్తారు.

ఫ్రాన్సిస్ పాపుగారు కాబోయేతల్లులందరీనీ మిక్కిలి వినయంతో ఈ విధంగా బ్రతిమాలుచున్నారు. “మీర్లెప్పుడు సంతోషంగా ఉండండి మరియు మీకు కలిగిన మాతృత్వపు సంతోషం, ఇతర విషయాలు వలనదూరం కాకుండా చూసుకోండి. మీ శిశువే మీ సంతోషానికి కారణం మరియు అర్హుడు.”

ఒకవేళ ఇతరులు ఎవరైన మీ సంతోషాన్ని దూరం చేయడానికి లేనిపోనివి చెప్పినా, మిమ్మల్ని ప్రలోభాలకు లోను చేసినా, ఇబ్బందులకు గురిచేసినా, మిమ్ములను నిందలను అవమానాలకు గురిచేసినా గుర్తుంచుకోవాల్సిన ఒకేఒక్క విషయం : అది మీరు దేవుని సృష్టింలో భాగస్వామిగా కలసి పనిచేస్తున్నారన్నా సంతోషం మిమ్మల్ని అన్ని బాధల నుండి విముక్తులను చేసి నూతన జీవాన్ని ఈ లోకంలోనికి తేవడానికి సహకరిస్తుంది. స్త్రీ మూర్తులుగా బిడ్డలకు జన్మనివ్వడానికి సిద్ధపడండి. మరియు మరియతల్లి స్తోత్ర గీతములో చేరి మీరు కూడ ఈ విధంగా పాడండి. “నా హృదయము ప్రభువును స్తుతించుచున్నది. నా రక్షకుడైన దేవునియందు నా యాత్మ ఆనందించుచున్నది. ఏలయన సర్వశక్తిమంతుడు నా యెడల గొప్ప కార్యములు చేసెను. ఆయన నామము పవిత్రమైనది” (లూకా 1:46-48). మరియతల్లిలా మీరు కూడ ఈ అనుభూతిని పొందినప్పుడు ఎన్ని బాధలు వచ్చినా, ఇబ్బందులు ఎదురైనా, శ్రమలలో కుటుంబం అంతా సతమతమైనా ఇవేవి మీ సంతోషాన్ని మీ నుండి తొలగించలేవు. దేవుని అడగండి మీ కోరికలను తీర్చామని, మీ సంతోషాలను దీవించమని, తద్వారా మీ పిల్లలకు సంతోషాలను వార సత్వంగా ఇవ్వవచ్చును.

## తల్లిదండ్రుల ప్రేమ

పిల్లలు పుట్టినప్పటి నుండి వారు తల్లిదండ్రుల ప్రేమనుభూతులను పొందడం మొదలుపెడతారు. వారు ఏ విధంగా పెంచబడుతున్నారో, కాపాడబడుచున్నారో అన్నింటిని పిల్లలు గ్రహిస్తూనే ఉంటారు. మనం పిల్లల్ని ప్రేమిస్తున్నాము అని చెప్పడానికి కొన్ని విషయాలను మనం తరచుగ చేస్తూండాలి. అవేమనగా: పిల్లలను పేరు పెట్టి పిలవడము, భాష ద్వారా ప్రేమను పంచడము, ప్రేమైక చూపులతో ఆలరించడము, వాళ్ళను చూసినప్పుడు వారిని చూచి సంతోషంగా నవ్వడం వంటివి తప్పని సరిగ చేయాలి. మనం చూపించే మానవ ప్రేమలో దైవప్రేమ మిళితమై ఉండాలి. ప్రతి శిశువు తల్లిదండ్రుల యొద్ద నుండి ప్రేమ పొందడం అనేది న్యాయమైనది మరియు యుక్తమైనది. ఈ విధంగా ప్రేమించబడటం అనేది కూడ పిల్లల లోలోపల హార్మోలనులపై ప్రభావం చూపుతుంది కాబట్టి పిల్లలు మన ప్రేమను పొందేందుకు మనం శాయశక్తుల కృషి చేయాలి. తల్లిదండ్రులుగా వారి యొక్క బాధ్యతలను పిల్లలను సక్రమంగా పెంచే విధంగా నిర్వర్తించాలి. భార్యాభర్తలు ఇద్దరైనప్పటికి వారి యొద్ద పరస్పర ప్రేమ మిళితమై ఉంటుంది. కాబట్టి వారిద్దరు ఒకటే. ఈ ప్రేమే వారిని ఒకటిగా చేసి, ఒకే కుటుంబంగా తీర్చిదిద్దుతుంది. వీరిద్దరు దైవ సృష్టి కార్యంలో ప్రధాన పాత్ర వహిస్తారు. దేవుడే తల్లిదండ్రుల రూపంలో ఉన్నట్లుగా బిడ్డలను అనునిత్యం మంచి మార్గంలో నడిపించాలి. తల్లిదండ్రులు వారి యొక్క ప్రేమలను అనునిత్యం ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా వారు సంతోషంగ ఉంటూ ఇదే విషయాన్ని పిల్లలకు క్రియల రూపంలో నేర్పిస్తారు. వారి పిల్లలు పరిపక్వత చెంది ఒక స్థాయికి చేరే వరకు పిల్లల్ని కంటి పాపలా కాపాడుకుంటూ వస్తారు.

కాని ప్రస్తుత సమాజంలో చాల మంది అనాధులుగా, అభాగ్యులుగా జీవిస్తున్నారు, ఇటువంటి వాటిని మనం చూచిచూడనట్లు వదిలివేయరాదు లేదా పెడచెవిని పెట్టరాదు. ఇంకా చాలమంది కనీస వసతులు లేకఎన్నో బాధలు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితులను మనము పరిగణలోనికి తీసుకొని తగిన ముగింపును తీసుకురావలయును. నేటి సమాజంలో మహిళలు ఎంతో మంది చదువుకోవాలని, ఉద్యోగాలు చేయాలని ఎన్నో శిఖరాలను చేరాలని ప్రయాసపడు

తున్నారు మరియు వాటినన్నింటిని సంపాదించుకుంటున్నారు. ఇదేమి తప్పుకాదు. కాని బాలింతలుగా తల్లి యొక్క ప్రేమ పసి పిల్లలకు ఎంతో అవసరం. జన్మనివ్వడమే కాదు, ఆ పసిబిడ్డను కాపాడకోవలసిన బాధ్యత అంతా కూడ తల్లిదండ్రులపై ఆధారపడి ఉంది. మహిళతత్వం గురించి ఫ్రాన్సిస్ పాపు గారు అంటారు. ఈ విధంగా "నేను మహిళలకు ఎంతో గౌరవాన్ని ఇస్తాను". కాని మహిళలే స్వయం పాలకులని ప్రభోదించే వారికి కాదని తెగించి చెప్పారు. అమ్మలో దాగియున్న కమ్మదనం పిల్లల్ని కంటెనే తెలుస్తుంది.

మాతృమూర్తులందరు ఒంటరితనానికి, ఏకాకి జీవితానికి విరుగుడు మందులాంటివారు. అందుకే అందమైన జీవితానికి మూలం మాతృమూర్తి అంటారు. దీనికి ప్రత్యేక సాక్షులు మాతృమూర్తులే. కనుకనే తల్లిలేని సమాజం మానవత్వం లేని సమాజంగా మారుతుంది. ఎందువలనంటే ఎంత దురదృష్టకర సమయలోనైనా తల్లి మృదుత్వమును, అప్యాయతను, అనురాగమును, ధృడత్వమును, పటుత్వమును అన్నింటికి మించి ప్రేమను ప్రదర్శిస్తుంది. సమాజంలోని ప్రతి ఒక్కరు మతపరమైన అనుభవాలను తల్లిదండ్రులనుండే నేర్చుకుంటారు. కాబట్టి క్రైస్తవత్వంలో మంచితల్లి లేకపోతే నూతన విశ్వాసికి జీవమే లేదు. నూతన విశ్వాసానికి జీవం పోసి దానిని పెంచి పోషించే విశ్వాసపు తల్లులందరికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు అని తెలియజేశారు ఫ్రాన్సీస్ పాపుగారు. మాతృమూర్తులందరు ఏ విధమైన భక్తిభాశాలతో, మరియు విలువలతో వారి పిల్లలను పెంచుతారో ఆదే వారికి జీవితంలో ఎదగడానికి నమ్మకంగా ఏర్పడుతుంది మరియు ఈ లోకం ఒక అహ్వాన స్థలమని వారికి అర్థమవుతుంది. పిల్లలు తల్లీదండ్రులను చూస్తూ అనేక విషయాలు నేర్చుకుంటారు. మరిముఖ్యముగా తండ్రి యొద్ద నుండి కష్టపడి పనిచేసే తత్వమును, బాధ్యతయుతముగా జీవించడాన్ని, కుటుంబం గురించి అనునిత్యం శ్రమించే గుణాన్నీ, తండ్రి ప్రేమను, ధృడత్వంగా ఉండటాన్ని ఇంకా అనేక విషయాలను నేర్చుకుంటారు. భార్యాభర్తలు ఇద్దరు ఒకరిపై ఒకరు ప్రేమగా ఉంటూ, బాధ్యతలను చక్కగా నేరవేరుస్తూ, పిల్లలకు సుమాత్రుకగా జీవించాలి.

మరికొన్ని సందర్భాలలో విడ్డూరమైన విషయాలను వింటున్నాం. అవేమనగా 'తండ్రిలేని సమాజాన్ని' నెలకొల్పాలనే ప్రాశ్చత్యదేశాల ప్రాకులటను

పరిశీలించి చూస్తే తండ్రి పాత్ర అనేది ఒక ప్రశ్నార్థకంగా మారింది మరియు క్షీణించిపోయే స్థితికి చేరుకుంది. ఇలా ఎందుకు జరిగింది అని ప్రశ్నిస్తే అర్థమవుతుంది. కొంత మంది తండ్రుల దుష్ట ప్రవర్తనల ద్వారా, నేను గొప్పవాడిని అని ఇతరులను చిన్న చూపు చూచే ప్రవర్తన ద్వారా, పిల్లల జీవితాశయాలను, వారి పెరుగుదలను ప్రోత్సాహించకుండా, స్వలాభాల కోసం ప్రాకులాడే తండ్రుల వికృత రూపమే 'తండ్రిలేని సమాజం' అనే స్థితికి చేరింది. ఇటువంటి ధోరణిలో జీవిస్తున్న సమాజాన్ని చూచి ప్రాన్సీస్ పాపుగారు భాదతో ఈ విధంగా వ్యక్తి పరిచారు. "తల్లిదండ్రులు పిల్లల జీవితానికి వెన్నుముకలాంటివారు. తండ్రిగా ఎల్లప్పుడు కుటుంబానికి కాపుదలను, పెరుగుదలను తగిన సేవను అందించాలి అని తెలియజేశారు. పిల్లలకు తండ్రి ఎంతో అవసరం కుటుంబానికి తండ్రి అత్యవసరం కాబట్టి ప్రతి తండ్రి కుటుంబానికి బాసటగా మారాలి."

## ఫలవంతమైన ప్రేమను విస్తరింపజేయడం

మరికొంతమంది దంపతులు పిల్లలు కలగని సందర్భాలలో కృంగిపోతారు, కృశించిపోతారు మరియు సమాజం కూడా వారిని చిన్నచూపు చూస్తుంది. ఇటువంటి బాధలకు గురైనపుడు నిరుత్సాహపడరాదు. ఎందువలనంటే మానవ జీవితంలో ప్రేమను అనేక విధాలుగా పెంపొందించుకోవచ్చు. కేవలం పిల్లలను కనడంలో మాత్రమే కాకుండా, పిల్లల్ని దత్తతగా తీసుకోవడం ఇంకా పిల్లలకోసం వారియొక్క జీవితాలను వెచ్చించడం, ఇలా పలు రకాలుగా ఈ ప్రేమను విస్తరింపచేయవచ్చును. పిల్లలు కలగడం లేదని వివాహపు ప్రమాణములను విస్మరించకకూడదు. ఒకరినొకరు కించపరచకూడదు. ప్రతి ఒక్కరిలో తల్లిదండ్రులు కావాలనే ఆశ ఉంటుంది. ఈ ఆశ వారి దాంపత్య జీవితానికి అటంకంగా మారగూడదు. 'అమ్మ' అవ్వలనే భాగ్యం కేవలం పిల్లల్ని కంటేనే రాదు, ఇంకా అనేక మార్గాలున్నాయి. ఉదాహరణకు మథర్ థెరిస్సా ఒక్క పిల్లవానికి కూడ జన్మనివ్వకుండానే, మదర్ అయ్యింది. మాతృత్వాన్ని పంచింది. అభాగ్యులను ఆదరించి నిర్భాగ్యులను దరికి చేర్చుకొని వారికి తల్లిపేమను పంచుతూ తల్లిగా మారుమని పిలుపునిచ్చారు ప్రాన్సీస్ పాపుగారు.

దత్తత తీసుకోవడం అనేది మాతృత్వ ప్రేమను పంచడంలో మరో మార్గం. సంతానం లేని దంపతులు ఈ మార్గాన్ని అనుసరింపవలయును. ఈనాడు ప్రపంచ దేశాలన్నింటిలో, ప్రభుత్వ చట్టాలు అనేకం పిల్లల్ని దత్తత తీసుకునే మార్గంలో ప్రోత్సాహిస్తూ ఉన్నాయి. ఈ విధంగా దత్తత తీసుకొనమని, పేదరికంలో, కనీస వసతులు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరిని ఆదరించమని పిలుపునిచ్చారు ఫ్రాన్సిస్ పాపుగారు.

ఇంకా ఫలవంతమైన ప్రేమను వ్యాప్తి చేయడానికై పెద్దపెద్ద కుటుంబాలుగా తయారుకావాలి. ఎటువంటి హెచ్చుతగ్గులు లేకుండా ఉమ్మడి కుటుంబాలు సమాజంపైన తనదైన ముద్రవేయాలని పిలుపునందుకున్నాయి. ఈ యొక్క అమూల్యమైన ప్రేమను రుచిచూయించడానికి ఇంకా అనేకమైన ఇతర మార్గాలు కనుగొనవలయును, ఈవిధంగా ప్రేమైక కుటుంబాలుగా జీవింపజేస్తుంది. దేవునిపై ఉన్న విశ్వాసం మనలను లోకం నుండి వేరుచేయలేదు కాని లోకంలోనికి లోతుగా లాక్కోనిపోతుంది. ఇలా లాక్కోనిపోయిన సందర్భాలలో తన విశ్వాసాన్ని లోకానికి తెలియపరచాలి. తద్వారా మనమంతా ఒక్కొక్కరం ఒక్కొక్క శైలిలో దైవరాజ్యాన్ని స్థాపించడంలో మనవంతు కృషి చేయాలి. మనకుటుంబంలో ఎవరు నిరాశ్రయులుగా కాకుండ చూసుకోవాలి. ఇలా అందరు అన్ని కుటుంబాలలో చూసుకుంటే గనుక నిరాశ్రయులు, అనాధలు అన్న పదాలకే తావు లేకుండాపోతుంది అనగా అందరు కుటుంబంలో జీవిస్తారు. ప్రేమను ఎక్కువగా పొందుతారు. ఈ విధంగా దంపతులిద్దరు ఒక అవగాహనకు వచ్చి, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, సమాజ అసమానతలను గుర్తించి నైతిక బాధ్యతలను సక్రమంగా నెరవేర్చగల్గాలి లేదా నిర్వర్తించాలి.

వ్యత్యాసాలతో కూడిన ఏ ఒక్క కుటుంబం కూడా ఫలవంతమైన కుటుంబం కాదు. ఈ భేదాభిప్రాయాలను లేదా వ్యత్యాసలను తొలగించడానికి మనం తిరు కుటుంబాన్నే ఆదర్శప్రాయంగా తీసుకోవాలి. తిరు కుటుంబం : వరాలతో, దివ్యానుగ్రహలతో, ప్రేమ మరియు వివేకం విజ్ఞాతలలో నిండియుండి ఇలా ఉండినప్పటికి ఆ తిరుకుటుంబం ఇతర కుటుంబాలపై ఎటువంటి వ్యత్యాసాలను

చూపించలేదు. అందుకే ప్రజలు క్రీస్తు యొక్క జ్ఞానాన్ని గ్రహించడానికి వారి శక్తి సరిపోలేదు. "విశ్రాంతి దినమున ప్రార్థన మందిరములో ఆయన బోధింప ఆరంభించెను. ఆయన బోధలను వినుచున్న జనులు ఆశ్చర్యపడి, ఈయనకు ఇవి అన్ని ఎట్లు లభించినవి? ఈయనకు ఈ జ్ఞానము ఎట్లు కలిగినది? ఈయన ఇట్టి అద్భుత కార్యములనెట్లు చేయుచున్నాడు? ఈయన వడ్రంగి కాడా? మరియమ్మ కుమారుడు కాడా? (మార్కు 6:2–3). ఇతడు వడ్రంగి కుమారుడు కాడా? మరియమ్మ కుమారుడు కాడా? (మత్తయి 13:55)". ఈ విషయం ఆ జ్ఞానం ప్రజలకెందుకు అర్థం కాలేదంటే వారితోనే వారిలోనే ఉంటూ వారికంటె ఎక్కువ జ్ఞానంతో మాట్లాడారు కాబట్టి తిరుకుటుంబం ఎప్పుడు ఇతర కుటుంబాలను గౌరవిస్తూ, వారికి మంచి విలువలను నేర్పుతూ జీవిస్తూ ఉంది. ఈ తిరుకుటుంబంలోని వ్యక్తులు ఇతర కుటుంబ వ్యక్తులతో కలివిడిగా ఉంటూ, వారి యొక్క వ్యాధి భాదలలో, సంతోష దు:ఖాలలో, అన్ని సమయాలలో ఇతరులతో కలసి జీవించేవారు. అందుకే యెరుషలేము యాత్రకు వెళ్ళినప్పుడు క్రీస్తు ప్రభువు ఎవరొకరి దగ్గర ఉండి ఉంటారులే అనే మరియతల్లి యోసేపు గార్ల తలంపును మనం చూస్తాం. కాని ప్రస్తుత సమాజమంతా దారితప్పిపోయింది. కుల, మత, వర్గ, వర్ణ, భాషా, రంగు రుచులను అనుసరిస్తూ, వారిని వేరుచేస్తూ, లేనిపోనివి తగిలిస్తూ వాటి కోసం ప్రాకులాడుతుంది ప్రస్తుత సమాజం. వీటన్నిటిని విడచి క్రీస్తు చెంతకు చేరి, క్రీస్తు కుటుంబాన్ని అనుసరించే కుటుంబాలుగా మలచమని వేడుకొందాం, ప్రార్థిదాం, ప్రాథేయపడదాం. అందరు ఒకే కుటుంబంగా జీవించాలి. అదే తిరుకుటుంబంలో దాగియున్న అర్థం పరమార్థం.

ప్రేమ అనే శక్తి, అనుభవించిన దంపతులకు తెలుసు. ప్రేమ అంటే వెలివేయబడినా, తక్కువగా ఎంచబడుతున్నా, ఇతరులచే తృణీకరించబడుతున్నా వారి యొక్క హృదయగాయాలను మాన్పడమే మరియు నిత్యం సత్యం కోసం, న్యాయం కోసం పోరాడటమే. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, ఒకరికోసం మరొకరు జీవించడమని దేవుడు దంపతులకు ఇచ్చిన అతిముఖ్యమైన పనులు ఏమిటంటే:

1. సర్వమానవాళి అంతా సహోదరీ సహోదరులని తెలియజెప్పడం.
2. సకల జీవరాశులను ప్రేమతో చూడటం.

3. ఒకరినొకరు ప్రేమతో పలుకరించుకోవడం.

4. అందరికి రక్షణ రుచిని చూపించడం, ముఖ్యంగా ముందు వారివారి పిల్లలకు.

మన సమాజంలో నెలకొనియున్న రాజకీయయ పార్టీలు, ప్రభుత్వాలు, మంచికి వ్యతిరేకంగా ఉంటే వాటిని ఖండించాలి. అవసరమైతే దండించాలి. చట్టాల ద్వారా అందరిని అదరించి అక్కున చేర్చుకోవాలి. మానవతకు మారుపేరుగా నిలచే సమాజాన్ని సృష్టించుకోవాలి. అందుకే మనం విందులు వినోదాలు చేసేటప్పుడు ప్రభువు పేదలను ఆహ్వానించమన్నాడు. దాని అర్థం అందర్ని సమదృష్టితో చూడమని అందుకే ప్రభువు దానిని మరల మరల నొక్కివక్కానిస్తున్నాడు. ఈ తక్కువ స్థాయిలో ఉన్న వారికి మీరేమి చేసినను అది నాకు చేసినట్లే అని చెప్పారు. "నీవు విందు చేయునపుడు పేదలను, వికలాంగులను, కుంటివారిని, గ్రుడ్డి వారిని పిలువుము. వారు నీకు ప్రతిఫలమును ఈయలేరు. కనుక నీవు ధన్యుడవు అగుదువు. నీతిమంతుల పునరుత్థాన కాలమున దీనికి ప్రతిఫలము లభించును అనెను. (లూకా 14:12-14)" ఇలా చేస్తే మనం నిత్యజీవితానికి వారసులమవుతాము.

అందుకే క్రైస్తవులుగా మన జీవిత సాక్ష్యాల ద్వారా, మాటల, క్రియల ద్వారా ముఖ్యంగా మన జీవిత విధానం ద్వారా క్రీస్తుకు సాక్షులుగా నిలబడాలి. ఈ విధంగా విశ్వాసుల జీవితాలలో చిరుదివ్వెను వెలిగించాలి. క్రీస్తు సువిశేష గ్రంథాలపై, క్రైస్తవ జీవిత సుగుణాలపై మరిముఖ్యంగా పరలోక వారసత్వంపై కోరికను కలిగించాలి. నిజానికి ఇదే సత్యమైన మార్గం, నిత్యమైన జీవం, ముక్తికి సోపానం. అందుకే క్రైస్తవ దంపతులందరు ఎక్కడైతే పేదవారిని హింసిస్తున్నారో!, ఎక్కడైతే అన్యాయాన్ని తలపెడుతున్నారో దానిని చూచి అన్యాయాన్ని తొలగించి న్యాయం కోసం స్థిరంగా, బలంగా నిలబడాలి. ఈ విధంగా క్రీస్తు ప్రేమను లోకానికి చాటి చెప్పాలి.

## శరీరమును గ్రహించుట

ఫ్రాన్సీస్ పాపుగారు, పునీత పౌలుగారు (1కొరింతీ 11:17-34) 'ప్రభు భోజనము' అను అంశములో పొందిన అవమానపు సందర్భాన్ని గురించి మాట్లాడుతున్నారు. అది ఏమనగా కొరింతీయులు దైవ సంఘముగా కూడినప్పుడు

వారిలో బేధాభిప్రాయాలు రావడం, వారి శరీరానుసారంగా ప్రవర్తించడం, వారిలో హెచ్చుతగ్గులు ఉండడం, వారు ప్రభుభోజనాన్ని ఇష్టానుసారముగా భుజించు విధివిధానాలను గురించి తెలియజేస్తుంది. ముఖ్యముగా "ఏలయన, మీరు తినునప్పుడు మీ ఇష్టానుసారము తినుచుందురు. తినుటకును త్రాగుటకును మీకు మీ యిండ్లు లేవా? అవసరములలో ఉన్న వ్యక్తులను అవమానింతురా? దీనిని గూర్చి మీకు నేను ఏమి చెప్పవలెను? మిమ్ము పొగడవలెనా? ఈ విషయమున నేను మిమ్ము పొగడను" (1 కొరింతీ 11:21-22). ఈ విధముగా కాకుండ, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, త్యజించే గుణాన్ని అలవర్చుకోవాలి. అందరితో కలిసిమెలసి ఉంటూ, అందరు ఒకటేనన్న సుగుణాన్ని పెంపొందించుకోవాలి.

ప్రభుభోజనం మనలందర్ని ఐక్యమత్యముగా జీవించమని పిలుపునిస్తుంది. అయితే ఈ ప్రభుభోజనానికి వచ్చిన ప్రతివ్యక్తి పిలుపులో దాగియున్న నియమ నిబద్ధతలను అనుసరించి అనుగ్రహ పాత్రులుగా జీవించాలి, లేదంటే దేవుని అగ్రహానికి గురి అవుతాము అని తెలియజేస్తున్నారు పోపు ఫ్రాన్సిస్ గారు. "ఏలయన, ఎవడైన రొట్టెను తినుచు, పాత్ర నుండి త్రాగుచు అది ప్రభువు శరీరము అని గుర్తింపనిచో, అతడు తినుట వలనను త్రాగుట వలనను తీర్పునకు గురియగును" (1 కొరింతీ 11:29). ప్రతి వ్యక్తియు ఆత్మ పరిశీలనము కావించుకొని రొట్టెను తిని, పాత్ర నుండి త్రాగవలెను (11:28). క్రీస్తు శరీర రక్తాలను స్వీకరించు మనమంతా అది క్రీస్తు శరీర రక్తాలని గుర్తించి తగు విధంగా జీవించాలి.

## విశాల కుటుంబంలో - జీవితం

చిన్న చిన్న కుటుంబాలలో జీవించే వారు పెద్ద పెద్ద కుటుంబాలతో లేదా ఆయా వ్యక్తుతో కలసి జీవించినప్పుడుగాని కలసి మాట్లాడినప్పుడు గాని అర్థం కాదు. పెద్ద పెద్ద కుటుంబాలలో దాగియున్న కమ్మదనం : ఐక్యత, సోదారభావం, నీతి, నిజాయితి, కుటుంబా విలువలు, బరువు బాధ్యతలు, నిర్ణయించబడిన పని కార్యక్రమాలు, సంతృప్తి, ఒకరికోసం ఒకరు జీవించడం, కలసి కట్టుగా పనిచేయడం. అన్ని విషయాలలో పెద్ద కుటుంబీకులంతా సమాజంలో సుమాతృకగా జీవిస్తారు. చిన్న కుటుంబాలు చూడటానికి చూడముచ్చటగా ఉన్నా, మూడు నాళ్ళ మురిపమే అవుతుంది. ఎందుకంటే పెద్ద కుటుంబాలలో దొరికే సంతోషం శాంతి ఈ చిన్న

కుటుంబాలలో దొరకదు. బాధవచ్చినా, భయపడినా, కష్టమెచ్చినా, చెప్పుకోడానికి ఎవరుండరు. కాబట్టి అందర్ని ఉమ్మడి కుటుంబాలుగా మారుమని ఫ్రాన్సిస్ పాపుగారు పిలుపునిచ్చారు.

## కుమారులు, కుమార్తెలుగా ఉండటం

ఈ భూలోకంలో పుట్టిన ప్రతివాడు కుమారుడు లేదా కుమార్తె కాబట్టి 'తల్లిదండ్రులను గౌరవింపుడు, తల్లిదండ్రులను దూషించువాడు. మరణదండనకు గురియగును' అని మోషే ఆజ్ఞాపించెను గదా (మార్కు 7:10). కనుక మనమందరం పిల్లలమైనా, పెద్దలమయినా, వివాహితులమైనా, కాకపోయినా, గొప్పవాడవైనా, నిరుపేదలమైనా, ఉద్యోగులమైనా, ఎవరైనా మనమందరం బిడ్డలము. కాబట్టి మన తల్లిదండ్రులను ఏ సందర్భంలో విడిచి పెట్టకూడదు. ఒక తల్లి బిడ్డకు జన్మ నివ్వడానికి తాను చనిపోడానికైన సిద్ధపడుతుంది. ఒక తండ్రి తను తినినా తినకపోయిన కుటుంబాన్ని పోషించడానికి రేయిపగలు కష్టపడుతాడు. కాబట్టి తల్లిదండ్రులకు వృద్యాపంలో చేయూతనివ్వాలి. వారికి అన్నియు మనమే అయ్యి ఉండాలి. వారిని బాధపెట్టకుండా సంతోషంగా ఉంచాలి.

## వృద్ధులు

"నా ముసలి తనమున నీవు నన్ను పరిత్యజింపకుము. నా బలము తరిగిన తరుణమున నీవు నన్ను చేయి విడువకుము" (కీర్తన 71:9). మనము వదిలివేసిన, మరచిపోయిన ముసలివారి ఆర్తనాదాలు ఇవే. పేదవారి ఆర్తనాధాలను వినమన్న దేవుడే, ముసలివారి ఆర్తనాధాలను కూడా వినమంటున్నారు. కుటుంబాలకు సంఘాలకు ఇది ఒక సవాలుగా ఉంది. శ్రీసభ వృద్ధులను చూస్తూ చేతగానితనంగా ఉండలేదు. మనమంతా ఒకటి అన్న భావనను అందరము ఒకే కుటుంబానికి సంఘనికి చెందిన వారిమి అన్న భావనను వృద్ధులలో తీసుకురావాలి. వృద్ధులు ఎవరో కాదు మన తల్లిదండ్రులు, స్త్రీలు, పురుషులు, మనకన్నా ముందే ఆ దారిలో నడిచిన వారు, వీరు మన స్వంత వారు, మన ఇంటిలోనివారు మనలాగే జీవించినవారు. వాస్తవముగా చెప్పాలంటే ఇలాగా యువకులు, వృద్ధులను ఆనందముగా కలుపుతున్న శ్రీసభను నేను ఎంతగా ప్రేమించాలి."

పునీత రెండవ జాన్‌పాల్ పాపుగారు వృద్ధుల పట్ల చాలా జాగ్రత్త వహించాలి అంటారు. మన కుటుంబంలో ఉన్న పెద్ద వారిని అప్యాయంగా చూడాలి. ఎందుకంటే ప్రస్తుత సమాజంలో మరియు గడిచిన కాలంలో వృద్ధుల పనికిరాని వారిగా ప్రక్కకు త్రోసివేశారు. వృద్ధులు ఎప్పుడు మనలను ప్రోత్సాహిస్తూ తరువాత తరాలను ముందుకు నడిపించుటకు మనవాళ్ళకు మనవరాళ్ళకు మంచి బుద్ధులు నేర్పుతారు. చాలామంది పిల్లలు వారి తాతల అమ్మమ్మల దగ్గరే క్రైస్తవ విశ్వాసాలు నేర్చుకున్నట్లు చెప్తారు. వృద్ధుల నుండి పిల్లలు చాలా నేర్చుకుంటారు. వారి కన్నా ముందు ఇలా చాలా మంది ఉన్నారు అన్న భావన వస్తుంది. ఇలాగా వారి నానమ్మలను చూడని పిల్లలు చాల వరకు బంధాలను గూర్చి తెలుసుకోలేరు. వృద్ధులకు స్థానం ఇచ్చిన సమాజంలో మార్పులు ఉంటాయి. సమాజం నిజంగా వృద్ధులను చూస్తుందా? సమాజం వృద్ధులకు ఒక స్థానం ఇస్తుంది. వృద్ధులను గౌరవించు సమాజం అభివృద్ధిలోనికి వస్తుంది.

చరిత్ర గురించి తెలియకపోవడం సమాజానికి ఒక లోటు. "అది అప్పుడు, ఇది ఇప్పుడు అన్న భావన ఉంటె కుదరదు. జరిగిన విషయాలను గురించి తెలుసుకుని దాని ప్రకారం ఏమి చేయాలి అని ఆలోచించడం వలన అర్థవంతమైన భవిష్యత్తు ఉంటుంది. జ్ఞాపక శక్తి ఎదుగుదలకు చాలా అవసరం" గడిచిన కాలాన్ని గుర్తుచేసుకోవాలి" (హెబ్రీ 10:32). మన పెద్దవారు చెప్పినవి వినుట పిల్లలకు, యువతకు మంచిది. దీని వలన పెద్దల కుటుంబాలలో జరిగిన సంగతులే ఇప్పుడు కూడా వారి జీవితంలో కూడా జరుగుతున్నవి అనిపిస్తుంటుంది. కుటుంబంలోని వృద్ధులను మరచిన యెడల కుటుంబం నాశనమవుతుంది, అదే వారిని బాగా చూసుకుంటే మంచిగా ఫలవంతంగా ఉంటుంది.

## సహోదరి సహోదరులుగా ఉండటం

సహోదరీ సహోదరుల లాంటి బంధం వలన కుటుంబంలో మంచి సమయం గడిపినట్లుగా ఉంటుంది. మంచి వాతావరణం కూడా ఉంటుంది. కుటుంబంలో ఒకటిగా ఎలా ఉండాలి అని నేర్చుకుంటాం. మనం ఎప్పుడు ఆలోచించం కాని కుటుంబమే ఎలా ఉండాలి అని నేర్చుకుంటాం. మనం ఎప్పుడు ఆలోచించం కాని కుటుంబమే సహోదరీసహోదరులుగా ఉండటం నేర్పిస్తుంది.

ఇలా కుటుంబంలో ఒక సహోదర భావము కలిగి వుంటే, సమాజంలో కూడా అదే విధంగా ముందుకు వెళ్తాం.

కుటుంబంలో సహోదరులతో కలిసి పెరగడం వలన ప్రేమ, అప్యాయత గురించి తెలుసుకుంటాం. ఒకరితో ఒకరు ప్రేమతో, జాగ్రతతో మెలగడం నేర్చుకుంటాం. కుటుంబంలో ఎవరికైె బాగాలేక పోతే మనవారు చూపించే ప్రేమ. అనురాగం జాగ్రత్త చాలా బాగా ఉంటాయి. మనలను ప్రేమించే ఒక అక్క లేదా అన్న ఉండడం చాలా ఆనందదాయకం. పిల్లలకి కూడా అన్నదమ్ములవలె ఉండడం నేర్పించాలి. కొన్ని దేశాలలో ఒకే పిల్లవాడు ఉండటం ద్వారా అన్న, అక్క అను బంధాలను కొల్పోతున్నారు. ఇలాగా ఒకే బిడ్డ ఉన్నప్పుడు అతను ఒంటరిగా లేదా ఎవరూలేని వానిగా ఉండకుండా చూసుకోవాలి.

## గొప్ప హృదయం విశాల హృదయం

కుటుంబంలో తల్లిదండ్రులు, పిల్లల మాత్రమే కాకుండ మనం చూడలేని పెద్ద కుటుంబమే ఉంటుంది. కుటుంబంలో ఉన్న తల్లిదండ్రుల ప్రేమ, అన్నదమ్ములు, అక్క చెల్లెల ప్రేమతో సహా మన ఇరుగు పొరుగువారు, స్నేహితులు, బంధువులు, వీరిందరు కూడా ఒక పెద్ద కుటుంబంగా ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ కష్టాలు పంచకుంటూ విశ్వాసంలో పెంపొందుతూ ఉంటారు.

ఈ పెద్ద కుటుంబాలు అందరికి ప్రేమను పంచుతూ, అప్పుడే పెళ్ళయిన మహిళలకు, యుక్త వయస్సు గల తల్లులను, ఆదరించాలి. పిల్లలను మరియు తల్లిదండ్రులు లేని చిన్నారులను అవయవాలు లేని పిల్లలను, వృద్ధులను, రోగులను, విధవలను అవసరంలో ఉన్న వారందరిని పెద్దకుటుంబాలు ఆదరించాలి.

పెద్ద కుటుంబంలో అత్త మామలను మరిచిపోకూడదు మరియు భార్యాభర్తల బంధువులను కూడా మరువరాదు. ప్రేమ అనే ఒక్క భావం, వీరందరిని ఒకటి చేస్తుంది. వారిని భారంగా భావించదు. భార్యాభర్తల శారీరక బంధం, వారి సంస్కృతులను భాషలను, తెగలను అర్థం చేసుకొని వారిని వేరుచేయక ఒకటిగా జీవించేలా చేస్తుంది. భార్యాభర్తలు, వారి కోసం ఇలా చేయాలను కోవటం కూడా, ఒక శ్రేష్టమైన అనుభవం. అది అప్యాయమైన ప్రేమ బంధం.

# ౬. విశ్వాస పరిచర్యలోని దృక్పథాలు

**- బ్రదర్ అల్లం సాగర్ మనోజ్**



మనం నేటి కుటుంబాలను చూస్తే, ఈనాటి ప్రపంచంలో విడాకులు, స్వలింగ దంపతులు, సహజీవన విధానం, ఒంటరి జీవిత అలవాట్లు, పెండ్లి అంటే భయపడే యువత, స్వేచ్ఛ కోల్పోతామేమోనన్న భయాలు నేటికే కుటుంబ వ్యవస్థలో కనబడుతున్నాయి. పిల్లల కంటే, కుక్కపిల్లలుంటే మేలు అనుకునే భావాలు, అవిశ్వాసి తోడుకంటే, విశ్వాస జంతువులు మేలు అనే ఆలోచనలు, సహజంగా పిల్లల్ని కనడం కంటే పిల్లల్ని కృత్రిమ మార్గంలో తయారు చేయ్యాలనే ఆలోచనలు, అన్నీ చీకటిలో ఠక్కున జరగాలనే భావాలు మన సమాజంలో, కుటుంబాల్లో చూస్తున్నాము. మరి ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు 'ప్రేమానందం' (The Joy of Love) అనే అపోస్తోలిక ప్రబోధం విశ్వలేఖను వ్రాసారు. మన కుటుంబ జీవిత అనుభవాలు - సవాళ్ళు గూర్చి క్లుప్తముగా తెలియాజేస్తూ, ప్రతి కుటుంబం ఏ విధముగా ఉండాలి, వారి అనుభవాలు ఏ విధముగా ఉన్నాయని, వారు ఎలాంటి సవాళ్ళు ఎదుర్కొంటున్నారని, మరి ఇలాంటి పరిస్థితులలో శ్రీసభ ఎలాంటి ప్రేషిత కార్యసేవలు చెయ్యాలో అని తెలియజేశారు. శ్రీసభలో ఒక ప్రణాళిక బద్ధమైన పరిచర్యకు, ఎదురయ్యే సవాళ్ళకు కొన్ని విశ్వాసుల సంక్షేమ దృక్పథాలు ఎంతైనా అవసరం. మరి అటువంటి విశ్వాసుల సంక్షేమ దృక్పథాలను గూర్చి లోతుగా తెలుసుకుందాం.

### నేటి కాలంలో సువార్తను ప్రకటించుట

తండ్రి దేవుడు, తన సంతానమైన మానవులందరు ఈ లోకములో సుఖశాంతులలో సంతోషంగా జీవించాలని కోరుకుంటున్నారు. మానవ జీవితం

పారలౌకికమైన నిత్యజీవ ప్రాప్తితోనే పరిపూర్ణమవుతుందన్నది యథార్థమే. అయినప్పటికీ మానవుల ఇహలోక జీవనం కూడా ఆనందమయంగా గడవాలన్నది దేవుని సంకల్పమని గ్రహించాలి. నిజానికి లోకములోని సమస్తాన్ని దేవుడు “మనము సంతోషముగా అనుభవించుటకు ధారళముగా” ఒసగారు (1 తిమోతీ 6:17) ఈ లోకంలోని ప్రతి ఒక్కరు ఆనందంగా జీవించడానికే దేవుడు సమస్తాన్ని సృష్టించారు.

మరి దేవుడు సృష్టించిన ఈ సృష్టిని దివ్య సంస్కారం అనే పవిత్ర వివాహం ద్వారా స్త్రీ, పురుషులు ఇరువురు కలిసి అభివృద్ధి చేస్తున్నారు. మరియొక మాటలో చెప్పాలంటే, ఒక స్త్రీ ఒక పురుషుడు స్వచ్ఛందంగా ఇష్టపూర్తిగా చేసుకొనే ఒక ఒడంబడిక... ఒక ఒప్పందం... ఒక నిబంధన ఈ వివాహం. అది తమ సుఖ సంక్షేమాల కోసం, సంతాన సాఫల్యం కోసం, పిల్లల పెంపకం కోసం స్త్రీ పురుషులు కుదుర్చుకొనే ఒప్పందం. ఆ ఒప్పందం జ్ఞానస్నానం పొందిన స్త్రీ పురుషుల మధ్య జరుగుతున్నప్పుడు ప్రభు క్రీస్తు అనుగ్రహంతో ఆ వివాహ బంధం ఒక దివ్యసంస్కార స్థాయికి చేర్చబడుతుంది. అందుకు శ్రీసభ సాక్షిగా నిలచి, దీవిస్తుంది. మార్గచూపరిగా క్రైస్తవ దంపతులకు దిశానిర్దేశం చేస్తుంది.

అయితే ఈ నవీనయుగ కుటుంబజీవితాలలో ప్రేమ ఆప్యాయతలు, దయ, కనికరం, వినయం, సాత్వికత, ఓర్పు, శాంతి, ఐక్యత, క్షమ అనే మంచి సద్గుణాలు కనుమరుగైపోతున్నాయి. అనటంలో ఎటువంటి సందేహం లేదు. వివాహం దేవుడు మానవునికి ఒక పవిత్ర సంస్కారముగా అందించిన గొప్పవరం. ఇది దేవుని ప్రణాళిక, ఏర్పాటు అయితే కుటుంబంలో ఎందుకు సమస్యలు, ఎందుకు సవాళ్ళు? కుటుంబ జీవితంలో భార్యాభర్తల ప్రేమ అనేది అన్యోన్యముగా ఉండాలి, కాని అది ఇప్పుడు అమోమయముగా కనిపిస్తుంది. కుటుంబంలో భార్య, భర్తకి భరోసాగా ఉండాలి కాని భారముగా ఉంటుంది. కుటుంబంలో భర్త భార్యకి బలముగా ఉండాలి, కాని బలహీనముగా ఉంటున్నాడు. కుటుంబంలో క్రొధము, ఈర్ష్య, పగలు తాండవిస్తున్నాయి. సహనం కోల్పోయి, మానవత్వం కోల్పోయి, ‘నన్ను నేను ప్రేమించుకుంటూ’, ‘నాది’ అనే స్వార్థంతో కుటుంబాలు జీవిస్తున్నాయి. అందుకే అనుమానం ఎక్కువై, ఏదో ఒకటి అంటగడుతున్న ఈ సమాజం, కడగటానికి ఇబ్బందులు ఉండవని ప్లాస్టిక్ ప్లేట్స్, ప్లాస్టిక్ గ్లాసులు తెచ్చి, వాడి పారవేసినట్లే, ఈ

ప్రస్తుత సమాజంలో కుటుంబ సభ్యుల పట్ల ఉపయోగించి, పారవేయటం, గుడ్‌బై అని చెప్పటం, ఇతరులను చెత్తగా భావించే తత్వంతో జీవిస్తున్నాము.

## నిశ్చితార్థం జరిగిన వ్యక్తులను వివాహానికి తయారుచేయుట

మన కతోలిక విశ్వాస సిద్ధాంతం ప్రకారం పరిశుద్ధ వివాహం పరమాత్ముని సంకల్పముగా మనమందరం భావిస్తాం. మరి నిశ్చితార్థం జరిగిన దంపతులను వివాహమునకు తయారు చేయుటకు వారిని వివాహ సంసిద్ధత సదస్సులో పాల్గొనేలా చేసి, పరిశుద్ధ వివాహం గూర్చి సంపూర్ణముగా తెలియజేయాలి. నిశ్చితార్థం జరిగాక వధూవరులు పరస్పరం విశ్వాసనీయంగా మెలగాలనీ, తమ మధ్య ఏర్పడిన అనుబంధాన్ని గౌరవిస్తూ మానసికంగా శారీరంగా నిర్మలమైన జీవనం గడుపుతూ తమకు కాబోయే జీవిత భాగస్వామికి మచ్చలేని ప్రేమను అందించాలనీ, తమ వైవాహిక బంధాన్ని స్వచ్ఛమైన ప్రేమతో పటిష్టమూ ఫలప్రదమవమూ కావించుకోవాలనీ, పవిత్రగ్రంథం అనేక సందర్భాలలో ప్రబోధించింది. శ్రీసభ కలిపే పవిత్ర వివాహ బంధంలో గల పరమానందాన్ని నేనెలా వ్యక్తం చేయాగలను? ఇద్దరు విశ్వాసుల మధ్య ఏర్పడే ఈ ప్రేమానుబంధం ఎంతటి అపురూపమైనది...? అది ఆశావహమైన బంధం, కాంక్షాపూరితమైన బంధం, క్రమబద్ధమైన బంధం. ఏక శరీరులుగా వర్ధిల్లే ఇరువురు వ్యక్తుల అనురాగబంధం అద్వితీయమైనది, ఆదర్శ ప్రాయమైనది. ఈ వివాహబంధంలో దంపతులు, ఏక శరీరులుగా మాత్రమే కాదు. ఏకాత్మ సదృశులుగా జీవించగలుగుతారు.

పవిత్ర వివాహ దివ్యసంస్కారం ఒక స్త్రీ ఒక పురుషుడు కుదుర్చుకొనే వైవాహిక అంగీకారం (పెండ్లి ప్రమాణం) ద్వారా జరుగుతుంది. ఈ వైవాహిక అంగీకారం దేవుని సన్నిధానములో శ్రీసభ ఎదుట జరుగుతుంది. వివాహ ఒప్పందాన్ని దేవుడు ఆమోదించి నిర్ధారిస్తారు, స్త్రీ పురుషుల శారీరక కలయిక ద్వారా వారి వివాహం పరిపూర్ణమవుతుంది. ఈ పవిత్ర వివాహబంధాన్ని సాక్షాత్తు దేవుడే ఏర్పరుస్తున్నారు. కనుక దానికి దంపతులు జీవితాంతము కట్టుబడి ఉండాలి. దంపతులలో ఒకరు మరణించే వరకు వారు తమ వైవాహిక ఒప్పందానికి బద్ధులై ఉండాలి. కలసిమెలసి జీవించాలి. ఒక వ్యక్తిని ప్రేమించటమూ అంటే

దేవుడి దృష్టిలో అతడెంత అపురూపమైన వాడో, అంత అపురూపంగా అతన్ని చూడటం. ఒక వ్యక్తిని ప్రేమించటమూ అంటే అతనిలో గానీ, ఆమెలో గానీ ఇతరులెవరూ గుర్తించలేని ఒక అద్భుతమైన విశేషాన్ని గుర్తించగలగటం. ఈ ప్రపంచంలో ఎవరూ కుటుంబం లేకుండా ఉండరు. శ్రీసభ, లోకంలోని అందరికీ చెందిన విశాలమైన ఒక గృహం... విశ్వజనీన కుటుంబం ముఖ్యంగా, భారముతో క్రుంగియున్న సమస్త జనులను ఆదరించి అక్కున చేర్చుకొనే ప్రేమగల కుటుంబం – శ్రీసభ.

## వివాహ వేడుకకు సంసిద్ధులగుట

చాలాసార్లు వివాహం చేసుకోవటానికి సంసిద్ధత పొందేటప్పుడు భార్యాభర్తలు ఎక్కువ సమయం వివాహ పత్రికల మీద, పట్టుబట్టల మీద, పార్టీల మీద దృష్టి పెట్టడం ద్వారా వివాహం చేసుకోవటానికి సరిగా సంసిద్ధత చెందకపోతారు. వారు దేవుడు అనుగ్రహించే కృపావరాలను పొందుటకు ఆయత్తపడుతూ, ప్రేమలో అనునిత్యం ఫలించుటకు తయారుకావాలి. వివాహ సంస్కారాన్ని వధూవరులే నిర్వహిస్తారు. ఈ వివాహ సంస్కార నిర్వహణంలో గురువుగానీ, డీకనుగానీ వివాహానికి సాక్షులుగా నిలుస్తారు. వధూవరులకు దైవాశీస్సులు అందజేస్తారు. వారి వివాహం అన్ని విధాల చట్టబద్ధంగానే జరుగుతున్నదనీ, వధూవరులు పరస్పరం తెలుపుకొనే అంగీకారం సమగ్రమైనదనీ, వారు తమ అంగీకారాన్ని ప్రజలందరి ఎదుట వ్యక్తం చేస్తున్నారని అధికారికంగా నిర్ధారిస్తారు. ఈ పవిత్ర వివాహసంస్కారాన్ని ఆచరించే స్త్రీ పురుషులు ఎలాంటి భయంగానీ నిర్బంధంగానీ ప్రలోభంగానీ లేకుండా స్వేచ్ఛగా, వివాహ ఒప్పందం చేసుకున్నపుడే వివాహ సంస్కారం సంపూర్ణమవుతుంది.

మరి వివాహం ఓ పవిత్ర ఒడంబడికగా మారాలంటే భార్యభర్తలిద్దరూ భౌతిక, శారీరక సౌందర్యానికై పరితపించటమే కాకుండా, ఆధ్యాత్మిక సౌందర్యానికై పరితపిస్తూ, పరిశుద్ధ వివాహాన్ని దేవుని ఏర్పాటుగా భావిస్తూ, వివాహం – క్రీస్తు తిరుసభల ప్రేమబంధముగా అభివర్ణిస్తూ, వివాహం అనే వ్యవస్థను దృఢముగా నెలకొల్పాలి. రెండు మనసులు కలిసి, ఇద్దరు వ్యక్తులు ఏకమై, జీవించడమే దాంపత్యం.

వారు ఏకీభావంతో, సంయోగంతో ఎంతో అన్యోన్యంగా సన్నిహితంగా ఒకరితో మరొకరులీనమై ఒకే శరీరంగా, ఒకే వ్యక్తిగా రూపొందుతారు. కనుక వివాహం అంటే స్వేచ్ఛ, విశ్వసనీయతతో ఏర్పరుచుకొనే ఒక ఒప్పందం మాత్రమే కాదు. ఒక నూతన భాగస్వామ్యం. ఎన్నటికీ విడదీయలేని సంగమం. విడిపోని ఏకత్వం. భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం.

## వివాహ ప్రారంభ కాలములో దంపతులను నడిపించుట

వివాహానంతరం దంపతులు తమ మధ్యగల అనురాగాన్ని అపురూపంగా కాపాడుకుంటూ, ఒకరి కోసం, ఒకరు నిస్వార్థంగా జీవిస్తూ, తమ దాంపత్య బంధాన్ని సుస్థిరం కావించుకోవాలి. "వివాహము అన్ని విషయాలలో ఘనమైనది" (హెబ్రీ 13:4) అని దేవుడు హెచ్చించిన వివాహ ఘనతకు నిలువెత్తు సాక్ష్యం ఈ గొప్ప మాటలు. వివాహబంధంలో ఏకమై, "కష్టంలోను, సుఖంలోను, వ్యాధిలోను, సౌఖ్యంలోను నీకు ప్రామాణికముగా ఉందునని మాట ఇచ్చుచున్నాను. ప్రతి నిత్యము నిన్ను ప్రేమించి, గౌరవించెదను" అని బాహాటంగా, బహిరంగంగా దైవసన్నిధిలో, గురువు, విశ్వాసుల సాక్షిగా వధూవరులు చేసే ఈ నిత్య ప్రమాణాలతో, "నిండు నూరేళ్ళ వరకు, తుదిశ్వాస వరకు నీకు నమ్మకంగా తోడుంటానని", చేసే ఈ ప్రమాణంలో ఎంతో ధైర్యం వుంది, త్యాగముంది, కొండంత భరోసా ఉంది. ప్రతీ ప్రతికూల, అనుకూల పరిస్థితులలో రెండు జీవితాలు, ఇద్దరు వ్యక్తులు ఏక మనసు, ఏక హృదయంతో కలిసుంటామని ముందుకొచ్చి దేవునిలో, ఒకరితో ఒకరు ప్రమాణం చేస్తారు. మరి ఈ చేసిన ప్రమాణాన్ని వధూవరులు వారి జీవిత తుదిశ్వాస వరకు నిలబెట్టుకోవాలి.

క్రైస్తవ ధర్మం ప్రకారం వివాహ దివ్యసంస్కారానికి రెండు ప్రధాన లక్షణాలుంటాయి. అవి ఏకత, అవిచ్ఛిన్నత. స్త్రీ పురుషులు ఏక శరీరులు కావడం, వారి అనుబంధం వారు జీవించి ఉన్నంతకాలం అవిచ్ఛిన్నంగా కొనసాగడం క్రైస్తవ వివాహ ప్రధాన లక్షణం. అదే విధముగా, పవిత్ర వివాహ దివ్యసంస్కారం పరిపూర్ణం ఫలప్రదమూ కావడానికి మూడు ముఖ్యాంశాలు ఉన్నాయి. మొదటిగా స్వేచ్ఛగా కుదుర్చుకొనే వైవాహిక ఒప్పందం. రెండవదిగా సర్వకాల సర్వావస్థలలోను కలసి

ఉంటామని దంపతులు చేసే ప్రతిజ్ఞ, మూడవదిగా సంతానం పట్ల ఆకాంక్ష. క్రైస్తవ వివాహంలో అత్యంత విశిష్టమైన అంశం ఏమిటంటే, దంపతులు తమ వైవాహిక బంధానికి గల మహత్వాన్ని తెలుసుకోగలగటం: క్రీస్తు ప్రభువునకు శ్రీసభకు మధ్యగల ప్రేమ బంధానికి సజీవ ప్రతీక మన వివాహబంధం. మరి ఇటువంటి ప్రేమ బంధాన్ని దంపతులు వారి వివాహజీవితంలో కొనసాగించాలి.

అందుకే పునీత పౌలుగారు ఎఫెసీయులకు వ్రాసిన లేఖ 5వ అధ్యాయములో క్రీస్తునకు శ్రీసభకు మధ్యగల ప్రేమానుబంధాన్ని అనురాగాన్ని, అప్యాయతను సూచిస్తూ, వివాహ సంస్కారములో ఒకటయ్యే స్త్రీ పురుషుల మధ్య అలాంటి బంధం ఏర్పడులాగున ప్రేమించాలని, స్త్రీ పురుషుని యందు సంపూర్ణ వినయవిధేయతలు కలిగి జీవించాలని చక్కని ఉపదేశాన్ని ఇస్తున్నాడు. "భర్తలారా! క్రీస్తు శ్రీసభను ఎట్లు ప్రేమించి, దాని కొరకై తన ప్రాణములు అర్పించెనో, మీరును మీ భార్యలను అట్లే ప్రేమింపుడు". ప్రేమలో వీరిరువురు ఒకరికి ఒకరు తమను తాము ప్రేమ కానుకగా అర్పించుకొందురు. ప్రేమ సర్వాన్ని భరిస్తుందని పౌలు అన్నారు. అనుమానాలైన, మనస్పర్థలైనా వారి మధ్య తలెత్తినవి ఏవైనా ప్రేమ కారణం చేత వెంటనే సమసిపోతాయి. ఇదంతా ఆ దేవుని అనుగ్రహం మరియు ఆయన వరమే కాని వేరు కాదు. ఇలాంటి ప్రేమ క్రీస్తునకు తన సంఘంపై ఉన్నందున తనను తాను మన నిమిత్తం అర్పించుకున్నారు. భార్యాభర్తలు కూడా శ్రీసభను క్రీస్తును పోలి జీవించాలి. ఈ కారణం చేతనే వివాహము ప్రేమ బంధమని పిలుస్తాం.

మరి ఈ ప్రేమ బంధాన్ని ఐక్యత, పునరుత్పత్తి అను రెండు ప్రముఖ ఆశయాల ద్వారా సంతానోత్పత్తి పొంది భార్యభర్తలిద్దరూ తల్లిదండ్రులయ్యే ఉన్నతమైన పిలుపుకు ఆహ్వానించబడతారు. పునీత జాన్ క్రిసోస్టం గారు యువ భర్తలు తమ భార్యలకు ఇలా చెప్పాలని సూచిస్తున్నారు: "నిన్ను నా చేతుల్లోకి తీసికొన్నాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్ను నా సొంత ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను. ఎందుకంటే ప్రస్తుత జీవితంలో ఏమిలేదు. దీనిని నీతో గడపాలని తద్వారా దేవుడు మనకై పదిలపరిచి కొత్త జీవితంలో నీతో వీడిపోకుండా ఉండాలన్నదే నాకల...

అన్ని వస్తువుల కంటే నీ ప్రేమ నాకు విలువైంది. నీ ఆలోచనల కంటే వేరే ఆలోచనలు కలిగి ఉండటం నాకు చాలా చేదైంది, బాధాకరమైంది".

మరి ముఖ్యముగా, దంపతులు వారి ప్రేమ బంధములో ఎదగటమే కాకుండా, పరిశుద్ధ కుటుంబ జీవిత విలువలను, సుగుణాలను గూర్చి తెలుసుకొని, పరిశుద్ధ కుటుంబాన్ని ఆదర్శముగా స్వీకరించాలి. ఈ ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరచే విషయం: అందరూ విలువలు గురించి మాట్లాడటం. కాని, కొంతమంది మాత్రమే వాటిని నిష్టగా పాటించడం. కుటుంబ జీవనానికి నిబద్ధత, విశ్వాసం, ఆత్మత్యాగం చాలా అవసరం. వీటిపైన కుటుంబ జీవితం ఆధారపడుతుంది. పరిశుద్ధ కుటుంబం వీటిని ఆచరించి, మనకు ఆదర్శం చూపారు. యోసేపు, మరియ, బాలయేసుని గూర్చి బహుశ్రద్ధ వహించారు. ఆయన కోసం తమ జీవితాలను త్యాగం చేశారు. నేటి సమాజం పరిశుద్ధ కుటుంబం నుండి నేర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కుటుంబం శాంతీ సమాధానాలతో అలరారుతూ ఐక్యమత్యంగా జీవించాలంటే సుగుణాలు చాలా వరకు అవసరం. కుటుంబాలకు సుగుణాలను అలవర్చుకోవడం ద్వారా దేవుని దృష్టిలోను, మానవుల దృష్టిలోను కుటుంబానికి గౌరవముంది. పునీత పౌలు గారు చూపించిన కనికరం, వినయం, ఔదార్యం, సహనం, పరస్పర మన్నింపు, అన్నిటికన్నా ప్రేమ, ఇవన్నీ కుటుంబాన్ని శాంతీ, సమాధానలతో అలరారునట్లు చేస్తాయి. అంతేకాకుండా, దేవుడు ప్రతి కుటుంబానికి మూలం అని భావించి, ఆయనే వారి కాపరి అని ఆహ్వానించాలి. కుటుంబ ప్రార్థనలకు ప్రాముఖ్యత ఇవ్వాలి, తరుచుగా కుటుంబముగా దివ్య సత్ప్రసాదములో పాల్గొనాలి. రోజూ ప్రార్థించే కుటుంబముగా ఉండాలి. ఇలా ఉంటే అన్ని కుటుంబాలు, గృహస్థ శ్రీసభలుగా అవుతాయి.

## సమస్యలు, ఆందోళనలు, ఇబ్బందులపై పరిపూర్ణముగా పరిశీలించి చూచుట

### సమస్యల ద్వారా ఎదురయ్యే సవాళ్ళు

మన ఇంటిలో చెత్తాచెదారాలు వేసే ఒక డబ్బా ఉంటుంది. దానిలో మనం వ్యర్థపదార్థాలను, కుళ్ళిపోయిన వాటిని, పనికిరాని చెత్త అంతా వేస్తాము.

మరల మనము ఆ చెత్తని మన చేతులతో పట్టుకొని తీస్తామా? తీయము ఎందుకంటే క్రుళ్ళిపోయి కంపుకొడుతుంది. ప్రియులారా! భార్యాభర్తల మధ్య కుటుంబంలో కలహాలు, అనుమానాలు, అవమానాలు, మనస్పర్థలు, భేదాభిప్రాయాలు, వ్యత్యాసాలు వచ్చినప్పుడు పెద్ద మనుష్యులను, ఇరుగుపొరుగు వారిని పిలుచుకొని, విషయాన్ని లోతుగా త్రవ్వి సమస్యను సంక్లిష్టం చేసుకుంటాం. కాని ఒకరినొకరు సర్దుకొనిపోయే మనస్తత్వాన్ని కలిగియుంటూ, పాత జీవితానికి స్వస్తి చెప్పి నూతన జీవితానికి నాంది పలకాలి. అప్పుడే భార్యాభర్తలిద్దరూ కూడా అన్యోన్యముగా, ఐక్యమత్యముగా జీవిస్తారు.

కుటుంబంలో చోటుచేసుకునే కలహాలకు, గొడవలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇద్దరూ కారకులే! నా వల్ల ఈ సమస్య వచ్చిందా, లేదా వేరే వ్యక్తి వలన వచ్చిందోనని విశ్లేషించాలి. ఇద్దరూ కలిసి చర్చించాలి. సమస్య రావడానికి గల కారణాలను గుర్తించి, వాటిని పరిష్కరించుకోవాలి. మరోమారు ఇటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విధంగా చర్చించాలన్నా దానికి కావలసిన జ్ఞానం దేవుని నుండి మాత్రమే వస్తుంది. “ఇల్లు కట్టవలెనన్న విజ్ఞానము అవసరము. పునాదులు ఎత్తవలెనన్న వివేకము ఉండవలెను” (సామెతలు 24:3) “నా బోధనలను ఆలకించి, పాటించువాడు రాతి పునాదిపై తన ఇల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియున్నాడు” (మత్తయి 7:24). దైవజ్ఞానం మనకు లభిస్తే ఎంతటి సమస్యనైనా ఇట్లే పరిష్కరించుకోవచ్చును.

భార్యాభర్తలు అన్నాక సంసారంలో ఏదో ఒక గొడవ రాకమానదు. అంతమాత్రన గొడవను పెంచుకుని, బాధ్యతలు మరచి, ఎడముఖం-పెడముఖం పెట్టుకుంటే కుటుంబంలో ఆనందం ఉండదు. విశాల దృక్పథంతో, కుటుంబ శ్రేయస్సు కోరి, సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలి. సమస్య పెద్దదయితే నిపుణుల వద్ద కౌన్సిలింగ్ తీసుకోవాలి. అంతేగాని సమస్యను విడిచిపెట్టకూడదు. ఒకరి లోపాలను ఒకరు మన్నించుకుంటూ ముందుకు సాగితే కుటుంబంలో ఐక్యత, సంతోషం వెల్లివిరుస్తాయి. అటువంటి కుటుంబం సంఘానికి ఆదర్శంగాను, సంసారం అపురూపంగాను ఉంటాయి.

## గత గాయాలు

కుటుంబ వ్యవస్థలో భార్యాభర్తల మధ్య చిన్నచిన్న మనస్పర్థలు రావడం సహజం. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్దుకోవాలి. కాని భూతద్దంలోంచి చూడకూడదు. ఇలా చూడడం ద్వారానే కుటుంబ వ్యవస్థలో భార్యాభర్తల మధ్య అగాధాలు ఏర్పడి కలహాలకు దారితీస్తాయి. వాటికి పలు రకాలైన కారణాలు ఉన్నాయి. కొన్ని కుటుంబాలలో భార్యాభర్తల మధ్య తగువులు చాలా తక్కువగా ఉంటాయి. కాని, మరికొన్ని కుటుంబాలలో అస్తమానం తగువులు, కొట్లాటలు ఉంటాయి. ప్రతి చిన్న విషయం పెద్ద సమస్యగా మారుతుంది. వీటన్నింటికి ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, మతపరమైన, మానసిక పరమైన ముఖ్య కారణాలుగా ఉంటాయి. అదే విధముగా, కొన్నిసార్లు భార్య లేదా భర్త మానసిక ఆలోచనలలో పరిపూర్ణత, స్థిరత్వం లేనప్పుడు కూడా కలహాలు వస్తాయి. కుటుంబ వ్యవస్థలో చిన్న చిన్న విభేధాలు వస్తుంటాయి. వాటికి తావ్వికుండ సర్దుకోవాలి గాని, అహంకారానికి, పట్టుదలకుపోయి కుటుంబ జీవితం నాశనం చేసుకోకూడదు. భార్యభర్తలిద్దరు ఒకరితో ఒకరు మనసువిప్పి, మాట్లాడకపోవటం వలన వారిలో ఇటువంటి విభేదాలు తలెత్తుతాయి.

## వివాహ విచ్ఛిన్నత, విడాకుల తదనంతరం వారికి తోడ్పడుట

ఒక వ్యక్తి తాను చేసిన వాగ్దానానికి జీవితాంతము కట్టుబడి ఉండగలరని శ్రీసభ నమ్ముతుంది. క్లిష్టమైన సమస్యలు ఎదురైనపుడు సాధారణంగా ఏవివాహ బంధమైనా సంక్షోభంలో పడుతుంది. అయితే దంపతులు కూర్చొని సమస్యలను సావధానంగా చర్చించుకోవటం ద్వారా కలసి ప్రార్థించటం ద్వారా, నిపుణులతో సంప్రతింపులు జరుపటం ద్వారా సంక్షోభం నుంచి బయటపడే మార్గాన్ని కనుగొనవచ్చును. అన్నిటిని మించి వివాహ దివ్యసంస్కారంలో క్రీస్తు ప్రభువు వైవాహిక బంధానికి సాక్షిగా నిలుస్తారు. కనుక, ఆయన నిరంతరము సరికొత్త ఆశలను చిగురింపజేస్తూనే ఉంటారు. అయితే, వైవాహిక సంక్షోభంలో చిక్కుకున్న ఒక వ్యక్తి, ఎంత ప్రయత్నించినా సమస్యలు పరిష్కారం కాని నేపథ్యంలో తన వైవాహిక జీవితం భరించనలవి కానిది అనుకున్నపుడు, ఆధ్యాత్మికంగా గానీ, శారీరకంగా గానీ హింసకు గురైనపుడు విడాకులు తీసుకుంటారు. అయితే ఈ

తరహా విడాకులు విడిమంచాల విడాకులు మాత్రమే. అంటే, ఇది కలసి ఉండలేమనుకున్న దంపతులు విడివిడిగా జీవించే ఏర్పాటే తప్ప వారి వివాహబంధాన్ని రద్దుచేయటం కాదు. వారు వేర్వేరుగా జీవిస్తున్నప్పటికీ వారి వైవాహిక బంధం అవిచ్ఛన్నంగానే ఉంటుంది.

పలు రకాల కారణాల వల్ల, కొన్ని పరిస్థితుల్లో కలసి జీవింపటం అసాధ్యం కావచ్చు. అలాంటి సందర్భాలలో దంపతులు భౌతికంగా విడిపోయి వేరుగా జీవింపటానికి శ్రీసభ అనుమతిస్తుంది. దేవుని ముందు దంపతులు భార్యాభర్తలు లాగే ఉండిపోతారు. కాబట్టి వాళ్ళు కొత్త సంబంధాన్ని కుదుర్చుకోవటానికి వీలు లేదు. ఈ కష్టతరమైన పరిస్థితిలో సాధ్యమైతే సఖ్యపడటమే ఉత్తమమైన పరిష్కారం. ఈ పరిస్థితిలో క్రైస్తవ తరహాలో జీవించటానికి, అవిచ్ఛిన్నమైన వైవాహిక బంధానికి విశ్వసనీయులు కావటానికి సహాయం అందించటానికి క్రైస్తవ సమాజం పిలుపునందుకొంది. అయితే ఇలా వేర్వేరుగా బతకాలని నిర్ణయించుకున్న దంపతులు ఆ విషయాన్ని స్థానిక శ్రీసభ అధిష్టానానికి తెలియజేయాలి, వారి సలహాలకు చెవియొగ్గాలి.

ఏది ఏమైనా సరే దాపంత్యబంధం ద్వారా “భిన్నశరీరులు గాక ఏక శరీరులై ఉండే” దంపతులు (మత్తయి 19:6). ఒకరికొకరు సహాయ సహకారాల నందజేసుకుంటూ, ఒకరికొకరు సేవలు చేసుకుంటూ అన్యోన్యంగా జీవించాలి. ఆదర్శ ప్రాయమైన కుటుంబ జీవితానికి ఏకీభావం సదవగాహన ఎంత అవసరమో గుర్తించాలి, సర్వకాల సర్వావస్థలలోను సఖ్యతతో మెలగాలి. అంటే, దంపతులు పరస్పరం నమ్మక పాత్రుల్లా మెలగాలి, ఒకరినొకరు కట్టుబడి ఉండాలి. ఎలాంటి పరిస్థితులలోను ఒకరినుంచి ఒకరు విడిపోయే ప్రయత్నాలు చేయరాదు. దేవుడు నిర్దేశించిన వివాహ వ్యవస్థలో విడాకులు చెల్లుబాటు కావు. అప్పుడే వివాహ బంధం అర్థమవుతుంది. పటిష్ఠమవుతుంది. ఫలప్రదమవుతుంది.

## కొన్ని దాటవేయలేని క్లిష్టమైన పరిస్థితులు

ఏకలింగ సంపర్కాలు, ఆకర్షణలు, దైవ ప్రణాళిక కాదు. ప్రకృతి సిద్ధాంతాలకు, దైవ నిర్ణయానికి శ్రీసభ బోధలకు విరుద్ధం అని బోధించాలి.

వారిని ఖండించక, వెలివేయక, వారిపట్ల దయ, కరుణ అనే ప్రేషిత కార్యాలు చేస్తూ, పెండ్లి, కుటుంబం దేవుడు ఏ విధంగా నిర్ణయించారో తేలియజేయాలి. సవాళ్ళు, ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు శ్రీసభ ప్రేమ, కరుణ, జాలి అనే తలుపులు తెరవాలి.

అవకతవకలు ఉన్న కుటుంబాల పట్ల శ్రీసభ ప్రేమ చూపుతూ దేవుని వైపుకు నడపాలి. వారిని వెలివేయక, ఖండించక, తప్పును ఖండిస్తూ, ప్రేమతో వారిని క్రీస్తు వైపుకు నడపాలి. విడాకులు తీసుకొనక వేరువేరుగా జీవించుచూ, తమను తాము పవిత్రంగా ఉంచుకున్న భార్యాభర్తలకు దివ్యసత్ప్రసాదం ఇస్తూ, వారి కుటుంబాన్ని సరిదిద్దాలి. సవాళ్ళు ఎదురుకుంటున్న కుటుంబాలు ఈ సూత్రాన్ని పాటించాలి. ప్రేమ ఎన్ని తప్పులైనను మన్నిస్తుంది, భరిస్తుంది. వ్యక్తిత్వ స్వీయవాదం, సౌఖ్యవాదం, భౌతికవాదం, వినిమయవాదం, గర్భనిరోధక మనస్తత్వం, సాంకేతిక జీవనశైలి అనే అంశాలు, వివాహ ఐక్యత, శాశ్వతత్వం, స్థిరత్వం అనే విలువలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. కాబట్టి పెండ్లి, కుటుంబం దేవుని ప్రణాళిక అనే దాన్ని మరియొకసారి ధృఢపరచాలి. సమస్యలున్నా కుటుంబాన్ని అర్థం చేసుకొని ఖండించక, గృహస్థ శ్రీసభలో చేర్చుకోవాలి. "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" (జి.యస్. 52) ఇలా అంటుంది. "కుటుంబం సంపూర్ణ మానవ వికాసానికి దోహదం చేసే పాఠశాల. పాఠశాలలో భార్యాభర్తల మధ్య సఖ్యత, స్నేహ భావం, ప్రేమ, అన్యోన్యత వెల్లివిరియాలి."

## మరణపు ముళ్ళు మనలను బాధించినపుడు

మరణం ఒక అంతు చిక్కని రహస్యం. ఏదో ఒకరోజు మనమందరం మరణ కౌగిలిలో వాలవలసిందే. కాని ఎలా ఎప్పుడు, ఎక్కడ ఏ స్థితిలో కౌగిలించుకోబడతామో ఎవరికీ తెలియదు. అయినా మరణం తరువాత తీర్పుంటుందని తెలిసినవారు నిత్యనరకాన్ని గూర్చి భయపడతారు. కాని మరణం గూర్చి మనందరం గ్రహించే విషయం మరణం తథ్యం. మరణ ద్వారం గుండా అందరూ వెళ్ళవలసిందే. మరణం ఒక రణం, యుద్ధం, పోరాటం, ప్రయత్నం అనగా ఈ రణంలో మనం గెలవాలి అనుకోవటమే మరణం. అందుకే పునీత పౌలు భక్తుడు తిమోతికి వ్రాసిన రెండవ లేఖలో ఈ విధంగా చెప్పాడు: "ఇప్పుడు

నా కొరకై పందెపు బహుమానము వేచియున్నది. నీతి కిరీటమును నీతి గల న్యాయాధిపతియగు ప్రభువు ఆ రోజున నాకు ప్రసాదించును. నాకే కాదు, ఆయన దర్శనముకై ప్రేమతో వేచియున్న వారికి అందరికిని అనుగ్రహించును" (2 తిమోతి 4:8).

మరణానికి మరోపేరు ఎడబాటు. కావలసిన మనుష్యుల మధ్య నుండి దూరమై పోవటం. ఒకరిపట్ల ఒకరికున్న ప్రేమ అప్యాయతల నుండి దూరమై పోవటం. అందుకే మనిషి మరణిస్తే ఏడుస్తాం, దు:ఖిస్తాం. మరచిపోలేని బాధతో కొంతకాలం వరకు తపించిపోతాం. ఎడబాటు తనము మనిషి జీవితంలో చాలా సందర్భాలలో ఎదురౌతూ వుంటుంది. భార్యాభర్తల మధ్య ఎడబాటు తల్లీబిడ్డల ఎడబాటు, బంధువులతో, స్నేహితులతో ఎడబాటు అనేది తటస్థపడుతుంది. దీనిని మనము ప్రేమతో, సఖ్యతతో, ఓర్పుతో, సహనముతో తిరిగి కలసి జీవించుటకు అవకాశముంది.

అందుకే, మనం మృతుల దివ్యబలిపూజలో పాల్గొనినప్పుడు గురువు మృతుల స్తుతిగీతములో ఈ విధంగా చెప్తారు. "మరణము తప్పదన్న సత్యము మాకు దు:ఖము కలిగించినను, శాశ్వత జీవితం ఉన్నదన్న వాగ్దానం మాకు ఊరటనిచ్చుచున్నది. ఓ ప్రభువా! నీ విశ్వాసలకు జీవితము మారుచున్నదే గాని నాశనమగుట లేదు. ఇహలోకపు అనిత్య నివాసము శిధిలమైనప్పుడు, పరలోకపు నిత్యనివాసము పొందగలుగుచున్నాము". విశ్వాస దృక్పథంలో భార్యాభర్తల జీవితం, మానవ జీవితం శాశ్వతం. మన కుటుంబాలలో ఎవరైనా వ్యక్తులు మరణించినప్పుడు అందరూ దు:ఖిస్తాం. అయితే పరిశుద్ధ గ్రంథం మనకి దర్శన గ్రంథము 21:4 లో ఈ విధముగా తెలియజేస్తుంది. "వారి నేత్రముల నుండి వెలువడు భాష్పములను ఆయన తుడిచి వేయును. ఇక మృత్యువు గాని, దు:ఖమును గాని, ఏడ్పుగాని, బాధగాని ఏ మాత్రము ఉండబోదు". ఎందుకంటే నిజానికి స్వర్గవాసులైన విశ్వాసులను ఉద్దేశించి మనం చేసే ప్రార్థనలు వారికి అర్పించే సుకృత కార్యాలు, ప్రేమతో చేసే సేవా కార్యాలన్నీ సాక్షాత్తూ క్రీస్తు ప్రభువుకే చేరుతాయి. అదే విధముగా, మనం ఈ లోకంలో ఎంత మంచిగా జీవించగలుగుతామో, అంతే సంతోషముతో మన ప్రియమైన వారిని, తోబుట్టువులను గాఢముగా ప్రేమించగలము.

# 7. పిల్లల విద్యాభ్యాసం పురోగతి

**– బ్రదర్ తమనంపల్లి సంతోష్**



తల్లిదండ్రుల ప్రభావం బిడ్డలపై ఉంటుంది. అది మంచికైనా కాని, చెడుకైనా కాని ముఖ్యంగా పిల్లల నైతిక జీవనంపైన వుంటుంది. పిల్లలకి పిన్న వయస్సు నుంచే నైతిక విలువలు బోధించాలి. అందుకు ప్రతి తల్లిదండ్రులు ఆత్మసాక్షిగా, పట్టుదలగా, బాధ్యతగా శ్రీకారం చుట్టాలి. కుటుంబంలోనే పిల్లల విద్యాభ్యాసం మొదలవుతుంది. కాబట్టి ఆ విద్యాభ్యాసం ముఖ్యమైనది, ప్రధానమైనది.

### మన బిడ్డలు ఎక్కడ?

తల్లిదండ్రులు, వారి పిల్లల యొక్క భవిష్యత్తును పరిగణించాలి. దానికి కుటుంబం యొక్క ప్రోత్సాహం, సహాయం, సలహాలు – సూచనలు చాలా అవసరం. తల్లిదండ్రులు వారి బిడ్డల కదలికలను ఎప్పటికి అప్పుడు గమనిస్తూ ఉండాలి. ముఖ్యంగా వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు? వారి గదులలోనికి ఎవరు ప్రవేశిస్తున్నారు? ఖాళీ సమయంలో ఎవరితో కాలక్షేపం చేస్తున్నారు? ఇలా వారిని పర్యవేక్షిస్తూ, ఉంటే వారి బంగారు భవిష్యత్తుకు పునాధులు వేయగలరు. తల్లిదండ్రులుగా, వారి బంగారు భవిషత్తుకై ముందుగా క్రమబద్ధమైన ప్రణాళిక వేసుకుంటూ జాగరూకులై ఉండుట యెంతయినా మంచిది. వారు ఎప్పుడూ కూడా తమ పిల్లలు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చూడాలి (మత్తు ద్రవ్యాలకు, దుర అలవాట్లుకు, చెడు వ్యసనాలకు) బానిసలుకాకుండా భద్రముగా చూసుకోవాలి.

ఏ తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఎదురయ్యే అనుభవాన్ని, నియంత్రించలేరు ఎందుకంటే ఆ అనుభవ సమయ సందర్భాలు అంత విలువైనవి. ముఖ్యంగా

తల్లిదండ్రులు గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటి అంటే వారు వారి పిల్లల్ని గమనిస్తున్నారని, వారికి ఆంక్షలు, షరతులు విధిస్తున్నారని వారికి అనుమానం రాకుండా చాలా చాకచక్యంగా వ్యవహరించాలి. అలా వారికి అనిపిస్తే వారి ఆలోచన దోరణి మనస్సు, నటించే ఆస్కారం ఉంటుంది. తల్లిదండ్రులుగా పిల్లలకు నేర్పించే, బోధించేది ఏమిటి అంటే, వారికి జీవితంలో ఎన్ని సమస్యలు వచ్చినా, అడ్డంకులు వాటిల్లినా వాటిని ధైర్యంగా, ఎదుర్కొనే మనో ధైర్యాన్ని వారిలో నింపాలి. తల్లిదండ్రులుగా మీరు మీ పిల్లలకు ఇచ్చే స్వేచ్ఛని వారు బాధ్యతతో అనుభవించే వాతావరణం కల్పించాలి.

అలా మీరు వారికి బాధ్యతాయుతమైన స్వేచ్ఛని కల్పించినట్లయితే వారి ఆలోచన, తెలివి, వివేకం అభివృద్ధి చెందుతాయి. ఇంకా వారికి ఏ సమస్య ఏదురైనా వాటిని తెలివిగా, ధైర్యంగా ఎదుర్కొంటారు. కనుక తల్లిదండ్రులుగా మన పిల్లలు శారీరకంగా, మానసికంగా ముఖ్యంగా వారి జీవిత లక్ష్య సాధనలో ఎక్కడ ఉన్నారు? అని మనం గమనించాలి. ప్రతి ఒక్కరు కూడా ప్రత్యేకంగా దేవుని చేత సృష్టించబడినారు. వారి నైపుణ్యం, వ్యక్తిత్వం వేరువేరుగా ఉంటాయి. కనుక తల్లిదండ్రులుగా వారి పిల్లల నైపుణ్యాలను వెలికితీయాలి. వారి ప్రత్యేకతలు ఏమిటి? ఎంత వరకు వారు అభివృద్ధి చెందారు అని గమనించాలి. ప్రతి ఒక్కరికి దేవుడు ఇచ్చిన వరం కుటుంబం. ఆ కుటుంబమే మొదటి విద్యాలయం. ఆ కుటుంబంలో దొరికే స్వేచ్ఛ బాధ్యాతాయుతంగా అనుభవిస్తూ, మంచి విలువలు కలిగిన విద్యను అభ్యసిస్తే తప్పకుండా ప్రగతి పథంలో వారి విద్యాభ్యాసం కొనసాగుతుంది.

## బిడ్డల నైతికజీవన తర్ఫీదు

ఎక్కువ మంది తల్లిదండ్రులు పిల్లల నైతిక జీవన అభివృద్ధిని పాఠశాలలోని ఉపాధ్యాయులకు వదిలేస్తారు, పూర్తిగా ఉపాధ్యాయులపై భారం మోపి తల్లిదండ్రులు చేతులు దులుపుకోవటం అనేది మంచిదికాదు. ఉపాధ్యాయుల కంటే కూడా తల్లిదండ్రులకే పిల్లల బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా నైతిక జీవన అభివృద్ధిపైన. ఈ నైతిక జీవన అభివృద్ధి ఎల్లప్పుడు కూడా ఉత్సాహంగా, అసక్తిగా, సరైన మెరుగైన నూతన పద్దతులతో పిల్లలకు బోధించాలి. అపుడే పిల్లలు అసక్తిగా

తొందరగా నేర్చుకోవాలి అని తపన కనపరుస్తారు. మనం ఏ కార్యం చేసినా ఆ కార్యం మన నైతిక జీవనానికి ముడిపడి వుంది. మనకి నైతిక విద్యాభ్యాసం ఉన్నా కాని, కొన్ని సార్లు మనం నైతిక విలువలు పాటించము. మన అంతరాత్మను కూడా ప్రక్కన పెట్టి మనకు ఇష్టం వచ్చిన రీతిలో మనం ప్రవర్తిస్తాము. ప్రతి ఒక్కరికి వ్యక్తిగత ఆసక్తి ఉండాలి, నైతిక విలువలను పాటించటంలో. కాని ప్రస్తుత సమాజంలో నైతిక జీవన జీవితం సన్నగిల్లుతుంది అనుటలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

మంచి అలవాట్లను అభివృద్ధి చేసుకోవటం అవసరం. మనం బాల్యంలో కొన్ని మంచి పనులు, అలవాట్లుగా మారి నైతిక విలువలుగా మార్పు చెంది అవి ఇతరులతో ఐక్యతగా, సమాజ శ్రేయస్సుకై ఉపయోగపడాలి. మనం బాల్యం నుంచే కొన్ని పదాలను వాడము లేదా ఉపయోగించము ముఖ్యంగా "దయచేసి", "ధన్యవాదములు", క్షమించండి" ఎందుకంటే అవి ఉపయోగిస్తే చిన్నతనంగా ఉంటుందని భావిస్తాము. కాని మనం మన ఆలోచన ధోరణిని మార్చుకోవాలి. మనకు ఉన్న స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవాలి. మనం నేర్చుకున్న నైతిక విద్య స్వేచ్ఛాయుతంగా, క్రియారూపకంగా, వినూతనంగా రూపుదిద్దుకోవాలి. మంచినైతిక విలువలు కలిగిన వ్యక్తులు స్వేచ్ఛను మంచిగా, సద్వినియోగం చేసుకుంటారు. ఏ కార్యం చేసినా మనస్ఫూర్తిగా వ్యక్తిగత శ్రద్ధతో, చేస్తే అంతా మంచే చేస్తాము ఒక వేళ చెడుచేసినా మన మనసాక్షి, అంతరాత్మ ఓప్పుకోదు. ముఖ్యంగా ఈ నైతిక జీవనాన్ని మెరుగుపరచటానికి తగిన తర్ఫీదు ఎంతై నా అవసరమే.

## దిద్దుబాటు యొక్క విలువ ఒక పరిష్కారం

పిల్లలు తెలిసీ తెలియక తప్పులను చేస్తారు. తల్లిదండ్రులుగా ఉపాధ్యాయులుగా, పెద్దలుగా మనం ఆ తప్పులను గుర్తెరిగి వారిని తగిన రీతిలో, వారి మనస్సు నొప్పించకుండ వారు చేసిన తప్పు ఏమిటో వారికి తెలియజేయాలి. పిల్లలు ఇతరులకు ఇబ్బంది గాని, హానిగాని కలిగించినట్లయితే వెంటనే వారి నుండి క్షమాపణ కోరటం మంచిదిగా వారికి తెలియజేయాలి. తల్లిదండ్రులుగా మనం పిల్లల్ని పాఠశాలకి విద్యాలయాలకి పంపిచటం, విద్యను నేర్చుకోమని ప్రోత్సహించటం మంచిదే అయితే పిల్లలు పాఠశాలకి వెళ్ళిన తరువాత వారు

ఏవిధంగా విద్యను అభ్యసిస్తున్నారో, వారి నడవడిక, ప్రవర్తన ఎలా ఉందో మాత్రం మనం పట్టించుకోము. పిల్లలు తప్పుచేస్తే తల్లిదండ్రులు ఖండించాలి. అంతేకాని మహా గారాబం చేసి, ప్రతి దానికి వారిని వెనుకేసుకొని రాకూడదు. పిల్లలు కూడా వారి తప్పులను దిద్దుకుంటూ, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు చెప్పే మంచి మాటలను చేసే సవరణలను ప్రేమతో స్వీకరించి, ఆచరణలో పెట్టాలి. అంతేకాని వారి మీద కోపంగా, కక్ష్యగా, ప్రతీకారం తీసుకోరాదు ఎందుకంటే పిల్లల భవిష్యత్తుకే వారు దిద్దుబాటు చేసేది. ఏ పిల్లవాడు అయినా తప్పు చేస్తే సరిదిద్దాలి కాని అతనిని శత్రువుగా చూడరాదు. పెద్దవారు పిల్లల్ని తప్పు చేయమని ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని ప్రేరేపించరాదు. పెద్ద వారిగా మన ప్రవర్తన మంచిగా పిల్లలకు ఆదర్శంగా ఉండాలి. పిల్లలు నేర్చుకునే క్రమశిక్షణ మరియు దిద్దుబాటు, నిరుత్సాహమునకు కాదు కాని, ప్రోత్సాహకరంగా, భవిష్యత్తులో జీవిత గమ్యానికి దోహదపడే విధంగా ఉండాలి. తల్లిదండ్రులుగా పిల్లల యొక్క కోరికలను, నిర్ణయాలను గౌరవించాలి. అప్పుడే పిల్లలు ప్రగతిపథంలో దిద్దుబాటు యొక్క విలువను తెలుసుకోగలరు.

## సహన నిజతత్వం

పిల్లల వద్ద నుంచి గాని, యువత నుంచి గాని, వారి స్తోమతకి మించి వారి నుండి ఆశించటం మంచిదికాదు. పిల్లలకి బాధ్యతాయుతమైన స్వేచ్ఛని కల్పించటం వలన వారు సహనంగా, నిజాయితీగా ఉంటారు. అనేక సార్లు మనం పొందిన నైతిక జీవన తర్ఫీదును పెడచెవిన పెడతాము. కారణాలు అనేకం ఉండవచ్చు కాని ఈ నైతిక జీవితాన్ని మాత్రం విడనాడరాదు. పిల్లలకు అనేక అపోహలు ఉండవచ్చు. పెద్దలుగా, తల్లిదండ్రులుగా గురువులుగా మనం ఆ అపోహల నుండి వారిని విముక్తులను చేయాలి. పిల్లలు కేవలం పాఠశాలలోనే నైతిక విలువలను తెలుసుకుంటే సరిపోదు. సమాజంలో మంచి వ్యక్తులనుంచి కూడా తెలుసుకోవచ్చు. అప్పుడే సమాజంలో శాంతీ సమాధానాలతో జీవిస్తారు.

పిల్లల యొక్క శక్తి సామర్థ్యాలను బట్టి వారికి నైతిక విలువలను నేర్పించాలి. అంతేగాని బలవంతంగా నైతిక విలువలను వారిపై రుద్దరాదు. ఈ విధంగా నేర్పించాలని మానసిక వైద్యనిపుణులు ఆదేశిస్తున్నారు. వారు కూడా పూర్తి అధ్యయనం

చేసి, పిల్లల వ్యక్తిత్వంలో, ప్రవర్తనలో అభివృద్ధిని గమనించిన తరువాతనే మనకు చెబుతున్నారు. ఇంకా ఆ మానసిక వైద్యులు ఆదేశించేది ఏమిటి అంటే తల్లిదండ్రులు పిల్లలకిచ్చే స్వేచ్ఛ, తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే అనుభవించాలని. కొన్ని సార్లు యువత మత్తు పదార్థాలకు పానియాలకు, అలవాటుపడి వాటి బారి నుండి విముక్తులు కాలేరు. అటువంటి తరుణంలో వారికి తప్పనిసరిగా ఇతరులనుండి సలహాలు, సూచనలు ఇచ్చి వారిని విముక్తులను చేయాలి.

## కుటంబ జీవితం విద్యకు నిలయం

కుటుంబమే మొట్టమొదటి నైతిక విలువలు నేర్పే శిక్షాణాలయం. కుటుంబంలో నేర్చుకునే ప్రతి మంచి పని అయినా చెడు పని అయినా జీవిత కాలమంతా నిలచిపోతుంది. కాబట్టి చిన్న ప్రాయం నుంచే కుటుంబంలో మంచి నైతిక విలువలు నేర్చుకోవాలి. కుటుంబంలో మనకు సాంకేతిక పరికరాలు అయిన టెలివిజన్, కంప్యూటర్స్, చరవాణిలు, ఇంటర్‌నెట్లు మొదలగునవి తప్పుడు ప్రసారాలు చేసి మనలను తప్పుడు మార్గం ఎంచుకునేందుకు ప్రేరణ కల్పిస్తాయి. కాబట్టి ఈ సాంకేతిక పరికరాలను మన నైతిక విలువలను అభివృద్ధికి దోహదపడేలా వాటిని వినియోగించుకోవాలి. ప్రస్తుత రోజులలో సాంకేతిక పరిజ్ఞానం చాలా అభివృద్ధి చెందింది. పిల్లలు కూడా వీటికి బానిసలైపోతున్నారా? ఇది కుటుంబాలకు ఒక సవాళ్ళుగా మారింది. అందుకే వాటిపై సరియైన అవగాహన కల్పించి, నమ్మకమైన విద్యను బోధించాలి. అంటే ఈ సాంకేతిక పరికరాలను పూర్తిగా నిషేదించమని కాదు కాని, వాటి వాడకం ద్వారా మన నైతిక జీవనం మెరుగుపడాలి. అందుచేత ఈ సాంకేతిక పరికరాలను ఒక వయస్సు వచ్చిన తరువాత వినియోగించడం, అప్పటి వరకు ఓపిక పట్టడం ఎంతైనా శ్రేయస్కరం ఎప్పుడైతే పిల్లలు వారి బాధ్యతను స్వీకరించి వారి జీవితాలకి వారే బాధ్యులమని తెలుసుకుంటారో వారు ఈ సాంకేతిక పరికరాలను ఉపయోగించుకోవచ్చు. కాని పిల్లలుగా ఉండి పెద్దవారుగా మారాము అని నటించి అవి వాడితే వారు తప్పుడు త్రోవలలో పడినట్లే. వారు బాధ్యతాయుతమైన స్వేచ్ఛను అనుభవించలేదు అని భావం. ఏ కుటుంబం అయితే మంచి నైతిక విలువలు కలిగి వుంటుందో ఆ కుటుంబంలోని పిల్లలు మంచిగా విద్యాభ్యాసం

పొందుతారు. కుటుంబంలోనే ప్రథమంగా అన్ని విలువలను నేర్చుకునేది. ముఖ్యంగా ఇతరులతో ఏవిధంగా కలివిడిగా ఉండాలి. ఇతరులను ఎలా గౌరవించాలి, ఆపదలో ఉన్న వారికి ఏలా సహయం చేయాలి, సహనంగా ఎలా ఉండాలి, ఐక్యతగా ఎలాఉండాలి అని మనం నేర్చుకునే చదువు, నేర్పించే విద్య సమాజం కూడా మన సొంత కుటుంబం అనే భావన కలగచేయాలి. ఇంకా ఆ చదువు, విద్య ఈ సమాజంలో ఏలా ఐక్యతగా, ఒకటిగా కలసి జీవించాలో నేర్పించాలి. ప్రతిరోజు కుటుంబం క్రొత్త పద్ధతులతో కుటుంబ సభ్యులను, వారి మంచిని గుర్తెరిగి అభినందించాలి. కుటుంబాలు ప్రకృతి పట్ల కనికరం కలిగి, ఈ ప్రకృతి కూడా మన కుటుంబంలో భాగమే అని భావించి ప్రకృతిని పరిరక్షించాలి. కుటుంబం అన్నాక మానవ బలహీనతల వలన కొన్ని సమస్యలు ఎదురవుతాయి, వాటిని సవాళ్ళుగా తీసుకొని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగటానికి మనం నేర్చుకునే, నేర్పించే విద్య మనకు తెలియజేయాలి.

తల్లిదండ్రులు, పిల్లల మధ్య జరిగే విద్యాభ్యాస ప్రక్రియ వారి మధ్య ఉన్న సంబంధాన్ని బలపరచాలి. ముఖ్యంగా దూర ప్రాంతాలలో ఉండేవారు ప్రసార సాధనాల ద్వారా అనుసంధానమై ఉండాలి. ఒకరికొకరు వ్యక్తపరచుకోవాలి. సమస్యలను పరిష్కరించుకోవాలి. ఒంటరితనంగా భావింపక, కుటుంబ సభ్యులతోనే ఉన్నాము అని ముందుకుసాగాలి. కొన్ని సమయాల ఈ ప్రసార సాధనాలు కుటుంబ సభ్యుల మధ్య ఉన్న సంబంధాన్ని దూరం చేయవచ్చు. ముఖ్యంగా చరవాణి శరీరభాగమైయింది. ఈ చరవాణి ద్వారా లాభాలు, నష్టాలు ఉన్నాయి. ఈ చరవాణిని విపరీతంగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా వినియోగిస్తున్నారు. దాని ఫలితంగా అనేక శరీర వ్యాధులు వస్తున్నాయి. ఇంకా ప్రక్క వారిని నిర్లక్ష్యం చేస్తున్నారు. "కాబట్టి ఈ సమస్యను కుటుంబ సభ్యులు చర్చించుకొని వాటి వాడకంపై ఆంక్షలు విధించుకోవాలి. ముఖ్యంగా క్రైస్తవ సంఘాలు కుటుంబాలకు భరోసగా ఉంటూ, విశ్వాసాన్ని వ్యాప్తి చేయాలి. పరిపూర్ణ విద్యని అందించటానికి, కుటుంబాలు, సంఘాలు, విద్యాసంస్థలు నిబంధన విధానాన్ని నూత్నీకరించుకోవాలి. పీఠాధిపతుల సమాఖ్య సదస్సు తీర్మానం ప్రకారం కతోలిక విద్యాసంస్థలు ప్రతి విద్యార్థి కూడా

అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దాలని ఆదేశించాయి. దాని ద్వారా క్రీస్తు ప్రేమ హృదయం వలే పిల్లల హృదయం కూడా మారి వారి ప్రవర్తనలోనూ నడవడికలోనూ మార్పు తీసుకురావచ్చు. ఇదే అంశం శ్రీసభ కూడా బోధిస్తూ విద్యాభ్యాసానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుంది.

## లైంగిక విద్యాభ్యాస ఆవశ్యకత

ద్వితీయ వాటికన్ మహాసభ లైంగిక విద్య యొక్క ఆవశ్యకతను వాస్తవిక కోణంలో పిల్లలకు నేర్పించాలని ఆదేశించింది. ప్రతి విద్యా సంస్థ కూడా ప్రశ్నించుకోవలసిన విషయం ఏమిటంటే: ఎంత వరకు ఈ లైంగిక విద్యపై అవగాహన తరగతులను నిర్వహిస్తున్నాము అని. ఈ పని అంత సులువైనది కానప్పటికి దాని యొక్క ఆవశ్యకతను గుర్తెరిగి అవగాహన తరగతులను నిర్వహించటం మన బాధ్యత. ఈ లైంగిక విద్య పిల్లల యొక్క వయస్సు, ఆలోచనను బట్టి బోధించాలి. వారి యొక్క పరిపక్వతను పరిగణలోనికి తీసుకొవాలి. చాలా మంది పిల్లలు, ముఖ్యంగా యువత నీలిచిత్రాలు, బూతుబొమ్మలు వల్ల ప్రేరేపితులై ఇది ఒక శారీర సుఖ:మని తప్పుగా అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా యువత తెలుసుకోవలసిన విషయం ఏమిటి అంటే "మీ పరిపక్వత గురించి అనేక మంది అనేక రకాలైన తప్పుడు సమాచారాన్ని ఇస్తుంటారు అవి మీ యొక్క అభివృద్ధికి ఏ విధంగాను దోహదపడవు" పిల్లలకు బోధించే వాళ్ళు చాలా జాగ్రతగా, క్రొత్త పదజాలంతో, వారికి అర్ధవంతంగా వారు తప్పుడు మార్గాలకు వేళ్ళకుండా బోధించాలి. ముఖ్యంగా మానవ శరీర భాగాల గురించి, శరీర మార్పుల యొక్క ప్రాముఖ్యతను చాలా అర్ధవంతంగా, జాగ్రతగా తెలియజేయాలి.

సహజంగా ఈ లైగింక విద్య గురించి తనకు తానే రహస్యంగా తెలుసుకుంటారు కాని అది అంత మంచిది కాదు. కొంత మంది స్వీయ లైంగికానందమునకు అలవాటు పడతారు. యువత శరీరభాగాలను అగౌరపరుస్తూ విలువ లేకుండా వివాహనికి సిద్ధమౌతారు. ఆ వివాహం ఎక్కువకాలం నిలువకపోవచ్చు. అందుకే ముందుగా యువత ఈ లైంగిక విద్యని బాగా అభ్యసించాలి. లేదంటే యువత భ్రమలో జీవిస్తారు. సహజంగా యువతికి క్రొత్త

పరిచయాలు, ప్రేమ వ్యవహారాలు ఎదురవుతాయి. శరీర కామ వాంఛలు పుటుకొస్తాయి. కాని వాటిని అధిగమించి మన శరీరాన్ని మన ఆధీనంలో ఉంచుకోవాలి. భ్రమలో నుండి బయటికి రావాలి. కాని బాధాకరమైన విషయం ఏమిటి అంటే : ఈ యువతను మంచి మార్గంలో నడిపించాలి అని ఎవరూ అనుకోరు. వారిని ఎవరు ముందుకు నడిపిస్తారు? ముఖ్యంగా ఈ కౌమార దశలో యువతకు లైంగిక విద్యపై అనేక సమస్యలు అనుమానాలు ఉంటాయి. ఈ లైంగిక విద్య వాటికి చక్కటి పరిష్కారం చూపాలి. వారి శరీరం పై గౌరవం పెరగాలి. వారి శరీరాలను దేవునిచే సృష్టించబడినవి అని వారికి గుర్తు చేయాలి. వారి శరీరంలో మార్పులు మంచికేనని, సహజం అని గుర్తుచేయాలి. ముఖ్యంగా స్త్రీ శరీరం అయినా కాని పురుషుని శరీరం అయినా కాని దేవుని యొక్క సృష్టి అని గమనించాలి. వారిలో శరీర వాంఛలు సహజమని తెలుసుకోవాలి. ఈ జీవితం దేవుని గొప్ప వరంగా భావించి సంతోషంగా జీవించాలి. సమాజంలో ఒకరిపట్ల ఒకరు ప్రేమగా జీవించాలి. దేవుని దృష్టిలో స్త్రీ, పురుషులు వేరుకారు. కాబట్టి తల్లిదండ్రులుగా మన బాధ్యతను స్వీకరించి పిల్లలకు, యువతకు మంచి నడవడికను బోధించాలి. ముఖ్యంగా తల్లిదండ్రులుగా పెద్దలుగా, గురువులుగా ఈ యొక్క లైంగిక విద్యపై పూర్తి అవగాహనతో పిల్లలకు, యువతకు బోధించటానికి తగిన కృషి చేయాలి.

## విశ్వాసాన్ని భావితరానికి అందించుట

మన పూర్వీకులు పొందిన విశ్వాసాన్ని వారు తరువాత తరానికి అందించారు. అలాగనే తల్లిదండ్రులుగా మనం మన పూర్వీకుల వద్ద నుండి పొందిన విశ్వాసాన్ని మన తరువాత తరానికి అందించవలసిన బాధ్యత మనకు ఉంది. కాని ప్రస్తుత కాలంలో ఈ బాధ్యత సన్నగిల్లుతుంది. ఎందుకంటే తల్లిదండ్రుల పని భారం వల్ల కాని, సాంకేతిక ప్రపంచ పరిణామాల వల్లగాని అది సన్నిగిల్లుతుంది. కాని క్రైస్తవ కతోలిక కుటుంబాలుగా మనం మన పిల్లలకి ఆ గొప్ప విశ్వాసాన్ని అందించాలి. దానితో పాటు ప్రార్థన ఎలా చేయాలి. పొరుగువారికి ఆపదలో ఉన్న వారికి ఎలా సహాయాన్ని అందించాలో నేర్పించాలి. ఇటువంటి గొప్పకార్యం మన జ్ఞానస్నానంతో ప్రారంభమవుతుంది. పునీత అగస్టీను గారు అంటారు: “పవిత్ర పుట్టుకకు సహకరించు”

అని. ఇటువంటి నూతన జీవన పయనం అనునిత్యం అభివృద్ధి చెందాలి. విశ్వాసం అనేది సాక్షాత్తు ఆ దేవుడు మనకు ఇచ్చిన గొప్పవరం. దీనిని మనం జ్ఞానస్నానంలో పొందుకుంటాము. అంతేకాని మన కృషికాదు. ఆ మహత్తర కార్యాన్ని నెరవేర్చటానికి తల్లిదండ్రులను దేవుడు మధ్యవర్తులుగా ఎన్నుకొని వినియోగించుకుంటాడు. మనం కనుక దేవాలయాలలో గమనిస్తే తల్లి తన చిన్న పిల్లలకి బాలయేసు స్వరూపాన్ని, మరియతల్లి స్వరూపాన్ని ఏవిధంగా తాకి దండం పెట్టుకొని ప్రార్థించాలో చక్కగా నేర్పిస్తుంది. అలా పిల్లలు చిన్న ప్రాయం నుంచే ప్రార్థనా స్థలాల్లో ఎలా ప్రార్థన చేసుకోవాలో నేర్చుకుంటారు. అలా విశ్వాసాన్ని అందించాలి. కీర్తన 144:4 "నరుడు అల్పమైన శ్వాసము వంటివాడు. అతని రోజులు నీడవలే సాగిపోవును". యెషయా 38:19 "తల్లిదండ్రులు తమ తనయులతో నీవు నమ్మదగిన వాడవని చెప్పుదురు" ఇంకా మత్తయి 13:31-32 "పరలోక రాజ్యం ఆవగింజను పోలివుంది" అనే ఉపమానం మనకు తెలుసు. ఆవగింజ చాలా చిన్నదిగా ఉంటుంది. కాని అది పెరిగి మహా వృక్షంగా మారుతుంది, అనేక పక్షులకు నివాసాన్ని ఇస్తుంది. అలాగనే మనం కూడా దేవుని ప్రణాళికలో భాగస్తులుగా మారి పిల్లలకు విశ్వాసాన్ని అందించాలి. అది మొదటిలో ఆవగింజవలే చిన్నదిగా ఉంటుంది క్రమేపి అది విస్తరణ అవుతుంది. తల్లిదండ్రులు క్రొత్త పద్ధతులను పాటించి వారికి అర్థమైన రీతిలో నేర్పించాలి. వారికి బాగా ఇష్టమైన కథలతో, చిహ్నాలతో, ఆసక్తికరమైన పదాలతో, బొమ్మలతో, ఆటపాటలతో నేర్పించాలి. ఆత్మద్దిక జీవితాన్ని జీవించమని బలవంత చేయరాదు. పిల్లల ఆధ్యాత్మిక జీవితాన్ని సత్యోపదేశతరగతులు, ప్రసంగాలలో కంటే కూడా కుటుంబంలోనే ఎక్కువ నేర్చుకోవాలి. నిజంగానే తల్లిదండ్రులు కుటుంబంలో ప్రార్థనలు చేస్తే పిల్లలు కూడా ప్రార్థనలు చేస్తారు. ప్రతి తల్లిని అభినందించాలి. ఎందుకంటే ఈ విషయంలో వారు తగిన పాత్ర పోషిస్తారు. ఉదాహరణకు పునీత మౌనికమ్మగారు తన బిడ్డ యొక్క పరివర్తనకై కనీటి ప్రార్థన చేసి తన బిడ్డని క్రీస్తుకి దగ్గర జేసింది.

పిల్లలకి విశ్వాసాన్ని అందించే కార్యం సువార్త సేవలోని భాగమే. ఎందుకంటే పిల్లలు పెద్దవారు అయిన తరువాత వారు కూడా ఇతరులకు ఆమొక్క సువార్తను అందించాలి. విశ్వాసంతో పెరిగిన పిల్లలు పెద్దఅయిన తరువాత వారికి

ఎన్ని ఆటంకాలు, సమస్యలు ఎదురైనాకాని వారు మాత్రం విశ్వాసాన్ని విడనాడరు. వేద సాక్షి మరణం పొందటానికి కూడా సిద్ధంగా ఉంటారు. మార్కు 2:16లో మత్తయి, 11:19లో క్రీస్తు ప్రభువు పాపాత్ములతో విందునారగించటాన్ని గమనిస్తాము. ఇంకా యోహాను 3:1–21లో స్త్రీ తో క్రీస్తు ప్రభువు సంభాషించటాన్ని గమనిస్తాము. లూకా 7:36;50 లో వ్యభిచార స్త్రీని యేసు తన పాదాలను అభిషేకించటానికి అంగీకరించాడు. మార్కు 1:40–45 క్రీస్తు ప్రభువు రోగులపై చేయి ఉంచి వారిని స్వస్థలుగా చేయటాన్ని గమనిస్తున్నాము. ఇంకా అపో.కా. 2:47, 4:21;33, 5:13లో అపోస్తులు కూడా పొరుగు వారిని చిన్న చూపు చూడలేదు అనీ, వారు ప్రత్యేక బృందాల వారితో ఉండలేదు అనీ వారి జీవితాలను బంధాలకు దూరంగా ఉన్నాయి అనీ గమనించవచ్చు. అందుకే వారు అందరితో ఐక్యతగా జీవించి సువార్త వ్యాప్తి చేయగలిగారు.

“సువార్త పరిచర్యకై ప్రతి కుటుంబం కూడా మధ్యవర్తిగా వ్యవహరించాలి. ముఖ్యంగా సువార్త వ్యాప్తిలో సత్యానికి సాక్షులుగా పేదలను ఆదరిస్తూ, అన్ని మత వర్గాల వారితో కలివిడిగావుంటూ, ప్రకృతిని పర్యవేక్షిస్తూ, నైతిక విలువలతో, సమాజ శ్రేయస్సు కోరుతూ, అన్యాయాన్ని అరికడుతూ, శారీరకంగా, ఆధ్యాత్మికంగా క్రియలతో కుటుంబ జీవితాన్ని జీవించాలి.” ముఖ్యంగా కతోలికులుగా ఇటువంటి కుటుంబ జీవితం మనం జీవించాలి. అదే తండ్రి దేవుడు మనలనుండి ఆశించేది. తండ్రి దేవుడు ఎప్పుడూ క్రీస్తు ద్వారా మనకు తన అమూల్యమైన ప్రేమను ఇస్తున్నాడు. తన ఏకైక కుమారుడిని నిత్యం మనతో ఉంచాడు. అందుకు ప్రతి ఫలంగా ప్రతి కుటుంబం సుఖదు:ఖాలలో కూడా దేవుని వాక్కుతో ప్రతిధ్వనించాలి. కుటుంబంలో పొందిన అనుభూతికి కృతజ్ఞతలుగా ఉండాలి. 1 యోహాను 4:16 దేవునికి మనపై గల ప్రేమ మనకు తెలియును. దానిని మనము విశ్వసింతుము. దేవుడు ప్రేమ స్వరూపుడు. ఏ “వ్యక్తి ప్రేమమయుడై జీవించునో అతడు దేవుని యందు దేవుడు అతని యందు ఉందురు” కాబట్టి ప్రతి యొక్క కుటుంబం కూడా పిల్లలకి మంచి విద్యా నిలయంగా ఉంటూ సువార్త వ్యాప్తికి దోహదపడాలి.

❀ ❀ ❀ ❀

# 8. బలహీనతలో తోడుగా ఉండటం గమనించడం, పరిపూర్ణం చేయడం

**– బ్రదర్ కోల సాగర్**



సమాఖ్య సదస్సు సభ్యులు చెప్పినట్లుగా కలహముతో కూడిన ఎటువంటి వివాహ బంధమైన, అది దేవుని తలంపుకు విరుద్ధమని శ్రీసభ గుర్తించింది. తన పుత్రులు చాలామంది బలహీనులని శ్రీసభకు తెలుసు. యేసుక్రీస్తుని ప్రకాశవంతమైన చూపులో వెలుగొందు శ్రీసభ, తనలో పాలుపంచుకొనువారు అసంపూర్ణ జీవితం జీవిస్తున్నారని తెలుసుకొని వారిపై ఉన్న ప్రేమతో, వారి జీవితాలలో దేవుని అనుగ్రహమును గుర్తించి, వారికి మంచి చేయుట కొరకు, ప్రేమతో ఒకరికోసం ఒకరు జీవించేలా మరియు వారి సంఘజీవనంలో సేవాతత్వం కలిగి జీవించాలని శ్రీసభ వారిని ప్రోత్సహిస్తుంది. మనం సంతోషముతో జరుపుకునే ఈ కారుణ్య సంవత్సరం కోరుకునేది ఇదే. దేవునియందు పరిపూర్ణ జీవితం జీవించడానికి శ్రీసభ మనకు పిలుపునిచ్చినప్పటికీ, శ్రీసభ ప్రత్యేక శ్రద్ధతో మరియు పూర్తి బాధ్యతతో బలహీనులైన తన బిడ్డలను వెంబడిస్తూ, వారి మధ్య కుంటుబడిన ప్రేమను తిరిగి జీవించగలిగే ఆశను మరియు దృఢత్వమును నెలకొల్పుతుంది. శ్రీసభ చీకటిలో త్రోవ తప్పినవారికి వెలుగునిచ్చే దీపంలా పనిచేస్తుంది.

క్రైస్తవ వివాహం క్రీస్తుకు మరియు ఆయన స్థాపించిన శ్రీసభకు మధ్య గల సంబంధంతో పోల్చబడింది. వివాహం దాని పరిపూర్ణత సాధించేది కేవలం స్త్రీ మరియు పురుషుని మధ్యగల సంబంధంలోనే. ఈ బంధంలోకి ప్రవేశించిన

స్త్రీ, పురుషులు పూర్తి స్వేచ్ఛలో విశ్వాసాన్నీ, అత్యంత ప్రేమను కనుబరుస్తూ ఒకరి కోసం ఒకరంటు మరణాంతం వరకు జీవించగలిగే మారుమనస్సును కలిగి ఉంటారో వారు పవిత్ర సంస్కారంతో అభిషిక్తులవగలుగుతారు మరియు వారు తిరుకుటుంబంగా ఏర్పడడానికి కావలసిన అనుగ్రహం లభిస్తుంది. కొన్ని రకాల బంధాలు ఈ ఆదర్శానికి విరుద్ధం అయినప్పటికి కొంతమంది ఆ అసంపూర్ణమైన వాటిని పద్ధతిలోనే ఉన్నవి గదా అని అనుకుంటారు. శ్రీసభ అటువంటి పరిస్థితులలో కూడా నిర్మాణాత్మక అంశాలు ఉంటే వాటిని త్రోసివేయదు, వాటిలో శ్రీసభ బోధించు వివాహానికి దగ్గర సంబంధం లేనప్పటికి, గౌరవిస్తుందని సమాఖ్య సదస్సు సభ్యులు వ్యక్తపరుస్తున్నారు.

## విశ్వాసుల సంక్షేమ సేవలో పురోగతి

చట్టబద్ధమైన వివాహం లేక కలిసి జీవించడం అనే బంధంలోను కొంత స్థిరత్వం కలదని మరియు అది న్యాయబద్ధమైనది అని సమాఖ్య గుర్తించింది. ఎందుకంటే అందులోను పిల్లల పట్ల లోతైన ఆప్యాయత, బాధ్యత మరియు కష్టాలను ఎదుర్కొనే భావం వ్యక్తమగుతుంది. అటువంటి వారిని కూడా విశ్వాసుల సంక్షేమాన్ని అందించి దివ్యసంస్కారపు విలువలు కలిగిన వివాహం జరుపుకొనునట్లు వారిని నడిపించాలి. మరోప్రక్క యువకులు వివాహం మీద అపనమ్మకంతో, కలిసి జీవిస్తూ వివాహ బాధ్యతను విస్మరిస్తున్నారు. మరికొందరైతే అప్పటికి ఇచ్చిన మాటలను వైదొలగి కొత్త బంధాన్ని కోరుకుంటున్నారు. శ్రీసభ సభ్యులుగా పిలువబడువారికి విశ్వాసుల సంక్షేమమును, ఓదార్పును మరియు సహాయాన్ని అందించాలి. ఈ విషయంలో శ్రీసభ ప్రతినిధులగు గురువులు బాధ్యత వహించి క్రైస్తవ వివాహాలను ప్రోత్సహిస్తూ వారితో విశ్వాస చర్చ జరిపి వారి జీవితాలలో గల విభిన్న అంశాల గురించి మాట్లాడి, క్రైస్తవ వివాహ సార్ధకతకు అద్దం పట్టే వారిగా వారిని తయారు చేయాలి. ఈ ఆధ్యాత్మిక వివేచన ప్రక్రియలో సువార్తీకరణం చేస్తూ, మానవ మరియు ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఉపయోగపడు అంశాలను గుర్తించాలి.

చట్టపరమైన వివాహం లేక కలసి జీవించడం అనేది కేవలం సామాజిక దృక్పథం నుండి కలిగిన భావనే కాని దివ్యసంస్కారపు బంధం నుండి ప్రోత్సహించింది

కాదు. అటువంటి పరిస్థితులలో కూడా వారి పట్ల ప్రేమను చూపించగలగాలి, అప్పుడు మన ద్వారా వారికి దేవుని ప్రేమ ప్రతిబింబిస్తుంది. ఎక్కువ మంది కొంతకాలం కలిసి జీవించినా తరువాత శ్రీసభలో వివాహం చేసుకొనుటకు ప్రాధేయపడుతుంటారు. కలిసి జీవించడం అనేది సహజమైన అలవాటు మీద ఆధారపడి ఉంటుంది. లేక జీవితానికి ఒక భద్రత లభించేంత వరకు ఎదురుచూడడం జరుగుతుంది. కొన్ని దేశాలలో అయితే కలసి జీవించడం అధిక సంఖ్యలో ఉంటుంది. ఇది కేవలం కుటుంబ జీవితం లేక వివాహ విలువలను వద్దనుకోవడం కాదు, కాని ప్రముఖంగా వివాహం జరుపుకోవడం కొన్ని సామాజిక పరిస్థితులలో అతి ఖర్చుతో కూడుకున్నది కాబట్టి పేదరికంలో ఉన్న ప్రజలు ఇలా కలిసి జీవించడానికి సిద్ధపడతారు. ఏదిఏమైనప్పటికి ఇలాంటి పరిస్థితులను సామూహిక స్పందనతో మార్పును కోరుకొని నిజమైన వివాహాన్ని మరియు కుటుంబాన్ని సువార్త అనుసారం నడిపించుకోగలగాలి. అలాంటి వారిని మనం ఆహ్వానించి నిదానంగా వారిలో అవగాహన కల్పించాలి (యోహాను 4:1-26). మనం చూసినట్లుగా, యేసు సమరియా స్త్రీలోని నిజమైన ప్రేమను గుర్తించి, ఆమె జీవితంలో ఉన్న అంధకారాన్ని తొలగించి, ఆమెలో సువార్త సంతోషాన్ని నెలకొల్పుతాడు. పునీత రెండవ జాన్‌పాల్ పాపుగారు ప్రతిపాదించిన క్రమబద్ధీకరణ సిద్ధాంతములో అదే మనం చూస్తున్నాం. మనిషి తన తెలివితేటలతో అన్నింటిని తెలుసుకోగలడు, ప్రేమించగలడు మరియు ఆ ప్రక్రియలో మంచి నైతికత్వాన్ని అలవరచుకోగలడు. ఇది కేవలం సిద్ధాంతమే కాదు. ఇది ఎవరైతే ముఖ్యంగా చట్ట నియమాలను అర్థం చేసుకోలేరో, ఆస్వాదించలేరో మరియు దాన్ని సార్థకత చేయలేరో అలాంటివారు వారికున్న స్వేచ్ఛలో చూపించే వివేచనయే ఈ క్రమబద్ధీకరణ. ఎందుకంటే చట్టం అనేది దేవుని నుండి లభించిన ఒక బహుమానం మరియు ప్రతి ఒక్కరి మార్గచూపరి. ఇది దేవుని అనుగ్రహం ద్వారానే నడిపింపబడుతుంది.

## క్రమరహిత పరిస్థితులను వివేచించడం

సమాఖ్య సదస్సులో కొన్ని అసంపూర్ణ మరియు బలహీన పరిస్థితులను వ్యక్తపరచారు. దానికి పోపుగారు మనం తప్పుత్రోవలో పయినంపక మునుపే

శ్రీసభలోని కొన్ని విషయాలలో పున:శ్చరణ గావించి, రెండు అంశాలను ప్రబోధించారు, అవి బహిష్కరణ రద్దు మరియు తిరిగి స్వీకరించడం. శ్రీసభ యెరూషలేము సమావేశం నుండి అనుసరిస్తున్న బాట, క్రీస్తు బాట, కనికర బాట మరియు తిరిగి స్వీకరించడం. ఎన్నటికి ఏ ఒకరినైన త్రోసివేయడం లక్ష్యం కాదు, అడిగినవారికి పూర్ణహృదయంతో దేవుని కారుణ్యాన్ని చూపింపగలిగేదే శ్రీసభ. నిజమైన ప్రేమ గుర్తింపుకోరనిది, అంతులేనిది మరియు ఉచితముగా ఒసగబడినది. తద్వారా అతిక్లిష్టమైన అనేక పరిస్థితులను వదిలేసి తీర్పును ఇవ్వకపోవడం ఎంతో ఉత్తమం మరియు దానికి బదులుగా ప్రజల బాధలపై దృష్టి పెట్టడం అవసరం.

ముఖ్యంగా ఆపదలో ఉన్న వారి ప్రతి ఒక్కరి దగ్గరకు వెళ్లడం, వారికి తగిన సహాయాన్ని అందిస్తూ సంఘంలో అతడు లేక ఆమె పాటించు మతాచారాలను కనుగొని వారిని ఈ హద్దులేని, ఉచితమైన మరియు గుర్తింపుకోరని కారుణ్యాన్ని అనుభూతి చెందేలా చేయాలి. ఎన్నటికి మనం ఒకరిని ఖండింపకూడదు. ఎందుకంటే అది సువార్త యొక్క తర్కం కాదు. పోపుగారు ఇక్కడ కేవలం విడాకులు తీసుకున్న మరియు తిరిగి మళ్లీ వివాహం చేసుకున్న వారి గురించే మాట్లాడడం లేదు, అందరికోసం ఎలాంటి పరిస్థితులలో ఉన్నవారైనా సహజంగా తప్పు చేయడమే క్రైస్తవుని ఆచారంగా భావిస్తారో లేక శ్రీసభ బోధనకు విరుద్ధంగా ఏదైన ప్రబోధం చేసినా, అతడు లేక ఆమె అటువంటిది ఇతరులకు బోధించడం లేక ప్రకటించడం ఏ రకంగానైన చేయుటకు ప్రయత్నించకూడదు. అలాంటి పరిస్థితులు సంఘానికి వారిని దూరం చేస్తాయి (మత్తయి 18:17).

అలాంటి వ్యక్తులు సువార్తను మరొకసారి ఆలకించి మరియు అది అందించే మార్పును స్వీకరించాలి. అటువంటి వ్యక్తి కూడా ఏదొక రూపంలో సంఘ జీవనంలో పాలుపంచుకోవచ్చు. వారు విచారణ గురువుతో కలిసి వివేచన చేసి, ఆయన సలహా మేరకు సామాజిక సేవలోగాని, ప్రార్థన కూటమిలో లేక అతడు లేక ఆమె తమ సొంత ఆలోచన మేరకు జీవనం సాగించవచ్చు. ఇటువంటి కొన్ని క్రమరహిత పరిస్థితులతో వ్యవహరిస్తున్నపుడు సమాఖ్య సదస్సు గురువులు దానికి ఆదరణ కలిగించే కొన్ని సాధారణ నిర్ణయాలు చేశారు. చట్టపరమైన బంధం

ఏర్పాటుచేసుకున్నవారైన, విడాకులు పొందిన మరియు తిరిగి వివాహం చేసుకున్న లేక కలిసి జీవిస్తున్న వారి పట్ల ఆధ్యాత్మిక దృక్పథంతో మరియు వారి యెడల శ్రీసభకు ఉన్న బాధ్యతను గుర్తుంచుకొని, వారి జీవితాలలో దేవుని నుండి పొందే దైవానుగ్రహం అర్ధమయ్యేలా చేయాలి మరియు వారికి సహాయాన్ని అందించి నట్లయితే వారికై దేవుడు ఏర్పాటు చేసిన ప్రణాళికలను తెలుసుకొని వారు పరిపూర్ణత సాధిస్తారు. ఇది కేవలం పవిత్రాత్మ శక్తి వలననే సాధ్యమవుతుంది.

ఎవరైతే విడాకుల అనంతరం ఒక కొత్త బంధంలోకి ప్రవేశిస్తారో, ఉదాహరణకు అలాంటి వారి మధ్యలో అనేక పరిస్థితులు ఎదురైనప్పుడు, మనస్పర్ధలకు గురయ్యే వ్యక్తిగత మరియు ఆధ్యాత్మిక వివేచనకు అవకాశం ఇవ్వరు. ఏర్పడిన ఈ రెండవ బంధంలో, పిల్లలతో, నిజాయితీని నిరూపించుకోవడం ఉదారత్వంగా ఉండడం, క్రైస్తవ బాధ్యత, క్రమరహిత పరిస్థితులలో బంధాన్ని బలపరచుకునే సమయంలో, వెనక్కి వెళ్లలేక పాపం చేస్తున్నాం అనే ఆలోచన భావం లేక కొత్త తప్పు లేక పాపం చేస్తుంటారు. శ్రీసభ ఇటువంటి పరిస్థితులను గుర్తించి, కొన్ని బలమైన కారణాల కోసం ముఖ్యంగా పిల్లల ఎదుగుదల కోసం, స్త్రీ మరియు పురుషుడు విడిపోవడానికి సమ్మతించదు. అనేక సందర్భాలలో మొదటి వివాహానికి మరియు అన్యాయంగా విడిపోయిన బంధాలను కాపాడడానికి ప్రయత్నాలు జరిగాయి. అంతేకాక పిల్లల ఎదుగుదల కోసం రెండవ వివాహం చేసుకోవడం కొన్నిసార్లు వ్యక్తిగత పాత జ్ఞాపకాల వల్ల మరియు జతపరచలేని విరిగిన వివాహ బంధాలు ఎప్పటికి విలువను పొందలేవు. కొన్ని సందర్భాలలో కష్టాలు మరియు కలతలు వల్ల విడిపోయి ఒక కొత్త బంధాన్ని ఏర్పరచుకోవడం వల్ల దాని ప్రభావం పిల్లలకు మరియు కుటుంబం మొత్తంపై చూపుతుంది. లేక మరొకరి విషయంలో ప్రతిసారి కుటుంబ జీవితంలో విఫలమవ్వడం అనేవి సువార్త నందు కలిగి వివాహం లేక కుటుంబం జీవితానికి అంత ఆదర్శంగా ఉండదని అర్ధమవుతుంది. గురువు యొక్క వివేచన ఈ విధమైనటువంటి తేడాను చూపించుటలో వ్యక్తమవ్వాలి. అది కూడా పరిస్థితులను జాగ్రత్తగా పరిశీలించి ముందుకు వెళ్లాలి.

పోపుగారు సమాఖ్య సదస్సుతో ఏకీభవిస్తూ ఎవరైతే జ్ఞానవివాహం స్వీకరించి విడాకులు తీసుకున్నారో మరియు చట్టపరంగా తిరిగి వివాహం చేసుకొని

సాధ్యమైన రీతిలో అవమానాలను తొలగిస్తూ క్రైస్తవ సంఘంతో పూర్తిగా కలిసిపోవాలి. ఈ విధంగా కలవడం లేదా సఖ్యత చేయడమే ఆధ్యాత్మిక సంక్షేమానికి నిదర్శనం. ఈ సంక్షేమం ద్వారా వారు క్రీస్తుని శరీరమైన శ్రీసభకు సంబంధించిన వారిగా గుర్తించడమే కాక వారు ఇందులోని ఆనందాన్ని మరియు అనుభూతిని పొందుతారు. వారు జ్ఞానస్నానం పొందారు కనుక, వారు సహోదరీ సహోదరులు. వారి మంచిని తలంచి వారి హృదయాలలో పవిత్రాత్మ వరాలను, మరియు అనుగ్రహాలను క్రుమ్మరిస్తుంది. శ్రీసభ సాంగ్యాలలో వారి పాత్రను అనేక విధాలుగా పాల్గొనవచ్చు. వారు ఇప్పటి వరకు ప్రత్యేకంగా పాటించిన దైవార్చనను, ఆధ్యాత్మికతను, శిక్షణను మరియు సంస్థీకరణ రూపాన్ని అధిగమించియుండవచ్చు. అలాంటి వ్యక్తులను శ్రీసభ నుండి వెలివేయబడ్డ వ్యక్తులుగా చూడకుండా, దానికి బదులుగా శ్రీసభలో జీవిస్తూ మరియు ఎదుగుతున్న వ్యక్తులుగా పరిగణించాలి. మరియు వారు ఎల్లప్పుడు శ్రీసభలో తల్లిలాంటి అనుభూతిని పొందుతూ, తన ఆప్యాయత యందు ఆదరణ పొందుతూ సువార్త మరియు జీవపు బాటలో నడవమని ప్రోత్సహిస్తుంది. ఎవరైతే ముఖ్యంగా క్రైస్తవులు అనబడతారో వారు తమ పిల్లల క్రైస్తవత్వ ఎదుగుదల బాధ్యతకు ఈ సమాహారం కూడా ఎంతో అవసరం.

పోపుగారు పేర్కొనిన అనేక రకాలైన వాస్తవ పరిస్థితులను మనం పరిగణలోకి తీసుకున్నట్లయితే, సమాఖ్య సదస్సు లేక ఈ ప్రోత్సహక లేఖ క్రొత్త నియమాలను అన్ని పరిస్థితులకు వర్తించే విధంగా అందించబోదని అర్థమవుతుంది. ఇది కొన్ని ప్రత్యేక పరిస్థితులలో, వ్యక్తిగత బాధ్యత మరియు ఆధ్యాత్మిక వివేచనను కొనసాగించడానికి ఒక నూతన ఉత్తేజాన్ని మాత్రమే అందించగలదని ఒకరు గుర్తిస్తారో ఆ పరిస్థితులలో బాధ్యత సమానంగా ఉండదని తెలుస్తుంది, ఆ నియమం యొక్క ప్రభావం ఎల్లప్పుడు ఒకేలా ఉండాల్సిన అవసరం లేదు. విడిపోయిన వారు మరియు తిరిగి వివాహం చేసుకున్నవారికి తోడుండి శ్రీసభ బోధన ప్రకారం వారి పరిస్థితిని తెలుసుకొనేలా మరియు పీఠాధిపతుల సలహాలతో వారికి సహాయం అందించే ధర్మం గురువులకు ఉంది. ఈ ప్రక్రియలో ఆలోచన భావాలతో కూడిన ఆత్మపరిశీలన మరియు పశ్చాత్తాపం ఉపయోగపడుతుంది. విడాకులు తీసుకున్నవారు మరియు మరల వివాహం చేసుకున్నవారు తమని తాము ప్రశ్నించుకోవాలి, వారి

కుటుంబ సహవాసం కష్టంలో పడినప్పుడు వారు ఏ విధంగా పిల్లల యెడల ప్రవర్తిస్తున్నారు, సఖ్యపడడానికి ఏమైనా ప్రయత్నం చేశారా లేక విడిచిపెట్టబడ్డ వారిపై ఏమైనా ప్రభావం ఉంటుందా, ఏర్పడిన కొత్త అనుబంధం మిగితా కుటుంబ సభ్యులపై మరియు విశ్వాసుల సంఘంపై ఎలాంటి ప్రభావాలు చూపుతుంది, కొత్తగా వివాహానికి సిద్ధపడుతున్న యువకులకు ఎలాంటి ఉదాహరణను ఇస్తున్నారు? దీనియందు నిజమైన ఆలోచన, దేవుని కనికరముపై బలమైన నమ్మకాన్ని కలిగిస్తుంది. మనం మాట్లాడుకుంటున్న సహచరించడం మరియు వివేచించడం అనే ప్రక్రియ దేవుని ముందు వారి పరిస్థితిని అవగాహణలోకి తెచ్చుకొనుటకు విశ్వాసులను నడిపిస్తుంది. వ్యక్తి లోలోపల జరిగే అంశాలపై గురువుతో సంభాషిస్తే శ్రీసభ జీవితంలో పూర్తిగా పాల్గొనడానికి ఏవైతే అడ్డు వస్తున్నాయో వాటిపై సరైన తీర్పును గావించుటకు సాధ్యమయ్యేది అందిస్తుంది. మరియు ఏ మార్గంలో దాన్ని ఎదుర్కొని మరియు ఎదగలమో సాధ్యపరుస్తుంది. ఈ క్రమబద్ధం అనేది దానంతట అదే చట్టం కాదు, దాని వివేచన అనేది సువార్త అందించు ప్రేమను మరియు సత్యాన్ని దాటి పోలేదని శ్రీసభ వ్యక్తపరుస్తుంది. ఈ వివేచన జరగడానికి రానున్న షరతులు తప్పనిసరిగా ఉండాలి, శ్రీసభ పట్ల మరియు తన బోధన పట్ల ప్రేమ మరియు విచక్షణ. దేవుని ప్రణాళికను తెలుసుకొనుటలో మరియు దానికి సంపూర్ణ స్పందన అందించడానికి ఇటువంటి అలవాట్లు తీవ్రమైన అపార్ధాలను వైదొలగించుటకు ముఖ్యమైంది. ఆ విధంగా ఉన్నపుడు ఏ గురువైన సానుకూలతలను అందించవచ్చు లేక కొంతమంది ప్రజలు కొన్ని ఉపకారాలు చేసి దివ్యసంస్కారాల అవకాశాలను పొందుతారు. ఒక బాధ్యతలేనివాడు మరియు అతి తెలివిగల వ్యక్తి అతడు లేక ఆమె శ్రీసభకు మంచి చేయాలి కనీసం తలంచరో, ఆ విషయాన్ని లేక పరిస్థితిలో ఉన్న కష్టాన్ని తెలుసుకోగలిగిన గురువును వారు కలిసినప్పుడు శ్రీసభ రెండు స్థాయిలలో వివేచన చేస్తున్న విషయం ప్రజలలో ఆలోచన కలిగింపజేస్తుంది.

## ఆధ్యాత్మిక వివేచనలో సులువైన అంశాలు

క్రమరహిత పరిస్థితులను సాధ్యమైనంతవరకు సరిగ్గా అర్థం చేసుకోవడం కోసం ఒక ప్రత్యేకమైన వివేచన అవసరం. సువార్త కోరు అంశాలు ఏదో రకంగా

రాజీపడిపోతున్నాయి అని ఎవరో ఒకరు అనుకునే లోపు ఒక అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలి. సులువైన అంశాలు మరియు పరిస్థితుల గురించి శ్రీసభ పటిష్టంగానే ఆలోచన చేస్తుంది. ఇకనుండి ఎవరైతే ఈ క్రమరహిత పరిస్థితులలో ఉన్నారో వారు చావైన పాపంలో జీవిస్తున్నారు అనడానికి ఎన్నటికి అవకాశం లేదు మరియు పవిత్రీకరణ అనుగ్రహము కోల్పోరు. ఇది కేవలం నియమని మరువడమే కాదు ఇంకా ఏదో దాగి ఉంది. ఎందుకంటే ఒక వ్యక్తి నియమం పూర్తి తెలిసి ఉండవచ్చు కాని దాని అంతరార్థాన్ని అర్థం చేసుకోవడానికి బాగా కష్టపడతాడు. లేదా అతడు లేక ఆమెను ముమ్ముందు పాపం చేయకుండా ఇంకోలా ప్రవర్తించడానికి మరియు నిర్ణయం తీసుకోడానికి ప్రస్తుత పరిస్థితులు సహకరించవు. సమాఖ్య సదస్సు గురువులు చెప్పినట్లు నిర్ణయాన్ని తీసుకునే సామర్థ్యంలేని అనేక అంశాలు ఉండి ఉండవచ్చు. పునీత తోమాసు అక్వినాస్ గారు ఒక వ్యక్తితో అనుగ్రహము మరియు ప్రేమ ఉండవచ్చునని తను గుర్తించాడు. కాని ఏ ఒక్క సుగుణం ఎలా వినియోగించాలో తెలియదు అని అంటున్నారు.

కతోలిక సత్యోపదేశం కొన్ని అంశాలను ఈ విధంగా పేర్కొంటుంది. ఒక కార్యం అజ్ఞానం అనుకూలతలేదని, భయం వల్ల, అలవాటు ప్రకారం, అసాధారణ విషయాలు తగిలించుకోవడం వల్ల మరియు కొన్ని మానసిక లేక సామాజిక అంశాల వల్ల జరిగిందని అందు గల వ్యక్తిగత బాధ్యతలను తగ్గించుకోవచ్చు అని చెప్తుంది. మరోచోట సత్యోపదేశం పరిస్థితుల ప్రభావం వల్ల నైతిక బాధ్యత తగ్గుతుందని తెలియజేస్తుంది, మరియు పరిపక్వతలేని ఆప్యాయత, అలవాట్లలో ఉన్న ఉద్రిక్తత, ఆవేశం లేక మానసిక లేక సామాజిక అంశాల వల్ల నైతిక బాధ్యత క్షీణిస్తుంది. ఈ కారణం చేతనే ఆ పరిస్థితులపై వ్యతిరేక తీర్పు ఆ వ్యక్తి తప్పు చేశాడు అనడానికి మరియు ఆ వ్యక్తి యొక్క పాత్ర అందులో ఉంది అని తీర్పు చేయడానికి వీలులేదు. ఇటువంటి నమ్మకం మీదో ఆధారపడి, పాపుగారు సమాఖ్య సదస్సు గురువులు చెప్పాలనుకున్నది సరైనదని భావిస్తున్నారు: “ఇలాంటి కొన్ని పరిస్థితుల వల్ల ప్రజలు వేరేలా ప్రవర్తించడానికి కష్టపడుతున్నారు. సాధారణ నియమాన్ని అనుసరిస్తూ కొన్ని క్రియలకు మరియు నిర్ణయాలకు బాధ్యత అన్ని

విషయాలలో ఒకేలా ఉండదని గుర్తించడం అవసరం. ఆధ్యాత్మిక వివేచనలో సరైన పద్ధతిలో ఏర్పడిన వ్యక్తి యొక్క మనస్సాక్షిని పరిగణలోకి తీసుకుని, ఈ పరిస్థితులకు బాధ్యత తీసుకోగలగాలి. అప్పుడు క్రియల ప్రభావం కూడా అన్ని విషయాలలో ఒకేలా ఉండాల్సిన అవసరం లేదు".

ప్రస్తుత అంశాల ప్రభావమును గుర్తించి, మనకు తెలిసిన వివాహం జతపరచలేని పరిస్థితులలో ప్రతిఒక్కరు వారి అంతరాత్మలను శ్రీసభ నడవడికలో మిళితం చేయాలి. సహజంగా, జ్ఞానం కలిగిన అంతరాత్మ ఎదుగుదలకు, ఏర్పాటు చేయడానికి మరియు నడిపించడానికి తగిన ప్రోత్సాహం ఇవ్వడం వివేచన గల ఒక గురువు యొక్క బాద్యత మరియు దేవుని అనుగ్రహముపై గొప్ప నమ్మకాన్ని కలిగించాలి. అయిన అంతరాత్మ సువార్త కోరునటువంటి అంశాలతో సంబంధంలేని అనేక పరిస్థితుల కంటెను ఎక్కువ గుర్తించగలదు. దేవుడికి మనం ఇచ్చే ఉదారమైన సమాధానం ఎందుకని అంతరాత్మ నిజాయితీగా మరియు ఖచ్చితముగా గుర్తించగలదు మరియు అంతరాత్మ ఒకరికి ఉన్న అనేక హద్దుల పరిధిలో మధ్యలో దేవుడు అడుగుతున్న నైతిక భద్రతను చూపించుకోగలదు, అయినా కాని ఇది పూర్తి ఆదర్శవంతమైంది కాదు. ఏ సందర్భంలోనైనా ఈ వివేచన చైతన్యవంతమైనదిగా పిలువబడుతుంది, కొత్త ఎదుగుదల మార్గాలకు మరియు కొత్త నిర్ణయాలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి అప్పుడే అది ఆదర్శప్రాయంగా ఉంటుంది.

## వివేచన మరియు నియమాలు

ఒక వ్యక్తి యొక్క క్రియలు సాధారణ నియమానికి ప్రతీకగా ఉంటుందో లేక లేదో అని భావించడం, దాన్ని తగ్గించినట్లే, ఎందుకంటే ప్రస్తుత మానవ జీవితంలో దేవుని యందు పూర్తి నమ్మకాన్ని పొందడానికి నియమం సరిపోదు. పాపుగారు మనలను ప్రతిసారి అడిగితే, పునీత తోమస్ ఆక్వినాస్ గారి బోధనలను గుర్తుకు తెచ్చుకోమని మరియు దాని మన ఆధ్యాత్మిక వివేచణలో కలగలుపుకోవాలి. సాధారణ నియమాలలో అవసరం ఉన్న మనం వివరణాంశాలకై లోతులకు వెళ్తే అని ఎక్కువ సార్లు మనం తప్పును ఎదుర్కొంటాం. వివరణాంశాలు ఉన్నట్లే, క్రియాంశం, సత్యం మరియు యధార్ధ ఫలితం అన్నింటికి ఒకేలా ఉండదు, కాని

సాధారణ నియమాలలో మాత్రము వివరణాంశంలో ఒకే యదార్ధం ఉన్న అది అందరికి సమానంగా తెలియబడదు, ఒకవేళ వివరణ కోసం లోలోపలికి వెళ్తే ఆ నియమం తప్పుగా పరిగణించబడుతుంది. సాధారణ నియమాలు మంచినే కోరుకుంటాయి అవి ఎన్నటికి ఉపేక్షింపబడవు, కాని దాని నియమ ఏర్పాటులో పూర్తిగా అన్ని పరిస్థితులకు అవి అందించలేవు. అదే సమయంలో, ఈ కారణం చేతనే కొన్ని సందర్భాలలో చేసిన వివేచనను నియమ స్థాయికి ఎంపిక చేయలేదు.

ఈ కారణం చేతనే ఏ గురువైన క్రమరహిత పరిస్థితులలో జీవిస్తున్నవారు నైతిక ధర్మాలను పాటిస్తే చాలు అని అనుకోకూడదు, అవేవో ప్రజల జీవితంలో విసిరేసే తాళ్లులాగా. ఇది శ్రీసభ బోధన తెలిసి వారి హృదయాలను మూసుకున్న వారి గురించి మాట్లాడుతూ వారు కొన్నిసార్లు అధికారంతో మోషే సింహాసనంలో కూర్చొని గాయపడ్డ కుటుంబాలకు తీర్పు తీర్చుతారు. దాని ప్రకారమే, అంతర్జాతీయ దైవశాస్త్ర కార్యనిర్వాహక సంఘము ఈ విధంగా గుర్తించింది "ప్రకృతి ధర్మంలో ఎపుడో ఏర్పాటు చేయబడ్డ నియమాలను నైతిక వ్యక్తిత్వంపై ముందుగా విధింపకూడదు. దాని బదులుగా వ్యక్తిగత నిర్ణయాలు చేయడానికి ప్రేరేపణ కలిగించే మూలం. ఇటువంటి షరతులు మరియు సులువైన అంశాల వల్ల వ్యక్తిగత బాధ్యత లేకుండానే పాపం కట్టుకునే పరిస్థితులు ఎదురౌతున్నాయి. ఒక వ్యక్తి దేవుని అనుగ్రహంలో జీవించవచ్చు, ప్రేమించవచ్చు ఆ అనుగ్రహ జీవితంలో ఎదగొచ్చు మరియు సాయం చేయవచ్చు. శ్రీసభ సహాయం తీసుకుంటూ వివేచణ, దేవునికి స్పందించే మార్గాలను సాధ్యమైన రీతిలో కనుగొనడానికి సహాయపడుతుంది మరియు హద్దులోనే ఎదుగుతుంది". ప్రతిది తెలుపు మరియు నలుపు అని అనుకుంటూపోతే మనం అనుగ్రహ మార్గాన్ని మరియు ఎదుగుదలను మానేసినవారమవుతాం మరియు దేవునికి మహిమపరిచే పవిత్రీకరణ మార్గాలను విస్మరిస్తున్నాం. మానవ సరిహద్దుల మధ్యలో తీసుకునే ఒక చిన్న అడుగే దేవునికి ప్రీతికరంగా ఉంటుందని మనం గుర్తుపెట్టుకోవాలి. బయటకు పద్ధతిగా కనబడేదే రోజంతా ఏ కష్టం లేకుండా జీవితం సాఫీగా నడవడం లాంటివి అసాధ్యం అని తెలుసుకోవాలి. ఈ వాస్తవాన్ని స్వీకరించడంలో ఆధ్యాత్మిక సంక్షేమాన్ని కోరుకునే గురువులు మరియు సంఘాలు ఆదరించాలి.

ప్రతి పరిస్థితిలో, పరిపూర్ణంగా దేవుని నిబద్ధతను జీవించడానికి వీలుపడని వారితో మాట్లాడుతున్నపుడు వారిని ప్రేమతో మన ఆహ్వానాన్ని అందించాలి. 'సోదర ప్రేమ' క్రైస్తవుల మొదటి నిబంధన (యోహాను 15:12; గలతీ 5:14). ఒకరిపట్ల ఒకరు ప్రేమను ప్రదర్శించాలి. ఎందుకంటే ప్రేమ అనేక తప్పులను తుడిచేస్తుంది (1 పేతురు 4:3). సత్ప్రవర్తనతో మన పాపములకు ప్రక్షాళన పొందుతూ మరియు అణగద్రొక్కబడిన వారి తప్పిదాలను మన్నించి, మన మంచితనాన్ని పెంచుకోవచ్చు (దానియేలు 4:24). మండే ఎండకు నీరు ఆవిరైనట్లు అదే విధంగా దానధర్మాల ద్వారా పాపం క్షమించబడదు (సీరా 3:30).

## ఆధ్యాత్మిక కారుణ్యం యొక్క తర్కము

అపార్ధాలన్నింటిని తొలగించడానికి, పరిపూర్ణ ఆదర్శ వివాహాన్ని, అందులో దేవుని ప్రణాళికను శ్రీసభ ప్రతిపాదించకుండా ఉండదని పోపుగారు సూచిస్తున్నారు. జ్ఞానస్నానం పొందిన యువతీ, యువకులు వివాహ సంస్కారాన్ని అర్ధం చేసుకుని అందులో ప్రేమానురాగాలను అనుభూతి పొందుతూ మరియు దివ్యసంస్కారంలో ఉన్న క్రీస్తుని అనుగ్రహంలో జీవిస్తూ మరియు సాధ్యమైనంత వరకు శ్రీసభ జీవితంలో పూర్తిగా పాల్గొను వారిగా వారిని ప్రోత్సహించాలి. అయిష్టభావంతో, అవన్నీ నాకెందుకులే లేక పనికిరాని మాటలలో దాని ఆదర్శాన్ని విస్మరించడం అనేవి సువార్త మీద నమ్మకం లేనటువంటి మరియు శ్రీసభను ప్రేమించనటువంటి యువకులుగా పరిగణిస్తుంది. అనుకోని పరిస్థితులలో వివాహం యొక్క నిండు ఆదర్శాన్ని చూపించడానికి దానిపై తక్కువ కాంతి ప్రకాశింపకూడదు మరియు యేసు మానవులకు ఒసగిన అనుగ్రహాన్ని తక్కువగా ప్రతిపాదించకూడదు. ఈ రోజు ఆధ్యాత్మిక సంక్షేమ వైఫల్యాల కంటే అతి ముఖ్యమైనది ఆధ్యాత్మిక కృషి వివాహాలను బలపరుస్తుంది మరియు దాని కుంటితనమును ఆపుతుంది/ నిర్మూలిస్తుంది).

అదే విధంగా మన అవగాహన నుండి భారమౌతున్న సులువైన పరిస్థితులు మానసిక, చారిత్రక మరియు జీవన అంశాలు, సువార్తిక ఆదర్శాల నుండి దూరం కాకుండా అవి వెంబడించాలి. కనికరంతో మరియు ఓర్పుతో సహకరించే అవసరం ఉంది, తద్వారా తగురీతిలో వ్యక్తిత్వ ఎదుగుదల కనబడుతుంది అలాగే దేవుని

కనికరము అనుకూలపరిస్తే మనం పూర్తిస్థాయిలో అనుకున్నది చేయగలము. ఎవరైతే ఆధ్యాత్మిక సంక్షేమం కోసం అతి ఉత్సాహంగా శ్రమిస్తారో వారిలో ఎటువంటి సంక్షోభం ఉండదని పోపుగారు తెలియజేస్తున్నారు. కాని పోపుగారు నిజంగా నమ్మేది, మానవ బలహీనతల మధ్యలో మంచి చేయడాన్ని శ్రద్ధ వహించి పవిత్రాత్మచే నాటబడిన శ్రీసభ అదే యేసు కోరుకునేది.

శ్రీసభ తను ఒక తల్లిగా తన బోధన సత్యాలను వ్యక్తపరుస్తుంది. తను ఎప్పుడు మంచినే చేస్తుంది, ఒకవేళ తన పాదాలు రోడ్ల మీద ఉన్న మట్టితో పాడైన సరే. శ్రీసభ గురువు, సువార్త విశ్వసనీయతను మరియు శ్రీసభ బోధనను విశ్వాసులకు ప్రబోధించేటప్పుడు బలహీనుల పట్ల ప్రేమతో, కోపపడకుండా లేక అనవసరంగా విసుక్కోకుండా లేక త్వరిత తీర్పును విధించకుండా ప్రవర్తించవలెను. తీర్పు తీర్చరాదు మరియు బహిష్కరించరాదు అని మనకు సువార్త బోధిస్తుంది (మత్తయి 7:1; లూకా 6:37). మానవ పోకడల వల్ల కలిగే భావాలలో వ్యక్తిగత మరియు సామాజిక సంబంధాలలో మనం తలదాచుకోకూడదని యేసు మనలను ఆశిస్తున్నాడు. దానికి బదులుగా ప్రజల జీవిత సత్యంలోకి ప్రవేశించి వారి యొక్క మృదుత్వ శక్తిని తెలుసుకోవాలి. అలా చేసినప్పుడెల్లా మన జీవితాలు అద్భుతంగా రూపొందుతాయి.

ఈ కారుణ్య సంవత్సర సందర్భంగా ఈ విషయాలను గూర్చి ఆలోచించడం ఎంతో అనుగ్రహం, ఎందుకంటే కుటుంబాలను వేదిస్తున్న అనేక పరిస్థితులకు శ్రీసభ దేవుని కారుణ్యాన్ని బోధించడానికి సిద్ధపడింది, సువార్త ప్రకంపనలను మానవుని మదిలోకి మరియు హృదయంలో దాని పద్ధతిలోనే చొచ్చుకొని పోవాలి. దైవ కుమారుడు ఎలాగైతే ఏ భేదం కనపరచకుండా ప్రతి ఒక్కరిని కలవడానికి వెళ్తాడో అదే విధంగా క్రీస్తుని వధువు (శ్రీసభ) తన పద్ధతిని మలుచుకోవాలి. యేసు వంద గొర్రెలకు కాపరి అని తెలుసు, తొంబై తొమ్మిదికి కాదు. ఆయన అందరిని ప్రేమిస్తాడు. దీని ఆధారంగా చేసుకుని ప్రయత్నించే ప్రతిఒక్కరు ఆ కనికరాన్ని చేరగలరు. ముఖ్యం దూరంగా వెళ్తున్న విశ్వాసులకు దేవుని రాజ్యం మన మధ్యలోనే ఉందని తెలియజేసే గుర్తుగా అది మిగిలిపోతుంది.

ఈ కనికరం అనేది కేవలం తండ్రి వలననే కలిగింది కాదని, కాని నిజమైన కుమారులు ఎవరు అని తెలుసుకోటానికి ఉపయోగపడే సాధనం అని మనం మరచిపోకూడదు. ఇంకోమాటలో చెప్పాలంటే మనం కనికరం చూపించడానికే పిలువబడ్డాం. ఎందుకంటే అది మొదట మనకు చూపించబడింది కనుక. ఇది కేవలం ఆహ్లాదం కాదు లేక దేవుని ప్రేమ అయిష్టంలేని సమాధానం కాదు, కాని ఇది ఎప్పుడు మనకు శ్రేష్టమైన దానినే ఎంపిక చేస్తుంది. శ్రీసభ జీవితంలో కారుణ్యం అనేది ఒక ముఖ్యమైన ఆధారం. శ్రీసభ పరిచర్య అంతో తమ విశ్వాసుల పట్ల చూపించే మృధుత్వంలోనే ఉంది. తన బోధన యందు మరియు లోకానికి సాక్ష్యమిచ్చుటయందు ఎక్కడ ఈ కారుణ్యం లోపించదు. కొన్నిసార్లు మనం అనుగ్రహం చూపించేవారి కంటే మనమే ఆ అనుగ్రహశక్తిగా పని చేస్తుంటాం అన్నది వాస్తవం. శ్రీసభ తండ్రి గృహము. అందులో ప్రతిఒక్కరికి, వారి వారి కష్టాలలో కూడా స్థానం ఉంటుంది.

ఇటువంటి యోచనను నైతిక దైవశాస్త్ర బోధనతో క్రోడీకరించుటలో విఫలం చెందకూడదు. శ్రీసభ నైతిక బోధనలో దీన్ని సమకూర్చుటకు అభిమతం చూపించడం నిజానికి ఎంతో అవసరం. సువార్త యొక్క అతి ప్రాముఖ్యమైన విలువలను ప్రోత్సహించడానికి దానిపై ప్రత్యేక శ్రద్ధను కనపరచాలి. దేవుడు ఉచితంగా అందించే ప్రేమకు బదులుగా ప్రేమ యొక్క గొప్పదనాన్ని మనం ఇవ్వాలి. కొన్నిసార్లు మన పరిచర్యలో ఈ షరతులులేని దేవుని ప్రేమను అందించడానికి మరియు తెలియజేయడానికి మనం దాన్ని కష్టంగా భావిస్తాం. ఈ కారుణ్యాన్ని ఇతరులకు చూపించడానికి మనం అనేక షరతులను విధిస్తాం. వాటి ద్వారా దానిలో ఉన్న పరమార్ధాన్ని మరియు ప్రాముఖ్యతను తీసివేస్తున్నాం. ఇలాంటి పనికిరాని మార్గాల ద్వారా మనం సువార్తను కించపరుస్తున్నాం. ఈ కారుణ్యం నుండి మనం న్యాయాన్ని మరియు సత్యాన్ని వేరు చేయలేము కాని సంపూర్ణ న్యాయాన్ని కాంతివంతంగా వ్యక్తపరిచే దేవుని సత్యం కారుణ్యంలోనే ఉన్నది అని మొట్టమొదటగా చెప్పగలగాలి. దేవుని కారుణ్యాన్ని మరియు ఆయన సంపూర్ణ శక్తిని చివరిగా సంక్షభంలో ఉంచే అసమంజపుతత్వం కలిగించే ఎటువంటి దైవికాంశాలనైన మనం ఆలోచించగలగాలి.

ఇది అతి సున్నితమైన విషయాలను గురించి వ్యవహరించేటప్పుడు వ్యతిరేకత కలిగిన అధికార నియమాలు చూపించు నీతిని తొలగించడానికి మనకు ఈ పారదర్శక రూపాన్ని అందిస్తుంది. దీనికి బదులుగా ఆధ్యాత్మిక వివేచనలో కారుణ్యంతో కూడిన ప్రేమతో నింపుతుంది, ఇది ఎల్లప్పుడు అర్ధం చేసుకుంటుంది, క్షమిస్తుంది, సహకరిస్తుంది, ఆశను రగిలిస్తుంది. అన్నింటికంటే మిన్నగా కలగలుపుతుంది. శ్రీసభలో ఇటువంటి భావన మన హృదయాలను, సంఘం నుండి వేరుచేయబడి అతి తక్కువ స్థానంలో జీవిస్తున్న వారివైపు నడిపిస్తుంది. ఇబ్బందికర పరిస్థితులలో ఉన్న విశ్వాసులు గురువుతో వారి పరిస్థితి గురించి ధైర్యంగా మాట్లాడాలి లేక కనీసం సంఘంలో ఎవరైతే దేవునియందు విశ్వాసంతో జీవిస్తారో వారికైనా తెలియజేయాలంటూ వారిని పోపుగారు ప్రోత్సహిస్తున్నారు. వారు ప్రతిసారి వారి భావనకు మరియు తలంపునకు తగిన విధంగా ఖచ్చితత్వాన్ని పొందలేకపోవచ్చు కాని వారు ఆ సహాయం ద్వారా వారు పరిస్థితిని అర్ధం చేసుకోగలరు మరియు వ్యక్తిత్వ వికాసాన్ని పొందగలరు. గురువులు కూడా వారు చెప్పేదాన్ని నమ్మకంగా మరియు నిజాయితీగా ఆలకిస్తూ వారు వ్యక్తపరచే బాధలను మరియు వాటి రీతిని అర్ధం చేసుకుంటూ మంచి జీవితం జీవించడానికి మరియు శ్రీసభలో వారు సరైన స్థానాన్ని గుర్తించగలిగేలా వారికి సహాయాన్ని అందించమని పోపుగారు గురువులను ప్రోత్సహిస్తున్నారు.

❋ ❋ ❋ ❋

# 9. కుటుంబములోను, వివాహములోను ఉన్న ఆధ్యాత్మికత

**- బ్రదర్ సూరిపోగుల రవి**



మనం పిలువబడిన జీవితములోను, ఆధారపడి జీవిస్తున్న జీవితములోను ప్రేమ అనేక రకాల వర్ణములను కలిగి ఉంటుంది. చాలా సంవత్సరముల క్రితము, సాధారణ క్రైస్తవుని పరిచర్యను గురించి చర్చిస్తూ, ఆధ్యాత్మికత అనేది కుటుంబ జీవితంలో పుడుతుంది అని ద్వితీయ వాటికన్ మహాసభలో నొక్కి వక్కాణించారు. ఈ సభలో చెప్పినట్లుగా సాధారణ మనిషి ఆధ్యాత్మికత ఒక ప్రత్యేకమైన ప్రవర్తన ద్వారా వివాహ జీవితము మరియు కుటుంబ జీవితం మీద ఆధారపడుతుంది. కుటుంబంలో ఉన్న సంరక్షణ సంబంధములేని దానిలాగాక ఆధ్యాత్మికతను కలిగి ఉండాలి. ఇది ఎంతైనా సరియైన సమయం మనకు ఎందుకంటే ఆధ్యాత్మికతో ఉన్నటువంటి విలువలను, కుటుంబ జీవితంలోను మరియు బాంధవ్య జీవితములోను భావాలను క్లుప్తముగా వివరించవచ్చును.

## దివ్యమైన కలయికలోని ఆధ్యాత్మికత

మనం ఎల్లప్పుడు మాట్లాడుతుంటాము: ఎవరైతే దేవుని కృపలో జీవిస్తారో అటువంటి వారి హృదయంలో దేవుడు ఎల్లప్పుడు నివసిస్తారు అని. కాని మనం ఈ రోజు నొక్కి వక్కాణించి చెప్పవచ్చు: ఏ వివాహ జీవితములో అయితే కలిసి మెలిసి జీవిస్తారో అటువంటి వారి మధ్య త్రిత్వైక దేవుడు నివసిస్తారు అని మనము గ్రహించాలి. దేవుడు ఇస్రాయేలీయుల స్తుతులనెడి సింహాసనము మీద ఆసీనుడై ఉండువాడు (కీర్తన 22:3). కాబట్టి ప్రభువు ఎల్లప్పుడు కూడా వివాహ జీవితములో

వారు చూపించే ప్రేమలో ఉంటారు, ఈ ప్రేమే దేవునికి స్తుతులను, మహోన్నతమును కలుగజేస్తుంది.

ఏ కుటుంబములు అయితే నిజముగాను, స్థిరముగా ఉంటాయో అటువంటి వారి కుటుంబములు ప్రతిరోజు వారు అనుభవించే కష్టాలలోను, బాధలలోను, సంతోషాలలోను, నమ్మకములోను ప్రభువు వారికి సమీపంలో ఉంటాడు. ఏ కుటుంబంలో నిజముగా, స్థిరముగా ప్రోత్సాహకరమైన ప్రేమలో ఉంటాయో అలాంటి వారి కుటుంబాలను దేవుడు ఎల్లప్పుడు, సంతోషాలతోను, సమాధానములతోను దీవిస్తాడు. ఆధ్యాత్మికత అనేది కుటుంబ ప్రేమలో, వారు చూపించే అనేక చిన్న చిన్న సంజ్ఞలు సూచనలు మీద ఆధారపడి ఉంటూ, ఇచ్చుపుచ్చుకునే బహుమతులను, లోతైన అన్యోన్య సంబంధమును కనుబరుస్తూ, వారిలో దేవునికి అంటూ ఒక ప్రత్యేకమైన సాన్నిధ్యము కలిగి ఉంటుంది. అన్యోన్య బంధములో వారి పరస్పర బంధముతో దేవుడు వారి మధ్యలో ఉంటాడు. సన్నిహిత బంధాల్లో దేవునికి, మనిషికి ఉన్న సంబంధమును సూచిస్తుంది. ఆ బంధము అంతయు కూడా దేవుని ప్రేమతో నిండి ఉంటుంది. వైవాహిక ఆధ్యాత్మికత అనేది ఆధ్యాత్మికతకు ఒక బలమైన నాడిలాగా ఉంటుంది. ఇది దేవుని ప్రేమకు చిహ్నం, సాన్నిధ్యం. అనురాగ బంధము గల కుటుంబము నిజమైన దేవుని మార్గమును తెలుసుకొని దానిలో వారు పావనత్వము వైపు మరియు పాస్కా పరమ రహస్యంలో ఎదుగుతూ పయణించాలి.

ఏ కుటుంబ జీవితమైనా కూడా తమ హృదయాలను తెరచి వారిలోని అన్యోన్య ప్రేమను ఒకరితో ఒకరు కలిసి మెలసి పంచుకుంటూ ఉంటారో అలాంటి వారి జీవితాలలో దేవుడు ఎల్లప్పుడు కూడా ఉంటాడు. సాటి మనిషిని ప్రేమించని వ్యక్తి ''అంధకారమునందు ఉంటాడు'' (1 యోహాను 2:11). అతడు అంధకారమునందే సంచరిస్తాడు. అంతేకాక "ప్రేమింపనివాడు ఎవ్వడైనను ఇంకను మృత్యువులోనే ఉన్నాడు" (1 యోహాను 3:14), "ప్రేమింపనివాడు దేవుని ఎరుగనివాడే" (1 యోహాను 4:8). పదహారవ బెనెడిక్ట్ జగద్గురువులు ఇలా అన్నారు: పొరుగువాని పట్ల కనులు మూసుకున్న వాడు దేవుని చూడలేదు. ప్రేమ ఒక జ్యోతి. ఆ జ్యోతి ఒక్కటే మసగబారిన ప్రపంచాన్ని కాంతిమంతం చేయగలుగుతుంది. "దేవుని

ఎవరును ఎన్నడును చూడలేదు మనము ఒకరి యెడల ఒకరము ప్రేమ కలవారమైనచో దేవుడే మనయందు ఉండును. ఆయన ప్రేమే మన యందు పరిపూర్ణమగును" (1 యోహాను 4:12).

సామాజిక మనిషి వ్యవస్థలో బంధము విడదీయలేనిది. ఈనాటి సమాజంలో ఈ బంధమును వివాహ దాంపత్యములో చూడగలము. ఆధ్యాత్మికత అనునది ఏ కుటుంబములు అయితే కలిసి మెలిసి ఉంటాయో అలాంటి వారి కుటుంబములో అవతరిస్తుంది. లోతైన ఆధ్యాత్మిక ఆశను కలిగియున్న వారి కుటుంబములు ఎప్పుడు అధోగతిలో ఉండవు. అలాంటి వారి కుటుంబ జీవిత ఎదుగుదల ఎల్లప్పుడు వారి ఆత్మ మీద ఆధారపడి ఉంటుంది. అయితే వారు దేవుడు ఏర్పరచిన బాటను ఎంచుకొని దానిలో పయనించినపుడు దైవపరమైన ఆధ్యాత్మికతలో నడవగలరు.

## ఉత్థాన వెలుగులో ప్రార్థనా సమావేశం

ఏ కుటుంబములు అయితే క్రీస్తుని కేంద్ర బిందువుగా చేసుకుని జీవిస్తారో అలాంటి వారి కుటుంబములు ఎల్లప్పుడు కూడా కలిసి మెలిసి ఉంటాయి. వారికి కలిగే బాధలను, కష్టాలను అన్నీ కూడ క్రీస్తు సిలువ భారానికి అప్పగిస్తూ దేవునికి దగ్గర అవుతూ ఆ బాధలను, కష్లాను జయిస్తారు. వారిలో 'చీకటి ఘడియలు'గా కనిపించు వాటిని కూడా యేసుక్రీస్తులో ఉన్న వారందరు 'విడిపోవాలన్న ఆశ, కోరిక, కనుమరుగవుతుంది. పవిత్రాత్మ కృపా శక్తి వలన, భార్యాభర్తలు ఇద్దరు పవిత్రులుగా జీవిస్తూ దాంపత్య జీవితాన్ని అభివృద్ధి చేసుకుంటారు, వారు యేసుక్రీస్తు రహస్య ప్రణాళికలు సిలువ అనే భారాన్ని, కష్టాలను, వ్యాధులను, అవరోధాలను కూడా ప్రేమగా స్వీకరిస్తారు. అతి ముఖ్యంగా సంతోషాలలో, సేద తీర్చుకొనే సందర్భాలలో, వేడుకలో మరియు లైంగిక సంపర్కములో కూడా క్రీస్తుప్రభుని పునరుత్థానము యొక్క పూర్ణ జీవితమును అనుభవించాలి. దాంపత్య జీవితములో ఉన్న భార్యాభర్తలు వారి జీవితాలను ఒక రకమైన మార్పు చెందడానికి దేవుడు వారికి దయచేసిన సమయంలోను మరియు ప్రభువు పునరుత్థానములో దాగియున్న అనుభవాన్ని వెదకి కనుగొనాలి. అపుడే వారి జీవితాలు పునరుత్థాన క్రీస్తులో ఒక వెలుగులా ఉంటాయి.

పాస్కాబలి పరమ రహస్యములో ఉన్న విశ్వాసాన్ని దృఢపరచుటకు కుటుంబ ప్రార్థన ఎంతో ముఖ్యము. కుటుంబములో ప్రతిరోజు కొంత సమయాన్ని కుటుంబ ప్రార్థనకై కేటాయించాలి. అలా జీవిస్తున్న కుటుంబాలలో కలిగే బాధలు, కష్టాలు ఎదుర్కోడానికి కావలసిన ధైర్యమును, శక్తినీ ప్రసాదించమని ప్రభువును ప్రార్థించాలి. అదే విధంగా కష్టాలతో ఉన్న వారి కోసం ప్రార్థించడం వారి మీద ప్రేమను కనబరచుటకు, దేవుడు దయచేసిన జన్మముకుగాను, దేవునికి కృతజ్ఞతలు తెలుపుతూ దేవుని ఆశీర్వాదములను స్వీకరిస్తూ, మరి ముఖ్యముగా మరియ తల్లి ప్రార్థన సహాయమును ఎల్లప్పుడు కూడా వేడుతూ ఉండాలి. మనం మన చిన్న చిన్న మాటల ద్వారా ప్రభువుని ప్రార్థించుట వలన మన కుటుంబాలు ఎల్లప్పుడు కూడా ఆనందముతో, సంతోషాలతోను నిండి ఉంటాయి. కుటుంబాలలో కనబరచే దైవ సహాయం, ఆరాధనలు, స్తుతులు, ప్రార్థనలు, భక్తి ద్వారా కుటుంబములో అన్ని కూడా దేవుని ఆధ్యాత్మికతతో దీవింపబడతాయి. ఆదివారం కుటుంబ సమేతంగా దివ్యకారుణ్య బలిలో పాల్గొని ఆ దివ్యనాధుని స్వీకరించుట వలన మన కుటుంబములో ఆయన ప్రేమను ఒకరికొకరు పంచుకుంటారు. క్రీస్తుప్రభువు ప్రతి కుటుంబముల ద్వారమును తట్టుచూ పిలుస్తున్నాడు: తన కడరాత్రి భోజనమైన తన దివ్యశరీర భాగములలో పాలుపంచుకోమని (దర్శన 3:20). పాస్కాబలి ద్వారా ప్రభువు భార్యాభర్తలను ఒకటిగా చేసి వారికి ఒక ముద్రను వేశారు, వారు దానిలో ఎల్లప్పుడు కూడా స్థిరముగా ఉంటూ ఆ ముద్రను గట్టిగా దృఢపరుచుకుంటూ ఉండాలి. క్రీస్తుప్రభుని సిలువ యాగంలో పాల్గొనాలి. దివ్యసత్ప్రసాదము ఒక దివ్యసంస్కారము. ఇది ఒక నూతన నిబంధనము. యేసుక్రీస్తు సృష్టి రహస్యములను పరిపూర్ణం చేశాడు (లూకా 22:20). దాంపత్య జీవితం; ఆ క్రీస్తుప్రభుని దివ్యభోజనం విడదీయలేని ఒక గట్టి బంధాన్ని కలిగి ఉన్నాడు. భార్యాభర్తలకు క్రీస్తుప్రభువు తన శరీర రక్తముల ద్వారా వారి ఆత్మలకు భోజనంగా ఉంటూ, వారి దాంపత్య జీవితమును సుఖముగా, ఆనందముగా ఉండటానిక దోహదపడతాడు. క్రీస్తుప్రభుని వారికి అందించిన వివాహ జీవితము ఫలవంతము కావడానికి మరియు శ్రీసభ నియమముల ప్రకారం జీవించడానికి దివ్యభోజనం ఎంతగానో ఉపయోగపడుతుంది.

## ప్రత్యేకమైన, స్వేచ్ఛాపూరిత ప్రేమలో ఆధ్యాత్మికత

పవిత్ర వివాహ బంధము అనగానే ఆ బంధము ద్వారా పూర్తిగా, మరొకరికి స్వంతం అవుతున్నను అన్న నిగూఢ అర్థం అందులో దాగి ఉంది. ఈ బంధం ద్వారా భార్యాభర్తలు తమ జీవితాల్లో వచ్చే ప్రతి కష్టాన్ని, ఇబ్బందుల్ని, అవరోధాల్ని, ఆశలను, నిరాశలను, సుఖాలను, శ్రమలను ఒకరితోనొకరు పంచుకుంటూ, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, ప్రోత్సహించుకుంటూ, జీవితంలో ఎదుగుతూ ఈ జీవన ప్రక్రియలో దేవుని విశ్వాస పాత్రమైన ప్రేమను, ప్రణాళికను తలంచుకుంటారు. అయితే జీవితాంతము వరకు కలిసి ప్రయాణిద్దాం అని తీసుకునే నిర్ణయం పెదవులపై మాటలతో కాకుండా తమ పరిపూర్ణత కోసం హృదయాంత రంగాల నుండి వెలువడే మాటగా భావించి, దానిని అన్యోన్య దాంపత్య జీవితం ద్వారా నెరవేర్చాలి. తమని తాము పరిపూర్తిగా ప్రేమించుకొనని, అంగీకరించు కొననివారు జీవితాంతము వరకు వేరొకరితో ప్రేమగా ప్రయాణం చేయగలమని భావించడం ఒక కలగానే ఉంటుంది. అదే సమయంలో ఈ బంధాన్ని ఒక నిబద్ధ ఆజ్ఞగా, దేవుని కార్యముగా భావించి అసంపూర్తిగా అందులో జీవించిన ఆ ఆధ్యాత్మికత మోడుబారినదనే చెప్పాలి. మత్తయి 5:28లో చెప్పబడునట్లుగా ఇది పూర్తిగా హృదయాలకు సంబంధించిన విషయము. ఆ హృదయాలను రహస్యకార్యములు గుర్తించు తండ్రి మాత్రమే గుర్తించగలడు. వేకువ జామున తండ్రిని ప్రార్థిస్తూ ఆ దినమంతా మనకు ఎన్ని ఆటంకాలు వచ్చినా తండ్రికి విధేయులమై ఉంటామని నిర్ణయించుకుంటాం. నిద్రించేముందు తరువాత రోజు కూడా మన జీవితంలో ఉండాలని మన జీవిత ప్రయాణం సాగాలని తండ్రిపై నమ్మకం ఉంచుతాం. ఈ క్రమముగానే భార్యాభర్తలు ఒకిరికొకరు సాన్నిహిత్యాన్ని, ఎనలేని ప్రేమను నిజజీవితాల్లో చవిచూపించే సాధనాలవుతారు.

## ఆత్మీయానురాగముల ఆధ్యాత్మికత

క్రైస్తవ వివాహితులు (గృహస్థులు) ఒకరికొకరు మరియు వారి బిడ్డలకు, వారి బంధుమిత్రులకు దేవుని కృపలో భాగం పంచగలిగేలా మరియు వారి జీవితాల ద్వారా వారి విశ్వాసాన్ని ప్రకటించగలిగేలా ఉండాలి. నూతన జీవితాన్ని ఇవ్వడానికి మరియు జీవితాన్ని సంరక్షించటానికి దేవుడు వారిని పిలుచుకున్నారు. ఇందువలననే

కుటుంబమే మన ప్రధాన ఆసుపత్రి. కాబట్టి మనము ఒకరిపై ఒకరు ప్రేమ, దయ కలిగి ఉంటూ నడిపిస్తూ ప్రోత్సహిస్తూ దీనిని మన కుటుంబ ఆధ్యాత్మికంగా పాటించాలి. భార్యగా లేదా భర్తగా జీవించటం అంటే ప్రతి దినము దేవుని సృష్టి రహస్యములో పాలుపంచుకోవడమే. భార్యాభర్తల దాంపత్య అనురాగముల ద్వారా దేవుని ప్రేమ వారికి ప్రకటింపబడుతుంది. వారి వైవాహిక జీవితం ద్వారా ఆ ఇరువురు దేవుని ప్రేమకు ప్రతిబింబాలవంటివారు అవుతారు. ఆ ప్రేమ ఒకరిపై ఒకరి ఆదరణ ద్వారా ప్రేమ నిండిన చూపుల ద్వారా తోడుగాను చాపే చేతుల ద్వారా, ధైర్యాన్నిచ్చే హృదయ కౌగిలి ద్వారా వ్యక్తమవుతుంది, ఇందువలననే కుటుంబ జీవితం కోరుకోవడం అంటే దేవుని ప్రణాళికలో భాగస్తులు కావాలని నిర్ణయించుకోవడం. ఆ ప్రణాళికలో మేము రూపురేఖలు గీస్తామని, ఏ వ్యక్తి కూడా ఒంటరితనంగా భావించనని లోకాన్ని సృష్టిద్ధామని దేవునితో కలిసి పనిచేయడానికి సంసిద్ధులు అవ్వడమే.

కుటుంబ జీవితము అనగానే "ప్రేమతో పాలించడం" అని గుర్తించాలి. మనం చూపించే ప్రేమ, అనురాగం, కారుణ్యం ఖచ్చితంగా ఇతరుల జీవితాలపై ఒక చెరగని ముద్రను వేస్తాయి. 2 కొరింతీ 3:2-3లో పౌలుగారు చెప్పినట్లుగా, "సిరాతో కాక జీవాత్మతో రాయాలి, రాతి పలకపై కాక హృదయముపై లిఖించాలి" ఆ విధంగా మన కారుణ్యాన్ని ఇతరులు రుచి చూడాలి. ప్రభువు లూకా 5:10లో పలికినట్లుగా, మనమందరము కూడా మనుష్యులను పట్టువారమే. మనము మన వలలను విసరగలగాలి. వైవాహిక జీవితంలో సంపూర్ణత పరులకు సహాయపడడానికి కోరుతుంది. ఎందుకంటే ఒకరిని ప్రేమించడమంటే వారి నుండి మనం తిరిగి ఏదో ఆశిస్తాం. అది మనం వర్ణించలేనిది మరియు చవిచూడనిది. ఈ ఆశను తిరిగి పొందటానికి మనము కూడా అటువంటి ప్రేమను పంచడానికి ప్రయత్నిస్తాము. మనలో అంత ప్రేమను నింపి, ఆ ప్రేమను పరులకు పంచుతామని నిరీక్షిస్తున్న ప్రభువుకి పరులకు మన ప్రేమను పంచడమే నిజమైన ఆరాధన.

దేవుని దృష్టితో మన ప్రియమైన వారిని చూడడం మరియు వారిలో క్రీస్తుని కనుగొనడం మన ఆధ్యాత్మిక పరిపక్వతకు నిదర్శనం. ఇందుకు ఎదుటి వారి మనోభావాలను స్వేచ్ఛను పూర్తిగా అర్ధం చేసుకునే గుణం కావాలి. అన్నీ

మరచి మనలను మనం పూర్తిగా వేరొకరికి ఇచ్చునపుడు మనం వేరొకరి జీవితాల్లో స్థానం కలవారం అవుతాము. 'మనలను ప్రేమించినవారు వారిపై మనం పూర్తిగా ప్రేమానురాగాలు కలిగి ఉండాలని కోరుకుంటారు. ఇందులో క్రీస్తే మనకు ఆదర్శం. మార్కు 10:21లో ప్రభువు ఆయనతో మాట్లాడడానికి తరలివచ్చిన ప్రతి ఒక్కరిని ప్రేమతో ఆదరించి, పలుకరించారు. ప్రేమతో చెంత చేరినవారిని ఎవరిని కూడా ఆయన బాధపెట్టలేదు. ఇదే మన కుటుంబ జీవితాల్లో కూడా గమనిస్తూ ఉంటాం. మన సహచరులు మన ఆప్యాయతకు ఎంతగానో కోరుకుంటారు. ఆ విషయాన్ని గుర్తెరిగి ప్రతిక్షణం గాఢమైన ప్రేమను వారికి అందిస్తుండాలి. ఎందుకంటే వారు చూపించే ఆ గాఢమైన ప్రేమ, ఆ వ్యక్తుల్లో నేను ఎంతగానో ప్రేమింపబడు తున్నాను అనే నూతనోత్సాహాన్ని చిలికిస్తుంది. ఇతరుల స్వేచ్ఛను పూర్తిగా గౌరవిస్తూ వారిని ప్రేమించడం, ప్రేమ మాధుర్యము కనిపిస్తుంది.

ఆత్మ ప్రేరణతో జీవించే కుటుంబాలు వారి కుటుంబాల పురోగతిని మాత్రమే చూడరు, అయితే వారి జీవితము ద్వారా ఇతరుల సంతోషాలను, ఆనందాలను వెతుక్కుంటారు, ఇలాంటి ఆదరణ, ఆతిథ్యము ఆశ్రయమును చూపించి ఇతరులకు ఒక నిదర్శనముగా ఉంటారు అని దేవుని వాక్కు తెలియజేస్తుంది. "పరాయి వారికి ఆతిథ్యము నొసగుటలో అశ్రద్ధ చేయకుడు. దాని వలన కొందరు తమకు తెలియకయే దేవదూతలకు ఆతిథ్యమిచ్చిరి" (హెబ్రీ 13:2). ఏ కుటుంబం అయితే ఇతరుల మేలును కోరుతుందో మరి ముఖ్యముగా పేదలను, అంటరాని వారి మేలును కోరుతుందో అలాంటి కుటుంబాలకు చిహ్నం, సాక్షాన్ని ఇస్తూ వారు శ్రీసభ మాతృత్వంలో భాగస్తులవుతారు. సామాజిక ప్రేమ, త్రిత్వైక దేవునికి ఒక ప్రతిబింబముగా ఉంటుంది. ఇది కుటుంబంలో ఉన్న ఆధ్యాత్మికతకు అర్థాన్ని ఇస్తు మరియు దాని ప్రేషితకార్యము యొక్క ఆధ్యాత్మికతను ఇతరులకు చూపుతూ, ఆదిమ క్రైస్తవుల వలె కలిసి జీవించేలా చేస్తుంది. కుటుంబంలో ఉన్న ఆధ్యాత్మికత వలన కుటుంబమును ఒక్కటిగా ఉంటూ మరియు దేవాలయంలో ప్రజలు మార్పు చెందడానికి పిలుస్తుంది.

ప్రభువు తన బోధన ద్వారా మరియు పునీత పౌలుగారు తన వాక్యముల ద్వారా వివాహ జీవితము యొక్క నిగూఢ అర్థాన్ని తెలిపారు. వివాహ జీవితంలో

ఉన్న గొప్పతనాన్ని మరియు దానిలో దాగి ఉన్న లోతైన పరమార్ధాన్ని కనుగొనడానికి అనుక్షణం ప్రయత్నిస్తూ ఉండాలి. అదే కేవలం వారి వివాహ ప్రయాణం ద్వారా తెలుస్తుంది. మనకు తెలుసు ఏ కుటుంబముగాని పరలోకము నుండి ఊడి పడలేదు కాని మన కుటుంబములను ఒక విలువైన జీవితముల వైపు నడిపించడానికి అనునిత్యం ఆత్మను ఆ ప్రేమ సహకరిస్తుంది. త్రిత్వైక దేవునిలో ప్రేమ కాలము పరిపక్వమయినపుడు జన్మిస్తుంది. క్రీస్తుకు మరియు శ్రీసభకు వీడిపోని అనుబంధం ఉంది, పవిత్ర నజరేతు కుటుంబములో ఉన్న ప్రేమ మరియు పునీతుల బాంధవ్యంలో ఉన్న ప్రేమ ఎప్పుడు వికసిస్తూ ఉంటుంది.

మన కుటుంబంలో నిజమైన ప్రేమ, కుటుంబ జీవిత అర్ధాన్ని తెలుసుకోడానికి, మనకు చారిత్రక జీవితాలు ఎంతగానో ఉపయోగపడుతాయి. మన కుటుంబములు దాగియున్న నిగూఢ సత్యభావాలను మనం మన ఆధ్యాత్మికత జీవితములు ద్వారా పరలోక రాజ్యములో చూడవచ్చును. మన కుటుంబములు నిజమైన ప్రేమను తెలుసుకోవటానికి ఎప్పుడు కూడా పరితపిస్తూ ఉండాలి. కుటుంబ జీవితములను స్థిరముగా ఉంచుటకు ప్రయత్నించాలి. మనం కలిసికట్టుగా ముందుకు సాగాలి. దేవుడు మనకు వాగ్ధానం చేసిన వరం మన ఊహాతీతం. మన బలహీనతల కారణంగా మన హృదయంలోని ఆశను కోల్పోకూడదు. దేవుడు అందించు పరిపూర్ణ ప్రేమను, ఐక్యతను అన్వేషించడానికి మనం ఎన్నడు వెనుకడుగు వేయరాదు.

**పవిత్ర కుటుంబ ప్రార్ధన**

యేసు, మరియ, యోసేపులారా,  
నిజప్రేమలోని వెలుగును  
మీయందే గాంచగలము,  
నమ్మకముతో మీవైపే చూస్తున్నాం.  
పవిత్రమైన నజరేతు కుటుంబమా,  
మా కుటుంబాలు కూడా  
ఐక్యతకు, ప్రార్ధనకు ప్రదేశాలుగా,  
సువార్తకు నిజాయితీ పాఠశాలలుగా,

చిన్నపాటి గృహస్థ శ్రీసభలుగా
మారునట్లు అనుగ్రహించుము.
పవిత్రమైన నజరేతు కుటుంబమా,
హింస, నిరాకరణ, విభజనలు
కుటుంబాల దరి చేరకుండా దయచేయుము.
గాయపడినవారు, దూరమైనవారు
సఖ్యతను, స్వస్థతను పొందగలుగుదురుగాక.
పవిత్రమైన నజరేతు కుటుంబమా,
కుటుంబ పవిత్రతను, శాశ్వతత్వమును,
దైవ ప్రణాళికలో దాని సౌందర్యమును
గుర్తించేలా మమ్ము దీవించుము.
యేసు మరియ యోసేపులారా,
కృపతో మా ప్రార్థన ఆలకించండి.
ఆమెన్.

❊ ❊ ❊ ❊

# 10. నజరేతు పవిత్ర కుటుంబం విశ్వాస-ఆత్మీయతలకు ఆలయం

**- ఫాదర్ డా॥ పిల్లి అంతోని దాస్**



మనుష్యావతారం ధరించిన దైవకుమారుడు మానవాళికి, అనగా మనకందరికి, ప్రసాదించిన ఉన్నతమైన బహుమానమేంటో అని ఎన్నడైనా ప్రశ్నించుకున్నామా? ఈ ప్రశ్నకు సమాధానం క్రీస్తు జయంతి పండుగలో ఉంది, పశువుల తొట్టిలో పరుండి యున్న చిన్నారి యేసులోఉంది, మరీ ముఖ్యముగా ఆ బాలునికి ఇరువైపులా సంభ్రమాశ్చర్యాలతో, వినయ ప్రార్థనతో నిలుచొని ఉన్న మరియ యోసేపులలో ఉంది.

దేవుని ప్రియమైన కుమారుడు ఈలోకంలో ప్రవేశించిన మరుక్షణమే మనకిచ్చిన వెలకట్టలేని, అత్యంత విలువైన, అమరమైన బహుమానం: తిరుకుటుంబం. ఈ భువిలో దివ్యమైన దేవుని ఉచితమైన, ఉదారమైన ఓ కానుక: పవిత్రకుటుంబం. ప్రియ కుమారుని అత్యంత ప్రియమైన మొట్టమొదటి బహుమానం, ముచ్చటైన బహుమానం, మహిమగల బహుమానం: యేసు, మరియ, యోసేపుల నజరేతు కుటుంబం.

పశువుల కొట్టమే ఈ పవిత్ర కుటుంబానికి పునాది. అందులోనే జన్మించాలని చిత్తగించడం ద్వారా ప్రభువు మనకు రెండు సత్యాలు విశద పరుస్తున్నాడు: మొదటిది, ఓ కుటుంబానికి నివాసం కాదు - విశ్వాసం ముఖ్యం అని, మరియు రెండవది, ఓ కుటుంబం అశుద్ధతకు అతీతం - ఆత్మీయతకు అర్పణం అని. ఈ రెండు సత్యాలను కొద్దిగా పరిశీలిద్దాం.

**మొదటిది: నివాసం కాదు – విశ్వాసం ముఖ్యం**

ప్రభువులకు ప్రభువు, రాజులకు రారాజు, దేవాది దేవుడు, మన ప్రియ ప్రభువు తన జన్మస్థలంగా ఎంచుకుంది ఓ రాజ ప్రాకారం కాదు. అయినా ఒక కొట్టం, ఒక గుడిసె, ఒక మిద్దె, ఒక రాజ భవనం: ఇవి కాదు ముఖ్యం ఓ కుటుంబానికి. ఒక ఇల్లు బొమ్మరిల్లు కావాలంటే, ఒక కుటుంబం ఓ అనురాగ కుటుంబంగా మారాలంటే, కావాల్సింది “చంచల నివాసం” కాదు, కాని ఓ “అచంచల విశ్వాసం”.

పైకప్పు ఎగిరిపోవోచ్చు,
గోడలు పగిలిపోవోచ్చు,
పునాది కదిలిపోవోచ్చు,
ఇల్లు కూలిపోవోచ్చు –
ఎందుకంటే: నివాసం ‘చంచలం’, ‘భౌతికం’, ‘క్షణికం’ – శాశ్వతం కాదు.
పరిచయం చెడదు,
ప్రమాణం పగలదు,
ప్రమోదం చెరగదు,
ప్రయాణం ఆగదు –
ఎందుకంటే: విశ్వాసం ‘అచంచలం’, ‘ఆధ్యాత్మికం’, ‘చిరకాలం’ – శాశ్వతం.

పరస్పర విశ్వాసమున్న సభ్యుల మధ్య ఏర్పడే ఘనమైన అనురాగమే కుటుంబం. ఆ కుటుంబానికి ప్రేమ ప్రతీక, విశ్వాసం పునాది. ప్రభువంటాడు: “తన ఇంటిని (అనగా, కుటుంబాన్ని), రాతి పునాదిపై (అనగా, విశ్వాసం), నిర్మించుకున్నవాడే బుద్ధిమంతుడు (ఆత్మస్వరూపుడు)” మత్తయి 7:24. అటువంటి కుటుంబాన్ని ఇటుక గోడలు ఆపలేవు, ఇసుక పునాదులు ఆదుకోలేవు. యేసు మరియ యోసేపుల కుటుంబం ఓ పవిత్ర కుటుంబం. కారణం: వారు ఇహలోక నివాసంపై ఆధారపడలేదు కాని, పరలోక విశ్వాసం పై తమ జీవితాన్ని నిర్మించుకున్నారు.

**రెండవది: అశుద్ధతకు అతీతం – ఆత్మీయతకు అర్పణం**

పశువుల కొట్టం ఎలా ఉంటుందో మనకు తెలియంది కాదు. అందులోని మాలిన్యం, అశుద్ధత మనకు ఏవగింపును కలిగిస్తాయి. ఆ స్థలము పశువులకు

నిలయమేమో గాని, మనము మాత్రం అచట ఎక్కువ సమయాన్ని గడుపుటకు ఇష్టపడము. ఎంతటి దరిద్రమైన పరిస్థితులలో ఉన్నా, ఎంతటి భరించలేని కష్టం ఎదురైనా ఆ అశుచితమైన ప్రాంగణంలో నివసించుటకు ఎవరైనా ముందుకు వస్తారా? కాని, దైవకుమారుడైన యేసు "అదే పశువుల కొట్టము" ను తన జన్మస్థలముగా ఎంచుకున్నాడు. తనవారు, అనగా తన తల్లి తన తండ్రి, తనతోనే ఉండాలని, తను ఉన్నచోటే ఉండాలని, అదీ "అదే పశువుల కొట్టము" లో ఉండాలని చిత్తగించాడు. అది దైవసంకల్పం కాక మరేమవుతుంది?

అదేమీ చిత్రమో గాని:

- దైవకుమారుడు దిగిరాడానికి అప్పుడే సంపూర్ణ కాలం ఆసన్నమవడమేమిటో!
- జనాబా లెక్కల నిమిత్తమై అప్పుడే అందరు తమ గ్రామాలకు వెళ్ళవలసిందని ఆజ్ఞ జారీ కావడమేమిటో!
- మరియ యోసేపులు ఉన్న ఊరు వదలి, తమ 'నివాసాన్ని' వీడి వారు ప్రయాణం చేయాల్సిరావడం ఏమిటో!
- గర్భవతియైన మరియమ్మకు ఆసమయంలోనే ప్రసవ వేదన రావడం ఏమిటో!
- తిరిగి తిరిగి వేసారి, అడిగి అడిగి అలసి, ఏమితోచని స్థితిలో, అత్యవసర పరిస్థితులలో వారు పశువుల కొట్టమును చేరుకోవడమేమిటో!
- కాలక్రమాతీతుడు, సకల సృష్టికి కారణ సంభూతుడు, జీవ శ్వాసలకు ఆధారఘనుడు, ఆ దేవాదిదేవుడు, మరో స్థలం లేనట్టుగా, మహాప్రస్థానం అదేనన్నట్టుగా పశువుల కొట్టంలోనే పుట్టడమేమిటో! పశుగ్రాస నడుమ తన "నివాసాన్ని" నిర్మించుకోవడమేమిటో!

  చిత్రం కాకుంటే ...

  నరుని పాపపు మదిని, అహంకార హృదిని ఛిద్రం చేయుటకు కాకుంటే...

  అది విచిత్రం కాదు ... దైవ చిత్తానికి అది నిర్వచనం.

దేవుడు చిత్తగించాడు: తన కుటుంబం ఇలా ఉండాలని.
దేవుడు సంకల్పించాడు: తన కుటుంబం అశుద్ధతకు అతీతం అని.
దేవుడు నిరూపించాడు: తన కుటుంబం ఆత్మీయతకు మకుటమని.

నజరేతు కుటుంబం – యేసు మరియ యోసేపుల కుటుంబం:

ఒక వర్ణనాతీత కుటుంబం,

ఒక సువర్ణ విలువల సకుటుంబం.

దాని లక్షణం – విశ్వాసం,

దాని లక్ష్యం – ఆత్మీయం. ఎందుకంటే,

– ఇహలోక కష్టాలు, ఇబ్బందులు, ఒడిదుడుకులు, అవమానాలు, అపనిందలు, అలజడులు, అపార్థాలు: ఆ కుటుంబంలోని విశ్వాసాన్ని విచ్ఛిన్నం చేయలేవు.
– ఇహలోక ఆలోచనలు, ఆరాటాలు, ఆస్తులు, అంతస్తులు, ఆశుద్ధత, అపవిత్రత, అజ్ఞానం, అనిశ్చలత: ఆ కుటుంబంలోని ఆత్మీయతను అపహరించలేవు.

**నజరేతు ఆత్మీయ కుటుంబం**
**మానవాళికి నిరంతర సజీవ ఆలయం**

**మరియ యోసేపులు "తల్లిదండ్రులకు" ఆదర్శం:**
**బిడ్డలను విశ్వాసంలో నడిపించుటకు, వారిని 'నిరీక్షణతో' వెదకి సంరక్షించుటకు.**

**మొదటిది:** మరియ యోసేపులు బాలయేసును విశ్వాసంతో పెంచారు, తమ బిడ్డను దైవ గృహానికి నడిపించారు (లూకా 2:22–40). క్రైస్తవ తల్లిదండ్రులకును ఇవ్వబడిన అత్యంత ప్రధానమైన భాద్యత ఇదే. జ్ఞానస్నాన సాంగ్యములో గురువు వారిని ప్రశ్నిస్తాడు: 'మీ బిడ్డలను విశ్వాసమందు పెంచుటకు సిద్ధంగా ఉన్నారా?' అని. వారు 'అవును', 'సిద్ధముగా ఉన్నాము' అని సమాధానమిస్తారు. తల్లిదండ్రులకు మంచి తరుణమిది: తమను తాము ప్రశ్నించుకోడానికి, ఆత్మ పరిశీలన కావించుకోడానికి – తాము చేసిన బాస ఎంతవరకు నిలబెట్టు కుంటున్నారా అని.

**రెండవది:** కనిపించక పోయిన తమ బిడ్డ కొరకు మరియ యోసేపులు తపన పడ్డారు, వెదుకుతూ తిరిగి వచ్చారు (లూకా 2:41–50). బాలయేసు కనిపించక పోయేసరికి మరియ యోసేపులు ఎంత ఆవేదన చెంది ఉంటారో, వారి మనసు ఎంత క్రుంగిపోయివుంటుందో ఊహించగలమా? అయినా వారి కలతను 'కలిమి' జయించింది. వారి ఆవేదనను 'ఆత్మీయత' జయించింది. అందుకే, కనిపించిన వారినందరిలో వెదికారు, తెలిసిన వారందరిని అడిగారు. అడగటం ఆపలేదు –

వెదకటం వీడలేదు. వెదుకుతూ ఉన్నారు, వెళ్తూవున్నారు కనిపించేంత వరకు. మూడు రోజులైనా సరే అన్వేషిస్తూనే ఉన్నారు.

బిడ్డల యెడల తల్లిదండ్రుల ప్రేమ, అన్వేషణ అలా దీర్ఘంగా ఉండాలి, అంత లోతుగా ఉండాలి. క్రైస్తవ తల్లిదండ్రులకు ఇవ్వబడిన రెండవ ప్రధాన బాధ్యత ఇదే. ఇది చాల ఉత్తమమైన బాధ్యత. కారణం: నేటితరంలో పిల్లలు రకరకాల మార్గాలలో వెళ్తున్నారు. అమాయకత్వంతో, అజ్ఞానంతో ప్రాపంచిక ఆకర్షణలకు లోనై, అడ్డదారులలో అగమ్యగోచరంగా తిరిగుతూ వున్నారు. అశాశ్వతమైన సుఖభోగాలకు బానిసలై వారు అసత్యంగా ఆదమరచి, మైమరచి, మురిసిపోతూ లేవలేని పాతాళానికి దిగిపోతున్నారు. విచ్ఛిన్నమైన కుటుంబాలలో ఈ పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా మారుతుంది. దీని వలన వివరించలేని పర్యవసానాలు ఎన్నో?

- ఒంటరిగా మిగిలిపోయి, నలగిపోతున్న పసిహృదయాలెన్నో!
- దురలవాట్లకు, దుష్ట స్నేహాలకు దాసోహమై దీన స్థితికి దిగజారిపోతున్న పావన గుండెలెన్నో!
- గర్వానికి, అహంకారానికి, అభద్రతాబావానికి, అనారోగ్యానికి, అసత్యానికి సమాధియై ఆరిపోతున్న ఎదిగే ఆశాజ్యోతులెన్నో!
- పుట్టగానే పరిమళించాల్సిన సమయంలో, పుట్టుకతోనే తమ జీవితాన్ని మట్టి పుట్టగా మారుస్తున్న శక్తులకు తెలియని వయసులోనే బానిసలవుతున్న బాలబాలికలెందరో!

ఆధునిక పరిజ్ఞానం, విషయ పరిశీలనం భావి తరాలను, యువ కెరటాలను అనుకూల పరిస్థితులలో కంటే ఎక్కువగా, ప్రతికూల పరిస్థితులలోకే త్రోసివేస్తున్నాయి. ఇటువంటి తరుణంలో తల్లిదండ్రులు వారి బిడ్డలను వెదుకుతూ వెళ్ళాలి. వారిని వెనుకకు తీసుకొని రావాలి. వారికి దైవమార్గం నేర్పాలి. ఆత్మీయత తెలపాలి. అర్థం చేసుకోవాలి. ఆదరించాలి. సరియైన దారి చూపించాలి. దానిలోనే వారిని నడిపించాలి. చాలా శ్రమతో నిండిన బాధ్యత. కాని తప్పదుగా నిజమైన తల్లిదండ్రులకు. వారి శ్రమకు, పరిశ్రమకు ఆదర్శం తిరు కుటుంబం లోని మరియ యోసేపులు.

**బిడ్డలందరికీ ఆదర్శం బాలయేసు**
**దేవునిలో ఎదుగుటకు, తల్లిదండ్రులకు విధేయించి జీవించుటకు (లూకా 2:52).**

**మొదటిది:** బాలయేసు పసిప్రాయం నుండే తన తండ్రి చిత్తాన్ని తెలుసుకోవటంలో, దాని పరిపూర్ణంగా పాటించటంలో ఎప్పుడు ముందంజలో ఉన్నాడు (లూకా 2:46-47). బాలయేసు తన ఆత్మను, తన ఆధ్యాతికతను ఎన్నడును విస్మరించలేదు. తన జీవం, తన కార్యం సమస్తమూ తన పరలోకతండ్రిలోనే ఉందని విశ్వసించాడు. తన తండ్రి మహిమార్థం తన కర్తవ్యాన్ని సంపూర్ణం కావించాడు. పశువుల "కొట్టం"తో ప్రారంభమైన తన ఇహలోక ప్రయాణాన్ని, కల్వరి "కొయ్య"వరకు, అనగా కడవరకు "ఆత్మబలంతో", "ఆధ్యాత్మిక ఎదుగుదలతో" కొనసాగించాడు, ముగించాడు, మహిమను పొందాడు.

**రెండవది:** బాలయేసు తన కుటుంబానికి, ముఖ్యముగా తన అమ్మకు, నాన్నకు విధేయించి జీవించాడు (లూకా 2:51). తల్లిదండ్రుల ప్రేమ ఎంత మహోన్నతమైనదో బాలయేసు ఎరిగివున్నాడు. వారి ప్రతీ మాట, ప్రతీ చర్య తన మంచి కొరకే అని గుర్తించాడు కాబట్టే వారికి లోబడి జీవించాడు, వారిని గౌరవించాడు, తన విధేయతను చాటుకున్నాడు.

ప్రతి బాలుడు, ప్రతి బాలిక, ప్రతి యువతి, ప్రతి యువకుడు ఆ "పవిత్ర బాలుని" ఆదర్శంగా తీసుకోవాలి. ఆ "బాలునిలా" ఎదగాలి. ఆ "బాలునిలా" మారాలి.

ఇలా 'అటు తల్లిదండ్రులు', 'ఇటు బిడ్డలు' "కలిమి"తో కలిసి, "చెలిమి"తో సహకరించుకొని, "ప్రేమ"తో ఐఖ్యంగా పయనిస్తే ఆ కుటుంబాన్ని కష్టాలు కాల్చివేయవు, ఇబ్బందులు ఇరుకున పెట్టవు, అపనమ్మకం దరిచేరదు, ఆనందం అంతరించదు. అటువంటి కుటుంబం "మమతలతో" మెరిసిపోతుంది, "స్నేహంతో" చిగురిస్తుంది, "పరస్పర ప్రేమతో" పరిమళిస్తుంది. ఒక "తిరుకుటుంబం"గా రూపు దిద్దుకుంటుంది. నజరేతు కుటుంబ ఆదర్శంతో మన క్రైస్తవ కుటుంబ "ఔనత్యాన్ని" కాపాడుకుందాం, దాన్ని వాక్య బలముతో నింపుకుందాం, ఆత్మ ప్రేరణతో అభిషేకించుకుందాం, తండ్రి దేవునికి ప్రీతికరమైన "చిరు శ్రీసభ"గా మలుచుకుందాం. దేవుడు మన కుటుంబాలను దీవించును గాక!

❋ ❋ ❋ ❋



కుటుంబం

శ్రీసభకు, దైవసృష్టికి మధ్య
ప్రాథమిక స్థానమైన
ఒక నిబంధన

- పోప్ ఫ్రాన్సిస్

# ప్రేమానందం

## AMORIS LAETITIA



## కుటుంబంలోని ప్రేమ

అపోస్తోలిక ప్రభోధం

## పోప్ ఫ్రాన్సిస్

భక్త యోహాను ప్రచురణలు
భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
www.stjohnseminaryhyd.org

*Holycrossprinters 9848145417*